
# వివేక చూడామణి

సంస్కృత మూలం: శ్రీ శంకర భగవత్పాదులు



శ్రీ సామవేదుల సీతారామశాస్త్రి

శ్రీ శంకర భగవత్పాద విరచిత

# వివేకచూడామణి

(తెలుగు తాత్పర్యముతో)

తెలుగు తాత్పర్య రచయిత :

## సామవేదుల సీతారామశాస్త్రి

**శ్రీ శైలజ పబ్లికేషన్స్**

స్వామివీధి, గాంధీనగర్,

విజయవాడ-520 003

**VIVEKA CHUDAMANI**

(With Telugu Narration)

By

**Samavedula Seetharama Sastry**

First Edition :
March 1991

Copies : 1000

**Price : Rs. 40/-**

All rights reserved

Cover Design :
**RAMANA**


Copies can be had from :

**S. SEETHARAMA SASTRY**
47-3-13, Dwarakanagar
Visakhapatnam-530 016

A N D

**SRI SAILAJA PUBLICATIONS**
Swami Street, Gandhi Nagar
Vijayawada - 520 003

Printed at :
**"RAGHAVENDRA**
S.N. Puram, V. Z. A. 11.



This book is
Published with the
Financial Assistance of
**Thirumala Thirupathi Devasthanam**
Under the scheme
"Aid to Publish Religious books"

# విషయసూచిక


| సం. | విషయము | శ్లోకములు | పేజీ |
|---|---|---|---|
| 1. | గురుస్తుతి | 1 | 49 |
| 2. | అధ్యాత్మ జీవిత ప్రశంస | 2 | 49 |
| 3. | దైవానుగ్రహము | 3 | 50 |
| 4. | ఆత్మ హంతకుడు | 4—7 | 50 |
| 5. | జ్ఞానార్జనకు మార్గము | 8—13 | 51 |
| 6. | అధికారి నిర్ణయము | 14—17 | 53 |
| 7. | సాధన చతుష్టయము | 18—30 | 54 |
| 8. | భక్తి | 31 | 58 |
| 9. | గురువును సమీపించుట — ప్రశ్నించుట | 32—40 | 58 |
| 10. | గురూపదేశము | 41—47 | 61 |
| 11. | శిష్యుడడిగిన ప్రశ్నలు | 48—49 | 63 |
| 12. | శిష్యప్రశంస | 50 | 63 |
| 13. | స్వప్రయత్నము యొక్క ప్రశంస | 51—55 | 64 |
| 14. | ఆత్మజ్ఞాన ప్రశంస | 56—61 | 65 |
| 15. | అపరోక్ష జ్ఞానము | 62—66 | 67 |
| 16. | ప్రశ్నలపై వివరణ | 67—71 | 68 |
| 17. | స్థూల శరీరము | 72—75 | 69 |
| 18. | విషయానురక్తి బంధహేతువు | 76—82 | 70 |

| నం. | విషయము | శ్లోకములు | పేజీ |
|---|---|---|---|
| 19. | శరీరాభిమాన నిరసన | 83—86 | 72 |
| 20. | స్థూలశరీర నిరసన | 87—91 | 73 |
| 21. | బాహ్యేంద్రియములు | 92 | 74 |
| 22. | అంతఃకరణము | 93—94 | 75 |
| 23. | పంచప్రాణములు | 95 | 75 |
| 24. | సూక్ష్మశరీరము | 96—101 | 76 |
| 25. | ప్రాణ ధర్మములు—క్రియలు | 102 | 78 |
| 26. | జీవాత్మ | 103—105 | 78 |
| 27. | ఆత్మతత్వము—I | 106—107 | 79 |
| 28. | మాయ | 108—110 | 79 |
| 29. | రజోగుణము | 111—112 | 81 |
| 30. | తమోగుణము | 113—116 | 81 |
| 31. | సత్వగుణము | 117—119 | 83 |
| 32. | కారణశరీరము | 120—121 | 84 |
| 33. | అనాత్మ | 122—123 | 84 |
| 34. | పరమాత్మతత్వము | 124—135 | 85 |
| 35. | మనో నియమము | 136 | 88 |
| 36. | బంధహేతువు | 137—142 | 88 |
| 37. | ఆవరణ—విక్షేప శక్తులు | 143—144 | 90 |
| 38. | సంసార వృక్షము | 145—146 | 91 |
| 39. | ఆత్మానాత్మ విచారము | 147—153 | 92 |
| 40. | అన్నమయకోశము | 154—164 | 93 |

| నం. | విషయము | శ్లోకములు | పేజీ |
|---|---|---|---|
| 41. | ప్రాణమయకోశము | 165—166 | 97 |
| 42. | మనోమయకోశము | 167—183 | 97 |
| 43. | విజ్ఞానమయకోశము | 184—188 | 102 |
| 44. | ప్రత్యగాత్మ | 189—191 | 104 |
| 45. | మోక్షమనగా నేమి ? | 192—193 | 105 |
| 46. | ఆత్మజ్ఞానము మోక్షహేతువు | 194—206 | 105 |
| 47. | ఆనందమయ కోశము | 207—211 | 108 |
| 48. | ఆత్మ తత్వము—II | 212—225 | 110 |
| 49. | సర్వాత్మతత్వము | 226—236 | 114 |
| 50. | బ్రహ్మతత్వము | 237—240 | 118 |
| 51. | తత్వమసి | 241—249 | 120 |
| 52. | ధ్యానమార్గము | 250—235 | 123 |
| 53. | ధ్యానాలంబన | 254—266 | 125 |
| 54. | వాసనలను విడిచిపెట్టుట | 267—276 | 129 |
| 55. | అధ్యాసాపనయము | 277—292 | 132 |
| 56. | జీవ మిథ్యాతత్వము | 293—297 | 136 |
| 57. | జీవభావమును విడచుట | 298—309 | 138 |
| 58. | చింతన, క్రియ, వాసనల విడుచుట | 310—319 | 142 |
| 59. | అప్రమత్తత | 320—329 | 145 |
| 60. | కేవలత్వము | 330—338 | 148 |
| 61. | సర్వాత్మత్వము | 339—348 | 151 |
| 62. | కారణము—కార్యము | 349—353 | 154 |

| నం. | విషయము | శ్లోకములు | పేజీ |
|---|---|---|---|
| 63. | సమాధి | 354—372 | 156 |
| 64. | నిస్సంగత్వము | 373—378 | 163 |
| 65. | ధ్యాన పద్ధతి | 379—383 | 165 |
| 66. | ఆత్మ భావన | 384—397 | 167 |
| 67. | అభేదత్వము | 398—406 | 171 |
| 68. | ఆత్మ విచారము | 407—413 | 174 |
| 69. | శరీరభావమును విడుచుట | 414—418 | 176 |
| 70. | ఆత్మజ్ఞాన ఫలము | 419—425 | 175 |
| 71. | జీవన్ముక్తుని లక్షణములు | 426—445 | 178 |
| 72. | ప్రారబ్ధకర్మ | 446—464 | 182 |
| 73. | అద్వయ బ్రహ్మము | 465—471 | 190 |
| 74. | ఆత్మానుభవము | 472—479 | 192 |
| 75. | శిష్యుని ఆత్మానుభవము | 480—520 | 195 |
| 76. | అంతిమ ఉపదేశము | 521—575 | 208 |
| 77. | ఉపసంహారము | 576—578 | 227 |
| 78. | గ్రంథ ప్రశంస | 579—581 | 228 |

# అంకితము

సీ. బ్రహ్మభావమునందు పరిపూర్ణుడయ్యును
పరులతో వాదించు ప్రతిభ చూపె
సర్వమ్ము విడనాడి సన్యాసి యయ్యును
నలుదెసల తన ధ్వజము నాటియుంచె
స్వాత్మ తీర్థమునందు శాంతుడై నిలిచియు
ఒరులకై యెల్లెడల పరుగు పెట్టె
పరమాత్మలో తాను పరవశించుచు కూడ
శిష్యులను యెందరినో చేరదీసె;

తర్కమందున నెంతటి కర్కశుండో
విద్యగరపుట యందంత వినయశీలి
భావప్రకటన యందెంత భాసురుండో
రచనలందున నంతటి రసమయుండు;

సీ. అద్వైత వేదాంతమతని సొత్తందునా
పలు దేవతలనతడు భక్తి గొలచె
కేవలుండని యతని గీర్తింప జూతునా
పెరవారితో తగవు పెట్టుకొనియె
"జగన్మిథ్య" భావ శాసకుండందునా
వసుధపై తన పట్టు వదలడాయె
మాయలోపడి నిజము మరచెనేమోయన్న
సమతుల్యులకె విద్య గరపబూనె;

అతని వాగ్ధాటి కెదురాడు నతడు లేడు
అతని యుపమానములు లేని కథలు లేవు
అతని రసయుక్త సన్నుతులనందుకొనని
దేవుడేలేడు భారతదేశమందు,

కువలయమునందు పెరిగిన
అవివేకము పారద్రోల హరుడే గురుడై ;
భువిపైన శంకరునిగా
అవతారము దాల్చెనందు రందరికొరకున్;

— అట్టి —

శంకరు ప్రతిరూపునకున్
శంకోద్భవ తిమిరహరణ జ్ఞానార్కునకున్
శంకర భగవత్పాదుల
కంకిత మిచ్చెదను దీని నతులితభక్తిన్.

# స్వపరిచయము

నాపేరు సీతారామశాస్త్రి. ఇంటిపేరు సామవేదులవారు. ఆరామద్రావిడ శాఖ. భారద్వాజస గోత్రము. మా తండ్రిగారు శ్రీ వెంకట శాస్త్రిగారు, తల్లి శ్రీమతి మహాలక్ష్మి. పితామహులైన శ్రీ గోపాలశాస్త్రిగారు సంస్కృతమునందును, తర్క వేదాంత శాస్త్రములయందును పండితులు. సామవేదమునందు నిష్ణాతులు.

నేను సింగరేణి బొగ్గు గనులలో వివిధ పదవులు నిర్వహించి బెల్లంపల్లిలో జనరల్ మానేజర్‌గా పదవీ విరమణ చేసితిని. అప్పటినుండి విశాఖపట్టణములో స్థిర నివాసము ఏర్పరచుకొనియున్నాను.

నాకు భగవద్గీతయందును, శంకరాచార్యులవారి అద్వైత వేదాంతము నందును అభిరుచి గలదు. నేను తెలుగులో (ముత్యాల సరములలో) వ్రాసిన భగవద్గీతను కొద్దికాలము క్రిందట శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము వారందించిన ఆర్థిక సహాయముతో ప్రచురించుట జరిగినది. ప్రస్తుత గ్రంథమైన శ్రీ శంకరాచార్య ప్రణీత వివేక చూడామణికి తెలుగులో తాత్పర్యమును వ్రాసి శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము వారందించిన ఆర్థిక సహాయముతో ప్రచురించుచున్నాను.

**పై పుస్తకములను ప్రచురించుటకు ఆర్థిక సహాయమును అందించిన శ్రీ తిరుమల తిరుపతి దేవస్థానము వారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతలు.**

ఇవిగాక "శంకరభావలహరి" అను పేరుతో శ్రీ శంకరాచార్యుల వారు రచించిన ఇతర చిన్నచిన్న రచనలను తెలుగులో గేయ రూపములో వ్రాసితిని. ఆ గ్రంథము కూడ త్వరలో వెలువడగలదు.

ఈ గ్రంథమును ప్రచురించుటలో సహాయ సహకారములను అందించిన మా అల్లుడు చి॥ అవధానుల జగన్నాథరావునకు నా కృతజ్ఞతా పూర్వక ఆశీస్సులు. ఈ పుస్తకములన్నియు బహుళ ప్రజాదరణను పొందగలవని ఆశించుచున్నాను.

47-3-13, ద్వారకానగర్
విశాఖపట్నం -530 016

ఇట్లు
సామవేదుల సీతారామశాస్త్రి

# ముందుమాట

శ్రీ శంకర భగవత్పాదులు అద్వైత వేదాంత పునర్నిర్మాత అని చెప్ప వచ్చును. అప్పటి వరకును వేదముల మీద ఆధారపడియున్న ఆర్షమతము కర్మ కాండకే ఎక్కువ ప్రాధాన్యత ఇచ్చుచు వచ్చినది. యజ్ఞ యాగాదులను తిరస్కరించిన బౌద్ధమతము కొంతకాలము ప్రజాదరణను పొందినను, అదిగూడ రెండుగా చీలిపోయి బౌద్ధారామములకే పరిమితమై పోయినది. వేద బాహ్యమని ఆర్షమతస్థులు బౌద్ధమతమును తిరస్కరించిరి. ఐనను బౌద్ధమతము యొక్క ఒత్తిడికి తట్టుకొనలేక ఆర్షమతము తిరిగి తలఎత్తుకొనలేక పోయినది. ప్రజలు తమ గమ్యమేమిటో తెలుసుకొనలేక మూఢ విశ్వాసములతో ప్రవర్తింపసాగిరి.

అట్టి సమయములో కారణ జన్ములయిన శ్రీ శంకర భగవత్పాదులు జన్మించి అప్పటి వరకును అరణ్యములకే పరిమితమైయున్న వేదములలోని ఉపనిషత్ భాగములను వెలికితీసి, వాటిని పునరుద్ధరించి ప్రజలలో బహుళ ప్రచారము చేసిరి. జీవాత్మకును, పరమాత్మకును భేదము లేదన్న అద్వైత వేదాంత భావమునకు ఆయన ప్రాచుర్యము ఇచ్చిరి. అనేకములయిన ఉపనిషత్తుల, బ్రహ్మసూత్రముల సారాంశమును ఒకచోట చేర్చి దానికి తన బ్రహ్మానుభవమును, ప్రపంచానుభవమును జోడించి "వివేకచూడామణి" యను ఒక చక్కని గ్రంధమును శ్రీ శంకర భగవత్పాదులు మనకందించిరి.

ఇందలి వివరణలు ఎంతో యుక్తియుక్తముగను, మనస్సును ఆకట్టుకొనునవిగాను ఉండుటవలన ఆధునిక విద్యా పారంగతుల కెంతయో హృద్యముగాను, ఉపయోగకరముగను ఉండును. ఈ గ్రంధమును అద్వైత వేదాంతమునకు పాఠ్య పుస్తకముగా భావించవచ్చును. ఇందులో బ్రహ్మతత్వము గూర్చియు, జీవాత్మ పరమాత్మల ఐక్యత గూర్చియు, అది సాధించుటకు కావలసిన సాధన సంపత్తి గూర్చియు విస్తృతముగా చర్చించబడినది. స్వల్ప సంస్కృత జ్ఞానమున్న వారికి గూడ ఇందలి శ్లోకములు సులభముగ అర్ధమగుచున్నను, అందరకును అర్ధమగుట

కొరకు నేను ఈ గ్రంథమునకు తెలుగులో తాత్పర్యము వ్రాసితిని. ఈ తాత్పర్యమును వ్రాయుటకు ఆంగ్లములో శ్రీ చిన్మయానంద స్వామిగారు వ్రాసిన వ్యాఖ్యానమును ఆధారముగా తీసుకొంటిని.

ఈ తాత్పర్యమునందు - అవసరమని తోచిన చోట కొద్దిపాటి వివరణ గూడ ఇచ్చుట జరిగినది. మూలములోలేని భావము సంపూర్ణముగా అర్థమగుటకు అక్కడక్కడ చేర్చిన పదములను, వాక్యములను బ్రాకెట్లమధ్యన ఉంచుట జరిగినది. చదువుకొనునప్పుడు వాటిని కలుపుకొనియే చదువవలెను. మూలము విడచి తాత్పర్యము మాత్రము చదువుకొన్నను భావగమనమునకు భంగము రాకుండునట్లు తగు జాగ్రత్త తీసుకొనబడినది. విజ్ఞులు దీనిని సహృదయముతో స్వీకరింతురని నా అభిలాష.

ఇట్లు

సామవేదుల సీతారామశాస్త్రి

# పీఠిక

శ్రీ ఆదిశంకరులు, ఈ వివేకచూడామణిలో దృశ్యప్రపంచము యొక్క మిథ్యా తత్వము గూర్చి, బ్రహ్మము యొక్క నిజతత్వము గూర్చి, జీవబ్రహ్మైక్య భావమును గూర్చి, బ్రహ్మ తత్వమును స్వానుభవ పూర్వకముగా తెలుసుకొనుటకు అవసరమగు సాధనలగూర్చి, వివరముగా చెప్పిరి. 'జగన్మిథ్య-బ్రహ్మసత్యం' అను వారి సిద్ధాంతమును నిరూపించుటకు అవసరమగు వాదములను, ఉపమానములను ఎన్నియో ఇచ్చిరి.

## 1. దృశ్యప్రపంచము :

మనకందరకు, పుట్టినప్పటినుండి, చనిపోవు వరకు-అన్ని వేళల యందును, ఈ ప్రపంచములో గల వస్తువులయందు ఒక నిర్దిష్ట జ్ఞానము యుండును. కనబడు ప్రతివస్తువునకు ఒక రూపము, ఒక నామము ఉండును. నామము తెలిసినచో రూపము ఊహించగలము. రూపము చూచినచో నామము జ్ఞప్తికి వచ్చును. ఏ రూపమునకయినను నామము లేక పోయినచో, ఏదో ఒక పేరుపెట్టి, ఆ పేరుతో దానిని గూర్చి చెప్పుదుము. ఈ సూత్రము కనుపించు వస్తువులకేకాక, వినిపించు శబ్దములకు, నాలుకకు తెలియు రుచులకు, ముక్కునకు తెలియు వాసనలకు, శరీరమునకు తగులు స్పర్శలకు వర్తించును. పంచేంద్రియములకు అనుభవమగు వివిధ గుణములకు (స్పర్శలకు) ఆగుణములు గల వస్తువులకు వేరు,వేరు పేరులు పెట్టి వ్యవహరించు చుందుము. ఆ పేరుతో ఆ గుణములు గల వస్తువును నిర్దేశించగలము.

'కుర్చీ కుడి ప్రక్కన ఉన్న బల్లమీద ఉన్న ఎర్రని పుస్తకమును తీసుకొనిరా', అని చెప్పినపుడు, ఆ గదిలో ఎన్ని వస్తువులు ఉన్నను, ఎంతటి చిన్నపిల్లవాడయినను ఆ పుస్తకమును తెచ్చి ఇవ్వగలడు. కుర్చీవేరు; బల్లవేరు; కుడివేరు; ఎడమవేరు; ఎరుపు వేరు; పుస్తకము వేరు; తెచ్చుట వేరు; ఇచ్చుటవేరు; కాని ఈ పేరు లేవియు వస్తువుల మీద వ్రాసిలేవు. అవి చిన్నతనమునుండి, పెద్ద వారి నుండి వినుటవలన, ఆ వస్తువునకు, ఆ పేరునకు ఒక అవినాభావ సంబంధము మన మనస్సులో ఏర్పడినది.

అందువలన ఒకరి మనస్సులో ఏర్పరుచుకున్న రూపములను నామములద్వారా వేరొకరికి చెప్పుట జరుగుచున్నది. అప్పుడు ఆ రెండవవాడు, తన మనస్సులో ఏర్పరుచుకున్న రూపనామ సమన్వయముననుసరించి ఒక భావమును ఏర్పరచుకొనును. ఆ భావమున కనుగుణముగా తాను ప్రవర్తించును.

ఈ వివిధత్వముల నన్నింటిని సమన్వయపరచి, ఒకే ఒక వాక్యములో ఇమిడ్చి, మన మనసులో గల భావమును పరులకు వ్యక్తపరుచుటకు ఒక భాషను వాడుచున్నాము. మాటలను వాడుచున్నాము. మాట - వాక్కు - అన్ననేమి ? ఒక శబ్దమో, కొన్ని శబ్దముల కలయికయో, ఒక మాట అగుచున్నది. ఆ మాటకు ఒక అర్థముండును: ఆ అర్థము వెనుక నొక భావము ఉండును. ఆ భాషకు ఒక 'లిపి' ని గూడ జోడించినచో, ఆ మాటను చూడగలము; వినగలము. 'పుస్తకము' అని వ్రాసినచో, దానిని వాచకముగా, 'పుస్తకము' అని ఉచ్చరింతుము. దాని అర్థము అందరును చదువుకొనుటకు ఉపయోగపడి కాగితములతోకుట్టి, అచ్చువేయబడిన వస్తువు అని అర్థము చేసుకోగలము. ఆ అర్థముద్వారా ఎదటి మనిషి మనసులోనున్న 'పుస్తకము' అనుభావమును, మనమనస్సులో ఏర్పరుచు కోగలము, ఒక భావమును ఒక మనస్సు నుండి మరొకరి మనస్సులోనికి ప్రవేశించునట్లు చేయుటకు ఈ ప్రక్రియలన్నియు అవసరము. వ్రాయుటలో లోపమున్నను, ఉచ్చరించుటలో లోపమున్నను వినుటలో లోపమున్నను, అర్థము చేసుకొనుటలో లోపమున్నను, భావ ప్రసారము దెబ్బతినును. ఒకరి మనస్సులో ఉన్న రూపము ఒకటి. ఇంకొకరు తనమనస్సులో ఏర్పరుచుకున్న చిత్రము వేరొకటి కావచ్చును.

ఇది ఒకరి భావములను ఇంకొకరు అర్థము చేసికొనుటలో లోపమే కాక, తనంత తాను స్వయముగా చూచిన వాటిలో గూడ వేరు వేరు వ్యక్తులు వేరు వేరు భావములను ఏర్పరుచుకొనవచ్చును. ఒక పోలీసు అధికారి దొంగలకు భయంకర మయిన వ్యక్తిగను, కన్నకొడుకునకు ఆదర్శవంతమయిన మహాపురుషునిగను, భార్యకు కొరకరాని కొయ్యగను, తల్లికి పనిలో సతమతమగుచు భోజనముగూడ మరచిపోవుచున్న చిన్నపిల్లవానివలెను, క్రింది అధికారులకు కఠోరమయినవానిగను, పై అధికారులకు అత్యాసకుపోవు వాంఛితునిగాను కాన్పడవచ్చును. వారి వారి మనసు లోని భావములననుసరించి, అతని రూపము గూడ వారికి ఆ విధముగనే గోచరించును.

ఈ దృశ్య ప్రపంచమును ఎవ్వరును యథా తథముగా చూచు చుండుట లేదు. ఇంద్రియములు అందజేయు వార్తలను మనస్సు, తన మనో భావనలకనుగుణముగా, (ఈ దృశ్యప్రపంచమును) తనలో ఒక భావనాప్రపంచముగా ఏర్పరుచుకొనును. ప్రతివ్యక్తియు తన మనస్సులో ఏర్పడిన ఈ భావనాప్రపంచమునే చూచు చుండును. తాను మనస్సులో ఏర్పరుచుకున్న భావనాప్రపంచమే నిజమయిన ప్రపంచమని తలచు చుండును.

మనము ఈ దృశ్య ప్రపంచమును చూచుటయేకాక, ఇందులో ప్రవర్తించుట గూడ చేయుచుందుము. కాళ్ళతో నడచుట, చేతులతో పనులు చేయుట, నోటితో మాటలాడుట, విసర్జనావయవములతో విసర్జించుట, ఇవన్నియు బాహ్యప్రపంచములో మనము చేయుపనులు. మనస్సుతో ఆలోచించుట, బుద్ధితో విమర్శించుట. ఇవి అంతఃప్రపంచములో చేయుపనులు. ఈ పనులన్నియు మనము ఇచ్ఛా పూర్వకముగా చేయుచుందుము. కొన్ని పనులు మన ఇచ్ఛ లేకయే జరుగుచుండును. ఊపిరిపీల్చుట, గుండె కొట్టుకొనుట, రక్తప్రసారము, అన్నము జీర్ణించుకొనుట మొదలగునవి. మనము ఇచ్ఛాపూర్వకముగా చేయగలుగు పనులకు ఉపయోగపడు అవయవములనే కర్మేంద్రియములందురు. అవి కాలు, చేయి, నోరు, గుదము, లింగము. ఆవిధముగనే అయిదు జ్ఞానేంద్రియములు - కన్ను, ముక్కు, చెవి, నాలుక - చర్మము. మనకు బాహ్యప్రపంచముతో సంబంధము కలుగజేయునవి ఈ పది ఇంద్రియములు మాత్రమే. ఈ దశేంద్రియముల వెనుక, (శరీర, మనోబుద్ధుల వెనుక కూడ) ఒక ప్రాణ శక్తి కలదు. ఆ ప్రాణ శక్తి వలననే ఈ ఇంద్రియములన్నియు పనిచేయుచుండును. మన శరీరములో జరుగు మిగిలిన, అనిచ్ఛాపూర్వకమయిన పనులుగూడ ప్రాణశక్తి వలననే కలుగును. ఆ చైతన్యము నాధారము చేసికొనియే ఈ జగత్తులో సృష్టి జరుగుచున్నది.

ప్రకృతిలో మరికొన్ని శక్తులు గలవు. గాలి వీచుట, వర్షము కురియుట, నదులు ప్రవహించుట, తుఫానులు, భూకంపములు - ఇటువంటి వన్నియును ప్రకృతి శక్తులు. (ఈ జగత్తంతయు విరాట్ స్వరూపుడయిన ఈశ్వరుని శరీరమే అను భావములో, ఈ శక్తులు గూడ ప్రాణశక్తులని కొందరందురు.)

ఈ దృశ్య ప్రపంచమును రెండు భాగములుగా చెప్పవచ్చును : 1. బాహ్యము : బయటకు కనబడునది. 2. ఆంతరము :- బయటకు కనబడనిది.

**1. బాహ్యప్రపంచము :** పంచేంద్రియములకు కనుపించునది, పంచ కర్మేంద్రియములతో పనులు చేయుటకు అనువయినది. పంచభూతములతో కూడుకున్న ఈ ప్రకృతి, అందలి వస్తు సంచయము, శరీరములు, బాహ్య సంఘటనలు, బాహ్యకర్మలు - ఇవన్నియును బాహ్యప్రపంచమగును (Odjective World).

**2. అంతరము :** తనలో జరుగునవి - భావనలు, ఆలోచనలు, వాంఛలు భయములు, ఆందోళనలు, కోపతాపములు మొదలగునవి (Subjective World). ఇవి బయటకు కనుపించవు. తనకుతాను చెప్పినపుడు మాత్రమే బయట వారు గ్రహించగలరు.

## 2. కాలము, దేశము, కారణము :-

ఈ రెండురకములయిన ప్రపంచములకు కాల, దేశ, కారణ నియమములున్నవి. ఎప్పుడు ? ఎక్కడ ? ఎందుకు ? అను ప్రశ్నలు సదా పుట్టుచుండును. ఈ మూడు ప్రశ్నలును కాల, దేశ, కారణములకు సంబంధించినవి. బాహ్యాంతర ప్రపంచమంతయును, ఈ మూడింటి యొక్క సంయోగ ఫలితమే అని చెప్పవచ్చును.

ఉదయము తూర్పున ఉన్న సూర్యుడు, సాయంత్రము పడమటనుండును. ప్రొద్దుట సాయంత్రము కాలమును తెలియజేయును; తూర్పు, పడమర దేశమును తెలియజేయును. ఈ ఉదయాస్తమయములను స్వాభావికమని మనస్సు ఒప్పుకొనదు. దాని వెనకగల కారణమును తెలుసుకొనగోరును. ఎందుకన అను ప్రశ్న పుట్టును. దానికి సమాధానము దొరుకువరకు మనస్సునకు శాంతి ఉండదు— ఎందువలన— 'మనము భూమిమీద ఉంటిమి కావున; భూమి తన చుట్టూ తాను తిరుగుచున్నది కావున; సూర్యుడు తానున్న చోటనే కదలకుండ ఉన్నందువలన; (ఈ మూడు ప్రశ్నలేకాక 'ఎవరు' 'ఏమిటి?' అన్న ప్రశ్న సాధారణముగా ఎదురగుచుండును. అది నామ, రూపములకు సంబంధించిన ప్రశ్న. 'రాముడు ఎవరు?' అని అడుగునపుడు పేరు తెలుసునుగాని రూపము తెలియదని అర్థము; 'అతను ఎవరు ?' అన్నప్పుడు రూపము తెలుసునుగాని, పేరు తెలియదని అర్థము. 'అది ఏమిటి' అనునప్పుడు రూపము, పేరు గూడ స్పష్టముగా తెలియుటలేదని యర్థము).

'రాముడు ఉన్నాడు' అని మనము చెప్పినచో సరిపోదు. 'ఎప్పుడు ఉన్నాడు?' 'ఎక్కడ ఉన్నాడు?' 'ఎందుకు ఉన్నాడు' అను ప్రశ్నలు వెంటనే పుట్టును. ఉదయము

భార్యమీద కోపముతో ఉడికిపోవుచున్న మనస్సు, రాత్రికి ప్రశాంతముగా అనురాగ ముతో నిండిపోవును— ఎందుకు? (ఆ ప్రశ్నకు జవాబు చెప్పవలసిన అవసరము లేదు). దేశ నియమము, కాల నియమము, కారణ నియమము— ఈ మూడును ఈ దృశ్య ప్రపంచమునకు ప్రధాన లక్షణములు. (Basic Qualities).

ఈరోజు మన ఇంటిలోనున్న బల్ల మంచము పది సంవత్సరముల క్రిందట అడవిలో ఒక చెట్టు: 100 ఏళ్ళ క్రిందట అది మరొక చెట్టుయొక్క విత్తనము. మనకిప్పుడు మహాసముద్రముగా కనబడు నీరు, ఒకప్పుడు నదీప్రవాహము. అంతకు పూర్వము అది వర్షము. అంతకుముందు అది మేఘము. అంతకుముందు అది వేరొక సముద్రము. ఈ విధముగా మనము ఆలోచించుకొనుచుపోయినచో, ఈ దృశ్య ప్రపంచము సదా మార్పులు చెందుచు, ఇప్పుడు మనకు కనుపించు విధముగా పూర్వము లేదనియు, ఇకముందు గూడ ఈ విధముగనే ఉండదనియును మనము చెప్పగలము.

మార్పు, మార్పు, మార్పు— ఇది ఈ దృశ్య ప్రపంచము యొక్క ప్రధాన లక్షణము. ఈ మార్పు ఒక్క బాహ్యప్రపంచమునకే కాక, అంతఃప్రపంచములో గూడ నుండును. ఒకప్పుడు కోపము, ఒకప్పుడు శాంతము, ఒకచోట ద్వేషము, ఒకచోట రాగము, విజయము సాధించుటవలన ఆనందము, ఓడిపోవుట వలన దుఃఖము, ఇవన్నియు మనకు అనుభవమే— ఈ దేశ, కాల, కారణములతో నిమిత్తము లేని, ఈ మార్పులేని ప్రపంచమును మనము ఊహించుటకుగూడ కష్టము.

### 3. మార్పు — ఆధారము :—

మార్పును తెలిసికొనుటకు ఒక మారని వస్తువు, ఆధారముగా, ప్రమాణముగా ఉండవలెను. నిన్న ఒకచోట చూసిన చెట్టు, నేడు అక్కడ లేకపోయినచో ఆ మార్పును గ్రహించగలము. 'నిన్న ఇక్కడ చెట్టు ఉండెడిది? ఇప్పుడేమయినది' అని ప్రశ్నించినచో, 'ఎక్కడ?' అను ప్రశ్న పుట్టును. 'ఇక్కడే, ఈ పెద్ద భవనము ముందు, ఈ బాటకు ఇటువైపు' అని చెప్పెదము. అట్లు చెప్పుటలో మనము మనకు తెలియకుండగనే, కొన్ని మారని వస్తువులను ఆధారముగ తీసికొని, మారిన పరిస్థితిని గ్రహించితిమి. 'ఇక్కడ' అను స్థల నిర్ణయమునకు, నిన్నను, ఈరోజునను మారక యుండ ఉన్న ఆ భవనమును, ఆ బాటను ఆధారముగా చేసికొంటిమన్నమాట. అట్లు

రాత, తెల్లవారిన పిదప, ఆ భవనము, ఆ బాట గూత లేకపోయినచో ? అప్పుడు 'ఇక్కడ' అని నిర్దేశించుటకు ఏమి ఉండును ? దేనితో పోల్చి ఏది మారినదని నిర్ణయింతుము ?

ప్రత్యేకమయిన స్థలమును నిర్ణయించుటకు, ఏదో ఒక ఆధారరేఖ, స్థిరముగ ఉండునది — (Fixed Base line) ఉండవలెను. ఆ విధముగనే, ఒక ప్రత్యే సమయమును నిర్ణయించుటకు, ఒక నిర్దిష్టమయిన సన్నివేశమును ఆధారముగా తీసి కొనవలెను. మనము తీసుకొను ఆధారములు ఎప్పటికిని మారనివిగా ఉండవలెను..

స్థలమునకు (Space) అది ఎక్కడ ?
కాలమునకు (Time) అది ఎక్కడ ?
కారణమునకు — మూలకారణమేది ?

ఒక వస్తువునకు మరొక వస్తువునకు మధ్య అంతరము స్థలము (దేశము) కావి, వస్తువులే లేనిచోట స్థల నిర్ణయము ఎట్లు చేయగలము ? ఎట్టి సంకేతములు (Distinguishable points)లేని మహా ఎడారిలో మనము దూరమును ఎట్లు కొలవ గలము ? ఒకచోట బయలుదేరి 100 అడుగులు వేసి 'నేను 100 అడుగుల దూర ములో ఉన్నాను' అని మనము అనవచ్చును. కాని 'ఎక్కడనుండి' అని ప్రశ్నించు సరికి, మనము బయలుదేరిన బిందువు ఎక్కడున్నదో చెప్పలేము.... మనము ఎక్క డున్నను చుట్టూ కనుచూపుమేరవరకు ఎడారే— ఎంత దూరము నడిచినను ఎడారిలోనే యుందుము. ఆకాశము మేఘావృతమై, సూర్యుడుగాని, చంద్రుడుగాని, నక్షత్రములు గాని కనుపించనప్పుడు మనము దిక్కులుగూడ మరచిపోదుము— తూర్పునకు పోవు టకు బదులు ఉత్తరమునకు పోదుము. (ఈ విధముగా త్రోవ మరచిపోవుటకు ఎడారులే అక్కరలేదు. పెద్ద పెద్ద పట్టణములలో కూడ, ఒకేరకమయిన భవనము లున్న ప్రాంతములందు గూడ మనము స్థలనిర్ణయము చేయలేము). ఏలననగా అంతయును ఒకే వస్తువు. విభిన్నత్వము లేని ఒకేవస్తువు. విభిన్నత్వము లేనిచోట— 'స్థలము' అన్న మాటకు అర్థము లేదు.

ఇక కాలము—రెండు సంఘటనల మధ్య అంతరమును కాలము అను చున్నాము. ఈరోజు సూర్యోదయము మొదలుకొని, మరునాడు సూర్యోదయము వరకుగల మధ్య అంతరమును 'ఒకరోజు' అనుచున్నాము. దానినే గంటలలోను,

నిమిషములలోను, సెకనులలోను భాగించితిమి. ఆ రోజును ఆధారము చేసికొనియే నెలలు, వత్సరములు, యుగములు మొదలగునవి నిర్ణయించుచున్నాము. కాని సంఘటనలతో ప్రమేయములేని 'శుద్ధకాలము' (Undependent Absolute Time) అన్నది ఉన్నదా? అని ప్రశ్నించుకున్నచో, అట్టి కాలము లేదనే చెప్పవలెను. సంఘటనలు ఈ దృశ్య ప్రపంచములోనే వీలగును. దీనికి వేరయిన, విభిన్నత్వము లేని, సంఘటనలు లేనిచోట కాలము ఉండునా? గాఢనిద్రలో విభిన్నత్వములేదు; సంఘటలున లేవు. కాలము లేదు. ఏదో ఒకదానిగూర్చి, దీర్ఘముగా ఏకాగ్రతతో ఆలోచించుచున్నవారికి గూడ, భిన్నత్వము లేకుండుటవలన కాలగతి తెలియదు. అనగా కాలము నిలచిపోవును. మనము కాలమును గంటలు, నిముషములు అని విభజించితిమికాని, కాలపరిమితి అందరకును ఒక్కలాగున నుండదు. ఎన్నియో రోజుల తదుపరి కలుసుకున్న ప్రేమికులకు గంటలు నిముషములవలె గడచిపోవును. ప్రియుని బాసిన ప్రేయసికి, ప్రతి నిముషము ఒక యుగముగా తోచును. చలనచిత్రమును చూచునప్పుడు కాలమునకు ఉన్న వేగము పాఠ్యపుస్తకములు చదువునప్పు డుండదు. ఏకాగ్రతయందును, ఆనందానుభవమునందును గడియారములు చూపించుకాలము పరిగిడునట్లు తోచును; నిరీక్షణయందును, దుఃఖానుభవమునందును గడియారములు చూపించు కాలము కదలనట్లగుపించును. కాలము ఊహామాత్రము, మనోకల్పితము. దానికి స్థిరత్వముగాని, అస్థిరత్వముగాని లేదు.

మార్పులు జరుగుచున్న ఈ ప్రపంచములో ఆ మార్పులను గ్రహించి, నిర్దేశించగల మారని ఆధారము ఒకటి ఉండవలెనని చెప్పకొంటిమి. అట్లు కాక మారుచున్న ఆధారముమీద ఉండి, మరొక మారుతున్న వస్తువును చూచుచున్నచో కలుగు జ్ఞానము నిజమైనదికాదు—అది మిథ్యాజ్ఞానము.

మనము కదులుచున్న ఒక రైలుబండిలో కూర్చొని, అదే వేగముతో మన ప్రక్క లైనుమీద మనము వెళ్ళుచున్నవైపే వెళ్ళుచున్న మరొక రైలుబండిని చూచినచో, అది కదులుచున్నట్లే ఉండదు. అందులోని ప్రయాణీకులతో మాట్లాడవచ్చును, చేతులు కలపవచ్చును. ఒక బండినుండి మరొకబండికి మారవచ్చును. ఏ కారణముచేతనైనను మన బండి ఒకేసారి ఆగిపోయినచో, మన ప్రక్కనున్న బండి మహావేగముతో ముందునకు పోవుచున్నట్లు కనబడవచ్చును; లేదా మనము కూర్చున్న బండి మహావేగముతో వెనుకకు పోవుచున్నట్లు కనబడవచ్చును.

మన బండి వేగముగా ముందునకు వెళ్ళుచున్నను, మన ప్రక్క లైనుమీద వున్న బండి మనకన్న వేగముగా మనము వెళ్ళుచున్నవైపునకే వెళ్ళుచున్నచో, ఆ బండినే చూచుచున్న మనకు, మన బండి వేగముగా ముందుకు పోవుటకు బదులు నెమ్మదిగా వెనుకకు పోవుచున్నట్లు తోచును. ఈ అనుభూతి ఎంత సహజముగనుండు నన్నచో, మన బండిలోని ప్రయాణీకులందరూ, ముందుకు పోవలసిన బండి వెనుకకు ఎందుకు పోవుచున్నదని భ్రాంతిచెందుదురు. ఇంతలో మన ప్రక్కన వున్న బండి మన బండిని దాటుకొనుచు, ముందునకుపోయి, ఆఖరిపెట్టెగూడ మనను దాటిపోయి, లైను ప్రక్కనవున్న చెట్లు కనుపించగనే, అప్పటివరకు వెనుకకు పోవుచున్నట్లు అనుభూతి కలిగించిన బండి ఒక్క కుదుపుతో ముందుకు మహావేగముగా పోవు చున్నట్లు తెలియును. మన మనములందు ఆ 'కుదుపు' గూడ అనుభవమునకు వచ్చును.

రెండు లైనుల ప్రక్కన భూమిమీద కదలకుండ నిలబడి రెండు బళ్లను చూచుచున్న వ్యక్తికి, ఆ రెండును శరవేగముతో ఒకదాని నొకటి దాటుకొనుచు వెళ్లి పోవుట కనుపించును. ఇందులో ఏది సత్యము ? ఎవరి అనుభవము నిజమయి నది? భూమిమీద కదలకుండా నిలబడి రెండు బళ్లను చూచిన వాని అనుభవమే నిజమని మనము చెప్పగలము. కాని, బండిలోనే కూర్చొని, మనకళ్లతో మనము చూసి, ఏర్పరుచుకున్న అనుభవమో? అది అసత్యమా!

తాము చూచినదే నిజమని నమ్మువారికి, అది నిజముగానే తోచును. వారి అనుభవమునకు వేరైన నిజము ఇంకొకటి ఉన్నదని చెప్పినను వారు గ్రహించలేరు. గ్రహించుటకు ప్రయత్నించరు. కాని ఆ విధముగా ప్రయత్నించి, ఏది నిజమో తెలుసుకొనువారికి, తార్కికముగా ఆలోచించుట వలన అందులోని నిజా నిజములు తెలిసికొనగలడు. నిజము తెలిసిన పిమ్మట తన అనుభూతి వెనుకకు పోవు చున్నట్లు చెప్పుచున్నను, తన విచక్షణాజ్ఞానము తాను ముందుకే వేగముగా పోవు చున్నానను సత్యమును చెప్పుచుండును. అందువలన నిజము తెలిసికొనలేని మిగి లిన ప్రయాణీకులు ఆందోళన పడినట్లు, తాను ఆందోళన చెందక నిశ్చింతగా నుండును. మిగిలిన వారి అజ్ఞానమునకు తనలో తానే నవ్వుకొనును.

## 4. ఆధారము - వస్తుతత్వము :-

ఈ మారుచున్న జగత్తు వెనుక, మారని ఆధారమును, మారని సత్యమును మనము గ్రహించగలిగినచో, అప్పుడే మనము నిజమును గ్రహించితిమని చెప్ప

వచ్చును. ఆ సత్యమును తెలుసుకొననంత వరకు, మన జ్ఞానము నిజమయినది కాద నియు, భ్రమకు లోనయినదనియు చెప్పవచ్చును. అందువలన, ఈ మార్పుల వెనుక నున్న సత్యమెట్టిది అన్నది తెలుసుకొనవలెను.

ఒక వస్తువు ఒకచోట, ఒకకాలములో ఒక రూపములో ఒకపేరుతో ఉండి, వేరొకచోట, మరొక కాలములో, ఇంకొక రూపములో, వేరొక పేరుతో ఉన్నచో అందులో మార్పు జరిగినదన్నమాట. కాని వస్తుతత్వములో మార్పు లేదు. కేవలము నామ, రూపములలోనే మార్పు వచ్చినది. ఆ మార్పు దేశ, కాలముల పరిధిలో జరిగినది.

ఒక ఇల్లాలు తన పెళ్ళికి ముందు తన పుట్టింటి వారు పెట్టిన రెండు జతల బంగారపు గాజులను, పెళ్లి అయిన రెండు సంవత్సరముల తర్వాత, వాటిని చెరి పించి, పుస్తెల నానుగా చేయించుకొనెను. ఆమె తిరిగి పుట్టింటికి వెళ్లినపుడు ఆమె తల్లి 'నీబంగారపుగాజులు ఏవే' అని అడిగినపుడు పుస్తెలనానును చూపించి - 'ఇవిగో, అవే ఇది' అని చెప్పను. 'అవి' బహువచనము. 'ఇది' ఏకవచనము; గాజులు రూపము వేరు, పేరు వేరు; పుస్తెల నాను రూపమువేరు, పేరు వేరు, అట్టి సందర్భములో 'అవే, ఇది' అనుటలో ఔచిత్యమేమున్నది. 'అవే ఇది' - అనుటలో గాజులలో నున్న వస్తుతత్వమే, వాటిలోని బంగారమే పుస్తెలనాను యందుగూడ ఉన్నదని భావము. నామరూపములు మారినను వస్తుతత్వములో మార్పులేదు గావున విచారించవలసిన పనిలేదు అని తల్లికి ధైర్యము చెప్పెనని భావము.

నగలు వేరువేరయినా బంగారము అంతయు ఒక్కటే.

కుండలు, గోలెములు, వేరువేరయినను వాటిలోని వస్తుతత్వమయిన మట్టి అంతయును ఒక్కటే.

కర్ర వస్తువులు (Furniture) వేరువేరయినను, వాటి అన్నింటి యందు నున్నది కలపమాత్రమే.

మనము ప్రతీ వస్తువునందును దానికి నామ, రూపములు సమకూర్చిన వస్తు తత్వమును గూర్చి, తెలుసుకొనుట మొదలు పెట్టినచో ఇప్పుడు కనుపించుచున్నంత వివిధత్వము గోచరించదు, ఆ వస్తువులలో మనము ఏర్పరుకుచున్న విలువలలో కొంత

మార్పు వచ్చును. వాటిలో మనము ఏర్పరచుకున్న మమకారములో కొంతమార్పు వచ్చును. మనము మన వస్తువులయందు (అవి విలువయినవి కాకపోయినను) మనము ఏర్పరచుకున్న గర్వము, పరులకున్న వస్తువులయందు (అవికూడను విలువలేనివే అయినను), మనము ఏర్పరచుకొను ఈర్ష్యాభావము నందును, చాల మట్టుకు తరుగుదల కనుపించును.

ఈ మమకారములు, ఈ గర్వములు, ఈ ఈర్ష్యలు, ఈ వస్తువులు సమకూర్చుకొనుటయందలి తాపత్రయము - ఇవే కదా జీవితము. ఇవి లేనిచో జీవితములో ఆనందము (Thrill) ఎట్లుండును? అనికొందరు ప్రశ్నించవచ్చును. ఇదే ఆనందము అనుకొనుట ఒక భ్రమ. ఆ మిథ్యానందము కొరకు నిజమును కప్పిపుచ్చి భ్రమలో పడిపోనక్కరలేదు. నిజము గ్రహించుమనే ఆనందమును పొందవచ్చును. అసలు నిజము తెలుసుకొనుటలో నున్న ఆనందము భ్రమలో ఉండదు. నిజమును మరచి పోనంత వరకు, భ్రమలో నున్నట్లు నటించినను తప్పులేదు. కాని నిజమును మరచిపోరాదు.

చిన్నపిల్లలు గల ఇంటిలో, పెద్దవారుగూడ చిన్నపిల్లలతో కలసి ఆడుకొనుచు చిన్నపిల్లల వలెనే పాలకోసము ఏడ్చుచు, అన్నముపెట్టమని అల్లరిచేయుచు, ఆడుకొనుచుందురు. ఆ దుఃఖములోనూ, ఆ మారామచేయుటలోనూ వారికి ఆనందమే కలుగును. ఏలననగా, అది వట్టి ఆటమాత్రమేనని, ఆ పెద్దవారికే తెలియును. పిల్లలకుగూడా తెలియును. అది వట్టి భ్రమ. అందులోనే ఆనందము. కాని, ఆ ఆనందముకొరకు తమ నిజతత్వమును మరచిపోనక్కరలేదు. అట్లుకాక, ఆట అయిపోయిన పిమ్మట గూడా, పెద్దవారు చిన్న పిల్లలుగా ప్రవర్తించుచున్నచో, వారికి మతి స్థిమితము పోయినదని మనము చెప్పవచ్చును.

## 5. బాహ్యప్రపంచ వస్తుతత్వము :-

ఈ బాహ్యప్రపంచము యొక్క వస్తుతత్వమేమిటి? ఈ విషయమును ఆలోచించునప్పుడు, మన శరీరముగూడ ఈ బాహ్య ప్రపంచమునకు సంబంధించినదేనని రెండింటియందును వస్తుతత్వమొక్కటే అనియు గ్రహించుటముఖ్యము.

ఈ దృశ్య ప్రపంచమును, మన శరీరములతోసహా - పదార్థము (Matter) శక్తి (Energy), ఆకాశము (Space) అని మనము చెప్పవచ్చును. కాలము


(Time) ఈ వస్తుతత్వమునకు సంబంధించినదికాదు: కాని వస్తుతత్వముగల నామరూపసంజ్ఞారూపకమయిన (పేరు, రూపము, 'ఇది' అవి నిర్దేశించి చెప్పగల్గు గుర్తు) విభిన్న వస్తువులలో కలుగు మార్పులను తెలియుటకు ఉపయోగపడును.

మన పూర్వులు ఈ ప్రపంచమును (వస్తుతత్వమును) అయిదు భాగములుగా నిర్ణయించి, వాటికి, ఆకాశము, వాయువు, అగ్ని, నీరు, భూమి అని పేర్లుపెట్టిరి. సృష్టిక్రమములో ముందు ఆకాశము, దానినుండి వాయువు, పిమ్మట అగ్ని, ఆ తరువాత నీరు, ఆఖరున భూమి వచ్చినదని చెప్పుదురు. వీటిని పంచభూతములు (Five Elements) అనిరి. వీనిలో అన్నిటి కన్న సూక్ష్మమయినది ఆకాశము. అన్నిటికన్న స్థూలమయినది భూమి.

మన శాస్త్రముల ప్రకారము, ఈ పంచ భూతములు తమ సూక్ష్మరూపములో (తన్మాత్రలుగా) ఉన్నప్పుడు వాటినుండి మనఇంద్రియములు కలగినవని చెప్పుదురు ఆకాశమునుండి శ్రవణేంద్రియము, వాయువునుండి స్పర్శేంద్రియము, అగ్నినుండి దృగింద్రియము, నీటినుండి జిహ్వేంద్రియము, భూమినుండి ఘ్రాణేంద్రియము పుట్టినవి. ఈ పంచజ్ఞానేంద్రియములద్వారా మనము ఈ ప్రపంచములో గల ఈ అయిదు గుణములను తెలుసుకొని (చప్పుడు, స్పర్శ, కాంతి, రుచి, వాసన) ఇదే మన ప్రపంచమనుచున్నాము.

ఈ పంచ భూతములు తమ సూక్ష్మస్థితినుండి ఒకదానితో ఒకటి ఒక క్రమ పద్ధతిలో కలసి పంచ మహాభూతములయినవి. ఈ ప్రక్రియనే 'పంచీకరణము' అందురు. ఈ పంచభూతములు సూక్ష్మ స్థితిలో (తన్మాత్రలుగా) నున్నప్పుడు అవి అవ్యక్తమయినవి. ఇంద్రియములకు కానరానివి. అవి పంచీకరణము చెందిన పిమ్మటనే దృశ్య ప్రపంచముగా మారినవి.

పంచీకరణమనగా అయిదు అంచెలలో ఈ ఆయిదు భూతములు విడిపోయి, మరల కలియుట- ముందుగా ఒక్కొక్క భూతము రెండు భాగములయినది. అందులోని ఒక సగము అవిధముగనే, ఉండగా, మిగిలిన సగము నాలుగుభాగములు అయి, ఆ ఒక్కొక్క భాగము మిగిలిన నాలుగు భూతముల అర్ధభాగముతోనూ కలియును.




పైన చూపిన బొమ్మలో ఈ పంచీకరణము చూపబడినది. ఒక్కొక్క మహా భూతము తన శుద్ధతత్వము సగభాగము, మిగిలిన నాలుగు భూతముల శుద్ధ తత్వములను $\frac{1}{8}$వ వంతు చొప్పున కలిసి మరల పూర్తి మహాభూతముగా తయారగును. (అనగా :- భూమి $= \frac{1}{2}$ భూమి $+ \frac{1}{8}$ నీరు $+ \frac{1}{8}$ అగ్ని $+ \frac{1}{8}$ వాయువు $+$ $\frac{1}{8}$ఆకాశము).

## 6· స్థూ ల శ రీ ర ము :

మన శరీరమునందు గల పదార్థ తత్వముగూడ ఈ పంచ మహాభూతముల నుండి వచ్చినదే. వస్తు తత్వములో మన శరీరములకును ఈ పాంచ భౌతిక ప్రపంచమునకును భేదము లేదు. సప్తధాతువులతో (పైచర్మము, లోని చర్మము, మాంసము, క్రొవ్వు, రక్తము, ఎముకలు, మూలుగ) కూడిన ఈ శరీరము నుండి ప్రాణముపోయిన పిమ్మట ఇది ఈ పంచ భూతములలోనే కలిసిపోవును. ఈ శరీరములోనే, పంచ కర్మేంద్రియములయిన, కాళ్ళు, చేతులు, నోరు, గుదము, లింగము ఉన్నవి. ఈ స్థూల శరీరములోనే మన జ్ఞానేంద్రియముల పరికరములయిన కళ్ళు, చెవులు,

ముక్కు, నాలుక, చర్మము ఉన్నవి. ఈ దృశ్య ప్రపంచములో పనులుచేయుటకు, పైవారితో సంబంధ బాంధవ్యములు పెట్టుకొనుటలోను ఈ స్థూల శరీరము ఉపయోగ పడును. 'కాలవశమున ఈ స్థూల శరీరము నశించిపోయినచో, ఆ వ్యక్తి ఉండడు. అనగా నామ రూపములు, జాతి, వర్ణము, ఆశ్రమము ఇవన్నియును ఈ శరీరమునే ఆశ్రయించుకొని యుండును. అందుచేత అందరును ఈ స్థూల శరీరమునే వ్యక్తిగా పరిగణించుచుందురు.

కాని, మనకు బయటకు కనుపించుచున్న, నశించుపోవు స్వభావముగల ఈ స్థూల శరీరమే మన నిజతత్వమా ? కాదని చిన్నపిల్లవానికి గూడ కొద్ది అనుభవముతో తెలిసిపోవును. అల్లరి చేయుచున్న చిన్నపిల్లవానిని, తండ్రి గట్టిగా 'కొట్టెదను' అని బెదిరించి, చేయి ఎత్తి కొట్టబోవునట్లు అభినయించు సరికి, ఆ పిల్లవాడు ముందుగా తండ్రి ముఖములోనికి చూచును. ఆ ముఖములో ఏ మాత్రము చిరునగవు కనుపించినను, ఆ కొట్టుట అంతయు నటనయే అని గ్రహించి, నవ్వుచు, పరుగు పరుగున వెళ్ళి తండ్రి కాళ్ళకు చుట్టుకొనును. తండ్రి ముఖములో కోపముగాని కనుపించినచో, అతను కొట్టకుండగనే భోరుమని ఏడ్చుట మొదలిడును.

## 7. సూక్ష్మ శరీరము :

మనకు కనబడు దేహములో మనకు కనుపించని మరొక వ్యక్తిత్వమున్నదని కొద్ది విచక్షణాజ్ఞానముతో గ్రహించగలము. దానిని సూక్ష్మ శరీరమందురు. ఈ రెండు శరీరములలోను ఏది మన నిజతత్వమని ఆలోచించినచో, బయటకు కనబడు స్థూల శరీరముకంటె, లోపల నున్న సూక్ష్మశరీరమే మన నిజతత్వమని గ్రహించ గలము. మనము కట్టుకున్న బట్టలు మన నిజతత్వముకానట్లు, ఈ బాహ్య శరీరము గూడ మన నిజతత్వముకాదు. ఈ లోపలి శరీరము ఉండుటకు పనికివచ్చు ఒక గూడు; ఆ లోపలి మనిషి వాడుకొనుటకు పనికివచ్చు ఒక పనిముట్టు.

ఈ సూక్ష్మ శరీరము యొక్క వస్తుతత్వము ఎట్టిది? అని ఆలోచించినచో, అది స్పందనా రూపకమయినది, భావనా రూపకమయినది, ఆలోచనా రూపకమయి నది, అనుభూతి రూపకమయినదని గ్రహించగలము. అనగా ఇవన్నియును ఒక రకమయిన 'వృత్తి' (Waves; vibrations) రూపకమయినవని చెప్పవచ్చును. వీటిని 'మనోవృత్తులు' అనిగూడ అందురు.

స్పందన రూపకమయిన మనోవృత్తులను— 1) స్పందన, 2) ప్రతిస్పందన 3) క్రియ అను మూడు విధములుగా విభజించవచ్చును. ఇంద్రియములు బాహ్య ప్రపంచము నుండి తెచ్చు సంకేతములను గ్రహించి, దానిని విశ్లేషించి, వానిని అన్వయించుకొనుట (తెలిసికొనుట) 'స్పందన' (Perseption) అనవచ్చును. ఆ విధముగా తెలిసిన సమాచారమునకు అనుగుణముగా మనసులో కలుగు భావతరంగములను 'ప్రతి స్పందన' (Reaction) అనవచ్చును. ఆ ప్రతిస్పందన కనుగుణముగా ప్రవర్తింపుటకు కావలసిన సంకేతములను 'క్రియారూపకమయినవి' (Action oriented) అని చెప్పవచ్చును. ఈ విధముగా 'స్పందన' 'ప్రతిస్పందన', 'క్రియ' ఒక క్రమ పద్ధతిలో ఒకదాని వెనుక ఒకటి ప్రవాహరూపమున జరిగిపోవుచుండుట వలన సూక్ష్మ శరీరమునకు ఒక 'అస్తిత్వము' (ఉన్నది అను భావము) కలిగినది. సూక్ష్మ శరీరము లోపలనున్నను, బయటకు కనబడు స్థూల శరీరమును ఆడించుచుండును. కాని బాహ్య ప్రపంచమునకు కనుపించునది బాహ్య శరీరము గావున, మానావమానములు, సత్కార తిరస్కారములు, నమస్కారములు, పాదాభివందనములు, నామకరణము, ఉపనయనము, వివాహము—అన్నియు బాహ్య శరీరమునకే జరుగుచుండును.

ఇక, భావనా రూపకమయిన మనో వృత్తులు ఎట్టివనిన—కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములు, భయము, అనుమానము మొదలగు భావనలతో-కూడు కున్నవి. రాగము, ద్వేషముకూడ మనో వృత్తులే—మనిషిలో కలుగు ఆవేదనలకు, దుఃఖమునకు ఈ భావనలే ప్రధాన కారణములు. మనిషి చేయు ప్రతి పనియును ఈ భావనల పరిధిలోనే జరుగుచుండును. మనకు ఒకరిలో ద్వేషము కలిగినచో వానిని సర్వనాశనము చేయుటకు పూనుకొందుము. వాడు ఏపని చేసినను మనకు చెడ్డగనే కనుపించుచుండును. ఆ దృష్టితోనే అతనితో వ్యవహరింతుము. మనకు ఒకరిలో ప్రేమ కలిగినచో అతని తప్పులన్నియు ఒప్పులుగానే కనుపించును. అతను చేయు ఎంతటి స్వల్ప కార్యమయినను మహత్కార్యముగా తోచును.

ఇక ఆలోచనా రూపకమయిన మనోవృత్తులు-ఈ ఆలోచనలను 1) వాంఛా రూపకమయినవి; 2) విచక్షణా రూపకమయినవి 3) నిర్ణయాత్మకమయినవి. అని విభజించవచ్చును.

క్రొత్త అనుభవములను పొందుటకును, అంతకు ముందు అనుభవించిన వాటిని తిరిగి పొందుటకును కలుగు మనోవృత్తిని 'వాంఛ' అనవచ్చును. మనము తెలుసు

కొనుచున్న విషయములను విశ్లేషించి, అందుగల నిజానిజములు, మంచిచెడ్డలు తెలిసికొనుట విచక్షణా రూపకములయిన ఆలోచనలు. మనదై సందిన వ్యవహారములలోను క్రొత్త వ్యవహారములలోను పూర్వాపరములను విచారించి, నిర్ణయము తీసుకొనుటకు దోహదము చేయు ఆలోచనలు నిర్ణయాత్మకమయినవి.

ఇక అనుభూతి పూర్వకమయిన మనోవృత్తులు—మనము చూచు ప్రతీ దృశ్యమందును, చేయు ప్రతీ పనివలనను, ఆలోచించిన ప్రతీ ఆలోచనవలనను అంతరంగములో ఒక తృప్తభావముగాని, అసంతృప్త భావముగాని కలుగును. తృప్తభావము ఆనందము కలిగించును; అసంతృప్తభావము దుఃఖమును కలిగించును.

ఈ స్థూల, సూక్ష్మ శరీరములను సంధాన పరచి (ఒకదానితో ఒకటి చేర్చి), ఆ రెండింటిలోనూ చైతన్యము కలిగించునది 'ప్రాణశక్తి'. అదిలేనిచో రెండింటి మధ్యన గల బంధము వీడిపోవును.

## 8. చిత్తము :

సూక్ష్మశరీరమును చిత్తమని, అంతరంగమని కూడ వ్యవహరించుచుందురు. మన వేదాంతములో ఈ 'చిత్తము' నకు ముఖ్యమయిన పాత్రకలదు.

ఈ 'చిత్తము'ను నాలుగు భాగములుగా విభజింపవచ్చును. 1) మనస్సు: 2) బుద్ధి 3) అహంకారము 4) చిత్తము.

**మనస్సు** : దీని గూర్చి ఇంతకు ముందు చెప్పుకొంటిమి. స్పందనలు, ప్రతి స్పందనలు, కామక్రోధాది భావములు, సుఖదుఃఖాది అనుభూతులు, రాగ ద్వేషాది ద్వంద్వములు—అన్నియుగూడ ఈ మనస్సుకు సంబంధించినవే—ఆందోళ నలు, అలజడులు, భయములు- ఇవి గూడ మనస్సునకు సంబంధించినవే-ఇవన్ని యును భావనా రూపకమయిన మనోవృత్తులు.

**బుద్ధి** : దీని గురించియును ఇంతకు పూర్వము చెప్పుకుంటిమి. వివేకము, విచక్షణాజ్ఞానము; క్రొత్త సంగతులనూర్చి ఆలోచించుట—ఇవన్నియును బుద్ధికి సంబంధించినవే— 'వాంఛలు' కొందరు బుద్ధికి చెందినవని కొందరు మనస్సునకు చెందినవని యందురు. అసలు మనస్సునకును, బుద్ధికిని మధ్యన ఉన్నరేఖ చాల పల్చనిది. అలజడులు, ఆందోళనలు మనస్సునందునూ, ఆలోచనలు బుద్ధియందును కలుగునని చెప్పవచ్చును, ఈ రెండును గూడ మనోవృత్తులే.

**అహంకారము :** బయట ప్రపంచములో జరుగుచున్న సంఘటనలను గ్రహించుచు, వాటియందు ఎట్టి 'ప్రతి స్పందన' లేకుండ, కేవలము 'ద్రష్ట' (చూచు వాడు)గా మాత్రమే ఉన్నచో, అప్పుడు చిత్తము 'అహంకారము'గా వ్యవహరించు చున్నదని చెప్పవచ్చును. అప్పుడు 'నేను చూచుచున్నాను', 'నేను విను చున్నాను', అను భావము మాత్రమేయుండును. ఆ 'నేను, నేను'అను భావమే అహంకారము-మనకు సంబంధము లేని సన్నివేశమును చూచుచున్నప్పుడు, మనస్సులో ఎట్టి అలజడులు ఆలోచనలు కలుగకపోయినను 'నేను చూచుచున్నాను' అనుభావము మాత్రము నిరంతరము కలుగుచుండును. అదే అహంకారము.

ఈ 'అహంకారము' బాహ్య ప్రపంచములోని సన్నివేశములనేగాక, మన మనోబుద్ధులలో కలుగు భావములను, ఆలోచనలను గూడ తెలిసికొనుచుండును. మనస్సు కోపముతో నిండియున్నను, బుద్ధి ఆలోచనలతో సతమతమగుచున్నను— అహంకారము వాటిని గ్రహించి, 'నేను కోపముతో ఉన్నాను', 'నేను ఆలోచించు చున్నాను' అను భావము కలిగి ఉండును.

అందుచేత మనోబుద్ధులలో ఎటువంటి స్పందనలు, ప్రతిస్పందనలు, భావములు, ఆలోచనలు, ఏమి కలిగినను ఈ 'అహంకారము' తెలిసికొను చుండును. అసలు బాహ్యప్రపంచములో కనుపించు దృశ్యములన్నియును, స్పందన రూపములో మన మనస్సులోననేయుండును. వాటినే ఈ అహంకారము చూచుచుండును. అహంకారము చూచునది మనోబుద్ధులలో కలుగు స్పందనలను, ప్రతిస్పందనలను, మనోవృత్తులనేగాని, బాహ్యప్రపంచమును కాదని చెప్పవచ్చును. ఎవరయినను 'నేను కొండను చూచుచున్నాను' అన్నచో, ఆ కొండ అతని మనోఫలకము మీద ఏర్పరచిన ప్రతిబింబమును చూచుచున్నాడన్నమాట! ఫొటోగ్రాఫరు తన కెమేరా వెనుక నల్లగుడ్డ కప్పుకొని, కెమేరా యొక్క భూతద్దము వలన లోపలి గాజుపలక మీద పడ్డ ప్రతిబింబమును చూచుచు, ఎదురుగా కూర్చున్న మనుష్యులను ఇటునటు జరుపును. ఆ విధముగనే, మనము(మన అహంకారము), మన మనస్సులో కలిగిన ప్రతిబింబమును చూచుచు, మనము బాహ్యప్రపంచమునే చూచుచున్నామని భ్రాంతి చెందుచున్నాము.

ఆ మనోఫలకము (మనస్సు అను గాజుపలక), మలినముగా (అలజడుల తోను, ఆందోళనలతోనూ కూడుకొని) ఉన్నచో మనకు కనుపించు బింబముగూడ వికృతముగా నుండును. మనస్సు కోపవికారముతో కూడి ఉన్నపుడు, బింబమును

గూడ వికారముగా కాన్పించును. మనస్సు నల్లగా నున్నచో (అనగా నిద్రావస్థలో) బింబమే కనుపించదు. బాహ్యప్రపంచములో మార్పులు లేకపోయినను, మన మనో వికారములనుబట్టి, బింబము ఒక్కొక్కప్పుడు ఒక్కొక్క తీరులో కాన్పించును. మన మనోవృత్తుల ననుగుణముగా కనుపించును. ఏలననగా, అహంకారము చూచునది బాహ్య ప్రపంచమునుకాదు. మనోబుద్ధులలో కల్గు మనోవృత్తులను—ఈ అహంకారము గూడ ఒక భావనయే- ఒక మనోవృత్తియే.

**చిత్తము :** మనస్సు, బుద్ధి, అహంకారము అన్నవి వృత్తిరూపకమయినవని చెప్పుకొంటిమి. అవి సముద్రముయొక్క ఉపరితలము మీద కనబడు అలలవంటివి. అలలు ఎత్తు పల్లములు కలిగి, నిరంతరము కదులుచుండుట వలన అవి వాటి క్రిందన ఉన్న వాటికి ఆధారభూతమయిన సముద్రమును పూర్తిగా కప్పి, తామే సముద్రమను భ్రాంతిని కలుగజేయును. కాని ఆ అలల వస్తుత్వము, వాటిక్రిందన ఉన్న సముద్రమే. అలలు లేని నిశ్చలమయిన సముద్రము ఉండగలదు కాని, సముద్రములేని అలలు ఉండలేవు.

ఆ విధముగనే ఈ మనస్సు, బుద్ధి, అహంకారము అనునవి చిత్తము అను సముద్రము మీద కదులు అలలు. వీటి వస్తుతత్వమును 'చిత్తము' అందురు. ఈ మనో బుద్ధ్యహంకారములు కలిగించు మనోవృత్తులు (అలలు) పూర్తిగా ఆగిపోయినచో, మిగిలెడిది స్పందన, ప్రతిస్పందన, అలజడి, ఆందోళన, ఆలోచన, భావము, అనుభూతిలేని మనోపదార్థముయొక్కటే-అదే 'చిత్తము' అని ఎరుగవలెను. గాఢ నిద్రలో నున్నప్పుడు: మనకు బాహ్యప్రపంచముగాని, మన ఆలోచనలుగాని, ఆందోళనలుగాని, భావములుగాని, కొనకు 'నేను ఉన్నాను' అను భావముకూడ ఉండదు. అప్పుడు (వృత్తిరూపకములయిన) మనస్సు, బుద్ధి, అహంకారము లేని 'చిత్తము' ఒక్కటే నిశ్చలముగా నుండును. వస్తుతత్వములో మనో బుద్ధ్యహంకారములు చిత్తమునకు భిన్నమయినవికావు గాన, మనోవృత్తులను చిత్తవృత్తులు అనికూడ అందురు. (ఈ చిత్తము తన్మాత్రరూపములోనున్న శుద్ధ ఆకాశతత్వముతో కలిగినదని చెప్పుదురు. అందువలన దీనిని 'చిత్తాకాశము' అనికూడ అందురు.)

## 9. ఆత్మతత్వము :

స్థూల శరీరము అస్థిరమయినదనియును, నాశవంతమయినదనియును చెప్పుకొంటిమి. అట్లే సూక్ష్మ శరీరమయిన మనోబుద్ధులు కూడ చంచలమయినవి. స్థిరత్వము

లేనవి. వృత్తి రూపకమయినవి. ఈ రెండు శరీరములుగూడ అవస్థా భేదములను చెందుచుండును. ఒకప్పుడు జాగ్రదవస్థలోను, మరొకప్పుడు స్వప్నావస్థలోను, వేరొకప్పుడు సుషుప్త్యవస్థలోను ఉండును. గాఢనిద్రలో ఈ రెండును గూడ తమ అస్తిత్వమును మరచిపోయి యుండును. వాటికి నిత్యత్వము, నిర్వికల్పత్వము (మార్పులు లేకయుండుట) లేవు. విశేషించి ఈ రెండును స్వయంప్రకాశమయినవి కావు. జడమయినవి, అవి స్వయం ప్రతిపత్తి కలవికావు. (తమంతతాము నిలువ గలిగెడివికావు.) కావున ఈ రెండును గూడ మన నిజతత్వము కానేరవు. మార్పులు చెందుచుండెడివి, మార్పులులేని ఆధారము కానేరదు.

ఈ విధముగా యోచించిన పిమ్మట, ఈ బాహ్యాంతర శరీరములవెనుక, వాటికి ఆధారభూతమయిన, నిర్వికల్పమయిన, నిత్యమయిన, వేరొక తత్వమున్నదనియును, అదియే 'నేను', 'నేను' అను భావము వెనుకనున్న నిజతత్వమనియును నిర్ధారణకు వచ్చిరి. అది జ్ఞానరూపమయినది. సూర్యునకు కాంతి, వేడిమి స్వాభావిక గుణములయినట్లు, జ్ఞానము (Consciousness)-ఎరుక- ఈ ఆత్మకు స్వాభావిక గుణము సూర్యకాంతిలో ప్రపంచములోని జీవరాసులన్నియును, సూర్యుని ప్రమేయము లేకుండనే, తమ తమ పనులలో నిమగ్నమైయుండును. సూర్యుడు సర్వకర్మసాక్షి అతనికి తనకాంతిలో జరుగు పనులతో-అవి మంచివయినను, చెడ్డవయినను-వాటితో ఎట్టిప్రమేయము లేదు. ఆ విధముగానే, ఈ ఆత్మయొక్క జ్ఞానప్రకాశములో ఈ శరీర మనోబుద్ధులు తమతమ అన్ని పనులను చేసుకొనుచుండును. అట్టిపనుల కన్నింటికిని 'ఆత్మ' సాక్షి మాత్రమే. సూర్యుడు ఎల్లప్పుడును ప్రకాశించుచున్నను భూమి తన చుట్టును తాను తిరుగుచు, తన నీడలోనికే తాను వచ్చినపుడు అంధకారములో మునిగి పోవును. అంతమాత్రము చేత సూర్యుడు లేడనికాదు. ఆ విధముగనే 'ఆత్మ' ప్రకాశములో చిత్తము ఉన్నప్పుడు, అది చైతన్యవంతమై, స్థూల శరీరమును గూడ చైతన్యవంతము చేయును. వెంటనే స్థూల, సూక్ష్మ శరీరములు తమ తమ పనులు చేయుట మొదలిడును. గాఢనిద్రలో 'చిత్తము' తమస్సులో ఉన్నప్పుడు ఆత్మ తేజము మరుగుపడును. అప్పుడు స్థూల, సూక్ష్మ శరీరములు చైతన్యమును కోల్పోయి నిద్రావస్థలో ఉండును. స్వప్నావస్థలో 'చిత్తము' రజోగుణ ప్రాధాన్యము కలిగి, ఆత్మప్రకాశము కొద్దికొద్దిగా యున్నప్పుడు, మనోబుద్ధులలో, మిగిలిపోయిన మనోవృత్తులను, ప్రాత సంఘటనలయొక్క స్మృతి రూపకమయిన మనోవృత్తులను, కలిపి ప్రకాశింపజేయుట వలన పలురకములయిన స్వప్నములు కలుగుచుండును.

కాని, ఆ అసంపూర్ణ జ్ఞానములో, స్వప్న రూపకమయిన ఈ మనోవృత్తులు బాహ్య ప్రపంచములో కలుగు యథార్థ సంఘటనలవలెనే అనుభూతి కలిగించును. చిత్తము ఈ విధముగా పలు అవస్థలలో పలు విధములుగా ఉన్ననూ,ఆత్మ తత్వము మాత్రము సూర్యునివలె, ఒకేవిధముగా, ఎట్టి మార్పులును లేకుండ, ప్రకాశించుచుండును.

ఈ జ్ఞాన రూపకమయిన ఆత్మ తత్వమే మన నిజతత్వమని మన శాస్త్రము లన్నియు అంగీకరించును.

ఈ సందర్భములో ఒకముఖ్య విషయము గమనించవలసి యుండును. 'ఆత్మ' అనునది మన శరీర మనోబుద్ధులకు వేరయి వాటికి ఆధార భూతమయిన తత్వ మయినను, మన వేదాంత గ్రంథములలోనూ, తదితర గ్రంథములలోను 'ఆత్మ'అను పదమును వేరువేరు సమయములలో వేరువేరు అర్థములలో వాడుచుందురు. 'ఆత్మ' అను పదము 'నేను' అను అర్థములో, ఒకప్పుడు దేహమును సూచించునదిగను ఒకప్పుడు మనస్సును, వేరొకప్పుడు బుద్ధిని, మరొకప్పుడు జీవాత్మను సూచించు చుండును. ఒకొక్కప్పుడు శుద్ధ ఆత్మతత్వము అను భావములో సర్వాత్మతత్వము నకు గూడ వాడుచుందురు. అందువలన సందర్భమును బట్టి 'ఆత్మ' అను పదము దేనిని సూచించుటకు వాడబడినదో చూచుకొనుచుండవలెను.

## 10. జీవాత్మ — లేక — జీవుడు :

ప్రతిమానవుడు ఈ ప్రపంచములో వ్యవహరించునప్పుడును, తనలో తాను ఆలోచించుకొను చున్నప్పుడును 'నేను', 'నాది' అను మాటలను వాడుచుండును. 'నేను' అను పదమును కర్తను, భోక్తను, ద్రష్టను, అనుభావములో వాడును. 'నాది' అను పదమును 'నేను' అను పదమునకు భిన్నముగా వాడుచుందుము.

'నేను సుబ్బారావును' అని చెప్పునప్పుడు సుబ్బారావు అన్న పేరే తాను అను భావము కల్గును. కాని 'సుబ్బారావు అను పేరునాది' అనునప్పుడు 'నేను' వేరు, సుబ్బరావు అనుపేరు వేరు అని చెప్పగలము. ఒకటి ఆత్మ పరమయిన(Subjective) పదము. ఇంకొకటి అన్యపరమయిన (Objective) పదము. 'నాది' అనునప్పుడు 'అది నేను కాను' అని చెప్పుచున్నట్లే భావించవచ్చును.

'ఈదేహమును నేను' అనునప్పుడు ఆ వ్యక్తి దేహమే తానుగా వ్యవహరించు చున్నాడన్నమాట, కాని, 'ఈదేహము నాది' అనునప్పుడు 'నేను వేరు' 'ఈ దేహము

వేరు' అను భావము కల్గును. 'నేను', 'నాది' అనుభావములలో 'నాది' 'నాది' అని చెప్పుకొనగలిగెడివన్నియు, 'నేను' కాదు అని చెప్పవచ్చును.

పైన చెప్పిన వివరణ నాధారమును తీసుకొని, మనలో 'నేను' 'నేను' అనునది ఎవరు అనునది నిర్ధారించవచ్చును.

ఈ శరీరము 'నాది' కావున నేను శరీరమును కాను.

ఈ మనస్సు 'నాది' కావున నేను మనస్సును కాను

ఈ బుద్ధినాది కావున నేను బుద్ధిని కాదు.

ఈ విధముగా ఒక్కొక్క దానిని తిరస్కరించుకొనుచు పోయినచో, 'నేను' అన్నది ఏమయినను చేతికందునా ? లేక శూన్యమే మిగులునా? మనము వేటిని 'నేను' 'నేను' అని భావించుకొనుచు వచ్చితిమో, అవన్నియును 'నావి', 'నావి' అను భావములోనికి పోవుచుండును. అందువలన ఆ 'నాది' అను భావము ఎక్కడ ఏ విధముగా కలుగుచున్నదో ఆలోచింతము.

ఇంతకు ముంచు మనము 'అహంకారము' గూర్చి చెప్పుకొంటిమి. 'నేను చూచుచున్నాను', 'నేను చేయుచున్నాను', 'నేను అనుభవించుచున్నాను' (ద్రష్ట, కర్త, భోక్త) అను భావన వెనుక 'నేను' అనునది ఏదియో యున్నది. అదేమిటో ఆ భావనకు కూడ తెలియదు. అన్ని మనోవృత్తుల వలెనే అది కూడ ఒక మనోవృత్తియే. అప్పటి వరకు, స్థూలశరీరముతోసహా, సూక్ష్మశరీరములో కలుగు అన్ని మనోవృత్తులను, 'నావి', 'నావి' — (ఈ శరీరమునాది; ఈ కోపము నాది; ఈ ఆలోచన నాది) అని అనుచున్న వ్యక్తి 'అహంకారము' వద్దకు వచ్చునరికి 'అది నాది' అని అనలేకపోవుచున్నాడు. అక్కడకు వచ్చునరికి 'ఇదే నేను' అను భావము స్ఫురించుచుండును. ఈ 'అహంకార' భావనకూడ ఒక మనోవృత్తియే అని మనకు తెలియును. ఏలననగా, గాఢనిద్రలో ఈ భావన కూడ ఉండదు; కాని ఈ మనోవృత్తిని కలిగించు శక్తి ఎట్టిదో ఎవ్వరును చెప్పలేకపోవుట వలన, ఆ మనోవృత్తియే, ఆ భావనయే, 'నేను'గా వ్యవహరించును. గాఢనిద్రలో లేని ఈ 'నేను' అనుభావన—ఈ అహంకారము—మెలుకువరాగానే, ఒక్కసారి, 'నేను ఉన్నాను' అను భావముతో లేచి, జాగ్రద్ స్వప్నావస్థలలో తానే కర్తగా, ద్రష్టగా, భోక్తగా వ్యవహరించుట మొదలిడును. కాని, **ఈ 'అహంకారము', ఈ** భావన — నిజమయిన 'నేను' కాదు.

ప్రతీ పెద్ద వ్యాపార సంస్థకును, ఒక ముఖ్య వ్యవహర్త—ప్రధానాధికారి, (Managing Director) ఉండును. అతను ఆ సంస్థ వ్యవహారము లను సక్రమముగా నిర్వర్తించుటకు కావలసిన అధికారమును (General Power of Attorny) పొంది, అన్ని వ్యవహారములు తానే చూచుచుండును, కాని, కొంతకాలమునకు, తాను ఒక అధికారి మాత్రమే అన్న విషయమును మరచిపోయి, 'నేనే సంస్థను' అనునట్లు వ్యవహరించుట మొదలిడును. ఆ విధముగానే ఈ 'అహంకార భావన' కూడ తన వెనుకనున్న 'శక్తి'ని గ్రహించలేక, తానే 'నేను'గా వ్యవహరించును. అందుచేత ఆ 'అహంకార' భావననే 'జీవుడు', 'జీవాత్మ' అని పిలుచుట మొదలిడిరి.

ప్రధాన కార్యకర్త వెనుక, అతనికి సర్వాధికారములను ఇచ్చు 'సంస్థ' లేనిచో ఆ ప్రధానాధికారికి ఎట్టి విలువయులేదు. ఎట్టి అస్తిత్వమునులేదు. ఆ విధముగనే 'నేను'గా వ్యవహరించుచున్న ఈ 'అహంకార భావన' వెనుక ఆధార భూతమయిన ఒక నిత్యపదార్థము, సత్ పదార్థములేనిచో ఆ 'అహంకారము'నకు కూడా అస్తిత్వము ఉండదు. ఆ సత్ పదార్థమే 'ఆత్మ' తత్వము.

జ్ఞాన రూపకమయిన 'ఆత్మ' తత్వము యొక్క జ్ఞాన ప్రకాశము చిత్తములో ప్రతిబింబితమై, 'నేను' అను భావనను కలుగజేయును.

సూర్యకాంతి ప్రవేశించలేని గదిలో చీకటి నిండియుండును. కాని, గది బయటనున్న సూర్యకాంతిలో ఒక అద్దమునుపెట్టి, ఆ కాంతిని గదిలోనికి పంపించ వచ్చును. అప్పుడు గది యంతయును కాంతితో నిండిపోవును. ఆ కాంతి సూర్యుని వలన కలిగినది అయినను, అది శుద్ధమయిన సూర్యరశ్మికాదు. అద్దము ద్వారా పరావర్తనము అయిన కాంతి. అద్దము ఎర్రరంగులో ఉన్నచో, గదిలోనికి ప్రవేశించు కాంతికూడ ఎర్రగానుండును. ఆగదిలోని వస్తువులు కూడ ఎర్రగా కనబడును. అద్దము మలినముగా నున్నచో, గదిలోకి ప్రవేశించు కాంతి గూడ స్వచ్ఛముగా ఉండదు. గదిలోని వస్తువులు గూడ అస్పష్టముగా కనబడును.

ఆ విధముగనే ఆత్మయొక్క జ్ఞానప్రకాశము చిత్తము (బుద్ధి) అను అద్దములో ప్రతిబింబితమై, ఆ చిత్తమును ప్రకాశవంతము చేయును. ఆ పరావర్తిత జ్ఞానప్రకాశములో, చిత్తములో కలుగు మనోవృత్తులన్నియును ప్రకాశితమగును. 'అహంకారమ'ను మనోవృత్తి గూడ ప్రకాశితమై (జ్ఞానవంతమై), 'నేను' అను

భావముగా మెలగును. కాని, ఈ 'అహంకారము', తాను పరాప్రకృతి యొక్క తేజోవంతమయినదను విషయమును ఎరుగక, తానే స్వయం ప్రకాశుడనని ఎంచును, తానే ద్రష్టగా, కర్తగా, భోక్తగా భావించి వ్యవహరించుచుండును. శరీరములో బుద్ధిలో జరుగు అన్ని పనులకును తానే బాధ్యుడనని భావించును. మంచి జరిగినచో సంతోషించును; చెరుపు జరిగినచో దుఃఖించును; కష్టములు ఎదురయినచో ఆందోళన చెందును; సుఖములను వాంఛించును; కష్టములను ద్వేషించును; ఆలోచించును; విచారించును; కోపము తెచ్చుకొనును; భయము చెందును.

తన నిజతత్త్వమేమిటో తెలుసుకొనలేక, ఈ 'జీవుడు' ఒక అసహాయస్థితిలో యుండును. తన స్థితి తనకు అవగతమగు చున్నను, దానిని అధిగమించుట ఎట్లో ఎరుగడు. ఈ ప్రపంచమెందుకు యున్నదో తెలియదు. అందులో తనకర్తవ్యమేమిటో తెలియదు; తన వాంఛల ప్రోద్బలమువలన ఈ ప్రపంచములో ప్రవర్తించును, వాటి వలన కలిగిన సుఖదుఃఖములను అనుభవించుచుండును. కాని ఆ జీవభావము వెనుకనున్న ఆత్మతత్త్వమునకు మాత్రము 'జీవుడు' అనుభవించు సుఖదుఃఖములతోగాని, అతను చేయు పనులతోగాని, ఎట్టి సంబంధము లేక నిర్వికారముగా, నిశ్చలముగా, నిర్వికల్పముగా నుండును.

## 11. నిరీశ్వర–ఈశ్వర వాదములు :

కొందరు (చాలమంది), ఈ జీవుడే నిజమయిన వ్యక్తి తత్త్వమని యును, అంతకు మించి ఆలోచపలసినదియు, ఎరుగవలసినదియు, చేయవలసినదియు మరి యొకటి లేదనియు ఎంచి, జీవితము విభిన్న సంఘటనల పరంపర అనియును, దీనికి మృత్యువే అంతమనియును, అంతకు మించినది మరొకటి లేదనియును, అందుచేత, ఈ జీవితమును, సుఖవంతము చేసుకొనుటకు తగిన మార్గములను చేపట్టవలెననియు తలంచుచు, మహాప్రవాహములో కొట్టుకొనిపోవు కర్రముక్కలవలె, అస్వాధీనముగ కాల ప్రవాహములో కొట్టుకొని పోవుచుందురు.

కాని, కొందరు ఇదే నిజమని నమ్మలేక, దీని వెనుకనేదో ఒక నిజము ఉండవలెననియు, ఒక అజ్ఞాత శక్తి ఉండవలెననియు, లేకపోయినచో ఈ అనిత్య ప్రపంచములో, ఈ విధముగ దుఃఖములనుభవించుచు జీవించుటలో పరమార్థమేమియును లేదని ఊహించి, ఆ అజ్ఞాత శక్తి యొక్క తత్త్వమును తెలుసుకొనుటకు ప్రయత్నించిరి.

రెండవది ఆ శక్తిని ఈశ్వరుడని, అతడు శాశ్వతుడనియు, సర్వజ్ఞుడనియును, సర్వవ్యాపకుడనియును, అతడే ఈ ప్రకృతిని స్వాధీనపరచుకొని సృష్టి కార్యమును చేయుననియును, అతని కృప ఉన్నచో 'జీవుడు' ఈ జననమరణ చక్రమునుండి ముక్తుడై, ఈశ్వరునితో సాయుజ్యము పొందుననియును, అందుచేత ఆ ఈశ్వరునే సర్వదా ఆరాధించవలెననియును చెప్పుదురు.

వివిధమతానుసారముగా, ఆ ఈశ్వరుడు విష్ణువనియు, శివుడనియు, పరమాత్మ అనియు, శక్తి అనియు, జహోవా అనియు, అల్లా అనియు—ఈ విధముగా పలు నామములతో వ్యవహరించుచుందురు. ఈ సృష్టి కార్యమంతయును ఆయనవలననే జరిగినది; ఈ జగత్తులో జరుగు ప్రతిపనియును అతని సాక్షిత్వములోనే జరుగును. ఈ జగత్తు ఆయన 'ఇచ్ఛ' ఉండువరకు నుండును. ఆ పిమ్మట అది ఈశ్వరునిలోనే కలసి పోవును. లేక అవ్యక్తముగా మిగిలిపోవును; ఈశ్వరుడొక్కడే ప్రళయానంతరము గూడ నుండును. మరల అతనికి 'ఇచ్ఛ' కలిగినప్పుడు ఈ జగత్తును సృష్టించును; ఈ సృష్టి, స్థితి, లయములు ఆయనకు ఒక 'లీల' వంటివి అని చెప్పుదురు.

అన్ని ద్వైతమతములకు మౌలికమయిన సిద్ధాంతము ఇది. సృష్టిక్రమములోను సృష్టికి ముందు ఉండు ఈశ్వరుని ప్రధాన లక్షణములలోను, అతనికి జీవునకు ఉన్న సంబంధములోను విభిన్న మతములు విభిన్న సిద్ధాంతములను వెలిబుచ్చినను, అన్ని ద్వైతమతములలోను ఈశ్వరుడు సర్వాధికారములుగల ప్రభువు. జీవుడు ఎట్టి అధికారములు లేని, పరాధీనుడయిన భృత్యుడు.

## 12. అద్వైత సిద్ధాంతములు :

అద్వైత సిద్ధాంతములు, ద్వైత సిద్ధాంతమునకు భిన్నమయినవి. అద్వైత సిద్ధాంతము ప్రకారము ఈ జత్తునకంతకును (జీవునితోసహా), మూల పదార్థము ఒక్కటే—దానిని 'శివ-శక్తి' అని తంత్ర శాస్త్రము, 'బ్రహ్మము' అని వేదాంత శాస్త్రము పేర్కొనుచున్నది.

'శివ-శక్తి' ప్రధానముగా బీజ రూపములోనున్న 'సృజన-శక్తి' అది అర్ధ నారీశ్వర తత్వముగా, శివుని అంశ, శక్తి అంశ కలసిన ఒక అవ్యక్త, అనావిర్భావ స్థితి. సృష్టికి ముందు ఆ 'శివ-శక్తి' లో ఒక (వాంఛారూపకమయిన) సంచలనము కలిగి ఆ శివ-శక్తి శివునిగాను, శక్తిగాను విడిపోవును. శివుడు ప్రధానముగా

జ్ఞానస్వరూపుడు అయినపురుషుడు శక్తి ప్రధానముగా ఈ పాంచభౌతిక ప్రపంచమునకును చిత్తమునకును కారణము. ఈ విశ్వములోని సమస్తమును (అందరు దేవతలతో గూడ), ఈ రెండిటివలననే కలుగును. మరల కల్పాంతమున, శక్తి తిరిగి శివునితో కలిసి 'శివ-శక్తి' గా అద్వైతభావముతో బీజ రూపములో ఉండును.

కాని వేదాంత శాస్త్రము ప్రకారము, అద్వైతమయిన పరబ్రహ్మతత్త్వము ఎప్పుడును అద్వైతముగానే యుండును. అందులో మనకుకనబడు విభిన్నత్వము లేదు. దీనిగూర్చి ముందు ముందు పరిశీలింతుము.

## 13. ప్రత్యగాత్మ-సర్వాత్మ-పరమాత్మ

క్రిందటిమాటు జీవునివెనుకనున్న ఆధారము ఆత్మతత్త్వమనియును, అది జ్ఞాన స్వరూపమయినదనియు, ఆ ఆత్మజ్ఞానము చిత్తములో ప్రతిబింబించుటవలననే జీవ భావము కలుగుచున్నదనియును చెప్పుకుంటిమి. ప్రతి జీవియందును ఉన్న ఆత్మ తత్త్వమును ప్రత్యగాత్మ అనియును, జీవాత్మ అనియును అందురు. ఈ ఆత్మతత్త్వము ప్రత్యేకమయిన శరీరముతో కూడి, ఆ శరీర మనోబుద్ధులను ప్రకాశింపజేయుచు, వాటితో తాదాత్మ్యము పొందుటవలన దానికి ప్రత్యగాత్మ అను పేరు వచ్చినది. ఆ ఆత్మతత్త్వము ఆ శరీర మనోబుద్ధులవలన కప్పబడినదై తన నిజతత్త్వమును మరచి పోయి, మహా సముద్రములో ఒక ప్రత్యేక అల 'తనువేరు' అను భావముతో ఉండు వట్లు ఉండును. పరమాత్మ సర్వవ్యాపకమై మహాసముద్రమువలె నుండును. వస్తు తత్త్వములో సముద్రమునకును, దానిపై కదులు అలకును భేదములేనట్లు, ప్రత్యగాత్మ కును, పరమాత్మకును వస్తుతత్త్వములో భేదములేదు. ప్రత్యగాత్మ ఒక ఉపాధితో (శరీరముతో) కూడుకున్నది. పరమాత్మ అశరీరమయినది. అన్ని ఉపాధులలో (శరీరములలో) ఉండు ఆత్మతత్త్వమును సర్వాత్మతత్త్వమందురు. వస్తుతత్త్వములో మూడును ఒక్కటే. అప్పుడప్పుడు పరమాత్మను, సర్వాత్మ అనిగూడ అందురు.

## 14. బ్రహ్మతత్త్వము :

బ్రహ్మతత్త్వమును గూర్చి చెప్పునప్పుడు, అది అనాదియనీ, అంతములేని దనియు, సర్వవ్యాపకమయిన దనియు, సర్వాత్మతత్త్వమనియు, నిరాకారమయిన దనియు, నిర్వికారమయినదనియు, నిర్వికల్పమయినదనియు, ఇంద్రియ మనోబుద్ధుల కతీతమయినదనియు, సత్-చిత్-ఆనంద స్వరూపమయినదనియు, ఆకాశమువలె

అనంతమయినదియు, అవిచ్ఛిన్నమయినదియు, నిరంజనమయినదియు, అలలులేని మహాసముద్రమువలె నిశ్చలమయినదియు, చంద్రకాంతివలె మధురానుభూతి కలుగ చేయునదనియు-ఈ విధముగా పలు విధములుగా చెప్పుచుందురు. అవి అనిర్వచనీయమయినది: అనుభవ గ్రాహ్యమయినది. బ్రహ్మమునందు నిలచినవారికి ఈ దృశ్య ప్రపంచము కనిపించకనే కనుపించదనియును, కనుపించినను స్వప్నతుల్యముగా కనిపించుననియును చెప్పుదురు.

అంతయు బ్రహ్మమే అయినచో, ఈ దృశ్య ప్రపంచమేమిటి? జీవుడు ఎవరు? నేను బ్రహ్మము నగుునట్లయిన, ఆ అనుభవము నాకెందుకు కలుగుటలేదు? అన్నియు అద్వయమయిన బ్రహ్మతత్వమే. అందులో నీవు, నేను, వాడు అను విభేదములేదు. ఈ దృశ్య ప్రపంచములేదు. ఈ వివిధతత్వములేదు. ఈ విభిన్నత్వములేదు. కాని మన భ్రమ వలన ఈ వివిధత్వము, విభిన్నత్వము గోచరించుచున్నది. నీవు, నేను, వాడు, అది అను భేదభావము కలుగుచున్నది. ఆ భ్రమ తొలగిపోగానే నీ నిజతత్వమయిన అఖండ బ్రహ్మతత్వము అవగతమగును-ఇది అద్వైత వేదాంత సిద్ధాంత సారాంశము.

కాని పైన చెప్పినంత సులభముగా దీనిని అర్థము చేసుకొనలేము. దీనిని తెలుసుకొనుటకు ఎంతయో విచక్షణాజ్ఞానము అవసరము.

ముందుగా బ్రహ్మము గూర్చి చెప్పునప్పుడు అది సత్-చిత్-ఆనంద స్వరూపుడని చెప్పుచుందురు.

మనకు కనిపించు దృశ్యప్రపంచము వెనుక ఒక సత్పార్థము, ఈ విశ్వమునకంతకును ఆధారభూతమయినది కలదు-అది నిత్యమయినది. శాశ్వతమయినది. మార్పులు చెందనిది. దేశ, కాల, కారణ నియమములు లేనిది. (ఈ మూడును మార్పులు చెందుచుండు వాటియందు మాత్రమే యుండును.)

ఆ విధమయిన సత్పదార్థమున్నదని ఎవరు తెలుసుకొనుచున్నారు? ఆ సత్పదార్థము తననుతాను తెలుసుకొను జ్ఞానముకూడ అందులోనేకలదు. "నేను ఉన్నాను" అను భావముతో ఆ సత్-పదార్థము నిండియున్నది. అ ఉండుట, ఈ తెలిసికొనుట ఎందుకు? ఆనంద మనుభవించుటకు. ఆ సత్ పదార్థము "నేను ఉన్నాను" అను జ్ఞానములో ఆనందమనుభవించు చుండును.

ఆ ఉనికికీ, ఆ జ్ఞానమునకు, ఆ ఆనందమునకు దేశ, కాల, కారణనిమిత్తము లేదు; అది సర్వదా ఆ విధముగనే యుండును. అట్టి సచ్చిదానంద స్వరూపమే నీవు: ఈ సమస్త జీవరాసులు గూడ బ్రహ్మమే-ఈ చరాచర ప్రపంచమంతయు సత్-పదార్థమే; చైతన్యవంతములయిన జీవరాసు లన్నింటియందును చిత్-శక్తి ప్రకాశించు చుండును. ఎల్లజీవరాసులయందును ప్రధానమయిన (ప్రగాఢమయిన)వాంఛ ఆనందమే.

## 15. మాయ :

అట్టిచో మన నిజతత్త్వమయిన ఆ బ్రహ్మమును మనమెందుకు తెలిసికొనలేక పోవుచున్నాము. దానికి కారణము 'మాయ' అందురు. అప్పుడప్పుడు తనను తాను మరచిపోవు శక్తి గూడ బ్రహ్మములో కలదు. అదియే మాయాశక్తి-దానిని 'అవిద్య' అనికూడ అందురు.

ఆ 'మాయ' తామసము, రాజసము, సాత్త్వికము అను మూడు గుణములతో కూడుకొనియున్నది. తామసమునకు నిజమును మరుగుపరచు గుణము కలదు. ఆ గుణమువలన మన నిజతత్త్వమేమిటో మనము మరచిపోదుము. ఆ గుణమును 'ఆవరణ శక్తి'యందురు, మన నిజతత్త్వమును మరచిపోగానే రజోగుణములో గల 'విక్షేపశక్తి' మన నిజతత్త్వమును మరచిపోయిన మనలో-'నేను అనంతమైన బ్రహ్మతత్త్వమును కాను; పరిమితమయిన జీవుడను' అను భావమును ప్రతి వారి యందును కలుగజేయును. తాను పరిమితమయిన వాడననియు, ఈ ప్రపంచమంతయు తనకు భిన్నమయినదనియు ఊహ ఎప్పుడు జనించినదో, అప్పుడే, భయములు, ఆందోళనలు, అలజడులతో కూడిన మనస్సు జనించును. ఆ 'మనస్సు'ద్వారా బయటకు చూచినప్పుడు ఏకరసముతో కూడుకున్న విశ్వమంతయును, విభిన్నత్వముతో గోచరించును. అప్పుడు 'నేను వేరు' అను భావము స్థిరపడి కొన్నిటిలో 'ఇవినావి' అను భావము కూడ కలిగించును. ఈ అహంకార, మమకారములు ఈ విశ్వమును మరికొంత భిన్నముగను చేసినవి. మన నిజతత్త్వమందు లేని వాంఛా భయ మోహాములను సృష్టించినవి. ద్వంద్వ భావములను కలుగచేసినది. కామ, క్రోధ, లోభ, మోహ, మద, మత్సరములను మనోవృత్తులను కలుగచేసినది. ఇవన్నియు మనస్సుచేసిన సృష్టి-ఈ మనస్సు, బుద్ధి, అహంకారము-ఇవన్నియును మాయ వలనకలిగినవే.

ఈ మాయ వలన కల్పింపబడిన మూడు గుణముల ప్రోద్బలము వలన, మనిషి ఈ ప్రపంచములో ప్రవర్తించు చుండును. మంచి చెడ్డల ననుభవించు

యుండును. సుఖదుఃఖముల ననుభవించు చుండును. చనిపోయిన పిదప, కర్మ ఫలవశమున తిరిగి పుట్టుచుండును.

'వ్యక్తి' స్థాయిలో ఈ విధముగా జరుగుచుండగా, జగత్తు స్థాయిలో కూడ మాయా ప్రభావము వలన-బ్రహ్మములోని ఒక 'అంశ' (తన నిజతత్త్వమును మరచి పోయి), ఈ జగత్తునకు-కారణరూపుడయిన'హిరణ్య గర్భుని'గను(విశ్వరూపున్నుగను) అటు పిమ్మట 'విరాట్ స్వరూపునిగ (దృశ్య జగత్తుగను)మారెను. జీవునకు, శరీరము మనస్సు, బుద్ధి ఎట్టివో, ఈశ్వరునకు విరాట్ స్వరూపము, తైజసము, ప్రాజ్ఞము అట్టివి. ఆ మూడును కలిసిన మహాపురుషుడు ఈశ్వరుడు.

ఈ మాయాకల్పిత సృష్టికార్యము, బ్రహ్మతత్త్వము నంతయు ఆక్రమించి యుండనక్కరలేదు. మహాసముద్రములోని ఒక అలె వల, ఎక్కడో ఒకచోట ఉండవచ్చును మిగిలిన బ్రహ్మతత్త్వమంతయు నిర్వికారముగా ఉండవచ్చును. లేక, సముద్రములోని పలు అలలవలె, ఇట్టి జగత్తులు ఎన్ని అయినను ఉండవచ్చును. ఎన్ని ఉన్నను బ్రహ్మతత్త్వము అనంతము, కాబట్టి దానిలో ఎట్టి మార్పును రాదు.

అంతకుముందు చెప్పుకొనిన ఆత్మతత్త్వమునకును, బ్రహ్మతత్త్వమునకును భేదములేదు. మాయకు లోనయి ఒక ఉపాధిని (ఒక శరీరమును) ఆశ్రయించుకొని యున్న (బ్రహ్మతత్త్వము) ఆత్మతత్త్వమే ప్రత్యగాత్మ. ఈ విశ్వమే ఉపాధిగాగల ఈశ్వరుడు సర్వాత్మ: ఎట్టి ఉపాధియు లేనిది పరమాత్మ - పరమాత్మకును, పర బ్రహ్మమునకును భేదములేదు.

దీనిని బట్టి ఈ సృష్టియంతయు బ్రహ్మతత్త్వమే అయినను, మాయ వలన నిజము మరుగువడి, వేరు విధముగా కనపడుచున్నదని చెప్పవచ్చును. అంతియేకాక ఈశ్వరుడును, జీవుడును-ఇద్దరును బ్రహ్మతత్త్వము కలవారేయనియును, ఇద్దరు కూడ మాయకులోబడి యున్నవారేయనియు, వారి వారి ఉపాధుల తరతమ భేదములవలన అల్ప, అధిక రూపములలో కనుపించుచున్నారనియును చెప్పవచ్చును.

## 16. సృష్టి-మాయావాదము :

ఈ మాయా వాదము వలన సృష్టి అను పదమునకు నిర్వచనమే మారి పోయినది.

వివిధ మతసిద్ధాంతముల ప్రకారము, సృష్టి భగవంతుని యొక్క ఇచ్ఛా పూర్వక కార్యము: ఈ లోకములను సృష్టించెదనని తలంచి, భగవంతుడు తనలో

నుండియే సాలెపురుగు తన నుండి వచ్చు పదార్థముతోనే సాలెపట్టును నిర్మించునట్లు ఈ సమస్త జగమును సృష్టించెను. మరల కల్పాంతరమున ఈ సర్వమును తనలో లయపరచుకొనును. ఈ మధ్యకాలమున ఈ జగత్తునకంతకును తానే అధిపతి నియంత; ప్రభువు. ఈ మతములవారు మాయ ఉన్నదని ఒప్పుకున్నను, మాయ కూడ భగవత్కల్పితమే. దాని వలన భగవంతుడు లోకములనుండి తన నిజతత్వమును మరగు పరచుననియును, ఎవరు తనను అనన్యభక్తితో సేవింతురో, వారిని మాత్రము ఈ మాయనుండి తరింపజేసి, తనవద్దకు చేర్చుకొనుననియును భావింతురు.

మరొక సిద్ధాంతము ప్రకారము సృష్టికి ముందుగల ఆదిశక్తి (శివ-శక్తి) సృష్టికార్యము ఆరంభమగుటకు ముందు ప్రకృతి (స్త్రీ శక్తి) గాను, పురుషుడు (పురుష శక్తి) గాను విడిపోయి, ఆ రెండింటి సంయోగము వలన, ఈ విశ్వమంతయును, అందలి జీవరాసులన్నియును, పుట్టినవనియును, తిరిగి కల్పాంతమున అవన్ని యును ఆదిశక్తిగా మారిపోవుననియును చెప్పుదురు.

కొందరు నిరీశ్వరవాదులు, మూలప్రకృతి కొన్ని అంతర్గత శక్తులవలన విభిన్న రూపములుగా మారినదనియును, ఈ మార్పు ప్రకృతికి సహజమనియును, ఇందులో ఎప్పుడు ఏమిటి జరుగునో చెప్పుట కష్టమని, ఈ నిరంతర పరిణామ స్థితికి ఆది, అంతము లేదనియు చెప్పుచుందురు.

కాని అద్వైత వేదాంత సిద్ధాంత ప్రకారము, పూర్వము, ఇప్పుడు, ఇక ముందు గూడ నుండునది, మార్పు లేని, అఖండమయిన బ్రహ్మతత్వమే అనియును సృష్టి అన్నది జరుగుటయే లేదనియు, ఈ బ్రహ్మతత్వమే అయిన మనము, మాయచే కల్పింపబడిన ఒక భ్రాంతిలోపడి, మన నిజతత్వము మరచిపోయి, 'నేను వేరు' అనుభావనతో, ఆ బ్రహ్మతత్వమును చూచుచుండుటవలన, ఆ అఖండ బ్రహ్మ తత్వమే, విభిన్నమయిన బాహ్య ప్రపంచముగా కనుపించుచున్నదనియును జీవుడు తన నిజతత్వమయిన బ్రహ్మమును తెలుసుకొనినంతనే, మాయచే కల్గిన ప్రపంచమను భ్రమతొలగిపోయి, అంతటను అఖండ అద్వైత బ్రహ్మతత్వమే అనుభవమునకు వచ్చుననియును, చెప్పుదురు.

ఇది సంభవమని చెప్పుటకు దృష్టాంతముగా త్రాటిని చూచి పాము అనుకొనుట, చెట్టు మొద్దును చూచి దయ్యమనుకొనుట, ఎండమావులను నీరు అనుకొనుట. స్వప్నప్రపంచమును యథార్థమనుకొనుట-ఈ విధముగా ఎన్నియో భ్రాంతిజనిత సన్నివేశములను (దృష్టాంతములుగా) చూపింతురు.

పై ఉదాహరణలన్నింటి యందును, అసలు వస్తువు యొక్క నిజ తత్త్వము తెలియకపోవుట వలన, దానిని వేరొక వస్తువుగా ఊహించి, అదే నిజమని భావించుట జరుగుచున్నది. ఈ ప్రక్రియను 'అధ్యాసము' అందురు. ఒక వస్తువుపై ఇంకొక వస్తువు అను భావమును ఆరోపించుట 'అధ్యాస' మనబడును. ఆ అధ్యాస భావము తొలగిపోగానే, వస్తువుయొక్క నిజతత్త్వము తనంతతానే మేఘములు తొలగిపోయిన పిదప సూర్యునివలె-ఎరుకపడును. ఆ విధముగనే, 'నేను పరిమితమయిన జీవుడను' అను భ్రమ తొలగిపోగానే, తన నిజతత్త్వమయిన బ్రహ్మభావము తనంతట తానే అనుభవమునకువచ్చును. ఆ అనుభవములో జీవుడు లేడు. శరీర మనోబుద్ధులు ఉండవు: ఈ బహుళ ప్రపంచము ఉండదు. అంతయు, అవిచ్ఛిన్న, అఖండ, అద్వయిత బ్రహ్మమే. ఆ అనుభవము పరమానందకరమయినది.

ఈ సిద్ధాంతమునకు ఎన్నియో శ్రుతులను (ఉపనిషత్తులను) ప్రమాణముగా చూపింతురు. అంతియేకాక, గాఢనిద్రలో అందరి అనుభవము ఒక్కలాగే ఉండును. ఆ అనుభవములో జాతి, కుల, ధర్మ, ఆశ్రమ, వయో భేదములు లేవు. అది ఒక అనిర్వచనీయమయిన దుఃఖరహితమయిన పరిస్థితి. కాని ఆ సమయములో మన జ్ఞానము మరుగుపడియుండుట వలన, ఆ అనుభవమును మనము చెప్పలేక పోవు చున్నాము. ఆ విధముగానే, ఏమతమునందైనను, మహాత్ములు అనుభవించు సమాధిస్థితి యందలి అనుభవము ఒక్కలాగే ఉండునని, వారి మాటల వలన తెలిసికొనగలము. ఆస్థితిలో, వివిధత్వము ఉండదనియును, అది ఒక పరమశాంత మయిన, అనిర్వచనీయ మయిన ఆనందానుభవ మనియును, అక్కడ కాల, స్థల, కారణములు లేవనియును చెప్పుచుందురు.

## 17. బంధము - మోక్షము.

జీవుడు స్వభావముగా బ్రహ్మతత్త్వమే అయినను, మాయకు లోబడి, తన నిజ తత్త్వమును మరచిపోయి, తన ఉపాధి మాత్రములయిన శరీర మనోబుద్ధులే తానను భావముతో, వాటికి కష్టము కలుగకుండ చూచుకొనుట తన కర్తవ్యమని భావించును. ఇంద్రియములకు గోచరించు ఈ బాహ్య ప్రపంచము తన సౌఖ్యముకొరకే ఉన్నదని భావించి, అందులోనుండి వీలయినంత సౌఖ్యమును, సౌఖ్యమునిచ్చు వస్తువులను తన స్వంతము చేసుకొనవలెనని ప్రయత్నించుచుండును. ఆ ప్రయత్నములో సఫలీకృతు డయినచో సంతోషించుచు, విఫలుడయినచో దుఃఖించుచుండును. తన ప్రయత్నమునకు అడ్డు తగులు వారిని ద్వేషించుచుండును. తన సౌఖ్యముకొరకు భార్యా పుత్రులను,

బంధుమిత్రులను సహుకార్చుకొని, వారి పోషణకు నిరంతరము శ్రమించుచు ధనము కూడబెట్టుచుండును. దానిని నిలబెట్టుకొనుటకు శ్రమపడుచుండును. అవి కారకాంతర వశమువలన పోయినచో అమితముగ దుఃఖించును. తన దారాపుత్రులలో ఎవ్వరయినను చనిపోయినచో, మహాదుఃఖసముద్రములో మునిగిపోవును. ఈ జన్మలో చేసిన కర్మఫలములు వాసనారూపములో తనవెంటరాగా, తిరిగి జననము పొంది, ఈ ప్రపంచములో ప్రవర్తించుట మొదలిడును. ఇదే సంసారము. ఇదే జనన మరణ చక్రము. ఇదే బంధము. దీని నుండి బయటపడుట అంత సులభమయినదికాదు.

అసలు ఈ బంధము ఎప్పుడు కలిగినది ? ఎందుకు కలిగినది ? ఇది ఎంతో కాలము క్రిందట, జీవుడు తన నిజ స్వరూపమును (తాను ఆనంద స్వరూపుడయిన బ్రహ్మమును అను సత్యమును), మరచి పోవుట వలన కలిగినది.

దీనికొక చక్కని ఉదాహరణ చెప్పెదరు, ఒక ఇల్లాలు, తన బంగారు కంఠాభరణము పోయినదని ఎంతో వ్యాకులత చెంది, ఇల్లంతయు వెదుక మొదలిడెను. అందరను అడుగుచు, వెతికిన చోటనే వెదకుచు, తిరిగిన చోటనే తిరుగుచు బంగారు నగ పోయినదని తనభర్త, అత్తగారు ఏమని దూషింతురో ఊహించుకొనుచు, వారికి ఏమని జవాబు చెప్పుటో ఆలోచించుచు, తన దౌర్భాగ్యమునకు తననే తిట్టుకొనుచు, నిద్రాహారములు మాని, ఆ నగకై పరితపించసాగెను. ఇంతలో ఆమె, ఎందుకో అద్దము ముందు నిల్చొని, తన నిజరూపమును చూచుకొనుచుండునప్పుడు, ఆ బంగారు నగ తన కంఠమునకే ఉండుట చూచెను. ఆమె వెంటనే అమితానందభరితయై, 'నా ఆభరణము దొరికినది, నా ఆభరణము దొరికినది' అని ఆనందోత్సాహములతో చిందులు వేయుచు, అందరకును చెప్పసాగెను.

నిజముగ ఆలోచించినచో ఆమె నగ పోవుటయు అసత్యమే, అదిదొరుకుటయు అబద్ధమే - నగపోయిన కదా దొరుకుట అను ప్రసక్తి వచ్చును? మరి-నగపోయినదని ఆమె పడిన ఆవేదన, నగదొరికినదని ఆమె అనుభవించిన ఆనందము - అవికూడ అబద్ధమేనా? కాదు; అవి నిజమయిన అనుభూతులే-కాని అవి నగపోవుటవలనగాని, తిరిగి దొరుకుట వలన గాని కలిగిన అనుభూతులు కావు. ఆమె అనుభవించిన ఆవేదన అంతయు, 'నగఉన్నది' అనునిజమును మరిచిపోయి, భ్రమవలన 'నగపోయినది' అను అసత్య భావనవలన గాని కలిగినది. ఆ విధముగనే, ఆమె ఆనందమంతయు భ్రమతొలగి పోయి 'నగ ఉన్నది' అను సత్యమును గ్రహించుట వలన కలిగినది.

సూక్ష్మముగా చెప్పవలెనన్నచో, కంఠాభరణము మొదటి నుండి చివరి వరకు యథాస్థానము నందేయున్నను, పోయినదను భ్రమ వలన దుఃఖమును, ఉన్నదను నిజమును తెలిసికొనుట వలన ఆనందమును కలిగినవి.

ఆ విధముగనే జీవుని యొక్క వస్తుతత్త్వము — సత్-చిత్- ఆనందమయిన బ్రహ్మతత్త్వమే అయినను, మాయవలన తన నిజతత్త్వమును మరచిపోయి, ఆ ఆనందమును తన ఉపాధులద్వారా, బాహ్యప్రపంచములో వెదుక మొదలుపెట్టును. ఆ ఉపాధులును మాయాకల్పితములే— ఈ ప్రపంచముగూడ మాయాకల్పితమే— మాయామోహితుడైన జీవుడు, మాయచే కల్పింపబడిన శరీర మనోబుద్ధులతో, మాయాకల్పిత బాహ్యప్రపంచములో, లేని ఆనందమును వెతుకుటకు ప్రయత్నించుచున్నాడు. నిజమునెంచిన, తానే ఆనందమయుడు. ఆ ఆనందముకొరకు వేరుచోట్ల వెదుకనక్కరలేదు. తన నిజతత్త్వమును తెలిసికొనినచాలును.

తన నిజతత్త్వమును మరచిపోయి, జీవునిగా ఈ సంసారములో కొట్టుకొనిపోవుచుండుట బంధము. తన నిజతత్త్వమును తెలిసికొని, ఈ సంసారమునుండి బయటపడి, బ్రహ్మస్వరూపునిగా (బ్రహ్మభూతునిగా) జీవించుట మోక్షము.

ఈ బంధమునుండి బయటపడుటకు మార్గము ఏమిటి ? ఈ బంధమును కల్గించు ప్రధానకారణమును తొలగించినచో బంధము పోవును. అట్టి ప్రధాన కారణమేద్ది? జీవుని యొక్క నిజతత్త్వమయిన బ్రహ్మభావమును మరగుపరచి, తాను ఈ దేహము, మనస్సు, బుద్ధి అను భ్రమలో పడిపోవుట. ఆ భ్రమనుండి జీవుడు బయటపడినప్పుడే బంధముక్తుడగుచున్నాడు.

ఈ భ్రమనుండి బయటపడి, తన నిజతత్త్వమును తెలిసికొనుటకు ప్రగాఢమైన మోక్షేచ్ఛ (ముముక్షుత్వము) ఉండవలెను. ఎంతయో విచక్షణాజ్ఞానము ఉండవలెను. 'నేను ఎవరు?' ('నా నిజతత్త్వము ఏమిటి?')— ఈ విధముగా తనను తాను ప్రశ్నించుకొనుచు, దేనియందయినను, 'ఇది నేను కాదు' అను భావముకలిగిన వెంటనే, దానిని మానసికముగా విడిచిపెట్టగలుగు వైరాగ్యము ఉండవలెను. అందుకు కావలసిన ఇంద్రియ నిగ్రహము, మనోనిగ్రహము, నిశ్చలత్వము, శ్రద్ధ, ఎట్టి కష్టములు కలిగినను నిర్వికారముగా ఉండగలుగుట, గురువులయందును, దేవునియందును భక్తిభావము ఉండవలెను. వీటన్నిటికితోడు, సకలశాస్త్రపారంగతుడు, బ్రహ్మజ్ఞాని అయిన గురువుల ఆశ్రయము పొందుట ఎంతయో శ్రేయస్కరము.

ఈ విధముగా సాధనసంపత్తిని సముపార్జించుకొని, వేదాంత గ్రంథములను (ఉపనిషత్తులు మొదలగువానిని) చదువుట, వానియందలి గూఢార్థములను గురువు చెప్పగా వినుట (శ్రవణము), చదివిన వాటియందును, వినినవాటియందును, అంతరార్థమును మనస్సులో తార్కికముగా ఆలోచించి అవగాహన చేసికొనుట(మననము), తను గ్రహించిన సత్యమును మనస్సులోనిలుపుకొనుటకు, అనన్యబుద్ధితో సంతత—ధ్యానము, అటుపిమ్మట సమాధిస్థితిలో (బాహ్యాంతరములను మరచి), బ్రహ్మతత్త్వమును స్వానుభవపూర్వకముగా తెలిసికొనుట—ఇవి మోక్షసాధనకు సాధకుడు అవలంబించవలసిన మార్గములు. ఇందులో స్వప్రయత్నము ఎంతో ముఖ్యము. ఇది అద్వైత వేదాంత సిద్ధాంత ప్రకారము మోక్షసాధనకు సూచించిన మార్గము. దీనిని జ్ఞానమార్గమందురు.

మిగిలిన ద్వైత మతములలో, ఈశ్వరుడే సృష్టికర్త, ప్రభువు, నియామకుడు. అతనికి మించినదేమియు మరొకటి లేదు. జగత్తులో జరుగు అన్ని పనులును అతని ఆజ్ఞానుసారము జరుగుచుండును. జీవుడు అతనిని మరచియున్నంతకాలము జనన మరణ చక్రములో తిరుగుచు, ఈ సంసారములో కొట్టుకొనిపోవుచుండును. ఇదియే బంధము. జీవుడు తన తప్పును గ్రహించి, ఈశ్వరునియందు ప్రగాఢమైన భక్తి భావముతో, అతని కొరకే ఎల్ల పనులను జేయుచు, అతనినే శరణుజొచ్చినచో, ఈశ్వరుడు కరుణాసాగరుడగుటచే, ఆ భక్తునియందు దయచూపి, అతనిని తన వద్దకు చేర్చుకొనును. అదియే మోక్షము— ఇందు భక్తిప్రధానముగావున, ఇది భక్తిమార్గము.

ఈ రెండు మార్గములందును, ఈ సంసార బంధము నుండి విడివడుట మోక్షమనీ, అందుకు వైరాగ్యము, వివేకము, భక్తి ముముక్షుత్వము, శమదమాది షట్సంపత్తి ముఖ్యమని ఒప్పుకుందురు. రెండింటియందును స్థితప్రజ్ఞ లక్షణములు, దైవీసంపత్తి, ముఖ్యాంగములుగా అంగీకరింపబడినవి. రెండింటియందును స్వార్థరహిత సేవ సహాయకారిగా అంగీకరింపబడినది. కాని, భక్తిమార్గమందు భక్తికి ప్రాధాన్యము ఈయగా, జ్ఞానమార్గమునందు వివేకమునకు ప్రాధాన్యత ఈయబడినది.

పరమభక్తునకును, బ్రహ్మజ్ఞానికిని, అంతిమ అనుభవము ఒక్కలాగునే యుండును. భక్తునకు భక్త్యాతిరేకములో అంతయు మధురాతిమధురమే — జ్ఞానికి బ్రహ్మజ్ఞాన రసానుభూతిలో అంతయు ఆనందమే — ఒకరికి సర్వము భగవంతుడు తప్ప వేరొక ప్రపంచము లేదు. వేరొకరికి అంతయు బ్రహ్మయే తప్ప వేరొకటి లేదు. ఇద్దరకును ఈ ప్రపంచముతో సంబంధములేదు; ఈ ప్రపంచములోని కీచు

లాటలతో ప్రమేయము లేదు. భగవద్గీతలో పరమభక్తుని లక్షణములు, బ్రహ్మజ్ఞాని లక్షణములు ఒక్క విధముగనే చెప్పబడినవి. ఇద్దరు చేరుకొను స్థానముకూడ ఒక్కటే అని చెప్పబడినది.

## 18. ముక్తి స్థితి :

సమాధిస్థితియందు బ్రహ్మానుభవము పొందిన మహాపురుషులు ఎందరో మరల ఈ లోకమునకు తిరిగివచ్చుటకు ఇచ్ఛగింపరు. అందువలన సాధారణముగా ఆ సమాధి యందే దేహత్యాగము చేయుదురు. దానిని విదేహముక్తి అందురు.

కాని కొందరు బ్రహ్మతత్త్వమునందు నిలచియు, ఈ దేహమును విడిచిపెట్టరు. అట్టి వారిని జీవన్ముక్తులందురు. వారికి ఈ దేహము ఒక నీడ వలెను, ఈ బాహ్య ప్రపంచము ఒక స్వప్నముగను గోచరించుచుండును. అట్టివారు ఈ లోకముతో ఎట్టి సంబంధము లేని సన్యాసులవలె గాని, లేక లోకకల్యాణార్థము పాటుపడు కర్మ యోగులుగా గాని ప్రవర్తింతురు. వారు పనులు జేసినను, చేయకున్నను, వారికి కర్మ ఫలమేమియు నంటదు. వారు ఈ లోకమునుండి కోరెడిదేమియు లేదు. వారు పని చేయుట కిచ్ఛగించినచో అది లోకమునకు మహోపకారము కాగలదు.

## 19. జీవన్ముక్తుని లక్షణములు :

వివేక చూడామణిలో జీవన్ముక్తుడైన బ్రహ్మజ్ఞాని లక్షణములు ఈ విధముగా చెప్పబడినవి :-

బ్రహ్మజ్ఞాని సదా బ్రహ్మభావమునందే నిలచును. ప్రారబ్ధ కర్మవశమున అతని దేహము ఇటునటు చరించుచున్నను, ఆ దేహము వలన కలుగు శుభాశుభములు గాని, మంచి చెడ్డలుగాని ఆ బ్రహ్మజ్ఞానికి అంటవు. ఛాయామాత్రమైన అతని శరీరము ఏమైపోయినను అతనికి అవసరము లేదు. అతడు అన్ని భావములకు నతీతుడు. కర్మ చేయుచున్నను, చేయకున్నను అతనికి కర్మఫలములు బంధించవు. మంటలో దహించి వేయబడిన వస్తువులన్నియు బూడిదగా మిగులునట్లు — జ్ఞానవహ్నిలో దహించివేయబడిన ఈ సమస్త ప్రపంచము బ్రహ్మముగానే మిగులును. అతను బ్రహ్మము; ఉన్నది గూడ బ్రహ్మమునందే — కావున, అతడు ఎల్లప్పుడును ద్వయానందములో ఉండును. సముద్రములోపడిన వడగలివలె అతని జీవాత్మ ఎప్పుడో పరమాత్మలో కలసిపోయినది. ఆభాసమాత్రమైన దేహము, పండుటాకులవలె, ఎప్పుడు, ఎక్కడ రాలిపోయినను, అతను లక్ష్యపెట్టడు. బహుశః గుర్తించక

పోవచ్చునుగూడ. అతడు స్వతంత్రుడు, నిరంకుశుడు. అతని ప్రవర్తన కడువిచిత్రముగా నుండును. బాలునివలె, పిచ్చివానివలె, మత్తునివలె, పిశాచమువలె తిరుగుచుండవచ్చును. లేక, మహాపండితునివలె సన్మానింపబడవచ్చును; లేక మూర్ఖునివలె తిరస్కరింపబడవచ్చును: అజ్ఞానివలె నిర్లక్ష్యము చేయబడవచ్చును. మానావమానములేవియు అతనిని అంటవు. అతడు సదా బ్రహ్మానంద రసాస్వాదనమత్తుడు.

బ్రహ్మవేత్త స్వయముగా బ్రహ్మమే — దేహము కనిపించుచున్నది గావున, అతనిని ఒక వ్యక్తిగా మనము భావించుచున్నాము. పాము విడిచిన పొరకు ఎంతటి అస్తిత్వమున్నదో, బ్రహ్మజ్ఞాని యొక్క దేహమునకు కూడ అంతటి అస్తిత్వమే యున్నది. అందుకే ఆదిశంకరులు అట్టివారినిగూడ, (దేహముతో నున్నను) విదేహకైవల్యము పొందినవానిగా పరిగణించిరి. అట్టి జ్ఞాని బ్రహ్మమే కావున, అతనికి పునర్జన్మ యుండదు; బాధ మోక్షముల ప్రసక్తే యుండదు.

## 20. స్వప్రయత్నము :

ఈ దేహము అనిత్యమని తెలిసియు, ఈ ప్రపంచములోని ప్రలోభములలో పసలేదని తెలిసియు, మృత్యుసమయమున 'నావి' అనుకున్నవేవియు తనతో రావని తెలిసియు, మోహజాలములో చిక్కుకొని, నిరంతరము దుఃఖావేశములతో పరితపించుచుండుట ఎంతటి దయనీయావస్థ! ఒక్కపరి, ఈ బాహ్యదృష్టిని లోనికి మరల్చి, 'నా నిజతత్వమేమిటి' అని ఆలోచించినచో, ప్రతి మానవునకు తన నిజతత్వము కొద్దిగనో, గొప్పగనో అర్థముకాక మానదు. అప్పుడు అతను తన చుట్టుప్రక్కల గల ప్రపంచములో ఏర్పరచుకున్న విలువలలో మార్పురాకమానదు.

ప్రతి సాధనకును మోక్షము సిద్ధింపకపోవచ్చును. కాని ఆ సత్యాన్వేషణా ప్రయత్నములో, ఎన్నియో సూక్ష్మవిషయములను తెలిసికొని, మనస్సును, బుద్ధిని వికసింపజేసికొని, ఒక వినూత్నదృక్పథముతో ఈ ప్రపంచమును చూచుట మొదలిడును. అదియే అతని ఆధ్యాత్మజీవితమునకు ప్రారంభము. ఆ జీవితములోనున్న మనశ్శాంతి, ఆనందము ఈ ప్రాపంచిక జీవితములో వెతికినను కానరావు.

ఆధ్యాత్మజీవనపథమును అనుసరించిన మనుజుడు తిరిగి మరలుట ఉండదు. అదియే ముక్తిమార్గము. అందుకు స్వప్రయత్నము అవసరము.

ఓం శాంతిః, శాంతిః, శాంతిః

శ్రీకృష్ణార్పణమస్తు.

ఓం శ్రీ పరబ్రహ్మణే నమః

# వివేకచూడామణి

## గురుస్తుతి :

1. సర్వవేదాంత సిద్ధాంత
గోచరం, తమ గోచరం
గోవిందం పరమానందం
సద్గురుం ప్రణతోఽ స్మ్యహం

ఎల్ల వేదాంతముల సారమును తెలుసుకొనుట వలన మాత్రమే ఎరుగదగు వానిని, ఇంద్రియములకు కనుపించని వానిని, పరమానంద స్వరూపుని, సద్గురుండయిన గోవిందుని (గోవింద పాదుని), నేను నమస్కరించుచున్నాను.

## ఆధ్యాత్మ జీవిత ప్రశంశ :

2. జంతూనాం నరజన్మ దుర్లభమతః
పుంస్త్వం, తతో విప్రతా
తస్మాద్వైదిక ధర్మమార్గ పరతా
విద్వత్వ మస్మాత్ పరం
ఆత్మానాత్మ వివేచనం, స్వనుభవో
బ్రహ్మాత్మనా సంస్థితిః
ముక్తిర్నో శతకోటి జన్మ సుకృతైః
పుణ్యైర్వినా లభ్యతే.

అన్ని ప్రాణులయందును నరజన్మ దుర్లభమయినది. అందులో పురుష స్వభావము, అందున విప్రత్వము, అందునను వైదికకర్మ పరత్వము, అందుపై విద్యత్వము ఉత్కృష్టమయినవి. అంతకంటే, ఆత్మా నాత్మ విచక్షణ, స్వానుభవము, బ్రాహ్మీ స్థితి (సమాధి స్థితి), (ఒక దాని కంటె నొకటి) మిక్కిలి ఉత్కృష్టమయినవి. శతకోటి జన్మల పుణ్య ఫలమునగాని మోక్షము సిద్ధింపదు.

### దైవానుగ్రహము :

3. దుర్లభం చ త్రయమే వైత
దైవానుగ్రహ హేతుకం:
మనుష్యత్వం, ముముక్షుత్వం
మహాపురుష సంశ్రయః

(ఈ జగత్తులో) మూడు దుర్లభమైనవి; అవి దైవానుగ్రహము వలన మాత్రమ్మే కలుగును; (అవి ఏవన), మనుజజన్మ, మోక్షమందలి ప్రగాఢమయిన కోరిక, మహా పురుషుల ఆశ్రయము.

### ఆత్మ హంతకుడు : (4–7)

4. లబ్ధ్వా కథం చిన్నర జన్మ దుర్లభం,
తత్రాపి పుంస్త్వం, శ్రుతి పారదర్శనం,
యస్త్వాత్మ ముక్త్యై నయతేత మూఢ ధీః
సహ్యాత్మహా, స్వంవినిహంత్యసగ్రహాత్

ఏదో విధముగ (పూర్వజన్మ సుకృతము వలన), దుర్లభమయిన నరజన్మను పొంది, అందునను పురుష స్వ భావము, శ్రుతులలో అపారమయిన విజ్ఞానము కలిగి కూడ, మోక్షము కొరకు, ప్రయత్నము చేయని మూఢుడు అసత్యమును గ్రహించుట వలన, (నిజమును తెలుసుకొనక పోవుట వలన) తన్ను తాను చంపుకున్న ఆత్మహంతకు డగు చున్నాడు.

5. ఇతః కోన్వస్తి మూఢాత్మా
యస్తు స్వార్థే ప్రమాద్యతి
దుర్లభం మానుషందేహం.
ప్రాప్య తత్రాపి పౌరుషం

దుర్లభమయిన మానవ దేహమును, అందునను పురుష ప్రవృత్తిని పొంది గూడ, తనను తాను తెలుసుకొనుటకు ప్రయత్నించని వానికంటె మూఢుడు ఇంకెవరు ఉందురు ?

6. పఠంతు శాస్త్రాణి, యజంతుదేవాన్
కుర్వంతు కర్మాణి, భజంతు దేవతాః
ఆత్మైక్య బోధేన వినా విముక్తి
ర్న సిద్ధ్యతి బ్రహ్మ శతాంతరేఽపి

శాస్త్రములను వల్లె వేయనిండు; దేవతల గూర్చి యజ్ఞముల జేయనిండు; కర్మల నాచరించనిండు, దేవతల గొలువనిండు; కాని, ఆత్మ ఒక్కటే అన్న జ్ఞానమును పొందనివాడు, నూరు బ్రహ్మ జీవితకాలముల యందును ముక్తిని పొందడు.

7. అమృతత్వస్య నాశాస్తి
విత్తేనేత్యేవహి శ్రుతిః
బ్రవీతి కర్మణో ముక్తే
రహేతుత్వం స్ఫుటం యతః

ధనము వలన అమృతత్వము పొందు ఆశ లేదని శ్రుతులు పలుకుచున్నవికదా! అందుచేత కర్మలు (సత్కర్మలయినను), ముక్తి కల్గుటకు కారణము కాజాలవు.

## జ్ఞానార్జనకు మార్గము : (8 13)

8. అతో విముక్త్యై ప్రయతేత విద్వాన్
సన్న్యస్త బాహ్యార్థ సుఖ స్పృహస్సన్
సంతం, మహాంతం, సముపేత్య దేశికం
తేనోపదిష్టార్థ సమాహితాత్మా

అందుచేత, పండితుడు బాహ్యవిషయ సుఖములందలి ఆసక్తిని విడచి, సత్య స్వభావుడును, మహాత్ముడును, సకల శాస్త్ర పారంగతుడును అయిన గురువును ఆశ్రయించి, ఆయనచే ఉపదేశింపబడిన మార్గమున, సమాయత్త చిత్తుడై నడచుకొనుచు, విముక్తి కొరకు ప్రయత్నించవలెను.

9. ఉద్ధరే దాత్మనాత్మానం
మగ్నం సంసార వారిధౌ
యోగారూఢత్వ మాసాద్య
సమ్యగ్దర్శన నిష్ఠయా

సమ్యగ్దర్శన నిష్ఠవలన (మమకారమును విడిచి, సునిశిత బుద్ధితో ఈ ప్రపంచమును యథా తథముగా సదసత్ విచారముతో తెలియగోరు నిష్ఠవలన), యోగారూఢత్వమును పొంది, (ఇంద్రియార్థములందనాసక్తి, సర్వ కర్మ పరిత్యాగము చేసి), సంసార సాగరమందు మునిగిపోయిన తన ఆత్మను, తన ఆత్మచేతనే (విచక్షణాజ్ఞానము చేత) ఉద్ధరింపవలెను.

10. సన్యస్య సర్వకర్మాణి
భవబంధ విముక్తయే
యత్యతాం పండితైర్ధీరై:
ఆత్మా భ్యాస ఉపస్థితై:

(బంధకారకములయిన) సర్వ కర్మలను విడిచి పెట్టి, ధీరులయిన పండితులు జన్మ పరంపర బంధ ముక్తికొరకు, (మోక్షముకొరకు), ఆత్మానాత్మ పరిజ్ఞానమునకై ప్రయత్నించవలెను.

11. చిత్తస్య శుద్ధయే కర్మ
నతు వస్తూపలబ్ధయే
వస్తు సిద్ధిర్విచారేణ
నకించిత్కర్మ కోటిభి:

ఎట్టి సత్కర్మ అయినను చిత్త శుద్ధికి మాత్రమే తోడ్పడగలదు కాని, దాని వలన మాత్రమే ఆత్మ జ్ఞానము (వస్తూపలబ్ధి) కలుగదు. (చిత్తశుద్ధి కలిగిన పిమ్మట) ఆత్మజ్ఞానము సునిశిత విచారణ వలన మాత్రమే లభించును. కోటికర్మల వలను గూడ అది సిద్ధింపదు.

12. సమ్యగ్విచారత: సిద్ధా
రజ్జుతత్వావధారణా
భ్రాంత్యోదిత మహాసర్ప
భయ దు:ఖ వినాశినీ

భ్రాంతి వలన (నిజమును తెలుసుకొనకపోవుట వలన), మహా సర్పముగ కనుపించి సృష్టించిన భయ దు:ఖములను, అది త్రాడు మాత్రమే, అను సముచిత విచక్షణ వలన కలిగిన యథార్థజ్ఞానము, (భ్రాంతి వలన కలిగిన దు:ఖమును) నాశనము జేయును.

13. అర్థస్య నిశ్చితో దృష్టో
విచారేణ హితోక్తితః
న స్నానేన, న దానేన
ప్రాణాయామ శతేనహి

స్నాన దానాదుల వలనగాని, వందలకొద్దీ ప్రాణాయామముల వలనగాని, ఆత్మ జ్ఞానము సిద్ధింపదు. తత్వదర్శనులు తెల్పెడి మార్గముల ననుసరించుచు, సంతత విచక్షణా సహిత విచారణవలన మాత్రమే నిశ్చయమయిన ఆత్మజ్ఞానమును కలుగును.

## అధికారి నిర్ణయము (14–17)

అధికారిణ మాశాస్తే
ఫలసిద్ధి విశేషతః
ఉపాయా దేశకాలాద్యాః
సన్త్యస్మిన్ సహకారిణః

(ఆత్మజ్ఞానము నందలి) ఫలసిద్ధి విశేషముగా సాధకుని (అంతరంగ శుద్ధి) మీద ఆధారపడి ఉండును. దేశకాలాదులు కొంతవరకు మాత్రమే ఉపయోగపడగలవు. (సాధకునిలోని ఆత్మశుద్ధి ముఖ్యమని దీని భావము).

15. అతో విచారో కర్తవ్యో
జిజ్ఞాసో రాత్మ వస్తునః
సమాసాద్య దయాసింధుం
గురుం బ్రహ్మ విదుత్తమం

అందుచేత, ఆత్మ తత్వమునందు జిజ్ఞాస గల సాధకుడు బ్రహ్మనిష్టుడు, బ్రహ్మవిదుడు దయాసాగరుడు అయిన గురువును ఆశ్రయించి. ఆత్మవస్తువుపై విచారము (తాత్విక చింతన) మొదలుపెట్టవలెను.

16. మేధావీ, పురుషో, విద్వాన్
ఊహాపోహా విచక్షణః
అధికార్యాత్మ విద్యాయా
ఉదిత లక్షణ లక్షితః

మేధావంతుడును, విద్వాంసుడును (ప్రపంచానుభవము గలవాడును), తార్కికముగా ఆలోచించి నిశ్చయించగల సామర్థ్యము కలవాడును, తెలుసుకున్న దానిలో అంతరార్థమును గ్రహించగలవాడును, ఆత్మవిద్యను తెలుసుకొనుటకు (పొందుటకు) అర్హుడగుచున్నాడు.

17. వివేకినో విరక్తస్య
శమాది గుణ శాలినః
ముముక్షో రేవహి బ్రహ్మ
జిజ్ఞాసా యోగ్యతామతా

వివేకవంతుడు (విచక్షణాజ్ఞానము కలవాడు), వైరాగ్యభావము కలవాడు, శమదమాది గుణములు కలవాడు, ముముక్షువు (మోక్షమును అధికముగా కాంక్షించువాడు) మాత్రమే ఆత్మజ్ఞానమును పొందుటకు అధికారముకలవాడగుచున్నాడు.

## సాధన చతుష్టయం : (18 30).

18. సాధనానిచ చత్వారి
కథితాని మనీషిభిః
యేషు సత్స్వేవ సన్నిష్ఠా
యదభావేన సిద్ధ్యతి.

సాధకుడు నిష్ఠలో నిలకడ పొందుటకు నాలుగు సాధనములు (Qualifications) అవసరమని మహాత్ములు చెప్పుచున్నారు. అవి లేనిచో సిద్ధి లభించదు.

19. ఆదౌ నిత్యా నిత్యవస్తు వివేకః పరిగణ్యతే
ఇహా ముత్ర ఫలభోగ విరాగ స్తదనంతరం
శమాది షట్క సంపత్తిర్ముముక్షుత్వ మితి స్ఫుటం.

ముందుగా నిత్యానిత్య వస్తువులయందలి విచక్షణాజ్ఞానము ఉండవలెను. పిమ్మట ఇహ పరములలో కర్మ ఫల భోగములలో వైరాగ్యము అవుసరము. తుదుపరి శమదమాది షట్సంపత్తి పెంపొందించుకొనవలెను. ఆ తరువాత మోక్షమునందు ప్రగాఢమయిన అభిలాష కలిగి ఉండవలెను.

20. బ్రహ్మసత్యం జగన్మిథ్యే
త్యేవం రూపో వినిశ్చయః
సోఽయం నిత్యా నిత్యవస్తు
వివేకః సముదాహృతః

బ్రహ్మమే సత్యమనియును, జగత్తు మిథ్య అనియును, నిశ్చయముగా తెలుసుకొనుటయే, నిత్యానిత్య వస్తు వివేకమని చెప్పబడుచున్నది.

21. తద్వైరాగ్యం జిహాసాయా
దర్శన శ్రవణాదిభిః
దేహాదిబ్రహ్మపర్యంతే
హ్యనిత్యే భోగవస్తుని

వినుట, చూచుట మొదలగు ఇంద్రియ వ్యాపారముల యందును, (ఈ లోకము మొదలుకొని) బ్రహ్మలోకము వరకు కలుగు దేహము లనుభవించు భోగవస్తువు లందును—అవి అనిత్యములని గ్రహించి, వానిని విడిచిపెట్టుటకై కలుగు తీవ్రమయిన అభిలాష వైరాగ్యమగును.

22. విరజ్య విషయ వ్రాతాన్
దోష దృష్ట్యాముహుర్ముహుః
స్వలక్ష్యే నియతావస్థా
మనసః శమ ఉచ్యతే

విషయ సుఖములు దోష భూయిష్టములని, మాట మాటికి గుర్తు చేసుకొనుచును, వానిని (వానియందలి ఆసక్తిని), విడిచిపెట్టి, మనస్సును స్వలక్ష్యమయిన ఆత్మ భావనయందే సదా నిలిపి యుంచుటను 'శమము' అందురు. (శమమును అభ్యసించుట వలన మనస్సు నిర్మలముగా, నిశ్చలముగా, నిర్వికారముగా శాంతభావముతో నిండినదై యుండును).

23. విషయేభ్యః పరావర్త్య స్థాపనం స్వస్వగోలకే
ఉభయేషామింద్రియాణాం స దమః పరికీర్తితః
బాహ్యానాలంబనం వృత్తేరేషోపరతి రుత్తమా

రెండు రకములయిన జ్ఞానేంద్రియ, కర్మేంద్రియములను, బాహ్యవిషయముల నుండి మళ్ళించి, వానిని వాటివాటి కేంద్ర స్థానములందు(స్వగోళములందు) నిలిపియుంచుట 'దమము' అనబడును.

సాధకుని మనోవృత్తులు (అనుభూతులు, ఆలోచనలు) బాహ్యవస్తువులపై ఆధారపడకుండ యుండుట, (బాహ్యసంఘటనలచే చలింపకుండ యుండుట) ఉత్తమ మయిన 'ఉపరతి' యగుచున్నది.

24. సహనం సర్వదుఃఖానా
మప్రతీకార పూర్వకం
చింతా విలాప రహితం
సా తితిక్షా నిగద్యతే

సర్వదుఃఖములను ప్రతీకార వాంఛ లేకుండ, చింతించుట, విలపించుట (మొదలగు మనోవికారములు) లేకుండ, సహించగలిగియుండు గుణమును 'తితిక్ష' అందురు.

25. శాస్త్రస్య గురువాక్యస్య
సత్యబుద్ధ్యావధారణా
సా శ్రద్ధా కథితాసద్భిః
యయా వస్తూపలభ్యతే.

శాస్త్రములయందును, గురువాక్యముల యందును, అంతర్గత భావార్థ గ్రహణమునకై నిలుపు ఏకాగ్రతను, 'శ్రద్ధ' యందురు. వస్తూపలబ్ధి (జ్ఞానప్రాప్తి) ఇందువల్లనే కలుగును.

26. సర్వదా స్థాపనం బుద్ధేః
శుద్ధే బ్రహ్మణి సర్వదా
తత్సమాధానమిత్యుక్తం
నతు చిత్తస్య లాలనం.

తన బుద్ధిని (ఇతర ఆలోచనలు లేకుండ) ఎల్లవేళల పరిశుద్ధమయిన పరమాత్మ స్వరూపమునందు (అతని గూర్చిన ధ్యానమునందు) నిలిపియుంచగలుగుటను 'సమాధానము' (సమాధి) యందురు. అంతియేకాని మనోచాంచల్యము కాదు.

27. అహంకారాది దేహాన్తాన్
బంధానజ్ఞానకల్పితాన్
స్వస్వరూపావబోధేన
మోక్తుమిచ్ఛా ముముక్షుతా.

(ఆత్మ తత్వము తెలిసికొనక పోవుట వలన) అజ్ఞానమువలన కలి[illegible]బయిన దేహాదులయందలి అహంకారమును, వాటి వాటి నిజ తత్వములను (స్వరూపము లను) బాగుగ తెలుసుకొని, అట్టి బంధములనుండి ముక్తి పొందవలెనను ప్రగాఢ మయిన వాంఛను 'ముముక్షుత్వము' అందురు.

28. మంద మధ్యమ రూపాపి
వైరాగ్యేణ శమాదినా
ప్రసాదేన గురోః సేయం
ప్రవృద్ధా సూయతే ఫలం.

సాధకుడు మందుడయినను, మధ్యముడయినను (స్వతఃగా సునిశిత బుద్ధి కలవాడు కాకున్నను), గురువుయొక్క ప్రసాదము వలన, (గురువు అభిమానించి ప్రత్యేక శ్రద్ధ చూపుటవలన) అభివృద్ధికరమయిన ఫలము లభించును.

29. వైరాగ్యంచ ముముక్షుత్వం
తీవ్రం యస్యతు విద్యతే
తస్మిన్నేవార్థవంతః స్యుః
ఫలవంతః శమాదయః

వైరాగ్యము, ముముక్షుత్వము ఎవరియందు తీవ్రముగ నుండునో, అట్టివారియందు మాత్రమే శమదమాది సద్గుణములు అర్థవంతములు, ఫలవంతములును అగు చున్నవి.

30. ఏతయోర్మందతా యత్ర
విరక్తత్వ ముముక్షయోః
మరౌ సలిలవత్తత్ర
శమాదేర్భాన మాత్రతా.

వైరాగ్యము, ముముక్షత్వము ఏ సాధకునియందు మందముగా (తక్కువగా) నుండునో, అట్టివానియందు శమదమాదులు ఇసుక పర్రలో పడిన నీటివలె ఇంకి పోవును.

భక్తి :

31. మోక్షకారణ సామగ్ర్యాం
భక్తిరేవ గరీయసీ
స్వ స్వరూపాను సంధానం
భక్తి రిత్యభి ధీయతే.

మోక్షమును కలుగజేయు సాధనములన్నింటిలోను 'భక్తి' ముఖ్యమయినది. స్వ స్వరూపమున (తన నిజతత్వము తెలుసుకొని, అందున) మనస్సును సదా లగ్నము చేసి ఉంచుట 'భక్తి' అనబడును.

## గురువును సమీపించుట—ప్రశ్నించుట : (32-40)

32. స్వాత్మ తత్వాను సంధానం భక్తిరిత్యపరే జగుః
ఉక్త సాధన సంపన్న స్తత్వ జిజ్ఞాసురాత్మనః
ఉపసీదేద్గురుం ప్రాజ్ఞం యస్మాద్బంధ విమోక్షణమ్.

తన ఆత్మతత్వ విచారములో సదా నిలిచియుండుటను 'భక్తి' అని కొందరందురు.

ఈ విధముగా, పైన జెప్పబడిన సాధన సంపత్తిని సమకూర్చుకొని, ఆత్మ జ్ఞానము పొందగోరు సాధకుడు ప్రాజ్ఞుడయిన (జ్ఞాన సంపన్నుడయిన) గురువును సమీపించి, అతనివలన బంధవిమోచనము (మోక్షము) పొందగలుగు విధమును తెలుసుకొనవలెను.

33. శ్రోత్రియో ఒవృజినో ఒకామహతో యో బ్రహ్మవిదుత్తమః
బ్రహ్మణ్యుపరతః శాంతో నిరింధన ఇవానలః
అహేతుక దయా సింధుర్బంధురానమతాం సతాం.

శాస్త్రములను క్షుణ్ణముగా తెలిసినవాడును, పాపరహితుడును, కోరికలు లేనివాడును, బ్రహ్మజ్ఞానము కలవాడును, బ్రహ్మమునందే ఉపరతి పొందువాడును (బ్రహ్మము నందే సదా నిలచి యుండువాడును), సమిధల నన్నింటిని దగ్ధముచేసిన (చల్లారిన)

అగ్నిహోత్రము వంటివాడును, శాంత స్వభావుడును, కారణములేకనే అపారమగు కరుణ చూపగలవాడును, తనను ఆశ్రయించిన వారికి బంధు సమానుడును, అయిన గురువును ఆశ్రయించవలెను.

34. తమారాధ్య గురుం భక్త్యా
ప్రహ్వ ప్రశ్రయ సేవనైః
ప్రసన్నం తమనుప్రాప్య
పృచ్ఛేత్ జ్ఞాతవ్య మాత్మనః

అట్టిగురువును భక్తితో కొలుచుచు, తన నమ్రత చేతను, అనునయము (ప్రేమ గౌరవము, అణకువ) చేతను, సేవల చేతను, అతనిని ప్రసన్నుని చేసుకొని, ఆత్మ తత్వము గూర్చి, (ఈ విధముగా) అడుగవలెను.

35. స్వామిన్నమస్తే నతిలోకబంధో
కారుణ్యసింధో పతతం భవాబ్ధౌ
మాముద్ధరాత్మీయ కటాక్షదృష్ట్యా
ఋజ్వాతి కారుణ్య సుధాభివృష్ట్యా

ఓ స్వామీ! ఓ ఆశ్రిత లోకబంధూ? కరుణాసాగరా, ఈ భవసాగరమున పడిన నన్ను, కారుణ్య సుధాధారలగు నీ కటాక్ష వీక్షణములచే నుద్ధరింపుము.

36. దుర్వార సంసార దవాగ్ని తప్తం
దోధూయమానం దురదృష్టవాతైః
భీతం ప్రపన్నం పరిపాహి మృత్యోః
శరణ్యమన్యద్యదహం న జానే

భరింప శక్యముకాని సంసార దావానలముతో కాలిపోవు చున్నాను. దురదృష్టమను ప్రచండ వాయువులచే చలించిపోవుచున్నాను. భయ భీతుడనై యున్నాను. ఓ ప్రభూ! నన్ను మృత్యుముఖము నుండి రక్షింపుము. నీకన్న వేరు శరణ్యము నేనెరుగను.

37 శాంతా మహాంతో నివసంతి సంతో
వసంతవల్లోకహితం చరంతః
తీర్ణాఃస్వయం భీమభవార్ణవం జనా
న హేతు నాన్యానపి తారయంతః

శాంత స్వభావులును, మహాగుణ సంపన్నులును, వసంత ఋతువువలె లోకహితమ
కొరకు పాటుపడువారును, భవార్ణవమును స్వయముగా తరించి, ఇతరులను గూ(డ)
కారణము లేకనే (వారు కోరకుండగనే),ఆసంసారాబ్ధిని తరింపచేయు వారును,తరు
మములును అయిన మహాత్ములెందరో కలరు.

38. అయం స్వభావః స్వతః ఏవయత్పర-
శ్రమాపనోద ప్రవణం మహాత్మనాం
సుధాంశురేష స్వయమర్కకర్కశ-
ప్రభాభితప్తామవతి క్షితిం కిల

కర్కశములయిన సూర్యకిరణములచే తపింపబడిన భూతలమును చంద్రుడు స్వయముగా (చల్లని కిరణముల స్పర్శచే) అనునయించు విధముగానే (చల్లార్చు విధముగనే), కష్టములలో నున్నవారి దుఃఖమును తొలగించుట, మహాపురుషుల స్వాభావిక లక్షణముకదా!

39. బ్రహ్మానంద రసానుభూతికలితైః పూతైః సుశీతైర్యుతైః
యుష్మద్వాక్కలశోజ్ఝితైః శ్రుతి సుఖైర్వాక్యామృతైః సేచయ
సంతప్తం భవతాపదావదహన జ్వాలాభిరేనం ప్రభో,
ధన్యాస్తే భవదీక్షణక్షణగతేః పాత్రీకృతాః స్వీకృతాః

ఓప్రభూ! (జనన మరణములతో కూడిన) ఈ సంసారదావానల తప్తుడనగు నన్ను, బ్రహ్మానందరసానుభూతితో నిండినవియు,పవిత్రమైనవియు, శ్రవణానందకరములును అయిన నీ వాక్సుధాకలశధారలచే తడిపి(నా తాపమును చల్లార్చుము). క్షణకాలమయిన నీకటాక్ష వీక్షణలను అనుభవించి, (నీ దగ్గర శిష్యత్వము పొందుటకు) అర్హులుగ స్వీకరింపబడినవారు ధన్యులుకదా!

40. కథం తరేయం భవసింధుమేతం
కావాగతిర్మే కతమోఽస్త్యుపాయః
జానే న కించిత్కృపయాఽవమాంప్రభో
సంసారదుఃఖక్షతి మాతనుష్వ-

ఓ ప్రభూ! నేను ఈ సంసార సాగరమును ఎట్లు దాటగలను? నేను చేరవలసిన గమ్య మేమిటి? దానిని చేరుటకు ఉపాయములెవ్వి?

సంసారదుఃఖ బాధితుడనయిననేను ఏమియును ఎరుగను. నీవే నన్ను కాపాడ పలెను.

## గురూపదేశము (41-47)

41. తథావదంతం శరణాగతం స్వం
సంసార దావానల తాపతప్తం
నిరీక్ష్య కారుణ్య రసార్ద్ర దృష్ట్యా
దద్యాదభీతిం సహసామహాత్మా

ఆ విధముగా పలుకుచు, సంసారదావానల తప్తుడై, తనను శరణు జొచ్చిన అతనికి (ఆ సాధకునికి) మహాత్ముడయిన గురువు దయార్ద్ర దృష్టితో చూసి, వెంటనే అభయ మొసంగపలెను.

42. విద్వాన్ స తస్మా ఉపసత్తిమీయుషే
ముముక్షవే సాధు యథోక్తకారిణే
ప్రశాంత చిత్తాయ శమాన్వితాయ
తత్త్వోపదేశం కృపయేవ కుర్యాత్

సాధు వర్తనుడును, శాస్త్రోక్తముగా నడచుకొను వాడును, పండితుడును, శమదమాది సద్గుణ సంపన్నుడును, ప్రశాంత చిత్తుడును, మోక్షకామియై తనను శరణు జొచ్చిన వాడును అయిన అతనికి, గురువు కారుణ్య భావముతో తత్త్వోపదేశము చేయవలెను. (శ్రీ గురురువాచ)

43. మా భైష్ట విద్వాన్స్తవ నాస్త్యపాయః
సంసార సింధోస్తరణేఽస్త్యుపాయః
యేనైష యాతా యతయోఽస్య పారం
తమేవమార్గం తవ నిర్దిశామి

(శ్రీ గురువు పలికెను.) ఓ! పండితుడా! భయపడకుము. నీకు ఎట్టి అపాయమును చేకూరదు. సంసార సాగరమును దాటుటకు ఉపాయముకలదు. ఎందరో మహాత్ములు, ఏ మార్గముచే ఈ సంసార సాగరమును తరించిరో ఆ మార్గమును నీకు తెలియ పరచెదను.

44. అస్త్యుపాయో మహాన్ కశ్చిత్
సంసార భయనాశనః
తేన తీర్త్వా భవాంభోధిం
పరమానంద మాప్స్యసి

ఈ సంసార భయమును పోగొట్టు మహత్తరమయిన ఉపాయము కలదు. ఆ ఉపాయము వలన నీవు ఈ భవ సాగరమును దాటి, పరమానందము పొందగలవు.

45. వేదాంతార్థ విచారేణ
జాయతే జ్ఞానముత్తమం
తేనాత్యంతిక సంసార-
దుఃఖనాశో భవత్యను

వేదాంత భావార్థ విచారము వలన ఉత్తమమయిన జ్ఞానము కల్గును. దాని వలన సంసార దుఃఖాతిరేకము వెంటనే నాశనమందును.

46. శ్రద్ధాభక్తి ధ్యానయోగా న్ముముక్షో
ర్ముక్తేర్హేతూన్వక్తి సాక్షాత్ శ్రుతేర్గీః
యో వా ఏతేష్వేవ తిష్ఠత్యముష్య
మోక్షోఽవిద్యా కల్పితా ద్దేహబంధాత్

శ్రద్ధ, భక్తి, ధ్యానయోగము—ఇవి మోక్షకామునికి ముక్తినిచ్చు కారణములని సాక్షాత్ వేదమంత్రములే చెప్పుచున్నవి. వీటిలో నిరంతరము నిలచియుండు (అభ్యసించు) వానికి అవిద్య వలన కలిగిన దేహాది బంధముల నుండి ముక్తి కలుగును.

47. అజ్ఞానయోగాత్పర మాత్మన స్తవ
హ్యనాత్మబంధ స్తత ఏవ సంసృతిః
తయోర్వివేకోదిత బోధవహ్ని
రజ్ఞానకార్యం ప్రదహేత్సమూలం.

పరమాత్మ స్వరూపుడవయిన నీవు అజ్ఞానముతో కూడియుండుట వలన, అనాత్మ బంధమువందు చిక్కుకొంటివి అందువలన ఈ సంసారము కలిగినది. (ఆ అజ్ఞాన జనిత సంసారమును) విచక్షణవలన కలిగిన జ్ఞానాగ్ని సమూలముగ కాల్చివేయును.

## ష్యుడడిగిన ప్రశ్నలు : (48-49)

ష్యఉవాచ :

కృపయా శ్రూయతాం స్వామిన్
ప్రశ్నోఽయం క్రియతే మయా
యదుత్తరమహం శ్రుత్వా
కృతార్థస్స్యాం భవన్ముఖాత్

ష్యుడు పలికెను : ఓ స్వామీ! నేనడుగు ప్రశ్నలను దయతో వినుడు. ఆ ప్రశ్నలకు త్తరము మీ నోటి నుండి విని నేను కృతార్థుడనగుదును.

9. కోనామ బంధః కథమేష ఆగతః
కథం ప్రతిష్ఠాస్య కథంవిమోక్షః
కోఽసావనాత్మా పరమఃక ఆత్మా
తయోర్వివేకః కథమేత దుచ్యతాం.

ంధము' అన్నది ఏమి? అది ఎట్లు కలుగుచున్నది? అది ఎట్లు నిలిచియున్నది? దాని ండి విమోచనము ఎట్లు కలుగును? 'అనాత్మ' అనగా నేమి? 'పరమాత్మ' అనగా మి? వాటి తత్వమును తెలుసుకొను విధమెట్టిది? స్వామీ! తెలపియవలెను. (ఈ శ్నలకు జవాబులు చెప్పవలెను.)

ష్య ప్రశంస :

శ్రీ గురు రువాచ :

0. ధన్యోసి కృతకృత్యోసి
పావితం తే కులం త్వయా
యదవిద్యా బంధముక్త్యా
బ్రహ్మీభవితు మిచ్ఛసి

శ్రీ గురువు పలికెను : ఆహా! అవిద్యవలన కలిగిన బంధములనుండి ముక్తినిపొంది, రబ్రహ్మను చేరగోరు నీవు ధన్యుడవు: కృతకృత్యుడవు, నీవలన నీ కులమంతయు పునీతమయినది.

## స్వప్రయత్నము యొక్క ప్రశంస : (51-55)

51. ఋణమోచన కర్తారః
పితుః సంతి సుతాదయః
బంధమోచన కర్తాతు
స్వస్మాదన్యో నకశ్చన

తండ్రిని ఋణ విముక్తుని చేయుటకు కొడుకులు మొదలయినవారు ఉందురు. కాని, ఈ (సంసార) బంధమునుండి ముక్తిని ప్రసాదించువారు తాను తప్ప ఇంకెవ్వరును ఉండరు. (సంసారబంధముక్తికై ఎవరికి వారే యత్నించవలెను).

52. మస్తక న్యస్త భారాదే
ర్దుఃఖ మన్యై ర్నివార్యతే;
క్షుధాదికృత దుఃఖంతు
వినా స్వేన నకేనచిత్

తలపై మోసుకొనిపోవుచున్న (వస్తువుయొక్క) భారము వలన కలిగిన దుఃఖమును, వేరొకరు (సహాయముచేసి) పోగొట్టగలరు. కాని ఆకలి మొదలగు వాని వలన కలిగిన దుఃఖమును పోగొట్టుట తనవల్ల మాత్రమే వీలగును. ఇతరుల వల్లకాదు. (వేరొకరు భుజించినచో తన ఆకలి తీరదు).

53. పథ్యమౌషధ సేవాచ
క్రియతే యేన రోగిణా
ఆరోగ్యసిద్ధి ర్దృష్టాఽస్య
నాన్యా నుష్ఠిత కర్మణా

రోగి స్వయముగా తగిన పథ్యము, ఔషధము సేవించుటవలన ఆరోగ్యము కలుగుట చూచుచున్నాము. ఇంకొకరు సేవించుట వలన (అతని రోగ నివారణ) కలుగదు.

54. వస్తు స్వరూపం స్ఫుటబోధ చక్షుషా
స్వేనైవ వేద్యం నతు పండితేన;
చంద్ర స్వరూపం నిజచక్షుషైవ
జ్ఞాతవ్య మన్యై రవగమ్యతే కిం

వస్తువుల యొక్క నిజతత్వము నిర్మలమయిన జ్ఞాన చక్షువుచే (విచక్షణాజ్ఞానముచే) తానే స్వయముగా తెలుసుకొనవలెను. (వేరొక) పండితుడు చెప్పినది వినుట వలన కాదు. చంద్రుని యొక్క (వెన్నెలలోని) అందములను తనకళ్ళతో చూచుట వలన మాత్రమే తెలుసుకొనగలడు. వేరొకరు చూచుటవలన (గాని, చెప్పుటవలన గాని) తెలుసుకొనలేడు.

55. అవిద్యా కామ కర్మాది
పాశబంధం విమోచితుం
కః శక్నుయాద్వినాత్మానం
కల్పకోటి శతైరపి

అజ్ఞానము, కామము, కర్మలు మొదలగు వానివలన కలుగు బంధములను తొలగించు కొనుటకు తనకు తప్ప, (ఎవరికి వారు ప్రయత్నించుట వలన తప్ప), ఇంకెవరికి సాధ్యపడగలదు - శతకోటి కల్పములు గడచినను - (ఇంకొకరికి సాధ్యపడదు).

## ఆత్మజ్ఞాన ప్రశంశ : (56–61)

56. నయోగేన న సాంఖ్యేన
కర్మణానో న విద్యయా
బ్రహ్మాత్మైకత్వబోధేన
మోక్షః సిద్ధ్యతి నాన్యథా

హఠయోగము వలనగాని, సాంఖ్యయోగము వలనగాని, కర్మల వలన గాని, శాస్త్ర పరిచయముపలనగాని, మోక్షము సిద్ధించదు. జీవబ్రహ్మైక్య జ్ఞానము వలన మాత్రమే, (జీవాత్మ పరమాత్మలు ఒక్కటే అని స్వానుభవము వలన తెలుసుకొనుటవలన మాత్రమే) మోక్షము సిద్ధింపగలదు. వేరు మార్గము లేదు.

57. వీణాయా రూపసౌందర్యం
తంత్రీవాదన సౌష్ఠవం
ప్రజారంజన మాత్రం త
న్న సామ్రాజ్యాయ కల్పతే

వీణ యొక్క అందచందములు, ఆ వీణాతంత్రులు మీటుట యందలి నైపుణ్యము; ప్రజలను మెప్పించుట కొరకు మాత్రమే - దాని వలన సామ్రాజ్యము చేకూరదు.

('వీణావాదన సామ్రాట్' అని పిలుపబడినంతమాత్రాన అతనికి సామ్రాజ్యము దొరకదని భావన - 'మోక్ష సామ్రాజ్యము దొరకదు' అని కూడ చెప్పవచ్చును).

58. వాగ్వైఖరీ శబ్దఝరీ శాస్త్ర వ్యాఖ్యాన కౌశలం
వైదుష్యం విదుషాం తద్వద్భుక్తయే నతు ముక్తయే

వాక్చాతుర్యము, శబ్దఘోష, శాస్త్రములను వ్యాఖ్యానించుట యందలి నైపుణ్యము, - ఇవన్నియును పండితులకు తమ పాండిత్య ప్రకర్ష చూపుటకును, మరియు భుక్తి కొరకు మాత్రమే ఉపయోగపడును కాని, ముక్తికొరకు కాదు.

59. అవిజ్ఞాతే పరే తత్త్వే
శాస్త్రాధీతిస్తు నిష్ఫలా
విజ్ఞాతేఽపి పరేతత్త్వే
శాస్త్రాధీతిస్తు నిష్ఫలా

పరమాత్మ తత్త్వమును తెలియని వానికి (తెలుసుకొనుట యందలి శ్రద్ధలేని వానికి), శాస్త్రాధ్యయనము నిష్ఫలము (ప్రయోజనకారి కాదు), అటులనే, పరమాత్మ తత్త్వము తెలిసిన వానికి కూడ (ఆత్మజ్ఞానికి కూడ), శాస్త్రాధ్యయనము నిష్ఫలమే- (అవసరములేదు).

60. శబ్దజాలం మహారణ్యం చిత్తభ్రమణ కారకం
అతఃప్రయత్నాత్ జ్ఞాతవ్యం తత్త్వజ్ఞైస్తత్త్వమాత్మనః

(అన్ని శాస్త్రములును) బహుళ పదజాలముతో నిండి, మహారణ్యము వందువలె, మనోభ్రమణము కలిగించును. అందుచేత సాధకులు ఆత్మతత్త్వమును స్వప్రయత్నము వలననే, (స్వానుభవము వలననే) తెలుసుకొనవలెను.

61. అజ్ఞాన సర్పదష్టస్య బ్రహ్మజ్ఞానౌషధం వినా
కిము వేదైశ్చ శాస్త్రైశ్చ, కిము మంత్రైః కిమౌషధైః

అజ్ఞానము అను మహాసర్పముచే కరువబడినవానికి, బ్రహ్మజ్ఞానమను (మహాశక్తివంత మయిన) ఔషధము అవసరము కాని, వేదములెందుకు? శాస్త్రములెందుకు? మంత్రము లెందుకు? (సాధారణమగు) మందులు ఎందుకు? (అవి ఏమియును ఉపయోగపడవు).

## అపరోక్ష జ్ఞానము (62-66)

62. నగచ్ఛతి వినాపానం వ్యాధిరౌషధ శబ్దతః
వినాఽపరోక్షానుభవం బ్రహ్మశబ్దైర్న ముచ్యతే

రోగము మందు త్రాగుట వలన ఉపశమించును, గాని, ఔషధ నామ జపము వలన శాంతింపదు. అట్లే అపరోక్ష జ్ఞానము వలన కాక, (స్వయముగా అనుభవించుట వలన కాక), బ్రహ్మశబ్దోచ్చారణ మాత్రమున ముక్తి లభింపదు.

63. అకృత్వా దృశ్య విలయ మజ్ఞాత్వా తత్త్వమాత్మనః
బ్రహ్మశబ్దైః కుతో ముక్తి రుక్తి మాత్ర ఫలైర్నృణాం

దృశ్య ప్రపంచకమును లయింపజేయకనే, (ధ్యాన సమాధి కలుగకనే), బ్రహ్మ తత్త్వమును (స్వానుభవ పూర్వకముగా) ఎరుగకనే, కేవల బ్రహ్మనామమును జపించుట మాత్రాన, ముక్తి ఎట్లు లభింపగలదు? మాటలాడ గలుగుటే దాని ఫలమగును. (నలుగురికీ చెప్పుకొనుటకు పనికివచ్చును).

64. అకృత్వా శత్రుసంహారం, అగత్వాఖిల భూశ్రియమ్
రాజాహమితి శబ్దాన్నో రాజా భవితు మర్హతి

శత్రువులను జయింపకనే, భూలక్ష్మినంతను తన అధీనములోనికి తీసుకొనకనే, 'నేను రాజును' అని పలుకుచుండినయంత మాత్రాన ఎవ్వడును రాజు అగుటకు అర్హుడు కాడు.

65. ఆప్తోక్తిం ఖననం, తథోపరి శిలాద్యుత్కర్షణం, స్వీకృతిం
నిక్షేపః సమపేక్షతే, నహి బహిః శబ్దైస్తు నిర్గచ్ఛతి
తద్వద్బ్రహ్మ విదోపదేశమననధ్యానాది భిర్లభ్యతే
మాయాకార్య తిరోహితం స్వమమలం తత్త్వం నదుర్యుక్తిభిః

(భూమిలో పాతిపెట్టబడిన) నిక్షేపము (అది కప్పిపెట్టబడిన స్థలమును) ఆప్తుల వాక్యముల వలన తెలిసికొనుట, (ఆ ప్రదేశములో) త్రవ్వుట, దానిపై ఉంచిన రాళ్ళను

మొదలగు వానిని తొలగించుట, ఆ పిమ్మట దానిని అనుభవించుట వలన మాత్రమే ఆ నిధి ఉపయోగపడునుకాని, కేవలం నామ మంత్రోచ్ఛారణ వలన అది వెలికి రాజాలదు. అట్లే తత్వవేత్తల ఉపదేశములను వినుటవలనను, ఆ పిమ్మట మననము చేయుట వలనను, తదుపరి ధ్యానము వలన మాత్రమే తన ఆత్మతత్వము (దానిని కప్పి ఉంచిన) మాయ తొలగిపోగా, నిర్మలముగా ప్రకాశింపగలదు. వట్టిభాషణముల వలన లభింపదు.

66. తస్మాత్సర్వప్రయత్నేన భవబంధ విముక్తయే
స్వైరేవయత్నైః కర్తవ్యో రోగాదావిష పండితైః

అందుచేత పండితుడయిన సాధకుడు రోగ నివారణయందువలె, సంసార బంధము నుండి ముక్తి పొందుటకు గూడ, తనకు తానుగా సర్వ ప్రయత్నములను చేయవలెను.

## ప్రశ్నలపై వివరణ (67-71) :

67. యస్త్వయాద్య కృతః ప్రశ్నో వరీయాఞ్ఛాస్త్ర విన్మతః
సూత్రప్రాయో నిగూఢార్థో, జ్ఞాతవ్యశ్చ ముముక్షుభిః

నీవు అడిగిన ప్రశ్నలు ఉత్కృష్టమయినవి. ఎంతో నిగూఢమయినవి. పండితులచే అంగీకరింపబడినవి. సూత్రప్రాయమయినవి. ఎంతో నిగూఢమయినవి. (అంతరార్థముగలవి). మోక్షకాములందరిచే తెలుసుకొనబడదగినవి.

68. శృణుష్వావహితో విద్వాన్యన్మయా సముదీర్యతే
తదేతచ్ఛ్రవణాత్సద్యో భవబంధాద్విమోక్ష్యసే

ఓ పండితుడా! నేను చెప్పబోవునది నీవు సావధానుడవై (అత్యంత శ్రద్ధతో)వినుము. నేను చెప్పెడిది వినినచో సంసారబంధము నుండి వెంటనే విముక్తి పొందగలవు.

69. మోక్షస్య హేతుః ప్రథమో నిగద్యతే
వైరాగ్యమత్యంత మనిత్యవస్తుషు
తతః శమ శ్చాపి దమ స్తితిక్షా
న్యాసః ప్రసక్తాఖిల కర్మణాం భృశం.

మోక్షమునకు మొట్టమొదటికారణము అనిత్యవస్తువులయందు అత్యంత వైరాగ్యము. ఆ పిమ్మట, శమము, దమము, తితిక్ష, సర్వకామ్యకర్మల త్యాగము చెప్పబడినవి.

70. తతః శ్రుతి స్తన్మననం సతత్త్వ
ధ్యానం చిరం నిత్య నిరంతరం మునేః
తతోఽవికల్పం పరమేత్య విద్వాన్
ఇహైవ నిర్వాణ సుఖం సముచ్ఛతి.

ఆ పిమ్మట (గురువు చెప్పినది) వినుట, విననదానిని (పూర్తిగ అవగాహన చేసికొనుటకు) మనసులో తార్కికముగా ఆలోచించుట (మననము), తదుపరి చిరకాలము వరకు నిత్యము నిరంతరముగా ధ్యానించుట, ఆ పిమ్మట నిర్వికల్ప సమాధియందు నిలచుట - ఈ పద్ధతుల వలన పండితుడయిన సాధకుడు ఇక్కడే (ఈ జన్మమందే) నిర్వాణ సుఖమును (బ్రహ్మానందమును) పొందగలడు.

71. యద్బోద్ధవ్యం తవేదానీమాత్మానాత్మ వివేచనం
తదుచ్యతే మయా సమ్యక్ శ్రుత్వాత్మన్యవధారయ.

నీవు ముఖ్యముగా తెలుసుకొనవలసిన ఆత్మానాత్మ విచక్షణ గూర్చి తెలిపెదను; దానిని నీవు శ్రద్ధగా విని, (నీ మనస్సులో స్థిరముగా) నిలుపుకొనుము.

## స్థూల శరీరము (72-75)

72. మజ్జాస్థిమేదః పలరక్తచర్మ
త్వగాహ్వయై ర్ధాతుభి రేభి రన్వితం
పాదోరు వక్షో భుజ పృష్ఠమస్తకై
రంగైరుపాంగైరుప యుక్తమేతత్.

(ఎముక లోపలి భాగములో నుండు) మూలుగు, ఎముక, కొవ్వు, మాంసము, రక్తము, (లోపలనుండు) చర్మము, (పైననుండు) తోలు, అను (ఏడు) ధాతువులతో కూడినదియు, కాళ్ళు, తొడలు, వక్షము, చేతులు, వీపు, శిరస్సు మొదలగు అంగములతోను, ఉపాంగములతోను కూడుకున్నదియు-(ముందు శ్లోకముతో)

73, అహం మమేతి ప్రథితం శరీరం
మోహాస్పదం స్థూలమితీర్యతే బుధైః
నభో నభస్వద్దహనాంబు భూమయః

నేను, నాది అను (అహంకార మమకారములతో) మోహాన్వితమయిన ఈ శరీరమును స్థూల శరీరమని పండితులు అందురు,

ఆకాశము, వాయువు, అగ్ని, నీరు, భూమి ఇవి సూక్ష్మ భూతములు (ముందు శ్లోకముతో అన్వయము).

74. పరస్పరాంశై ర్మిళితాని భూత్వా
స్థూలాని చ స్థూల శరీర హేతవః
మాత్రా స్తదీయా విషయా భవంతి
శబ్దాదయః పంచ సుఖాయ భోక్తుః

(ఈ సూక్ష్మదవస్థలోనున్న పంచభూతములు)ఒకదానితో నొకటి గలసి, స్థూలావస్థను పొంది, స్థూల శరీరములకు కారణములయినవి. (ఆ పంచభూతముల యొక్క) తన్మాత్రలు సుఖదుఃఖములను కలిగించు అయిదు విషయములయినవి.

75. య ఏషు మూఢా విషయేషు బద్ధా
రాగోరుపాశేన సుదుర్దమేన
ఆయాంతి నిర్యాంత్యధ ఊర్ధ్వముచ్చైః
స్వకర్మ దూతేన జవేన నీతాః

ఈ విషయములందు ఆసక్తి అనెడి బహు బలిష్టములయిన, గట్టి తాళ్ళతో కట్టబడిన మూర్ఖుడు, తన కర్మలే (కర్మ ఫలములే), దూతలై తనను వేగముగా నడిపింపగా, క్రిందకు, మీదకు, వచ్చుచు పోవుచుండును. (స్వకర్మ ఫలవశమున ఉచ్ఛ, నీచ జన్మలు పొందుచుండును).

## విషయానురక్తి బంధహేతువు (76-82)

76. శబ్దాదిభిః పంచభిరేవ పంచ
పంచత్వ మాపుః స్వగుణేన బద్ధాః
కురంగ మాతంగ పతంగ మీన
భృంగా నరః పంచభిరంచితః కిం.

శబ్దాది విషయములయిదింటిలో ఒక్కొక్కదానిచే బంధింపబడి, (ఒక్కొక్కదాని యందు ఆసక్తి పెంచుకొని), లేడి (శబ్దము వలనను), ఏనుగు (స్పర్శ వలనను), పతంగములు (కాంతివలనను) చేపలు (రుచి వలనను), తేనెటీగలు (వాసన వలనను) నశించుచున్నవి. (తమ వినాశనమును తామే తెచ్చిపెట్టుకొనుచున్నవి), అట్టి యెడ, అయిదు విషయముల చేతను బంధితుడయిన మనిషిగతి ఏమగును?

77. దోషేణ తీవ్రోవిషయః కృష్ణ సర్ప విషాదపి,
విషం నిహంతి భోక్తారం, ద్రష్టారం చక్షుషాప్యయం.

దోషమునందు ఈ విషయములు నల్లత్రాచు విషము కంటెను తీవ్రమయినవి. విషము త్రావినప్పుడే (త్రాగినవానిని) చంపును. విషయములన్ననో కళ్ళతో చూచినంత మాత్రముననే (స్పర్శ మాత్రముననే) నాశనము జేయును.

78. విషయాశామహాపాశాద్యో విముక్తః సుదుస్త్యజాత్
స ఏవకల్పతే ముక్త్యై నాన్యః షట్శాస్త్రవేద్యపి

విడువశక్యముకాని, ఈ విషయాసక్తి అను మహాపాశముల నుండి ఎవడు విముక్తి పొందగలడో, వాడే మోక్షమును పొందగలడు; కాని, వేరొకడు, షట్శాస్త్రములు చదివిన వాడయ్యును, పొందజాలడు.

79. ఆపాత వైరాగ్యవతో ముముక్షూన్
భవాబ్ధి పారం ప్రతియాతుముద్యతాన్
ఆశాగ్రహో మజ్జయతేఽన్తరాళే
నిగృహ్య కంఠే వినివర్త్యవేగాత్

ఆపాత వైరాగ్యము చేతనే, (దుఃఖముల వలన కలిగిన స్మశాన వైరాగ్యముచేతనే) మోక్షమును కోరుచు, ఈ సంసార సాగరమును దాటుటకు ఉద్యమించువారిని, వాంఛ అను మొసలి కంఠమును పట్టి వేగముగా ఈడ్చుకొనిపోయి, (ఏమి జరుగుచున్నదో తెలుసుకొను లోపున) నడి సముద్రములో ముంచివేయును.

80. విషయాఖ్యగ్రహో యేన సువిరక్త్యసినా హతః
స గచ్ఛతి భవాంభోధేః పారం ప్రత్యూహవర్జితం.

ఈ విషయ వాంఛ అను మొసలిని ఎవడు నిజమైన వైరాగ్యము కత్తితో ఖండించునో, వాడు ఈ భవసాగరమును నిరాటంకముగా దాటగలడు.

81. విషమ విషయ మార్గై ర్గచ్ఛతోఽనచ్ఛబుద్ధే
ప్రతిపదమభియాతో మృత్యురప్యేష విద్ధి;
హిత సుజన గురుక్త్యా గచ్ఛతః స్వస్య యుక్త్యా
ప్రభవతి ఫలసిద్ధిః సత్యమిత్యేవ విద్ధి.

విషయ సుఖములను కోరి కఠిన మార్గము ననుసరించుచు పోవు బుద్ధిహీనుడు అడుగడుగునకును మృత్యువును సమీపించుచున్నాడని తెలియుము. హితైషి, సుజనుడు అయిన గురువు చెప్పిన మాటలననుసరించుచు, తన బుద్ధిని ఉపయోగించి నడచుకొనువాడు ఫలసిద్ధిని (మోక్షమును) పొందగలడు. ఇది నిజమని తెలిసికొనుము.

82. మోక్షస్య కాంక్షా యదివై తవాస్తి
త్యజాతి దూరాద్విషయాన్విషం యథా
పీయూషవత్తోష దయా క్షమార్జవ—
ప్రశాంతి దాంతీర్భజ నిత్యమాదరాత్

నీకు మోక్షేచ్ఛ (నిజముగా) యున్నచో, విషయ సుఖములను విషతుల్యములుగా చూచి, వానిని దూరముగా విడచిపెట్టుము. అమృత తుల్యములయిన సంతోషము, దయ, క్షమ, ఋజుత్వము, ప్రశాంతత, ఇంద్రియ నిగ్రహము (అను సద్గుణములను) నిత్యము ఆదరముతో స్వీకరించుము.

## శరీరాభిమాన నిరసన : (83-86):

83. అనుక్షణం యత్పరిహృత్య కృత్య—
మనాద్య విద్యాకృతబంధ మోక్షణమ్
దేహః పరార్థోఽ యమముష్య పోషణే
యః సజ్జతే స స్వమనేన హంతి

ఈ శరీరము (ముఖ్యముగా) పరమాత్మను తెలిసికొనుటకు నిర్దేశింపబడినది. దానిని- ఉదికేని అవిద్యవలన కలిగిన బంధములను తొలగించుటకు అనుక్షణము ఉపయోగింపవలెను. అట్లుగాక, ఆ శరీర పోషణములోనే (శారీరక సుఖములలోనే) నిమగ్నుడై యుండువాడు తనను తానే చంపుకున్నవాడగును.

84. శరీరపోషణార్థీ సన్ య ఆత్మానం దిదృక్షతి
గ్రాహం దారు ధియా ధృత్వా నదీం తర్తుం సగచ్ఛతి

శరీర పోషణలో (శారీరక సుఖములలో) నిమగ్నుడై యుండి, ఎవడు ఆత్మదర్శనమును చేయ గోరునో, వాడు మొసలిని కర్ర ముక్క అనుకొని, దానిని పట్టుకొని నదిని దాట ప్రయత్నించుచున్నాడు.

85. మోహ ఏవ మహా మృత్యుర్ముముక్షోర్వపురాదిషు
మోహో వినిర్జితో యేన స ముక్తి పదమర్హతి

మోక్షమును కోరు సాధకునకు తనువు మొదలగు వానియందు మోహము మహా మృత్యువువంటిది. (ఈ శరీరాదులయందు) మోహమును విడిచిపెట్టినవాడే ముక్తి పదమును పొందుటకు అర్హుడగు చున్నాడు.

86. మోహం జహి మహామృత్యుం దేహదారసుతాదిషు
యం జిత్వా మునయో యాంతి తద్విష్ణోః పరమంపదం

దేహము నందును, భార్యా పుత్రులయందును, సర్వ నాశనకరమగు మోహమును వీడుము. ఈ మోహమును విడిచి ఎందరో మునులు (ఆత్మజ్ఞానులు) విష్ణుపదమును చేరుచున్నారు.

## స్థూల శరీర నిరసన : (87–91) :

87. త్వఙ్మాంస రుధిర స్నాయు మేదో మజ్జాస్థి సంకులం
పూర్ణం మూత్రపురీషాభ్యాం స్థూలం నింద్యమిదం వపుః

చర్మము, మాంసము, రక్తము, క్రొవ్వు, మూలుగు, ఎముకలతో కూడి, మూత్ర పురీషములతో నిండిన ఈ శరీరము నింద్యమయినది.

88. పంచీకృతేభ్యో భూతేభ్యః స్థూలేభ్యః పూర్వ కర్మణా
సముత్పన్నమిదం స్థూలం, భోగాయతన మాత్మనః
అవస్థా జాగర స్తస్య స్థూలార్థానుభవోయతః

పంచీకరణము పొందిన స్థూల భూతములచే తయారయి, పూర్వకర్మ ఫలముగ సంప్రాప్తమయిన ఈ స్థూల శరీరము ఆత్మకు భోగగృహము వంటిది. దీనికి జాగ్రదవస్థ. స్థూల విషయానుభవమున కుపయోగపడును.

89. బాహ్యేంద్రియైః స్థూలపదార్థ సేవాం
స్రక్చందన స్త్రియాది విచిత్రరూపాన్
కరోతి జీవః స్వయమేతదాత్మనా
తస్మాత్ప్రశస్తిర్వపుషోఽస్య జాగరే

జీవి, ఈ స్థూల శరీరములో జేరి, బాహ్యేంద్రియ క్రియలచే, హారములు, చందనము, స్త్రీలు మొదలగు పలువిధములయిన స్థూల పదార్థ సేవలను స్వయముగ అనుభవించు చుండును. అందుచేత ఈ స్థూల శరీరము జాగ్రదవస్థయందు పనిచేయును (ప్రత్యేక తను గాంచును).

90. సర్వోపి బాహ్యసంసారః పురుషస్య యదాశ్రయః
విద్ధి దేహమిదం స్థూలం గృహవద్గృహమేధినః

ఈ స్థూల శరీరము—గృహస్థునకు స్వగృహమువలె—పురుషునకు బాహ్య ప్రపంచము నందు చేయు సర్వ కర్మలకు ఆశ్రయమై యున్నది. (పురుషునికి బాహ్య ప్రపంచ ముతో కలుపు సాధనమై యున్నది).

91. స్థూలస్య సంభవ జరామరణాని ధర్మాః
స్థౌల్యాదయో బహువిధాః శిశుతాద్యవస్థాః
వర్ణాశ్రమాది నియమా బహుధాఽమయాః స్యుః
పూజావమాన బహుమాన ముఖా విశేషాః

ఈ స్థూల శరీరమునకు, పుట్టుట, ముసలి అగుట, చనిపోవుట స్వభావికములు. లావుగ నుండుట మొదలగు మార్పులు (సహజము), బాల్యము మొదలగు అవస్థ లను (పొందుచుండును). వర్ణాశ్రమాది ధర్మములు (ఈ స్థూల శరీరమునకే వర్తిం చును), అనేక రోగములు (ఈ స్థూల శరీరమునకే) కలుగును. పూజ, అవ మానము, బహుమానము మొదలగు బహువిధములైన (సన్మానావమానములు). ఈ స్థూల శరీరమునకే కలుగును.

## బాహ్యేంద్రియములు :

92. బుద్ధీంద్రియాణి శ్రవణం త్వగక్షి
ఘ్రాణం చ జిహ్వా విషయావబోధనాత్
వాక్పాణి పాదా గుదమప్యుపస్థః
కర్మేంద్రియాణి ప్రవణేన కర్మసు

విషయములను తెలుసుకొనుటలో ఉపయోగపడు జ్ఞానేంద్రియములు—చెవులు, చర్మము, కళ్ళు, ముక్కు, నాలుక, అట్లే (బాహ్య ప్రపంచములో) కర్మల నాచ రించుట కుపయోగపడు కర్మేంద్రియములు - వాక్కు (నోరు), చేతులు, కాళ్ళు, గుదము (ముడ్డి), ఉపస్థ (స్త్రీ పురుష మర్మాంగములు).

## అంతఃకరణము : (93-94)

93. నిగద్యతేఽన్తః కరణం మనోధీ—
రహంకృతి శ్చిత్తమితి స్వవృత్తిభిః
మనస్తు సంకల్ప వికల్ప నాదిభి—
ర్బుద్ధిః పదార్థా ధ్యవసాయ ధర్మతః

94. అత్రాభిమానాదహ మిత్యహంకృతిః
స్వార్థాను సంధాన గుణేన చిత్తమ్.

అంతః కరణము దానిలో కలుగు వృత్తులను (ఆలోచనలను) బట్టి మనస్సు, బుద్ధి, అహంకారము, చిత్తము అని తెలియబడుచున్నది. సంకల్ప వికల్పములతో కూడి నప్పుడు (అనిశ్చిత స్థితిలో నున్నప్పుడు) అది 'మనస్సు'గాను, వస్తువుల నిజతత్వ మును నిర్ణయించునప్పుడు అది 'బుద్ధి'గాను, వీటితో (ఈ మనోబుద్ధులతో) కలసి, 'నేను' (చేయుచున్నాను, వినుచున్నాను మొదలగు) భావము కలిగించునప్పుడు అహంకారముగాను, ఈమనోవృత్తుల నన్నింటిని సంధానపరచి (ఒకే ధారగా) ఎరుగు నప్పుడు 'చిత్తము'గను వ్యవహరింపబడును.

(ఒకే చిత్త పదార్థము—ఆందోళనలు అలజడులు కలిగి నిర్ణయించలేనిస్థితిలో మనస్సుగను, నిర్ణయాత్మక భూమికలో బుద్ధిగను, ఈ రెండు రకములయిన ఆలోచ నలు, భావనలు, 'తనవి'గా భావించుటలో అహంకారముగను, ఈ మూడింటియందును ఎప్పుడు ఏ వృత్తి కలిగినను, వానినన్నింటిని సమన్వయ పరచి, ఒకే ధారగా గ్రహించగలుగు భూమికలో చిత్తముగను వ్యవహరించును. చిత్తము ఈ మనో, బుద్ధ్యహంకారములతో కలియకుండ ఉన్నప్పుడు, అది కేవల చిన్మాత్రముగా (మనో వృత్తులు ఏమియు లేనిదిగా) ఉండును.

## పంచ ప్రాణములు :

95. ప్రాణాపాన వ్యానోదాన సమానా భవత్యసౌ ప్రాణః
స్వయమేవ వృత్తి భేదాద్వికృతి భేదాత్సువర్ణ సలిలాదివత్

ప్రాణము, అపానము, వ్యానము, ఉదానము, సమానము అని, ఒకే ప్రాణము వృత్తి భేదముల బట్టి, వికారములను బట్టి, (అవి చేయు వివిధ కర్మలను బట్టి) చెప్పబడు

అంధత్వ మందత్వ పటుత్వ ధర్మాః
సౌగుణ్య వైగుణ్య వశాద్ధి చక్షుషః
బాధిర్య మూకత్వ ముఖాస్తథైవ
శ్రోత్రాది ధర్మా నతు వేత్తు రాత్మనః

సూక్ష్మ శరీరము : (96–101)

96. వాగాదీ పంచ శ్రవణాదీ పంచ
ప్రాణాది పంచాభ్రముఖాని పంచ
బుద్ధ్యాద్యవిద్యాపి చ కామ కర్మణీ
పుర్యష్టకం సూక్ష్మ శరీరమాహుః

వాక్కు మొదలగు పంచ కర్మేంద్రియములు, చెవులు మొదలగు పంచజ్ఞానేంద్రియములు, పంచప్రాణములు, ఆకాశము మొదలగు పంచభూతములు, బుద్ధి మొదలగునవి, అవిద్య, కామము, కర్మలు—ఈ ఎనిమిది విధములచే కూడుకున్నది—సూక్ష్మ శరీరమందురు.

97. ఇదం శరిరం శృణు సూక్ష్మ సంజ్ఞితం
లింగం త్వ పంచీకృత భూత సంభవం
సవాసనం, కర్మ ఫలానుభావకం
స్వాజ్ఞానతోఽ నాదిరుపాధిరాత్మనః

లింగ శరీరమని కూడ అనబడు ఈ సూక్ష్మ శరీరము, పంచీకరణము పొందని (సూక్ష్మ) భూతములచే కలిగినది. ఇది (పూర్వ జన్మలయొక్క) వాసనలచే కూడుకున్నదై, కర్మ ఫలానుభవము (స్వభావముగా) గలది. ఆత్మకు అజ్ఞాన జనితమయిన ఈ ఉపాధి అనాది నుండి వచ్చుచున్నది.

98. స్వప్నో భవత్యస్య విభక్త్యవస్థా
స్వమాత్ర శేషేణ విభాతి తత్ర
స్వప్నేతు బుద్ధిః స్వయమేవ జాగ్ర-
త్కాలీన నానా విధవాసనాభిః

99. కర్త్రాదిభావం ప్రతిపద్య రాజతే
యత్ర స్వయం భాతి హ్యయం పరాత్మా
ధీమాత్రకోపాధి రశేష సాక్షీ
న లిప్యతే తత్కృత కర్మలేశైః
యస్మాదసంగ స్తత ఏవ కర్మభి-
ర్నలిప్యతే కించి దుపాధినా కృతే

ఈ సూక్ష్మ శరీరము స్వప్నావస్థయందు, తన వలన తానే తనలో ప్రకటిత మగు చున్నది. జాగ్రదవస్థయందు కలిగిన, నానా విధ వాసనలచే, బుద్ధి స్వప్నలోకమును సృష్టించి, అందు తానే కర్తగా వ్యవహరించును. ఈ అవస్థలో ఆత్మ తనలో తానే వెలుగొందుచుండును (ఆనందమును అనుభవించుచుండును). స్వప్నావస్థయందు, ఆత్మ ధీమాత్రుడై (బుద్ధి చేత మాత్రమే కప్పబడి), ఎల్ల ఉపాధులకు సాక్షీ భూతు డగుటచే, బుద్ధియొక్క ఈ కర్మలచే అంటబడడు. ఆత్మ సంగరహితుడగుటచే ఏ ఉపాధివలన చేయబడిన కర్మలునూ, అతనిని మలిన పరచలేవు. (ఏకర్మలునూ ఆత్మను అంటవని దీని భావము).

100. సర్వ వ్యాపృతి కరణం లింగమిదం
స్యాచ్చిదాత్మనః పుంసః
వాస్యాదిక మివ తక్ష్ణ-
స్తేనై వాత్మా భవత్య సంగోఽయమ్.

వడ్రంగి యొక్క పనిముట్లవలె, ఈ సూక్ష్మ శరీరము, కేవల చిత్స్వరూపుడయిన పురుషునకు, సకలకర్మలను చేయుటలో ఉపయోగపడు ఉపకరణము (పనిముట్టు) వంటిది.

ఆత్మ ఎల్లప్పుడును సంగరహితమయినదే—

101. అంధత్వ మందత్వ పటుత్వ ధర్మాః
సౌగుణ్య వైగుణ్య వశాద్ధి చక్షుషః
బాధిర్య మూకత్వ ముఖా స్తథైవ
శ్రోత్రాది ధర్మా నతు వేత్తు రాత్మనః

అంధత్వము, కొద్దిగా కనుపించుట, బాగుగా కనుపించుట అనునవి కంటి యొక్క గుణావగుణముల మీద (మంచిచెడ్డల మీద) ఆధారపడును. అట్లే చెవుడు, మూగ

తనము మొదలగునవి, చెవులు మొదలగు వానియొక్క ధర్మములు. (ఈ గుణావ గుణము లేవియు) ఆత్మకు సంబంధించినవి కావు.

### ప్రాణముయొక్క ధర్మములు (క్రియలు) :

102. ఉచ్ఛ్వాస నిశ్వాస విజృంభణక్షు-
త్ప్రస్యందనా ద్యుత్క్రమణాదికా క్రియాః
ప్రాణాది కర్మాణి వదంతి తజ్జ్ఞాః
ప్రాణస్య ధర్మావశనా పిపాసే.

ఉచ్ఛ్వాస నిశ్వాసములు, ఆవులింతలు, తుమ్ములు, నీరుకారుట. ఉత్క్రమణము (మరణము) మొదలగునవి ప్రాణములయొక్క విషయలని, దాని గూర్చి తెలిసినవారు చెప్పుదురు. ఆకలి, దాహము ప్రాణముయొక్క ధర్మములు. (శరీరమును ఆరోగ్యవంతముగను, బలిష్ఠముగను ఉంచుటకు అవసరమైన పదార్థముల యందలి 'వాంఛ' ఆకలి, దప్పిక క్రిందికి వచ్చునని చెప్పవచ్చును).

### జీవాత్మ (103-105) :

103. అంతఃకరణమే తేషు చక్షురాదిషు వర్ష్మణి
అహ మిత్యభిమానేన తిష్ఠత్యాభాస తేజసా.

అంతః కరణము కన్నులు మొదలగు ఇంద్రియములలో ప్రవర్తించుచు, ఆత్మయొక్క ఆభాస తేజస్సుచే (ప్రతిబింబిత తేజస్సుచే) 'నేను' అను అనుభూతిని('నేను చూచుచున్నాను', 'నేను వినుచున్నాను' అను అనుభూతిని) పొందుచున్నది. (ఆత్మ తేజస్సు అంతఃకరణమును ఉద్దీపింపచేయుటవలన, 'నేను' అనుభావము అంతఃకరణములో కలుగును. అదియే 'అహంకారము' అని తెలియబడుచున్నది.

104. అహంకారః స విజ్ఞేయః కర్తా భోక్తాభిమాన్యయం
సత్వాది గుణయోగేన చావస్థాత్రయ మశ్నుతే-

ఈ అహంకారమే (శరీరాదులతో చేరి,) కర్తగను, భోక్తగను, వ్యవహరించునని తెలుసుకొనవలెను. ఈ అహంకారమే సత్వాది గుణములతో కూడి, (జాగ్రత్, స్వప్న, సుషుప్త్యవస్థలను) మూడు అవస్థలను పొందుచుండును.

105. విషయాణామానుకూల్యే సుఖీ దుఃఖీ విపర్యయే,
సుఖం దుఃఖం చ తద్ధర్మః సదానందస్య నాత్మనః

విషయములు (బాహ్య సంఘటనలు) అనుకూలముగ నున్నచో సుఖమును, ప్రతికూలముగనున్నచో దుఃఖమును (లః అహంకారము) అనుభవించుచుండును. సదానందుడయిన (ఎల్లప్పుడును ఆనందమునందు ఉండు) ఆత్మవికావు. (సుఖదుఃఖములు ఆత్మకు అంటవు).

## ఆత్మతత్వము : (106-107)

106. ఆత్మార్థత్వేన హి ప్రేయాన్విషయో నస్వతః ప్రియః
స్వత ఏవహి సర్వేషామాత్మా ప్రియతమోయతః
తత ఆత్మా సదానందో నాస్య దుఃఖం కదాచన.

విషయములు స్వయముగ ప్రియమయినవి (ఆనందమిచ్చునవి) కావు. ఆత్మ ప్రకాశము వలననే అవి ప్రియ వస్తువులయినవి. (ప్రియ వస్తువులుగా కనబడుచున్నవి.) ఆత్మ స్వతస్సిద్ధముగా అన్నింటికంటెను ప్రియతమమయినది. అందువలననే, ఆత్మ సదానంద స్వరూపమయినది. అక్కడ దుఃఖము ఎప్పుడును ఉండదు.

107. యత్సుషుప్తౌ నిర్విషయ ఆత్మానందోఽనుభూయతే
శ్రుతిః ప్రత్యక్షమైతిహ్యమనుమానం చ జాగ్రతి.

సుషుప్త్యవస్థయందు (గాఢనిద్రలో), బాహ్య విషయ సంపర్కము లేక పోవుటచే, ఆత్మానందము కలుగుచున్నది. (జీవి తనలో తానే ఆనందము పొందుచున్నాడు). శ్రుతులు, ప్రత్యక్ష అనుభవము, అనుమానము (తార్కికముగా ఆలోచించి తెలుసుకున్నది). అన్నియు ఈ విషయమునే ధృవపరచు చున్నవి.

## మాయ : (108–110)

108. అవ్యక్త నామ్నీ పరమేశ శక్తి—
రనాద్యవిద్యా త్రిగుణాత్మికా పరా;
కార్యానుమేయా సుధియైవ మాయా
యయా జగత్సర్వమిదం ప్రసూయతే.

అవ్యక్తమని పిలువబడునదియు, ఈశ్వరకల్పితమును. అనాదిగ వచ్చుచున్నదియు, అయిన 'అవిద్య' మిక్కిలి గొప్పది (ఇంద్రియ గోచరమయినది.) విద్వాంసులు సహితము ఇదిచేయు పనుల వలన మాత్రమే దీనిని తెలుసుకొనగలుగుచున్నారు. ఈ మాయ చేతనే ఈ జగత్తంతయు కల్పింపబడినది.

('అవిద్య', 'మాయ' రెండును ఒక్క వస్తువునే తెలుపును — అవిద్యతో కూడినవాడు 'జీవి'. 'మాయ'తో కూడినవాడు 'ఈశ్వరుడు')

109. సన్నాప్యసన్నా ప్యుభయాత్మికా నో
భిన్నాప్యభిన్నాప్యు భయాత్మికా నో
సాంగా ప్యనంగా హ్యుభయాత్మికా నో
మహాద్భుతాఽ నిర్వనీచయ రూపా.

ఈ మాయ—సత్యమయినదికాదు. అసత్యమయినది కాదు; రెండింటితో కూడుకున్నది కాదు. భిన్నమయినదికాదు; అభిన్నమయినది కాదు; రెండింటితో కూడుకున్నదికాదు; అట్లే ఇది అంగములో (భాగములు) కలదికాదు; భాగములు లేనిది కాదు; రెండింటితో కూడినది కాదు. ఈ మాయ మహాద్భుతమయినది. (వివరింప శక్యము కానిది).

(ఆత్మ సత్యమయినది; నిర్ద్వంద్వ మయినది; అభిన్నమయినది. ఆత్మకు వేరయిన మాయను ఆత్మతత్త్వముతో పోల్చి చూచినచో ఈ శ్లోకములోని భావము గ్రహించగలము).

110. శుద్ధాద్వయ బ్రహ్మ విబోధ నాశ్యా
సర్పభ్రమో రజ్జు వివేకతో యథా;
రజస్తమః సత్త్వమితి ప్రసిద్ధా
గుణా స్తదీయాః ప్రథితైః స్వకార్యైః

త్రాటియొక్క నిజతత్త్వమును ఎరిగినంతనే (దానిని చూచినప్పుడు కలిగిన)'సర్పము' అను భ్రమ తొలగిపోవునట్లే, ద్వైత రహితమయిన శుద్ధ బ్రహ్మమును తెలిసికొనినంతనే, ఈ మాయ తొలగిపోవును.

ఈ మాయచే కల్పింపబడిన గుణములు—రజస్సు, తమస్సు, సత్త్వము అను నవి. వాటిని, వాటివాటి పనులవలన తెలుసుకొనవచ్చును.

## రజోగుణము (111-112):

111. విక్షేపశక్తీ రజసః క్రియాత్మికా
యతః ప్రవృత్తిః ప్రసృతా పురాణీ
రాగాదయోఽస్యాః ప్రభవంతి నిత్యం
దుఃఖాదయోయే మనసో వికారాః.

రజోగుణము 'విక్షేపశక్తి' (లేనిది ఉన్నట్లు భావించు శక్తి) కలది. క్రియాత్మక మయినది (పనులయందు ఆసక్తి కలిగించునది). దీనివల్లనే పాతకాలము నుండి 'ప్రవృత్తి' (పనుల చేయుటయందు ఆసక్తి) కలిగినది. దీనివల్లనే రాగము మొదలగు (ద్వంద్వములు), దుఃఖము మొదలగు మనో వికారములు నిరంతరము కలుగు చున్నవి.

112. కామః క్రోధో లోభ దంభాద్యసూయాఽ-
హంకారేర్ష్యా మత్సరాద్యస్తు ఘోరాః
ధర్మా ఏతే రాజసాః పుంప్రవృత్తి-
ర్యస్మాదేవా తద్రజో బంధహేతుః

రజోగుణముయొక్క ధర్మములు(స్వభావము) ఘోరమయినవి. కామము, క్రోధము, లోభము, దంభము, అసూయ, అహంకారము (దర్పము), ఈర్ష్య, మత్సరము— ఇవన్నియును రజోగుణము వలననే కలుగును. మనిషి (ఈ ప్రపంచములో) అనవరతము కర్మలలో నిమగ్నుడై యుండుట (పుంప్రవృత్తి), ఈ రజోగుణము వలననే కలుగును. అందుచేత ఈ రజోగుణము బంధహేతువు అగుచున్నది.

## తమోగుణము (113-116):

113. ఏషాఽఽవృతిర్నామ తమోగుణస్య
శక్తిర్యయా వస్త్వవ భాసతేఽన్యథా
సైషా నిదానం పురుషస్య సంసృతే-
ర్విక్షేప శక్తేః ప్రవణస్య హేతుః

తమోగుణమునకు 'ఆవరణశక్తి' (నిజమును మరుగుపరచుశక్తి) కలదు. ఈ శక్తి వలన వస్తువులు (ఉన్నవి ఉన్నట్లుకాక) వేరొక విధముగా తెలుసుకొనబడుచున్నవి.

మానవుల జనన మరణములకు ఇదే(ఈ తమోగుణమే)కారణము. ఈ 'ఆవరణశక్తి' వలన (నిజమును కప్పియుంచుటవలన) 'విక్షేపశక్తి' (లేనిది ఉన్నట్లు తోచుట) జరుగుచున్నది.

('ఆవరణ', 'విక్షేప' శక్తులు రెండును మాయాశక్తులు. కలసి పనిచేయును: 'ఆవరణశక్తి' ఉన్నదానిని ఉన్నట్టుగా తెలుసుకొననీకుండ చేయగా, అప్పుడు 'విక్షేప శక్తి' లేనిదానిని ఊహించి, అది ఉన్నట్టుగా భావింపజేయును.)

114. ప్రజ్ఞావానపి, పండితోఽపి, చతురోఽప్యత్యంత సూక్ష్మార్థదృగ్ —
వ్యాలీఢ స్తమసా నవేత్తి బహుధా సంబోధితోఽపి స్ఫుటం,
భ్రాంత్యారోపితమేవ సాధు కలయత్యాలంబతే తద్గుణాన్
హంతాసౌ ప్రబలా దురంత తమసః శక్తిర్మహత్యావృతిః

ఎంతటి ప్రజ్ఞావంతుడయినను, పండితుడయినను, చతురుడయినను, సూక్ష్మార్థగ్రాహి అయినను, తమస్సుచేత ఆవరింపబడి, ఎన్నోవిధములుగా బోధింపబడినప్పటికిని, నిజమును తెలిసికొనలేనివాడై, భ్రాంతివలన జనించినవాటినే నిజమని నమ్ముచున్నాడు. ఆ తమస్సువలన కలిగినవాటినే ఆధారముగా తీసుకొనుచున్నాడు. ఆహా! దురంతమైన (అంతముచేయ కష్టమగు) ఈ తమస్సు ఎంతటి ప్రబలమయినది ! (దానిచే కలిగిన) ఈ 'ఆవరణశక్తి' ఎంతటి మహత్తర శక్తివంతమయినది !

115. అభావనా వా విపరీతభావనాఽ —
సంభావనా విప్రతిపత్తిరస్యాః
సంసర్గయుక్తం న విముంచతి ధృవం
విక్షేపశక్తిః క్షపయత్యజస్రం.

తమోగుణము వలన నిజమును గ్రహించలేకపోవుట, నిజము కానివానిని నిజమని గ్రహించుట, నిజానిజములు తెలిసికొనలేకపోవుట, సందిగ్ధత — కలుగును. వీటితో కూడుకున్న వానిని, ఇవి (ఈ గుణములు)ఎప్పటికిని విడిచిపెట్టవు. ఇది నిశ్చయము. (వీటికితోడు) 'విక్షేపశక్తి' (ఇంకనూ ఎక్కువగా) నిరంతరము బాధపెట్టుచుండును.

116. అజ్ఞాన మాలస్య జడత్వ నిద్రా —
ప్రమాద మూఢత్వముఖా స్తమోగుణాః
ఏతైః ప్రయుక్తో నహివేత్తి కించి —
న్నిద్రాలు వ స్తంభవదేవ తిష్ఠతి.

అజ్ఞానము, అలసత్వము (బద్ధకము), జడత్వము(దేనియందును ఆసక్తి లేకపోవుట), నిద్ర, మరపు, మూఢత్వము, మొదలగునవి తమస్సు యొక్క గుణములు. వీటితో కూడుకున్నవాడు ఏమియును తెలుసుకొనలేడు. ఎల్లప్పుడును నిద్రించుచున్నవానివలె, స్తంభమువలె నుండును.

## సత్వగుణము (117-119):

**117.** సత్వం విశుద్ధం జలవత్తథాపి
తాభ్యాం మిళిత్వా సరణాయ కల్పతే.
యత్రాత్మబింబః ప్రతిబింబితః సన్
ప్రకాశయత్యర్క ఇవాఖిలం జడం

సత్వ గుణము (నిర్మలమైన) నీటివలె శుద్ధమైనది. అయినను వాటితో (రజస్తమో గుణములతో) కలసి, దేహాంతరయానమునకు కారణమగుచున్నది. ఈ సత్వగుణ ముతో కూడుకున్న అంతఃకరణమునందు ఆత్మబింబము ప్రతిబింబితమయి, సూర్యుని వలె, జడ జగత్తునంతయు ప్రకాశవంతము జేయును.

**118.** మిశ్రస్య సత్వస్య భవంతి ధర్మా —
స్త్వమానితాద్యా నియమాయ మాద్యాః
శ్రద్ధాచ భక్తిశ్చ ముముక్షుతాచ
దైవీచ సంపత్తి రసన్నివృత్తిః

మిశ్రమ సత్వమునకు(రజస్తమోగుణములతో కూడుకొని, ప్రధాన సత్వగుణమునకు), గర్వము లేకపోవుట, యమనియమాదులు, శ్రద్ధ, భక్తి, ముముక్షుత, దైవీసంపత్తి, అసత్య వస్తువులనుండి తొలగిపోవుట ధర్మములగుచున్నవి.

**119.** విశుద్ధ సత్వస్య గుణాః ప్రసాదః
స్వాత్మానుభూతిః పరమం ప్రశాంతిః
తృప్తిః ప్రహర్షః పరమాత్మ నిష్ఠా
యయా సదానందరసం సమృచ్ఛతి.

ఆనందము, స్వాత్మానుభూతి(తన ఆత్మతత్వము నిరంతరము అనుభవించుచుండుట), ఉత్కృష్టమైన ప్రశాంతత, తృప్తి, ఉత్సాహము (ప్రహర్షము), పరమాత్మయందలి

నిలకడ — ఇవి (రజస్తమో గుణములు కలవని) శుద్ధ సత్వగుణము యొక్క ధర్మములు. ఈ శుద్ధ సత్వగుణమువలన మనిషి సదా ఆనందమును అనుభవించుచుండును.

## కారణ శరీరము (120-121) :

120. అవ్యక్తమేతా త్రిగుణై ర్నిరుక్తం
తత్కారణం నామ శరీరమాత్మనః.
సుషుప్తి రేతస్య విభక్త్యవస్థా
ప్రలీన సర్వేంద్రియ బుద్ధివృత్తిః

మూడు గుణములతో కూడుకున్న ఈ అవ్యక్తము కారణశరీరమని పిలువబడుచున్నది. గాఢనిద్ర (సుషుప్తి) ఈ కారణశరీరము యొక్క ప్రత్యేక అవస్థ. (ఈ అవస్థయందు) ఇంద్రియ మనోబుద్ధుల సర్వకర్మలును అణగియుండును.

121. సర్వప్రకార ప్రమతి ప్రశాంతి
ర్బీజాత్మనావస్థితిరేవ బుద్ధేః
సుషుప్తి రేతస్యకిల ప్రతీతిః
కించిన్న వేద్మీతి జగత్ప్రసిద్ధేః

ఈ సుషుప్త్యావస్థలో అన్ని రకములయిన ఇంద్రియ వ్యాపారములు శాంతించి, బుద్ధి బీజస్థితియందు ఉన్నట్టులుండును: 'నేను ఏమియును తెలుసుకొనుచుండుటలేదు' అను భావమే ఈ అవస్థయందు జగత్ప్రసిద్ధమయినది. (అందరును అనుభవించునది).

## అనాత్మ (122-123) :

122. దేహేంద్రియ ప్రాణ మనోఽహమాదయః
సర్వే వికారా విషయాః సుఖాదయః
వ్యోమాది భూతానఖిలం - చ విశ్వ -
మవ్యక్త పర్యంతమిదం హ్యనాత్మా

దేహము, ఇంద్రియములు, ప్రాణము, మనస్సు, అహంకారము మొదలగునవి, వాటి పలు విధములయిన వికారములు (మార్పులు), విషయములు (అవి కల్గించు), సుఖ దుఃఖములు, ఆకాశము మొదలుగాగల పంచభూతములు, అవ్యక్తపర్యంతముకల ఈ విశ్వమంతయు— ఇవన్నియును 'అనాత్మ' (ఆత్మకానిది).

123. మాయా మాయాకార్యం సర్వం మహదాది దేహపర్యంతం
అసదిదమనాత్మతత్త్వం విద్ధిత్వం మరు మరీచికాకల్పం.

మాయ, మాయాకల్పితములయిన, మహత్తునుండి దేహమువరకు గల సర్వమును అసత్పదార్థములు; వీనిని 'అనాత్మ'గా తెలిసికొనుము. ఇవి ఎడారిలో కనబడు ఎండ మావుల వంటివి.

## పరమాత్మ తత్త్వము (124-135):

124. అథతే సంప్రవక్ష్యామి స్వరూపం పరమాత్మనః
యద్విజ్ఞాయ నరో బంధాన్ముక్తః కైవల్యమశ్నుతే -

ఇప్పుడు నీకు పరమాత్మ తత్త్వము గూర్చి విశదపరచెదను. దీనినెరిగిన మనుజుడు బంధములన్నింటి నుండి విడివడి, కైవల్యమును పొందును.

125. అస్తి కశ్చిత్ స్వయం నిత్యమహం ప్రత్యయలంబనః
అవస్థాత్రయ సాక్షీ సన్పంచకోశ విలక్షణః

స్వయముగ నిత్యమయినవాడును (మార్పులు లేనివాడును) 'అహం' అను ప్రత్యయమునకు (నేను అను భావమునకు) ఆధారభూతుడును, మూడు అవస్థలకు సాక్షీభూతుడును, పంచకోశములకు విభిన్నుడును అయిన ఒకానొకడు ఉన్నాడు.

126. యో విజానాతి సకలం, జాగ్రత్ స్వప్నసుషుప్తిషు
బుద్ధి తద్వృత్తి సద్భావమభావ మహమిత్యయం.

జాగ్రత్ స్వప్న సుషుప్త్యవస్థలయందు జరుగు సకలమును ఎవడు ఎరుగుచుండునో, బుద్ధిని, బుద్ధిలో కలుగు వృత్తులను, వాటి ఉనికిని, అవి లేకపోవుటను ఎవరు తెలుసుకొనుచు, 'నేను' (తెలుసుకొనుచున్నాను) అను భావమును కలుగజేయుచున్నాడో— అతడే ఇతడు (ఈ పరమాత్మ).

127. యః పశ్యతి స్వయం సర్వం, యం నపశ్యతి కంచన,
యశ్చేతయతి బుద్ధ్యాదీన్న తద్యం చేతయ త్యయం.

ఎవడు అన్నింటిని స్వయముగా చూచుచున్నాడో, (కాని) ఎవనిని వేరొకరు చూడలేరో, ఎవడు మనోబుద్ధ్యాదులయందు చైతన్యము కలిగించుచున్నాడో, (కాని) ఎవనిని ఇవి చైతన్యవంతము చేయలేవో - అతడే ఇతడు.

128. యేన విశ్వమిదంవ్యాప్తం, యంన వ్యాప్నోతి కించన :
అభారూపమిదం సర్వం యం భాంత మనుభాత్యయం.

ఎవడు ఈ విశ్వమునంతయు వ్యాపించి యుండెనో, (కాని) ఎవనిని ఇంకెవరును వ్యాపింపలేరో (ఆక్రమించలేరో), ఎవని ప్రకాశములో అభారూపమయిన (నిజ ప్రకాశములేని, ప్రతిబింబ రూపకమయిన) ఈ విశ్వమంతయు ప్రకాశితమగుచున్నదో- అతడే ఇతడు.

129. యస్య సన్నిధిమాత్రేణ దేహేంద్రియమనోధియః
విషయేషు స్వకీయేషు వర్తంతే ప్రేరితా ఇవ.

ఎవని సాన్నిధ్యమాత్రమున (దగ్గర ఉన్నంత మాత్రమున), దేహము, ఇంద్రియములు. మనస్సు, బుద్ధి, తమతమ విషయములలో (కార్యములలో), అతనిచే ప్రేరేపింపబడినట్లు (ఆజ్ఞాపింపబడినట్లు) ప్రవర్తించుచుందురో, — (అతడే ఇతడు).

130. అహంకారాది దేహాంతా విషయాశ్చ సుఖాదయః
వేద్యంతే ఘటవత్ యేన నిత్యబోధస్వరూపిణా

నిత్యజ్ఞాన స్వరూపుడయిన ఎవనిచే ఈ అహంకారము మొదలుకొని దేహము వరకు (మున్న ఇంద్రియమనోబుద్ధ్యాదులు సర్వము), విషయములు, (అవి కల్పించిన) సుఖములు, స్పష్టముగా (సూర్యకాంతిలో) కుండలవలె తెలియబడుచున్నవో (అతడే ఇతడు)

131. ఏషోఽంతరాత్మా పురుషః పురాణో
నిరంతరాఖండ సుఖానుభూతిః
సదైకరూపః ప్రతిబోధమాత్రో
యే నేషితా వాగసవశ్చరంతి.

అతడే (ప్రతి జీవిలోను ఉండు) అంతరాత్మ. పురాణ పురుషుడు; ఎల్లప్పుడును ఒకే రూపముకలవాడై, నిరంతర అఖండానందరూపుడు అతని ప్రకాశము చేత ప్రతిబోధితమై (చైతన్యవంతమై), అతనిచే ప్రేరేపింపబడినట్లు, వాక్కు (మొదలగు ఇంద్రియములు), ప్రాణము తమ తమ పనులు చేయుచుండును.

132.
అత్రైవ సత్త్వాత్మని ధీగుహాయా-
మవ్యాకృతాకాశ ఉశత్ ప్రకాశః
ఆకాశ ఉచ్చైః, రవివత్ప్రకాశతే
స్వతేజసా విశ్వమిదం ప్రకాశయన్

ఆకాశమున ఎంతో ఎత్తుననున్న సూర్యుడు ఈజగత్తునంతయు, ప్రకాశింపచేయు చున్నట్లు, ఆ పరమాత్మ ఈ దేహమునందే, సత్వప్రధానమయిన అంతరంగమున, హృదయ కుహరమునందు, (ప్రశాంతమయిన బుద్ధియందు), అవ్యక్తాకాశమున శుక్రునివలె ప్రకాశించుచు. తన తేజస్సుచే, ఈ విశ్వము నంతయును ప్రకాశింప జేయుచున్నాడు.

133.
జ్ఞాతా మనోఽహంకృతి విక్రియాణాం
దేహేంద్రియ ప్రాణకృతక్రియాణాం
అయోఽగ్నివత్తాననువర్తమానో
న చేష్టతే నోవికరోతి కించన.

మనస్సు, అహంకారములయొక్క వికారములను (మార్పులను), దేహము, ఇంద్రియములు, ప్రాణముచేయు పనులను, తెలుసుకొను ఈ ఆత్మ - (ఎర్రగా కాల్చబడిన) ఇనుముతో అగ్నివలె, వానినన్నింటిని (దేహేంద్రియ మనోహంకారాదులను) వ్యాపించుయు, ఆత్మ ఏమియును చేయదు; ఎట్టిమార్పులను పొందదు. (ఎర్రగా కాలిన ఇనుపముక్క సమ్మెట పోటుచే మార్పుచెందును కాని, అందలి 'అగ్ని' మార్పు చెందదు).

134.
న జాయతే నో మ్రియతే నవర్ధతే
నక్షీయతే, నో వికరోతినిత్యః
విలీయమానేఽపి వపుష్యముష్మి—
న్న లీయతే కుంభ ఇవాంబరం స్వయం.

ఈ ఆత్మకు పుట్టుకలేదు; చావులేదు; పెరుగుటలేదు; తరుగుటలేదు; మార్పులను చెందుటలేదు; కుండలోని ఆకాశమువలె, (కుండపగిలినను అందలి ఆకాశము పగలనట్లు) శరీరము నశించినను ఈఆత్మ నశింపకయుండును.

135. ప్రకృతి వికృతి భిన్నః శుద్ధ బోధస్వభావః
సదసదిదమశేషం భాసయన్నిర్విశేషః
విలసతి పరమాత్మా జాగ్రదాదిష్వవస్థా-
స్వహమహమితి సాక్షాత్ సాక్షిరూపేణబుద్ధేః

ప్రకృతిని, అందుకలుగుమార్పులకును(వికృతి,) భిన్నమయిన ఈ ఆత్మ, స్వచ్ఛమయిన జ్ఞానస్వరూపమయినది. నిర్విశేషమయిన ఈ ఆత్మ (అంతా తానే అయిన ఈ ఆత్మ) బాహ్యాంతర ప్రపంచమునంతను ప్రకాశింపచేయుచున్నది. జాగ్రద్యాదవస్థలయందు 'నేను' 'నేను' అను భావమును ప్రకాశింపజేయుచు ఈ పరమాత్మ బుద్ధియందు సాక్షీభూతునిగా నిలుచును. (ఈపరమాత్మ తత్వము సాక్షీరూపమున మనోబుద్ధ్యహంకారములందలి వృత్తులను ప్రకాశింపజేయుచుండును.)

## మనో నియమము :

136. నియమిత మనసాముం త్వం స్వమాత్మానమాత్మ-
న్యయమహమితి సాక్షాద్విద్ధి బుద్ధిప్రసాదాత్.
జనిమరణ తరంగాపారసంసార సింధుం.
ప్రతర భవకృతార్థో బ్రహ్మరూపేణ సంస్థః

మనస్సును నియమించి, ప్రశాంతమయిన బుద్ధిచేత, ఈ పరమాత్మను నీయందే, 'నేను ఈ ఆత్మను' అని స్వయముగా తెలుసుకొనుము. నీ స్వస్వరూపమయిన బ్రహ్మమునందు నిలిచి, జననమరణములను తరంగములచే దాటశక్యముకాని, ఈ సంసార సాగరమునుదాటి, కృతార్థుడవుకమ్ము.

## బంధ హేతువు: (137-142):

137. అత్రానాత్మన్యహమితి మతిర్బంధ ఏషోఽస్యపుంసః
ప్రాప్తోఽజ్ఞానాజ్జననమరణ క్లేశ సంపాత హేతుః
యేనైవాయం వపురిదమసత్సత్యమిత్యాత్మబుద్ధ్యా
పుష్యత్యుక్షత్యవతి విషయైస్తంతుభిః కోశకృద్వత్

అనాత్మయందు ఆత్మభావన కలిగియుండుట పురుషునకు బంధహేతువగుచున్నది. అజ్ఞానమువలన కలిగిన (ఈ బంధము) జనన మరణక్లేశములను కలిగించుచున్నది. దీనివలన- (ఈ అజ్ఞానమువలన) అసత్పదార్థమయిన (నశించు స్వభావముగల

ఈ శరీరము సత్యమయినదని, నమ్మి, 'ఈ దేహమే నేను' అను భావముచేత, దానిని, (ఆ శరీరమును) పెంచుచు, కడుగుచు, పోషించుచు, విషయములందు ప్రవర్తింపజేయుచు:—తనదారము చేత అల్లుకొన్న కోశములో తానే చిక్కుకున్న పట్టుపురుగు వలె -బద్ధుడగుచున్నాడు.

138. అతస్మింస్తద్బుద్ధిః ప్రభవతి విమూఢస్య తమసా
వివేకాభావాద్వైస్ఫురతి భుజగే రజ్జుధిషణా
తతోఽనర్థవ్రాతో నిపతతి సమాదాతు రధిక—
స్తతో యోఽసద్గ్రాహః సహి భవతి బంధః శృణుసఖే

తమస్సుచేత వివేకమును కోల్పోయిన మూఢుడు - సర్పమునుజూచి, అది తాడు మాత్రమే అని భ్రమించి (అనేక కష్టములకు పాల్పడినట్లు), అనాత్మను ఆత్మగా భావించి, భరింపశక్యముకాని అనేక అనర్థములకు గురియగుచున్నాడు. అందుచేత, ఓ మిత్రుడా! వినుము- అనాత్మను ఆత్మగా భ్రమించి గ్రహించువాడే (అసద్గ్రాహి) బంధము పొందుచున్నాడు.

139. అఖండ నిత్యాద్వయ బోధశక్త్యా
స్ఫురంతమాత్మానమనంత వైభవం
సమావృణో త్యావృతి శక్తిరేషా
తమోమయీ రాహు రివార్కబింబం

అఖండమై, నిత్యమై అద్వైతమై జ్ఞానశక్తి చేత మిక్కిలి వైభవముతో వెలుగొందు ఆత్మస్వరూపమును తమోగుణ జనితమయిన 'ఆవరణ శక్తి'- సూర్యబింబమును రాహువువలె -మరుగుపరుచుచున్నది.

140. తిరోభూతే స్వాత్మన్యమలతరతేజోవతి పుమా—
ననాత్మానం మోహాదహమితి శరీరం కలయతి:
తతః కామక్రోధప్రభృతిభిరముం బంధనగుణై
పరం విక్షేపాఖ్యా రజస ఉరుశక్తిర్వ్యథయతి.

నిర్మలమయిన అమిత తేజస్సుతో వెలుగు ఆత్మ (పైన చెప్పబడిన విధముగా) మరుగుపడినప్పుడు,పురుషుడు మోహవశమున అనాత్మ అయిన శరీరమును ఆత్మగా

భావించి చూచుచున్నాడు. వెంటనే రజోగుణమువలన కలిగిన శక్తి పంతమయిన విక్షేపశక్తి కామక్రోధాది బంధకములయిన గుణములచే (త్రాళ్లచే), అతనిని బాధ పెట్టుచున్నది.

141. మహామోహగ్రాహ గ్రసనగలితాత్మగమనో
ధియో నానావస్థాం స్వయమభినయం స్తద్గుణతయా
అపారే సంసారే విషయ విషపూరే జలనిధౌ
నిమజ్జ్యోన్మజ్జ్యాయం భ్రమతికుమతిః కుత్సితగతిః

'నేను ఆత్మను' అను జ్ఞానమును, (ఆత్మావగమనమును), మోహము అను మొసలి మ్రింగివేయగా, తెలివిలేని మూర్ఖుడు (కుమతి) మనో బుద్ధులయొక్క వివిధావస్థలనే తానుగా భావించి,వాటి గుణముల కనుగుణముగా వర్తించును. విషయములను విషముచే నిండి, దాట శక్యముకాని సంసార సాగరములో మునుగుచు, తేలుచు, కపట వర్తనుడై (జనన మరణ చక్రములో) తిరుగుచున్నాడు.

142. భానుప్రభా సంజనితాభ్రపంక్తి-
ర్భానుం తిరోధాయ విజృంభతే యథా
ఆత్మోదితాహంకృతి రాత్మతత్వం
తథా తిరోధాయ విజృంభతే స్వయం

సూర్యరశ్మి వలననే జనించిన మేఘములు, ఆ సూర్యునే పూర్తిగా కమ్మివేసి, ఏ విధముగా విజృంభించుచున్నవో, (ఎక్కడ చూచినను మేఘములే అనునట్లు తోచు చున్నవో), అట్లే ఆత్మతత్వమువలన కలిగిన అహంకారము ఆ ఆత్మతత్వమునే మరుగుపరచి తానే విజృంభించుచున్నది. (అంతయు అహంకారమే అనుభావమును కలుగచేయుచున్నది).

**ఆవరణ, విక్షేప శక్తులు (143-144) :**

143. కవలిత దిననాథే దుర్దినే సాంద్రమేఘై-
ర్వ్యథయతి హిమఝంఝా వాయు రుగ్రోయ థైతాన్
అవిరతతమసాత్మన్యావృతే మూఢబుద్ధిం
క్షపయతి బహుదుఃఖై స్తీవ్ర విక్షేపశక్తిః

రు పెట్టిన దినమున దిననాథుడయిన సూర్యుడు దట్టమయిన మేఘములచేత కప్ప ంతనే, ప్రచండమయిన చలిగాలులు వీచి మనుష్యులను ఏ విధముగా బాధ నో, అట్లే, ఘనమయిన తమస్సు తన ఆత్మను మరుగుపరచినంతనే, తీవ్ర న విక్షేపశక్తి అట్టి మూర్ఖుని (మూఢబుద్ధిని) బాధపెట్టుచుండును.

ఏతాభ్యామేవ శక్తిభ్యాం బంధః పుంసః సమాగతః
యాభ్యాం విమోహితో దేహం మత్వాత్మానం భ్రమత్యయం.

రెండు శక్తులవలననే పురుషుడు బంధము పొందుచున్నాడు. వీటిచే మోహితుడై హమే తానుగా భావించి, (జనన మరణ చక్రములో) భ్రమించుచున్నాడు.

## సార వృక్షము (145-146) :

బీజం సంసృతిభూమిజస్య తు తమో దేహాత్మధీరంకురో
రాగః పల్లవమంబు కర్మతువపుః స్కంధోఽసవః శాఖికాః
అగ్రాణీంద్రియ సంహతిశ్చ, విషయాః పుష్పాణి దుఃఖం ఫలం,
నానాకర్మ సముద్భవం బహువిధం భోక్తాత్ర జీవః ఖగః

సంసార వృక్షమునకు-తమస్సు (అజ్ఞానము) బీజము; 'నేను దేహమును' అను న అంకురము; వాంఛలు చిగుళ్ళు (పల్లవములు-తొలిఆకులు); కర్మలు నీరు, రము-చెట్టుయొక్క మొదలు (స్కంధము), ప్రాణములు శాఖలు; ఇంద్రియములు శాఖలు (చివరగలవి), విషయములు పుష్పములు, నానావిధ కర్మలవలన కలిగిన ఖము ఫలము; (వానిని) అనుభవించువాడు (భోక్త) జీవుడు అను ఒక పక్షి.

అజ్ఞానమూలోఽయమనాత్మబంధో
నైసర్గికోఽనాది రనంత ఈరితః
జన్మాప్యయ వ్యాధి జరాది దుఃఖ-
ప్రవాహ పాతం జనయత్యముష్య.

అనాత్మ బంధము (ఆత్మకాని దానిలో బంధింపబడిపోవుట) అజ్ఞానము వలన ంగుచున్నది. ఇది నైసర్గికమయినది. (ఈ అజ్ఞానమునకు వేరుకారణము లేదు). ఇది లేనిది; అంతములేనిది; దీనివలన జనన మరణ వ్యాధి జరా దుఃఖములు ప్రవా మువలె (నిరంతరము) కలుగుచుండును.

## ఆత్మానాత్మ విచారము (147-153) :

147. నాస్త్రైర్న శస్త్రైరనిలేన వహ్నినా
ఛేత్తుం న శక్యో నచకర్మకోటిభిః
వివేకవిజ్ఞాన మహాసినా వినా
ధాతుప్రసాదేన సితేన మంజునా.

(ఈ అజ్ఞానమును) అస్త్ర శస్త్రములచేత భేదింపజాలము. వాయువు, అగ్ని దీనిని నాశనము చేయలేదు. కోటి కర్మలవలన గూడ ఇది క్షీణింపదు. విచక్షణా జ్ఞానమను కత్తితో, ప్రశాంత చిత్తుడు (పరిశుద్ధమయిన అంతఃకరణముతో) మనోజ్ఞమయిన ఎరుకతో దీనిని భేదింపగలడు.

148. శ్రుతి ప్రమాణైక మతేః స్వధర్మ-
నిష్ఠా తయైవాత్మ విశుద్ధిరస్య
విశుద్ధ బుద్ధేః పరమాత్మ వేదనం
తేనైవ సంసార సమూల నాశః

శాస్త్రములు ప్రమాణముగా గ్రహించువానికి (శాస్త్రములయందు శ్రద్ధయున్నవానికి), స్వధర్మనిష్ఠ కలుగును; స్వధర్మనిష్ఠ కలవానికి అంతరంగము ప్రశాంతతను పొందును; బుద్ధి ప్రశాంతత పొందినపుడు ఆత్మ వివేకము కల్గును; దాని వలన ఈ సంసారము సమూలముగా నశించును.

149. కోశైరన్నమయాద్యైః పంచభిరాత్మా న సంవృతో భాతి
నిజశక్తి సముత్పన్నైః శైవాలపటలైరివాంబు వాపీస్థం.

(నీటియందు పుట్టి, నీటినంతటిని ఆక్రమించి), దిగుడుబావిలోని నీటిని కనబడకుండ చేయు నాచువలె, ఆత్మ చైతన్యము వలన కలిగిన అన్నమయాది పంచకోశములచే కప్పబడి, ఆత్మ ప్రకాశింపకయుండును. (ఈ పై తొడుగులవలన ఆత్మప్రకాశము వ్యక్తము కాదు).

150. తచ్ఛైవాలాపనయే సలిలం ప్రతీయతే శుద్ధం
తృష్ణా సంతాపహరం సద్యః సౌఖ్యప్రదం పరం పుంసః

ఆ నాచును తొలగించినంతనే (లోనగల) పరిశుద్ధమయిన నీరు స్పష్టముగా కను పించును, (ఆ నీరు) దప్పిక వలన కలిగిన దుఃఖమును వెంటనే ఉపశమింపజేసి, పురుషునికి సుఖమును కలిగించును.

151. పంచానామపి కోశానామపవాదే విభాత్యయం శుద్ధః
నిత్యానందైకరసః ప్రత్యగ్రూపః పరః స్వయంజ్యోతిః

(అట్లే) ఈ పంచకోశములను తొలగించినంతనే, లోపల ప్రత్యక్ రూపుడై, స్వయం జ్యోతియై, పరమాత్మ వెలుగొందుచుండును.

152. ఆత్మానాత్మ వివేకః కర్తవ్యో బంధముక్తయే విదుషా
తేనైవానందీ భవతి స్వంవిజ్ఞాయ సచ్చిదానంధం.

విద్వాంసులు బంధవిముక్తికొరకు ఆత్మా నాత్మ వివేచన చేయవలయును. తనను సచ్చిదానంద స్వరూపుడయిన పరమాత్మగా తెలుసుకొన్నప్పుడే ఆనందమును అనుభ వించగలడు.

153. ముంజా దిషీకామివ దృశ్యవర్గా-
త్ప్రత్యంచమాత్మాన మసంగ మక్రియం
వివిచ్య తత్ర ప్రవిలాప్య సర్వం
తదాత్మనా తిష్ఠతి యః సముక్తః

'ముంజ' గడ్డిలోని (పై పొరలను తీసివేయగా కనుపించు) లోపలి మృదువైన దవ్వ వలె, సంగరహితుడు, క్రియారహితుడు అయిన ఆత్మను-బయటకు కనుపించు (దృశ్య ములయిన) దేహేంద్రియ మనోబుద్ధులనుండి విడదీసి, వివేకముతో ఆతని తత్త్వమును తెలుసుకొని, ఆతనియందు సర్వమును లయమొనరచి, ఎవడు నిలుచునో, అతడే ముక్తుడు.

## అన్నమయ కోశము (154-164) :

154. దేహోఽయ మన్నభవనోఽన్నమయస్తు కోశ-
శ్చాన్నేన జీవతి వినశ్యతి తద్విహీనః
త్వక్ చర్మమాంస రుధిరాస్థి పురీషరాశి-
ర్నాయం స్వయం భవితుమర్హతి నిత్యశుద్ధః

ఈ శరీరము అన్నముతో ఉద్భవించినది, అన్నముచే జీవించుచున్నది, అన్నము లేక పోయినచో నశించుచున్నది. అందుచే ఇది అన్నమయకోశము అయినది. త్వక్కు, చర్మము, మాంసము, రక్తము, ఎముకలు (వీటితో కూడుకొని), పురీషముతో నిండిన ఈ శరీరము స్వయముగా, నిత్యశుద్ధ స్వరూపుడయిన (ఆత్మ) అగుటకు అనర్హమయినది. (ఆత్మకు ఉండవలసిన నిత్య శుద్ధత్వము శరీరములో లేదు; అందుచేత దేహము 'ఆత్మ'కాదు.)

155. పూర్వం జనే రధి మృతేరపి నాయమస్తి
జాతక్షణః క్షణగుణోఽనియత స్వభావః
నైకో జడశ్చ ఘటవత్పరి దృశ్యమానః
స్వాత్మా కథం భవతి భావవికారవేత్తా.

(ఈ శరీరము) పుట్టుకకు పూర్వము లేదు, చనిపోయిన పిమ్మట ఉండదు, ఇది క్షణభంగురమయినది; క్షణక్షణమునకు మారుచు నిలకడలేనిది; ఇది ఒకే వస్తువుకాదు (పలుభాగములతో కూడుకున్నది) ఇది జడమైనది (తనంతట తాను నిలువలేనిది). ఇది కుండలు మొదలగు వానివలె, దృశ్యమయినది (ఇంద్రియములకు గోచరించునది.) భావవికారములకు (దేహేంద్రియ మనోబుద్ధులలో కలుగు మార్పులకన్నింటికి) సాక్షీభూతుడయిన అంతరాత్మ, ఈ శరీరమెట్లు కాగలదు. (శ్రుతులలో చెప్పబడు 'ఆత్మ'కు ఉండవలసిన గుణములేవియు శరీరమునకు లేవు. కావున అది ఆత్మకాదు.)

156. పాణి పాదాదిమాన్ దేహో నాత్మా వ్యంగేఽపి జీవనాత్
తత్తచ్ఛక్తేరనాశాచ్చ న నియమ్యో నియామకః

చేతులు, కాళ్ళు మొదలగు అవయవములతో కూడుకున్న ఈ దేహము, ఆ అంగములు తొలగి పోయినను జీవించుచుండును. (అంగవిహీనునకు అతని వ్యక్తిత్వములో ఎట్టితరుగు ఉండదు). అందుచేత దేహము ఆత్మకాదు. నియమింపబడువాడు నియామకుడు కానేరడు.

157. దేహ తద్ధర్మ తత్కర్మ తదవస్థాది సాక్షిణః
సత ఏవ స్వయం సిద్ధం తద్వైలక్షణ్య మాత్మనః

(దేహము యొక్క ధర్మములు, దానికర్మలు, దాని అవస్థలను తెలుసుకొనువాడు 'ఆత్మ' అయినచో, అతడు ఆ శరీరముకంటె విలక్షణుడై (వేరైన వాడై) ఉండ

వలెననునది స్వతస్సిద్ధము. (చూమనది చూపబడు దానికంటె వేరైనదై యుండ వలెను. లేనిచో, 'చూచుట' అను క్రియ పొసగదు).

158. శల్యరాశిర్మాంసలిప్తో మలపూర్ణోఽతి కశ్మలః
కథం భవేదయం వేత్తా స్వయమేత ద్విలక్షణః

ఎముకల గూడుపై మాంసపుపూత పూయబడి మలముతో నిండి అతి నికృష్టమయిన ఈ దేహము, వీటికి వేరైన (పైన చెప్పిన అపవిత్ర లక్షణములు ఉండని), జ్ఞాన స్వరూపుడయిన ఆత్మ తానే స్వయముగా ఎట్లు కాగలడు?

159. త్వఙ్మాంస మేదోఽస్థి పురీషరాశా-
వహం మతిం మూఢజనః కరోతి
విలక్షణం వేత్తి విచారశీలో
నిజస్వరూపం పరమార్థ భూతం

త్వక్కు, మాంసము, కొవ్వు, ఎముకలు. పురీషముల కుప్పయగు (ఈ శరీరములో) మూర్ఖుడు - 'ఇదినేను' అను భావమును ఉంచు చున్నాడు. కాని, విచక్షణాజ్ఞానము కల పురుషుడు, పరమార్థముతో కూడుకున్న తన (నిజ) స్వరూపమును తెలుసుకొని, 'నేను ఈ శరీరమునకు వేరైనవాడను' (విలక్షణుడను) అని ఎరుగు చున్నాడు.

160 దేహోఽ హమిత్యేవ జడస్య బుద్ధి-
ర్దేహే చ జీవేచ విదుషస్త్వ హంధీః
వివేక విజ్ఞానవతో మహాత్మనః
బ్రహ్మాహమిత్యేవ మతిః సదాత్మని

జడులు (మూర్ఖులు) ఈ శరీరమే ఆత్మ అని తలంతురు. (ఆత్మానుభవము లేని) పండితులు, ఈ దేహము, జీవుడు కూడ 'ఆత్మ'గనే భావింతురు. విచక్షణ వలన కలిగిన విజ్ఞానముకల మహాత్ములు, ఆత్మతత్వము నెరిగిన వారై, 'నేను బ్రహ్మను' అను భావముతో నిలతురు.

161. అత్రాత్మ బుద్ధిం త్యజ మూఢబుద్ధే
త్వఙ్మాంసమే దోఽస్థి పురీషరాశౌ
సర్వాత్మని బ్రహ్మణి నిర్వికల్పే
కురుష్వ శాంతిం పరమాం భజస్వ

ఓ మూఢుడా! చర్మము, మాంసము, కొవ్వు, ఎముకలు, పురీషముతో కూడుకొన్న ఈ శరీరమే నేను అను భావమును (ఆత్మబుద్ధిని) విడిచిపెట్టుము. నిర్వికల్పుడయిన సర్వాత్మతత్వ స్వరూపుడయిన బ్రహ్మము నందు నిలచి, (ఆత్మ భావమును ఉంచి), పరమశాంతిని పొందుము.

162. దేహేంద్రియాదావసతి భ్రమోదితాం
విద్యానహంతాం నజహాతి యావత్
తావన్న తస్యాస్తి విముక్తి వార్తా-
ప్యస్త్వేష వేదాంత నయాంత దర్శీ

అసత్తయిన (ఆత్మకాని) దేహేంద్రియాదులయందు, మోహము వలన(భ్రమ వలన), 'అవే నేను' అను భావమును విడువకుండు నంతవరకు, పండితుడు, సకల వేదాంత న్యాయ శాస్త్రముల నెరిగిన వాడైనను, ముక్తిని పొందలేడు. (అసలు 'ముక్తి పొందుట' అను ప్రశ్నయే ఉండదు).

163. ఛాయా శరీరే ప్రతిబింబ గాత్రే
యత్స్వప్న దేహే హృది కల్పితాంగే
యథాత్మ బుద్ధి స్తవ నాస్తికాచి-
జ్జీవచ్ఛరీరే చ తథైవ మాఽస్తు

ఛాయా శరీరమందును (నీడయందును), ప్రతిబింబ శరీరము నందును, స్వప్న శరీరము నందును, ఊహాశరీరమునందును (పగటి కలలలో ఊహించుకున్న శరీర మందును), నీకు ఆత్మ భావన (అదే నేను అను భావన) ఏ కొంచెము గూడ ఎట్లు ఉండదో, అట్లే ఈ జీవశరీరము నందు గూడ (ఆత్మభావన) ఉంచతగదు.

164. దేహాత్మ—ధీరేవ నృణా మసిద్ధియాం
జన్మాది దుఃఖ ప్రభవస్య బీజం
యత స్తత స్త్వం జహి తాం ప్రయత్నా-
త్త్యక్తే తు చిత్తే నపునర్భవాశా.

అవస్తు నందు బుద్ధికలుగుటకు (అనాత్మలో అభిమానము కలుగుటకు) ఈ 'దేహమే నేను' అను భావమే బీజము. అదే జననమరణ దుఃఖము కలుగుటకు హేతువు.

అందుచేత నీవు ప్రయత్నము వలన దానిని (దేహాత్మ భావమును) విడిచిపెట్టుము. చిత్తము నుండి (ఈ భావము) పోయిన వెంటనే నీకు పునర్జన్మ అనునది ఉండదు.

## ప్రాణమయకోశము(165-166) :

165. కర్మేంద్రియైః పంచభిరంచితోయం,
ప్రాణోభవేత్ప్రాణ మయస్తు కోశః
యేనాత్మవానన్న మయోఽన్న పూర్ణః
ప్రవర్తతేఽసౌ సకల క్రియాసు.

(అయిదు విధములయిన)ప్రాణము కర్మేంద్రియము లయిదింటితో కలసి, ప్రాణమయ కోశమగుచున్నది. ఈ ప్రాణమయకోశమే తన ఆత్మగా, పూర్తిగా ఆవరింపబడి, అన్నమయకోశము సకల క్రియలందును ప్రవర్తించు చున్నది.

166. నైవాత్మాపి ప్రాణమయో వాయు వికారో,
గంతాఽఽగంతా వాయువ దన్తర్బహిరేషః
యస్మాత్కించి త్క్వాపి నవేత్తీష్ట మ నిష్టం
స్వం వాన్యం వా కించన నిత్యం పరతంత్రః

వాయు వికారమయిన ఈ ప్రాణమయ కోశము కూడ 'ఆత్మ' కానేరదు. ఎందువల ననగా, వాయువువలె ఇది లోనికి, బయటకు వచ్చుచు, పోవుచును యుండును. ఇది తన యొక్క గాని, పైవారి యొక్క గాని ఇష్టానిష్టములను ఎరుగదు. (ఇది 'వేత్త' కాదు). ఇది నిత్యము పరాధీనమయినది (ఇంకొకరి మీద ఆధారపడునది;) ప్రాణాయామము మొదలగు వానిచే దీనిని నిలుపవచ్చును. అందుచే ఇది పరాధీన మయినది).

## మనోమయకోశము (167-183) :

167. జ్ఞానేంద్రియాణి చ మనశ్చ మనోమయః స్యాత్
కోశో మమాహమితి వస్తు వికల్పహేతుః
సంజ్ఞాది భేద కలనా కలితో బలీయాం —
స్తత్పూర్వ కోశమభి పూర్య విజృంభతే యః

జ్ఞానేంద్రియములయిదు, మనస్సు కలిసి మనోమయ కోశమగు చున్నది. ఇది 'నేను', 'నాది' అను భావములతో (అహంకార మమకారములతో) వస్తువులలో (ప్రపంచములో) విభిన్నత్వము కల్గించుచున్నది. ఇది వస్తువులను సంజ్ఞా భేదముచే (పేరు మొదలగు భేదములచే), వివిధత్వమును కల్పించుచున్నది. ఇది బలీయమయినది. ఇది పూర్వకోశమును (ప్రాణమయకోశమును) పూర్తిగా చొచ్చుకొని, విజృంభించు చున్నది.

168. పంచేంద్రియైః పంచభిరేవ హోతృభిః
ప్రాచీయమానో విషయాజ్య ధారయా
జాజ్వల్యమానో బహువాసనేంధనై –
ర్మనోమయాగ్ని ర్దహతి ప్రపంచమ్.

పంచేంద్రియములనెడి, అయిదుగురు ఋత్విక్కులు (హోతలు) విషయములనెడి నేతిధారలచే, అహుతిచేయబడగా, పలు 'వాసనలు' అనెడి ఇంధనముల వలన జాజ్వల్య మానముగా ఈ మనోమయకోశమను (అగ్ని), ఈ ప్రపంచమునంతను నిలుపుచున్నది. (ఈ ప్రపంచము ఇప్పుడున్న రీతిగా ఉండుటకు కారణము మనోమయ కోశమే).

169. నహ్యస్త్య విద్యా మనసోఽతిరిక్తా
మనోహ్యవిద్యా భవబంధహేతుః
తస్మిన్ వినష్టే సకలం వినష్టం
విజృంభి తేఽస్మిన్ సకలం విజృంభతే

మనస్సుకన్న వేరగు అవిద్యలేదు. ఈ మనస్సే భవబంధకారణమగు అవిద్య (మాయ), మనస్సు నశించినంతనే (విలీనమయినంతనే)సర్వము నశించును, మనస్సు విజృంభించునప్పుడు సకలమును విజృంభించును. (సత్వరజస్తమోగుణములు మూడును మనస్సులోననే కలుగును) మనస్సు లేనప్పుడు ఈ మూడు గుణములు ఉండవు; త్రిగుణాత్మకమయిన మాయకూడ ఉండదు.

170. స్వప్నేఽర్థశూన్యే సృజతి స్వశక్త్యా
భోక్త్రాది విశ్వం మన ఏవ సర్వం
తథైవ జాగ్రత్యపి నో విశేష –
స్తత్సర్వమే తన్మనసో విజృంభణం.

స్వప్నావస్థయందు, బాహ్య ప్రపంచముతో ఎట్టి సంబంధము లేకపోయినను (అర్ధ శూన్యతలో), మనస్సు తనశక్తిచేత, స్వప్న ప్రపంచమును సృష్టించుచున్నది. భోక్తతోసహా ఆ (స్వప్న ప్రపంచమంతయు మనస్సే—జాగ్రదవస్థయందు కూడ అంతకన్న విశేషమేమియులేదు. అందుచేత ఈ సర్వమును మనస్సుయొక్క—విజృంభణమే,

171. సుషుప్తి కాలే మనసిప్రలీనే
నైవాస్తికించిత్సకల ప్రసిద్ధేః
అతోమనః కల్పిత ఏవ పుంసః
సంసార ఏతస్య న వస్తుతోఽస్తి.

గాఢనిద్ర యందు మనస్సు నశించునప్పుడు (పనిచేయక పోవునప్పుడు) ఏమియును లేకుండుట (దృశ్య ప్రపంచముగాని, మనోవృత్తులుగాని, అనుభూతులుగాని లేకుండుట) అందరకును అనుభవమే - అందుచేత ఈ కనుపించు ప్రపంచమంతయు, పురుషునిలోని మనసుచే కల్పింపబడినది. నిజముగ వస్తుతత్వము లేదు.

172. వాయునాఽఽనీయతే మేఘః పునస్తేనైవ నీయతే
మనసా కల్ప్యతే బంధో మోక్షస్తేనైవ కల్ప్యతే.

మేఘములను వాయువు ఒకచోటకు చేర్చుచున్నది. తిరిగి ఆ వాయువే వాటిని చెల్లా చెదరు చేయుచున్నది. అల్లే మనస్సు వల్లనే బంధము ఏర్పడుచున్నది. ఆ మనస్సు వల్లనే ముక్తి కూడ సాధ్యపడుచున్నది.

173. దేహాది సర్వవిషయే పరికల్ప్య రాగం
బధ్నాతి తేన పురుషం పశువద్గుణేన,
వైరస్యమత్ర విషవత్సు విధాయ పశ్చా —
దేనం విమోచయతి తన్మన ఏవ బంధాత్.

దేహము మొదలగు అన్ని విషయములందును ఆసక్తిని (రాగము) కలుగజేసి, మనస్సు (ఆ రాగముచే) పురుషుని—పశువును తాడుతో కట్టినట్లు — (ఆ దేహాదుల యందు) కట్టివేయుచున్నది. తిరిగి ఆ మనస్సే, వాటిని విషతుల్యముగా చూచునట్లు చేసి, వాటిలో వైరాగ్యము కలుగజేసి, బంధము నుండి విడిపించుచున్నది.

174. తస్మాన్మనః కారణమస్య జంతో -
ర్బంధస్య మోక్షస్య చ వా విధానే,
బంధస్య హేతుర్మలినం రజోగుణై
ర్మోక్షస్య శుద్ధం విరజ స్తమస్కం.

అందుచేత మనస్సే (మానవుడను) ఈ జంతువునకు బంధకారణము, మోక్షకారణము కూడ అగుచున్నది. మనస్సు రజోగుణముతో మలినమైనప్పుడు బంధహేతువగు చున్నది. ఆ మనస్సే, రజస్తమో గుణములు లేక, శుద్ధ సత్వగుణముతో నున్నప్పుడు మోక్షము కలుగుచున్నది. (ఆత్మ స్వయముగ బద్ధుడును కాడు: ముక్తుడునుకాడు; ఈ రెండును మనోకల్పితములు: మనస్సులో కలుగు భావములు; ఆత్మ బంధ మోక్షముల కతీతుడు).

175. వివేక వైరాగ్య గుణాతిరేకాత్
శుద్ధత్వమాసాద్య మనోవిముక్త్యై
భవత్యతో బుద్ధిమతో ముముక్షో —
స్తాభ్యాం దృఢాభ్యాం భవితవ్యమగ్రే.

విచక్షణా జ్ఞానము (వివేకము), వైరాగ్యము - ఈ రెండు గుణములు, ఎక్కువ అయినప్పుడు, (వీటిని వృద్ధి పరచుకున్నప్పుడు) మనస్సు పరిశుద్ధమగును. (అందువలన) మోక్షము సిద్ధించును. అందుచేత, మోక్షముకొరకు బుద్ధిమంతులు, ఈరెండు గుణములను, ముందుగా (అభివృద్ధి పరచి) దృఢపరచవలెను.

176. మనో నామ మహావ్యాఘ్రో విషయారణ్య భూమిషు
చరత్యత్ర న గచ్ఛంతు సాధవో యే ముముక్షవః

మనస్సు అను పెద్దపులి, విషయములను అరణ్యప్రదేశములలో సంచరించుచున్నది. మోక్షముకోరు సాధువులు అటువైపు, (ఆ మనస్సు, అది కల్పించు విషయముల వైపు) పోకుందురు గాక!

177. మనః ప్రసూతే విషయానశేషాన్
స్థూలాత్మనా సూక్ష్మతయా చ భోక్తుః
శరీర వర్ణాశ్రమ జాతి భేదాన్
గుణక్రియా హేతుఫలాని నిత్యం

స్థూల శరీరము తోను, సూక్ష్మ శరీరము తోనూ అనుభవించదగు అశేషములయిన విషయములను, శరీరము యొక్క వర్ణ, ఆశ్రమ, జాతి భేదములను, గుణములను, వాంఛలను, కర్మలను, ఫలములను, (అహంకారముతో సహా) అన్నింటిని —జీవుని అనుభవము కొరకు మనస్సు నిరంతరము సృష్టించుచున్నది.

178. అసంగచిద్రూపమముం విమోహ్య
దేహేంద్రియ ప్రాణగుణైర్నిబధ్య
అహం మమేతి భ్రమయత్యజస్రం
మనః స్వకృత్యేషు ఫలోపభుక్తిషు.

సంగరహితుడు, చిద్రూపుడు అయిన ఈ ఆత్మను (జీవాత్మను), మోహమునకు లోనుజేసి (మోహింపజేసి), దేహము, ఇంద్రియములు, ప్రాణముల గుణములచే (తాళ్ళచే) బంధించి, మనస్సు ఈ జీవిని 'నేను', 'నాది' అను భావములందు భ్రమింపజేయుచు, స్వకృతములయిన కర్మలయందు, వాని ఫలభోగములయందు సర్వదా నిలుపుచున్నది.

179. అధ్యాసదోషాత్పురుషస్య సంసృతి—
రధ్యాసబంధస్త్వమునైవ కల్పితః
రజస్తమోదోషవతోఽవివేకినో
జన్మాది దుఃఖస్య నిదానమేతత్.

అధ్యాస దోషమువలన—(త్రాటియందు సర్ప భావమువలె, వేరొక వస్తు భావనయుంచుట వలన), జీవునికి జనన మరణములు (సంసారము) కలుగుచున్నది. మనస్సువల్లనే (ఈ అధ్యాస భావము) అందులో జీవుని బంధము కలుగుచున్నది. రజస్తమో గుణ దోషములచే కూడుకున్న అవివేకిని, (ఈ అధ్యాస దోషము), జననము మొదలగు దుఃఖములకు హేతువగు చున్నది.

180. అతః ప్రాహుర్మనోఽవిద్యాం పండితాస్తత్త్వదర్శినః
యేనైవ భ్రామ్యతే విశ్వం వాయునేవాభ్రమండలం.

అందువల్లనే తత్త్వ దర్శనులయిన పండితులు ఈ మనస్సే 'అవిద్య' అని చెప్పుచుందురు. మేఘములు గాలి వలన (ఎల్లవైపుల) తిరుగుచుండునట్లు, ఈ విశ్వమంతయు మనస్సువల్లనే భ్రమించుచున్నది.

181. తన్మనఃశోధనం కార్యం ప్రయత్నేన ముముక్షుణా
విశుద్ధే సతి చైతస్మిన్ముక్తిః కరఫలాయతే

(అందుచేత) మోక్షముకోరు సాధకులు తమ మనస్సును (రజస్తమో గుణ వర్జితము చేసి), పరిశుద్ధము కావింపవలెను. శుద్ధమయిన మనస్సు వలన మోక్షము, చేతిలో గల పండువలె (సులభముగ) సిద్ధించును.

182. మోక్షైక సక్త్యా విషయేషు రాగం
నిర్మూల్య సన్యస్య చ సర్వకర్మ
సచ్ఛ్రద్ధయా యః శ్రవణాది నిష్ఠో
రజః స్వభావం స ధునోతి బుద్ధేః

మోక్షము నందు మాత్రమే ఆసక్తి కలిగి, విషయములందలి రాగమును నిర్మూలించి, ఎల్ల కర్మలను విడిచిపెట్టి, సత్యమందు శ్రద్ధ ఉంచి, శ్రవణాది (ఆధ్యాత్మిక) నిష్ఠ లందు నిమగ్నుడై సాధకుడు బుద్ధియందలి రాజస స్వభావమును ఏరి పారవేయగలడు (పారద్రోలగలడు).

183. మనోమయో నాపి భవేత్పరాత్మా
హ్యాద్యంత వత్త్వాత్పరిణామి భావాత్
దుఃఖాత్మకత్వా ద్విషయత్వ హేతో—
ర్ద్రష్టాహి దృశ్యాత్మతయా నదృష్టః

ఈ మనోమయ కోశము కూడ పరమాత్మ కాజాలదు. (ఎందుకనగా,) ఇది ఆద్యంత ములు కలదిః మార్పులను చెందుచుండునట్టిదిః దుఃఖమయమయినదిః విషయములతో కూడుకున్నదిః దృశ్యమానమయినదిః (ఇందలి మార్పులు అవగతమగు చున్నవి గాబట్టి); ద్రష్ట ఎప్పుడును దృశ్యము కాలేదు కావున (ఈ మనస్సు) పరమాత్మ కాదు.

## విజ్ఞానమయ కోశము (184–188) :

184. బుద్ధిర్బుద్ధీంద్రియైః సార్ధం సవృత్తిః కర్తృ లక్షణః
విజ్ఞానమయ కోశః స్యాత్పుంసః సంసారకారణమ్

జ్ఞానేంద్రియములతో కూడిన బుద్ధి, అందులో కలుగు వృత్తులతో కలసి, విజ్ఞానమయ కోశమగుచున్నది. దీనివలన జీవికి కర్తృత్వ భావము కలిగి, సంసార హేతువగు చున్నది. (పునర్జన్మకు కారణమగుచున్నది).

అనువ్రజచ్చిత్ప్రతిబింబశక్తి—
ర్విజ్ఞాన సంజ్ఞః ప్రకృతేర్వికారః
జ్ఞానక్రియావానహమిత్యజస్రం
దేహేంద్రియాదిష్వభిమన్యతే భృశం.

ఈ బుద్ధి మయకోశము ప్రకృతియొక్క వికారమయినను, (జడమయినది అయినను), అందులో చిత్శక్తి ఎల్లప్పుడును ప్రతిబింబించు చుండుట వలన, తెలివి తేటలతో ప్రకాశించుచున్నట్లు తోచును. అందువలన 'నేను తెలుసుకొనుచున్నాను' అను భావముతో సదా కూడుకొని ఉండి, దేహేంద్రియాదుల యందు అభిమానము ('అవే నేను' అనుభావము) ఎల్లప్పుడు కలిగియుండును.

186. 187. అనాదికాలోఽయమహంస్వభావో
జీవః సమస్త వ్యవహారవోఢా
కరోతి కర్మాణ్యనుపూర్వవాసనః
పుణ్యాన్యపుణ్యాన్య పి తత్ఫలాని॥
భుంక్తే విచిత్రా స్వపి యోనిషు వ్రజ—
న్నాయాతి నిర్యాత్యధ ఊర్ధ్వమేషః
అస్యైవ విజ్ఞాన మయస్య జాగ్రత్—
స్వప్నాద్యవస్థాః సుఖదుఃఖ భోగః

ఇది అనాదికాలము నుండి, అహంకారముతోకూడి, జీవునిగా సమస్త వ్యవహారము లలో నిమగ్నమైయుండి, పూర్వ వాసనల ననుసరించి పుణ్య పాప కర్మల నాచరించుచు, వాటి ఫలముల ననుభవించుచు, విచిత్రములయిన యోనులందు జననమందుచు, క్రిందికి, మీదికి వచ్చుచు, పోవుచునుండును. జాగ్రత్ స్వప్న సుషుప్తావస్థలు, సుఖ దుఃఖములు ఈ విజ్ఞానమయ కోశమునందే కలుగును.

188. దేహాది నిష్ఠాశ్రమ ధర్మకర్మ—
గుణాభిమానః సతతం మమేతి
విజ్ఞాన కోశోఽయ మతి ప్రకాశః
ప్రకృష్టసాన్నిధ్య వశాత్పరాత్మనః
అతోభవత్యేష ఉపాధిరస్య
యదాత్మధీః సంసరతి భ్రమేణ.

దేహముల యొక్క నిష్ఠలు, ఆశ్రమములు, ధర్మములు, కర్మలు, గుణములు – వీటి యందు అభిమానము (ఆత్మభావము) కలుగగా, ('ఇవి నావి' అను) మమకారముతో ఈ విజ్ఞానమయ కోశము ఎల్లప్పుడును నిండి యుండును. పరమాత్మకు అతి దగ్గరగా ఉన్నదిగాబట్టి, ఇది (ఈ విజ్ఞానమయకోశము) అతి ప్రకాశవంతమయినది. (అయినను) మోహము వలన కప్పబడి, (ఈ కోశమునందుగల) జీవుడు సంసారమునందు తిరుగుచుండును. (జనన మరణములను పొందుచుండును).

## ప్రత్యగాత్మ (189–191):

189. యోఽయం విజ్ఞానమయః ప్రాణేషు హృది స్ఫురత్యయం జ్యోతిః
కూటస్థః సన్నాత్మా కర్తా భోక్తా భవత్యుపాధిస్థః

జ్ఞాన స్వరూపమయిన ఆత్మజ్యోతి, ప్రతి జీవి హృదయ కుహరమందు ప్రాణములలో ప్రతిబింబించు చుండును. నిత్యుడును, మార్పులు చెందనివాడు అయ్యును (కూటస్థుడు అయ్యును), ఆత్మ ఈ ఉపాధులలో నుండుటవలన, కర్తగను, భోక్తగను తోచు చున్నాడు (వ్యవహరించుచున్నాడు).

190. స్వయం పరిచ్ఛేదముపేత్య బుద్ధే—
స్తాదాత్మ్య దోషేణ పరం మృషాత్మనః
సర్వాత్మకః సన్నపి వీక్షతే స్వయం
స్వతః పృథక్త్వేన మృదో ఘటానివ

సర్వాత్మికమయిన (ఎల్లప్రాణులయందు ఒక్కటే అయిన), ఈ 'ఆత్మ' — విజ్ఞానమయకోశమునందలి 'తాదాత్మ్య' దోషమువలన ('అదే నేను' అను భ్రాంతి వలన) తనను తానే పరిమితమయినదిగా భావించి, నేను (ఈ ఉపాధులలోనున్న) జీవాత్మను అని తలంచుచుండును. ఒకే రకమయిన మట్టితో చేయబడినవైనను, కుండలు (ఒక దానిని ఒకటి చూసి, అవి వేరు వేరయినవిగా) ఎంచునట్లు, (ఒకే ఆత్మ తత్త్వముగల) ఈ జీవాత్మలు వేరువేరుగా తమను తాము ఎంచుచుండును.

19 · ఉపాధి సంబంధవశాత్పరాత్మా
హ్యుపాధిధర్మాననుభాతి తద్గుణః
అయో వికారానవికార వహ్నివ—
త్సదైకరూపోఽపి పరః స్వభావాత్.

(స్వరూపముగా అవిచ్ఛిన్నరూపుడు, నిర్వికారుడు) ఎల్లప్పుడు ఒక్కరూపముతో నుండువాడయ్యును, పరమాత్మ ఉపాధులతో (పంచకోశములతో) కూడియుండుట వలన, వాటి యొక్క గుణధర్మములను పొందును. (ఆ గుణములు తనవే వని అనుభూతి పొందును. మంట ఒక్క రూపము కలది అయినను, అందులో (ఎర్రగా కాల్చబడిన) ఇనుప ముక్కల యొక్క వేరువేరు స్వరూపములను పొంది, వేరు వేరుగా కనుపించును కదా!

## మోక్షమనగా నేమి? (192-193)

శిష్యుడు పలికెను. (శిష్య ఉవాచ).

192. 193. భ్రమేణాప్యన్యథా వాస్తు జీవభావః పరాత్మనః
తదుపాధేరనాదిత్వాన్నానాదేర్నాశ ఇష్యతే.
అతోఽస్య జీవభావోఽపి నిత్యో భవతి సంసృతిః
ననివర్తేత తన్మోక్షః కథం మే శ్రీ గురోవద

భ్రాంతి వలన (మాయ వలన)గాని, మరేకారణము వలనగాని, పరమాత్మ, ఉపాధులలో అనాదిగా జీవభావముతో ఉన్నాడుకదా! ఆదిలేనివాటికి అంతముకూడ ఉండదందురు. అట్టిచో అనాదిగా వచ్చుచున్న ఈ జీవభావమునకు, సంసారమునకు అంతము ఉండదు. అట్టిచో మోక్షమెట్లుకలుగునో, ఓ. గురుదేవా! చెప్పవలెను.

## ఆత్మజ్ఞానము మోక్షహేతువు (194-206)

శ్రీ గురురువాచ:

194. సమ్యక్ పృష్టం త్వయా విద్వాన్సావధానేన తచ్ఛృణు
ప్రామాణికీ న భవతి భ్రాంత్యా మోహిత కల్పనా.

శ్రీ గురువు పలికెను.: ఓ పండితుడా! నీవు చక్కగా అడిగితివి; నేను చెప్పునది సావధానముగా వినుము. మోహకల్పితమయిన భ్రాంతి వలన కలిగినది ప్రమాణము (నిర్ధారింపబడిన సత్యము) కానేరదు. (ఎడారిలో ఎండమావులను జూచి, 'ఎడారిలో నీరు పుష్కలముగా కలదు' అనునది ప్రమాణముకానట్లే)

195. భ్రాంతి వినా త్వసంగస్య నిష్క్రియస్య నిరాకృతేః
న ఘటేతార్థసంబంధో నభసో నీలతాదివత్.

భ్రాంతి వలన తప్ప, నిస్సంగుడు, నిష్క్రియుడు, నిరాకారుడు అయిన పరమాత్మకు వస్తు సంబంధము (ఈ ఉపాధులతో సంబంధము) లేదు. (భ్రాంతివలన మాత్రమే) ఆకాశములో నీలి మొదలగు రంగులు కనిపించుచున్నవి (గాని ఆకాశమునకు రంగు లేదు).

196. స్వస్య ద్రష్టు ర్నిర్గుణ స్యాక్రియస్య
ప్రత్యగ్బోధానంద రూపస్య బుద్ధేః
భ్రాన్త్యా ప్రాప్తో జీవభావో న సత్యో
మోహాపాయే నా స్త్యవస్తు స్వభావాత్.

సర్వసాక్షి, నిర్గుణుడు, నిష్క్రియుడు, జ్ఞానానంద స్వరూపుడు, అయిన పరమాత్మలో జీవ భావము, బుద్ధికల్పిత మయిన భ్రాంతివలన కలిగినదిగాని, అది సత్యమయినది కాదు, భ్రాంతి తొలగిపోవగానే, ఆ జీవభావముకూడ - సత్యమయినదికాదు కావున తొలగిపోవును.

197. యావద్భ్రాంతి స్తావదేవాస్యసత్తా
మిథ్యాజ్ఞానోజ్జృంభితస్యప్రమాదాత్
రజ్వ్వాం సర్పో భ్రాంతి కాలీన ఏవ
భ్రాంతేర్నాశే నైవ సర్పోఽపి తద్వత్.

మోహము వలన కలిగిన అసత్య జ్ఞానమువలన (ఆవరణ - విక్షేప శక్తుల వలన) జనించిన దానిలో (ఈ జీవభావములో) సత్యము, (ఉన్నదన్న భావము) ఆ భ్రాంతి ఉన్నంతవరకే ఉండును. త్రాటినిచూచి భ్రాంతిచే కలుగు పాము అనుభవము ఆ భ్రాంతి ఉన్నంతవరకే ఉండును. ఆ భ్రాంతి తొలగిపోగానే సర్పము ఉండదు.- అట్లే (ఆత్మదర్శనమువలన) భ్రాంతి తొలగిపోయిన వెంటనే ఆ జీవభావముకూడ తొలగి పోవును.

198. 199. అనాదిత్వమ విద్యాయాః కార్యస్యాపి తదేష్యతే
ఉత్పన్నాయాంతు విద్యాయామావిద్యక మనా ద్యపి
ప్రబోధే స్వప్నవత్సర్వం సహమూలం వినశ్యతి
అనాద్యపీదం నోనిత్యం ప్రాగభావ ఇవ స్ఫుటం.

అవిద్య, దాని వలన కలిగినవి, (జీవభావాదులు), ఆదిలేనివే-కాని, విద్యవలన (జ్ఞానమువలన), మెలుకువ కలిగినంతనే, స్వప్న ప్రపంచమంతయు నశించునట్లు,

అవిద్య (అనాది అయినను) సమూలంగా నశించును. ఈ అవిద్య ఆదిలేనిదయ్యును, ప్రాగభావమువలె నిత్యమయినదికాదు అని స్పష్టమగు చున్నది. (ప్రాగభావము- ప్రాక్+అభావము: మొదట అవ్యక్త స్థితిలో ఉండి, తరువాత వ్యక్త స్థితిలోకి వచ్చుట, కుండను తయారు చేయక ముందు, అది మట్టిరూపములో అనాదిగా 'ప్రాగభావ స్థితిలోనున్నది. ఆస్థితి కుండ తయారు చేయుటవలన వ్యక్తమై, దాని పూర్వపు 'ప్రాగభావ స్థితిని' కోల్పోవుచున్నది).

200. 201. అనాదేరపి విధ్వంసః ప్రాగభావస్య వీక్షితః
యద్బుద్ధ్యుపాధి సంబంధాత్పరి కల్పిత మాత్మని.
జీవత్వం స తతోఽన్యత్తు స్వరూపేణ విలక్షణః
సంబంధస్త్వాత్మనోబుద్ధ్యా మిథ్యాజ్ఞానపురస్సరః

అనాది అయినను ప్రాగభావ స్థితికి అంతము ఉండుట కలదు. అట్లే, బుద్ధి ఉపాధితో సంబంధము వలన ఆత్మలో కల్పింపబడిన 'జీవభావము' సత్యమయినదికాదు. (సత్పదార్థమయిన) ఆత్మకన్న విలక్షణమయినది. (వేరయినది). ఆత్మతో బుద్ధికి సంబంధము మిథ్యాజ్ఞానము వలన కలుగుచున్నది. (తమస్సుయొక్క 'ఆవరణశక్తి' వల్ల, 'నేను స్వయముగ ఆత్మను' అన్న జ్ఞానము మరుగుపడగా, 'విక్షేపశక్తి' వలన కలిగిన 'బుద్ధి'లో 'నేను జీవుడను' అనుభావము -మిథ్యాజ్ఞానమువలన కలుగుచున్నది).

202. వినివృత్తి ర్భవేత్తస్య సమ్యక్ జ్ఞానేన నాన్యథా.
బ్రహ్మాత్మైకత్వ విజ్ఞానం సమ్యక్జ్ఞానం శ్రుతేర్మతం.

('నేను జీవుడను'అను) మిథ్యాజ్ఞానము సరియైన జ్ఞానమువలన, (సమ్యక్ జ్ఞానము) వలన) తొలగిపోవును. వేరు మార్గములేదు. 'పరమాత్మ', 'జీవాత్మలు' ఒక్కటే అను విజ్ఞానము (అనుభవపూర్వకమయిన జ్ఞానము) 'సమ్యక్జ్ఞానమని' శ్రుతులు పలుకుచున్నవి.

203. తదాత్మానాత్మనోః సమ్యగ్వివేకేనైవ సిధ్యతి
తతోవివేకః కర్తవ్యః ప్రత్యగాత్మసదాత్మనోః

ఈసమ్యక్జ్ఞానము ఆత్మానాత్మవిచక్షణా జ్ఞానమువలన, (ఏది ఆత్మ? ఏది ఆత్మకానిది అను విచక్షణద్వారా కలుగుచున్నది. అందువలన'జీవాత్మ' (ప్రత్యగాత్మ), 'పరమాత్మ' (సదాత్మ)ల విచక్షణ బుద్ధితో తెలుసుకొనుట (ప్రథమ) కర్తవ్యము.

204. జలం పంకవదస్పష్టం పంకాపాయే జలంస్ఫుటం,
యథా భాతి తథాత్మాపి దోషాభావే స్ఫుటప్రభః

బురదవలె కనిపించు (మట్టితోకూడిన)నీరు, ఆ మట్టి తొలగిపోగానే, ఏ విధముగా నిర్మలముగా ప్రకాశించునో, అట్లే, ఆత్మయందలి ('నేను జీవుడను' అను భ్రాంతి రూపకమయిన)మలినము (దోషము)తొలగిపోగానే, ఆత్మ నిర్మలమయిన కాంతితో ప్రకాశించును.

205. అసన్నివృత్తౌతు సదాత్మనాస్ఫుటం
ప్రతీతిరేతస్య భవేత్ప్రతీచః
తతోనిరాసః కరణీయ ఏవ
సదాత్మనః సాధ్వహమాది వస్తునః

ఈ 'అసత్తు' (నిజము కానిది, భ్రాంతి) తొలగినంతనే, (నేను ఈ శరీరాదులను అను భ్రాంతి తొలగిపోగానే), ప్రత్యగాత్మ (తనలో ఉన్న ఆత్మ), సదాత్మగా (ఎల్లెడ గల పరమాత్మగా) ప్రతీతమగును. అందుచేత ఈ 'సదాత్మ' నుండి (భ్రాంతి జనితమయిన) 'అహం' మొదలగు 'అసత్' వస్తువులను ('నేను జీవుడను' అను అసత్య భావమును) వెంటనే తొలగించవలెను.

206. అతోనాయం పరాత్మా స్యాద్విజ్ఞానమయ శబ్దభాక్
వికారిత్వాజ్జడత్వాచ్చ పరిచ్ఛిన్నత్వ హేతుతః
దృశ్యత్వాద్వ్యభిచారిత్వాన్నానిత్యో నిత్య ఇష్యతే.

ఈ విజ్ఞానమయ కోశముకూడ, వికారములు (మార్పులు) చెందుచుండుటవలనను, జడమగుటవలనను, పరిమితమై యుండుట వలనను, దృశ్యవస్తువు అగుటవలనను, అనిత్యత వలనను—ఇది పరమాత్మ కాజాలదు. అనిత్యమయినది నిత్యవస్తువు కానేరదు.

## ఆనందమయ కోశము (207-211) :

207. ఆనంద ప్రతిబింబ చుంబిత తనుర్వృత్తిస్తమోజృంభితా
స్యాదానందమయః ప్రియాది గుణకః స్వేష్టార్థ లాభోదయః
పుణ్యస్యానుభవే విభాతికృతి నామానందరూపః స్వయం
భూత్వానందతి యత్ర సాధుతను భృన్మాత్రః ప్రయత్నం వినా

ఈ ఆనందమయ కోశము—తమో గుణముపలన కలిగిన వృత్తి (అనుభూతి) అయినను, ఆత్మానందము యొక్క ప్రతిబింబము దానిని (ఆ మనోవృత్తిని) చుంబించుట వలన (తాకుటవలన), ఆనందమయమయినది: ప్రియాదికములతో కూడినదై, (ప్రియము, మోదము, ప్రమోదము అను తరతమ భేదములతో కూడుకున్నదై), తను కోరినది లభించుటవలన కలుగును (స్వేష్టా లాభోదయం): (పూర్వజన్మలో చేసిన) పుణ్యకర్మల ఫలముపలన ఇది (అట్టి వారికి) స్వయముగా (ఎట్టి ప్రయత్నము లేకనే) అనుభవమునకు వచ్చును. ఈ మనోమయ కోశములో ఉండు ప్రతి జీవి ఎట్టి ప్రయత్నము లేకనే ఆనంద మనుభవించు చుండును.

(తమోగుణము యొక్క ఆవరణ శక్తివల్ల ఆత్మ తత్వము మరుగు పడినను, దుఃఖమును కలిగించు రజోగుణము యొక్క విక్షేపశక్తి పనిచేయనందున (గాఢ నిద్రలో) 'జీవి' తన్ను తానే మరచి, సర్వమును మరచియుండును. అప్పుడు ఆత్మ తేజస్సు ఈ కోశములో ప్రతి బింబితమై, దుఃఖాభావమును అనుభవించును. ఈ అనుభవము ధ్యానసమాధి యందుకూడ కల్గును).

208. ఆనందమయ కోశస్య సుషుప్తౌ స్ఫూర్తిరుత్కటా
స్వప్న జాగరతయోరీషదిష్ట సందర్శ నాదినా

ఈ ఆనందమయకోశము గాఢనిద్రలో మిక్కిలి ప్రకటితమగును (అనుభవమునకు వచ్చును)· స్వప్న జాగ్రదవస్థలయందు కూడ, ఇది కొద్దిగా (అప్పుడప్పుడు), ప్రియ మయిన వాటిని చూచుట, వినుట, అనుభవించుట మొదలగు వానివలన కలుగును.

209. నైవాయమానందమయః పరాత్మా
సోపాధికత్వాత్ప్రకృతే ర్వికారాత్
కార్యత్వ హేతోః సుకృతిక్రియాయా
వికారసంఘాత సమాహితత్వాత్

ఈ ఆనందమయ కోశముకూడ పరమాత్మ కాజాలదు: ఏలననగా—ఉపాధితో కూడి యుండుటవలన (పరిమితమైనది, అనిత్యమయినది అగుటవలన): ప్రకృతి యొక్క వికారము అగుటవలన (మనస్సులో కలుగు వాంఛలవలనే ఇది కూడవృత్తి రూపక మయినది గాపున): (పూర్వజన్మ కర్మల వాసన రూపమే ఈ ఆనందమయ కోశము: ఒకదానివలన కలిగినది గాబట్టి స్వయంభవుడయిన ఆత్మ కానేరదు, అందువలన):

ఇది మిగిలిన కోశములతో కలసి ఒక్క సంఘటిత వస్తువుగా ఉండుటవలన (అన్న మయాది కోశములతో కలిసి, వాటిలో కలుగు మార్పులవల్ల తను మార్పుచెందు చుండుట వలన)- ఈ ఆనందమయ కోశము ఆత్మకాజాలదు.

210. పంచానామపి కోశానాం నిషేధే యుక్తితః శ్రుతేః
తన్నిషేధావధి స్సాక్షీ బోధరూపోఽవశిష్యతే.

శ్రుతుల నాధారముగ తీసుకొని, వివేకముతో ఈ అయిదు కోశములను (ఒక్కటొ క్కటిగ) ఆత్మకాదని తిరస్కరించినప్పుడు, తదనంతరము మిగిలెడిది బోధరూపక మయిన (జ్ఞానరూపకమయిన) 'సాక్షి' మాత్రమే—(నేను ఈ మార్పులకన్నింటికి సాక్షి భూతుడను, అను జ్ఞానముతో కూడిన ఆత్మ మిగులును).

211. యోఽయమాత్మా స్వయంజ్యోతిః పంచకోశ విలక్షణః
అవస్థాత్రయ సాక్షీ సన్నిర్వికారో నిరంజనః
సదానందః స విజ్ఞేయః స్వాత్మత్వేన విపశ్చితా

పంచకోశములకు భిన్నుడయిన వాడును, తన ప్రకాశము చేతనే వెలుగువాడును (స్వయంజ్యోతి), మూడు అవస్థలకు సాక్షి రూపుడును, సత్స్వరూపుడును, నిర్వికారు డును (మార్పులు లేని వాడును) నిరంజనుడును(దేనిచేతను కలుషితము కానివాడును), ఎల్లప్పుడు ఆనంద స్వరూపుడుగా ఉండు వాడును, అయిన ఈ 'ఆత్మ'యే 'నేను' అని పండితులు తెలుసుకొనవలెను.

## ఆత్మతత్త్వము (212-225) :

శిష్య ఉవాచ :

212. మిథ్యాత్వేన నిషిద్ధేషు కోశేష్వేతేషు పంచసు
సర్వాభావం వినాకించిన్న పశ్యామ్యత్ర హేగురో
విజ్ఞేయం కిమువస్త్వస్తి స్వాత్మ నాఽఽత్మ విపశ్చితా॥

శిష్యుడు పలికెను-ఈ అయిదు కోశములను మిథ్యగా (నిజము కానివిగా) భావించి, తొలగించివేయగా, ఏమియును లేకుండుట (సర్వాభావము) తప్ప, నాకు అక్కడ వేరేమియును గోచరించుట లేదు. అట్టిచో, ఓ గురుదేవా! పండితులు తమ ఆత్మగా గుర్తించుటకు అక్కడ ఏ వస్తువు (మిగిలి) యున్నది?

శ్రీగురు రువాచ :

213. 214. సత్యముక్తం త్వయా విద్వాన్నిపుణోఽసి విచారణే
అహమాది వికారాస్తే తదభావోఽయమప్యథ
సర్వే యేనానుభూయంతేయః స్వయం నానుభూయతే
తమాత్మానం వేదితారం విద్ధి బుద్ధ్యా సు సూక్ష్మయా

శ్రీగురువు పలికెను: ఓ పండితుడా! నీవు చక్కగా అడిగితివి. నీవు నిపుణుడవు. మంచి విచారణ శక్తికలవాడవు. ఎవడు ఈ అహంకారాది వికారములను, అవి ఉన్నప్పుడు, అవి లేనప్పుడు, (అనగా గాఢనిద్రలో) గూడ తెలుసుకొనుచున్నాడో, (అనుభవము పొందుచున్నాడో), కాని ఎవడు స్వయముగా తెలుసుకొనబడడో (ఎవనిని తెలుసుకొనుట కష్టమో), అట్టి ఆత్మను, అన్నిటిని తెలియు వానిని (వేత్తారం), సు సూక్ష్మమయిన బుద్ధిచేత మాత్రమే తెలుసుకొనగలము.

215. తత్సాక్షికం భవేత్తత్తద్యద్యద్యేనాను భూయతే
కస్యాప్యననుభూతార్థే సాక్షిత్వం నోపయుజ్యతే

(తత్ సాక్షికం భవేత్ తత్ తత్ యత్ యత్ యేన అనుభూయతే)—ఒకరు ('క') ఇంకొకరిని ('గ') చూచుచున్నప్పుడు, మొదటివాడు('క'),రెండవవానికి ('గ')సాక్షిగా (చూచువానిగా) చెప్పబడు చున్నాడు. చూడబడునది ఉన్నప్పుడే చూచువాడు 'సాక్షి' అనుచున్నాడు. చూచుటకు ఏమియు లేనప్పుడు, ఆ చూచువానిని 'సాక్షి' అనుటకూడ తగదు. (ఆత్మయొక్క సాక్షిత్వ భావము ఈ పంచకోశములవలన కలిగిన జీవ భావము, దృశ్య ప్రపంచము ఉన్నంతవరకే ఉండును. ఇవన్నియు విలీనమయినప్పుడు, అనుభవించుటకు జీవభావముతో సహా, ఏమియు ఉండదు కాబట్టి, అప్పుడు ఆత్మను 'సాక్షి' అనుటకూడ తగదు. అప్పుడు 'ఆత్మ' తనసుతానే తెలుసుకొనుచు 'కేవలుడు'గా ఉండును.

ఉదాహరణకు—రంగస్థలము మీది దీపము, ఆ రంగస్థలముపై నాటకము జరుగుచున్నంతవరకు, దానికి 'సాక్షి'గా ఉన్నను, ఆ నాటకానంతరము (ఏమియు లేకపోయినను), ఆ దీపము మాత్రము వెలుగుచునేయుండును. (దానికి 'సాక్షి' తత్వము పోయి 'కేవల' తత్వము వచ్చినదన్నమాట).

216. అసౌ స్వసాక్షికో భావోయతః స్వేనానుభూయతే
అతః పరం స్వయం సాక్షాత్ ప్రత్యగాత్మా న చేతరః

ఎప్పుడు ఈ ఆత్మయందు స్వసాక్షిభావము (నాకు నేనే సాక్షిని అను భావము) అను భవమునకు వచ్చునో, (సాక్షిత్వము జరుపుటకు వేరు ప్రపంచము లేనప్పుడు, తనకుతానే కేవలుడను అను అనుభూతి పొందునో), అప్పటి నుండి ఆ ప్రత్యగాత్మ స్వయముగా (తనకుతాను) సాక్షాత్ పరమాత్మనుగాని, తాను వేరెవరును కానని తెలుసుకొనును.

217. జాగ్రత్స్వప్న సుషుప్తిషు స్ఫుటతరం యోఽసౌ సముజ్జృంభతే,
ప్రత్యగ్రూపతయా సదాహమహమిత్యంతః స్ఫురన్నైకధా
నానాకారవికారభాజిన ఇమాన్ పశ్యన్నహంధీముఖాన్
నిత్యానంద చిదాత్మనా స్ఫురతి తం విద్ధి స్వమేతం హృది.

జాగ్రత్ స్వప్న సుషుప్తావస్థలయందు ఎవడు ప్రస్ఫుటముగా విజృంభించుచున్నాడో, ఎవడు ప్రత్యగాత్మ రూపమున ఎల్లప్పుడు నేను, నేను, అనుభావముతో అంతరంగ మున మెలుగుచుండునో, (స్ఫురంతం), అహంకారము మొదలగు పలుఆకారములలో (శరీర మనోబుద్ధులలో) కలుగు మార్పులను (ఎప్పటికప్పుడు) ఎవరు చూచుచున్నాడో, ఎవడు ఎల్లప్పుడు సత్-చిత్-ఆనంద రూపునిగా (అంతరంగమున) మెలుగుచున్నాడో, అతడే నీయందుగల ఆత్మ తత్వమని నీ హృదయములో తెలుసుకొనుము. (స్వానుభవ పూర్వకముగా గ్రహించుము).

218. ఘటోదకే బింబితమర్క బింబ—
మాలోక్య మూఢో రవిమేవ మన్యతే—
తథాచిదాభాసముపాధి సంస్థం
భ్రాంత్యాహమిత్యేవ జడోఽభిమన్యతే

కుండలోగల నీటియందు పడిన సూర్యుని ప్రతిబింబమునుచూచి, దానిలో నిజముగా సూర్యుడు ఉన్నాడని మూర్ఖుడు తలచును. అట్లే జ్ఞానహీనుడు, బుద్ధి ఉపాధియందు ప్రతిబింబించు, 'చిత్' ప్రకాశమును, 'నేను' అని (తన ఆత్మ అని) భ్రాంతి పొందు చున్నాడు.

219. ఘటం జలం తద్గత మర్కబింబం
విహాయ సర్వం వినిరీక్ష్యతేఽర్కః
తటస్థ ఏ తత్త్రితయావ భాసకః
స్వయంప్రకాశో విదుషా యథా తథా

పండితుడు తటస్థములయిన (నిజమును గ్రహించుటకు ఉపయోగపడు తటస్థలక్షణములు గల), ఆ కుండను, అందలి నీటిని, ఆ నీటిలోగల ప్రతిబింబమును పూర్తిగా విడిచి పెట్టి, ఆ మూడింటిని ప్రకాశింపజేయుచు, స్వయంప్రకాశుడయిన సూర్యుని (ఆకాశములో) చూడగలుగుచున్నాడు. అట్లే—

220. 221. దేహం ధియం చిత్ప్రతిబింబమేతం
222. విసృజ్య బుద్ధౌ నిహితం గుహాయాం
ద్రష్టార మాత్మాన మఖండ బోధం
సర్వప్రకాశం సదసద్విలక్షణమ్
నిత్యం విభుం సర్వగతం సుసూక్ష్మ—
మంతర్బహిః శూన్య మనన్య మాత్మనః
విజ్ఞాయ సమ్యక్ నిజరూప మేతత్
పుమాన్ విపాప్మా విరజా విమృత్యుః
విశోక ఆనందఘనో విపశ్చిత్
స్వయంకుతశ్చిన్న బిభేతి కశ్చిత్
నాన్యోऽస్తి పంథా భవబంధ ముక్తే
ర్వినా స్వతత్త్వావగమం ముముక్షోః

దేహమును, బుద్ధిని, చిత్ ప్రతిబింబమును (జీవ భావమును) విడిచిపెట్టి, బుద్ధి లోతులలో (బుద్ధౌ గుహాయాం) మెలిగెడి ఆ సాక్షిరూపుని (ద్రష్టారం), ఆత్మ స్వరూపుని, అఖండ జ్ఞానస్వరూపుని, సర్వమును ప్రకాశింపజేయు వానిని, స్థూల సూక్ష్మములకు వేరైన వానిని (సదసద్విలక్షణం), ఎల్లప్పుడు ఉండువానిని (నిత్యం), అన్నింటిని శాసించు వానిని (విభుం). అన్నింటియందు గలవానిని (సర్వగతం), సూక్ష్మాతి సూక్ష్మరూపుని, లోపల బయట అన్నది లేనివానిని (అంతః బహిః శూన్యం సర్వాంతర్యామిని), తనకు వేరైనది కాని వానిని (అనన్యమాత్మనః), -(అట్టి వానిని) తన నిజరూపముగా సమ్యక్ విచారణవలన తెలుసుకొని, పండితుడయిన మనుష్యుడు. పాపరహితుడు, రజో రహితుడు, (అపరిమిత విక్షేప శక్తి రహితుడు,) మృత్యువు లేనివాడు, శోకరహితుడు, ఆనందఘనుడు (ఎల్లప్పుడు ఆనందములోనే ఉండువాడు), అగుచు, ఎప్పుడును ఎవ్వరి వలనను (దేనిచేతను) భయమునొందక, స్వస్థు

ఈ పరబ్రహ్మ స్వరూపము సత్యమయినది. అందులో అతనికన్న వేరైన వస్తువు లేనందున అద్వయమయినది. అతనియొక్క (ఆ పరబ్రహ్మయొక్క) పరమార్థ తత్త్వమును (నిజతత్త్వమును) పరిపూర్ణముగా (సమ్యక్) తెలుసుకొను తరుణములో (ఆ దశలో) మరి ఇంకొకటి ఏమియును ఉండదు (గోచరించదు).

227. యదిదం సకల విశ్వం నానారూపం ప్రతీత మజ్ఞానాత్
తత్సర్వం బ్రహ్మైవ ప్రత్యస్తా శేషభావనా దోషమ్.

అజ్ఞానము వలన నానా రూపములుగా గోచరించు ఈ ప్రపంచము అంతయు పరబ్రహ్మ స్వరూపమే-నిజము మరుగున పడుట వలనను (ప్రత్యస్త), అనేకము లయినవి ఉన్నవని భావించుట వలనను (అశేషభావనా) కలిగిన దోషము వలన, (ఆవరణ విక్షేపశక్తులవలన), మాత్రమే (ఈ బహుళత్వము గోచరించుచున్నది).

228. మృత్కార్య భూతోఽపి మృదో న భిన్నః
కుంభోఽస్తి సర్వత్రతు మృత్స్వరూపాత్
న కుంభరూపం పృథగస్తి కుంభః
కుతో మృషా కల్పిత నామ మాత్రః

మట్టితో తయారుచేయబడిన కుండ (ఉపయోగములో) వేరయినను, అది (వస్తు తత్త్వములో) మట్టికంటె వేరయినదికాదు. ఆ కుండ తత్త్వమంతయు మట్టి మాత్రమే. కుండ రూపములో ఉన్నంత మాత్రమున అదివేరుకాదు. (అట్టిచో) కుండ ఎక్కడ? అది వట్టిది—కల్పితమయిన పేరుమాత్రమే.

229. కేనాపి మృద్ భిన్నతయా స్వరూపం
ఘటస్య సందర్శయితుం నశక్యతే
అతోఘటః కల్పిత ఏవ మోహా—
న్మృదేవ సత్యం పరమార్థ భూతం.

ఎవ్వరునుగూడ మన్నులేనటువంటి (మట్టి) కుండను చూపించ లేరు. (మట్టికుండలో మట్టితత్త్వములేదని నిరూపించలేరు). అందుచేత కుండ అను (భావము) మోహముచే కల్పింపబడినది. (కుండకు) మట్టియే అర్థవంతమయిన (రూపమును కలిగించు) తత్త్వము.

230. సద్బ్రహ్మకార్యం సకలం సదేవం
తన్మాత్రమేతన్న తతోఽన్య దస్తి
అస్తీతి యో వక్తి న తస్య మోహో
వినిర్గతో నిద్రితవత్ప్రజల్పః

అన్నీ ఈ సకలమును (విశ్వమంతయు), సత్యమయిన పరబ్రహ్మ వలన కలిగినది గాబట్టి. అంతయు సన్మాత్రమయినదే. (అంతయు బ్రహ్మస్వరూపమే). అందువ భిన్నమయినది కాదు. ఎవ్వడైనను (బ్రహ్మమునకు వేరయిన) జగత్తు ఉన్నదన్నచో వాడు ఇంకను మోహమును విడిచిపెట్టలేదన్నమాట! నిద్రలో మాట్లాడుచున్న య్యట్లు మాట్లాడుచున్నాడన్నమాట.

231. బ్రహ్మైవేదం విశ్వ మిత్యేవ వాణీ
శ్రౌతీ బ్రూతేఽ థర్వనిష్ఠా వరిష్ఠా
తస్మాత్సర్వం బ్రహ్మమాత్రం హి విశ్వ
నాధిష్ఠానా ద్భిన్నతాఽ రోపితస్య

'ఈ విశ్వమంతయు బ్రహ్మమే' (బ్రహ్మైవేదం విశ్వం), అని పవిత్రమయిన అథర్వణ వేదము (నందలి ముండకోపనిషత్తు) చెప్పుచున్నది. అందుచేత ఈ విశ్వమంతయు బ్రహ్మము మాత్రమే. ఆరోపింపబడినది ఆధారమునకు భిన్నమయినది కాదు. (కుండలు నామరూప భేదములచే వేరువేరైనను, వాటికి ఆధారమయిన (వస్తుతత్త్వమయిన) మట్టికంటె వేరైనవి కావు).

232. సత్యం యదిస్యా జ్జగదేతదాత్మనో–
ఽనంతత్వహానిర్నిగమా ప్రమాణతా
అసత్య వాదిత్వ మపీశితుః స్యా–
న్నైతత్త్రయం సాధుహితం మహాత్మనామ్.

ఈ జగత్తు బ్రహ్మమునకు భిన్నమయినదిగా భావించినచో, బ్రహ్మము యొక్క అనంతత్వము చెడిపోవును. (జగత్తు ఉన్నచోట బ్రహ్మము ఉండలేదు గాబట్టి). వేదములు ప్రామాణ్యతను కోల్పోవును; ఈశ్వరుడు అసత్యవాదియగును. (ఏలననగా వేదములలోను భగవంతుడు చెప్పిన భగవద్గీతలోను బ్రహ్మము అనంతము, అద్వితీయము అని చెప్పబడినదిగాబట్టి); ఈ మూడును అసత్యమని సాధువులయిన

మహాత్ములు అంగీకరించరు. (షడ్దర్శనములునూ వేదముల ప్రామాణ్యతను అంగీకరించును. ఏ ప్రతిపాదన గూడ వాటికి విభిన్నముగా ఉండరాదు).

233. ఈశ్వరో వస్తుతత్త్వజ్ఞో న చాహం తేష్వవస్థితః
న చ మత్స్థాని భూతా నీత్యేవమేవ వ్యచీకథత్.

బ్రహ్మతత్త్వము నెరిగిన (వస్తుతత్త్వమెరిగిన) శ్రీకృష్ణభగవానుడు (భగవద్గీతలో) 'నేను వాటియందు (పంచభూతములందు) లేను; అవి నాయందు కూడ లేవు' అని స్పష్టీకరించెను.

234. యది సత్యం భవేద్విశ్వం సుషుప్తావుపలభ్యతామ్.
త న్నోపలభ్యతే కించిదతో౽సత్స్వప్నవన్మృషా.

ఈ విశ్వము సత్యమయినదే అయినచో గాఢనిద్రలో కూడ అనుభవమునకు రావలెను. కాని, అట్లు అనుభవమునకు వచ్చుట లేదు. అందుచేత, ఈ విశ్వము కూడ, స్వప్న జగత్తువలెనే, అసత్యమయినది. (స్వప్నావస్థలో నున్నప్పుడు జాగ్రదవస్థలో కనబడు ప్రపంచము వ్యక్తమవదు; జాగ్రదవస్థలో స్వప్నప్రపంచము వ్యక్తముకాదు. సుషుప్తావస్థలో రెండును కూడ వ్యక్తముకావు. ఒకసారి ఉండి, మరొకసారి ఉండనిది సత్యమయినదికాదు).

235. అతః పృథక్ నాస్తి జగత్పరాత్మనః
పృథక్ ప్రతీతిస్తు మృషా గుణాదివత్
ఆరోపితస్యాస్తి కిమర్థవత్తా౽ —
ధిష్ఠానమాభాతి తథా భ్రమేణ.

అందుచేత, ఈ విశ్వము పరమాత్మకు (పరబ్రహ్మమునకు) భిన్నమయినదికాదు. భిన్నముగా కనబడుట (ఆకాశమునందలి రంగులు మొదలగు) గుణములవలె అసత్యమయినది. (మనో కల్పితమయినది). భ్రాంతివలన (సత్పదార్థమునందు) ఆరోపింపబడిన (అసత్ పదార్థమునకు) వేరు వస్తుతత్వ మెట్లుండును? ఆధారభూతమయిన (సత్పదార్థమే) భ్రాంతివలన ఆ విధముగా (అసత్ ప్రపంచముగా) కనుపించుచున్నది.

236. భ్రాంతస్య యద్యద్భ్రమతః ప్రతీతం
బ్రహ్మైవ తత్తద్రజతం హి శుక్తిః
ఇదం తయా బ్రహ్మ సదైవ రూప్యతే
త్వారోపితం బ్రహ్మణి నామమాత్రం.

భ్రాంతునకు తన మనోభ్రమణము వలన పలు విధములుగ కనబడునదంతయు బ్రహ్మమే (కాని వేరయినది కాదు). వెండివలె కనబడు ముత్యపు చిప్పవలెనే — (వెండివలె కనుపించుచున్నను ముత్యపుచిప్పలోనున్న వస్తుతత్త్వమంతయు ముత్యపు చిప్పయే గాని, వెండి ఏమాత్రమును ఉండదు). 'ఇవి' 'ఇది' అని (ఇదంతయా) చెప్పబడునదంతయు ఎల్లప్పుడూ బ్రహ్మతత్త్వమే (గాని వేరుకాదు.) ఈ బ్రహ్మము నందే (ఈ ప్రపంచము) నామమాత్రములచే ఆరోపింపబడినది. (ఏకరూపమై ఆధారభూతమయిన బ్రహ్మమునందు నామ భేదములవలన వేరువేరుగ కనుపించు ఈ విశ్వము ఊహింపబడినది).

## బ్రహ్మతత్త్వము : (237-240)

237-238. అతః పరం బ్రహ్మ సదద్వితీయం
విశుద్ధవిజ్ఞానఘనం నిరంజనం;
ప్రశాంతమాద్యంత విహీన మక్రియం,
నిరంతరానందరసస్వరూపమ్
నిరస్తమాయాకృత సర్వభేదం
నిత్యం సుఖం నిష్కల మప్రమేయం
అరూపమవ్యక్తమనాఖ్యమవ్యయం
జ్యోతిః స్వయం కించిదిదం చకాస్తి

ఈ పరబ్రహ్మ స్వరూపం ఎట్టిదనిన :- 1. సత్యమయినది (సత్-ఎల్లప్పుడును మార్పులు లేకుండునట్టిది): 2. అద్వితీయమయినది (వేరొక పదార్థము లేకుండ అంతా తానే అయి ఉండునది): 3. పరిశుద్ధమయినది (మరొక పదార్థముతో మిశ్రమము కానిది); 4. విజ్ఞాన ఘనమయినది (జ్ఞానమే మూల పదార్థముగా గలది). 5. మలినము లేనట్టిది (నిరంజనం—పూర్వ వాసనల మాలిన్యము లేనిది): 6. ప్రశాంతమయినది (ఎట్టి అలజడులు, ఆందోళనలు లేనట్టిది): 7. ఆద్యంతములులేనిది: 8. క్రియారహితమయినది (అక్రియం—తనలో తనే సంపూర్ణుడైయుండుట వల్లన వేరే

క్రియల వలన పొందవలసినది ఏమియు లేదు కాబట్టి); 9. నిరంతరము ఆనంద రసమే స్వరూపముగా గలది (అలజడులు, ఆందోళనలు లేవు కాబట్టి దుఃఖమునకు తావులేదు); 10. మాయచే కల్పింపబడిన నానాత్వమను భేదము లేనట్టిది (మాయ త్రిగుణాత్మకమయినది; పరబ్రహ్మము త్రిగుణాతీతుడు); 11. నిత్యమయినది (ఎల్లప్పుడును ఉండునది); 12. సుఖస్వరూపమయినది. (వివిధత్వము లేదు కావున దుఃఖము ఉండదు); 13. విడివిడి భాగములు లేనిది (నిష్కళం); 14. అప్రమేయ మయినది (ఏ ప్రమాణముచేత గూడ కొలవరానిది); 15. రూపరహితమయినది (అరూపం—నామరూపములు దృశ్య ప్రపంచమునకే పరిమితమైనవి కాబట్టి); 16. అవ్యక్తమయినది (ఇంద్రియ మనోబుద్ధులచే తెలియ రానిది); 17. పేరు లేనిది (అనాఖ్యం-వేరువేరు రూపములు గలవానికే పేర్లు అవసరము. రూపరహితునకు పేరు అవసరము లేదు) 18. తరుగులేనిది (అవ్యయం - ఎల్లప్పుడు ఒకే రూపుతో ఉండువానికి; అంతటను నిండి యున్నవానికి, అద్వైతునికి తరుగుట ఉండదు). 19. తనంతతానే ప్రకాశించునది (జ్యోతిః స్వయం-దానిని తెలుసుకొనుటకు వేరుకాంతి గాని, వేరు జ్ఞానముగాని అవసరము లేదు); 20. పరమయినది (దేహేంద్రియ మనోబుద్ధుల కతీతమై, వాటిలో చైతన్యము కలిగించునది).

239. జ్ఞాతృజ్ఞేయజ్ఞానశూన్యమనంతం నిర్వికల్పకమ్
కేవలాఖండచిన్మాత్రం పరం తత్త్వం విదుర్బుధాః

(ఈ పరబ్రహ్మము) జ్ఞాత, జ్ఞేయము, జ్ఞానము (తెలుసుకొనువాడు తెలుసుకొనబడునది, తెలుసుకొనుట) అను భేదములు లేక, అనంతము, నిర్వికల్పమయినదిగా (మార్పులు చెందనిదిగా) ఉండును. ఆత్మజ్ఞానులు ఈ పరమ తత్త్వమును కేవల అఖండ జ్ఞాన రూపునిగా గుర్తింతురు.

240. అహేయమనుపాదేయం మనోవాచామగోచరం
అప్రమేయమనాద్యంతం బ్రహ్మ పూర్ణమహం మహః

ఈ పరబ్రహ్మము (మిగిలిన కోశములవలె) విడువదగినదికాదు; (వేరొకచోటునుండి) పొందదగినదికాదు. (ఇది విడువదగిన, పొందగల అన్యవస్తువుకాదు). మనస్సునకు, వాక్కునకు అందరానిది; (దీని గూర్చి ఆలోచించుట, చెప్పుట వీలుపడదు). ఏ ప్రమాణము చేతను కొలువరానిది; ఆద్యంతములు లేనిది; పరిపూర్ణమయిన ఆ మహాతత్త్వము నేనే. (మనమే—ప్రతిజీవియందును ఉన్న ఆత్మతత్త్వము ఇదే).

## తత్త్వమసి : (241-229)

241-242 తత్త్వంపదాభ్యామభిధీయమానయోః
బ్రహ్మాత్మనోః శోధితయోర్యదీత్థమ్
శ్రుత్యా తయో స్తత్త్వమసీతి సమ్య-
గేకత్వమేవ ప్రతిపాద్యతే ముహుః
ఐక్యం తయోర్లక్షితయోర్న వాచ్యయో-
ర్నిగద్యతే న్యోన్యవిరుద్ధధర్మిణోః
ఖద్యోతభాన్వోరివ రాజభృత్యయోః
కూపాంబురాశ్యోః పరమాణు మేర్వోః

శ్రుతులలో 'తత్త్వమసి' అని నిర్దేశింపబడిన మహా వాక్యములో 'అది'. 'నీవు' (తత్, త్వం) అనుపదములు బ్రహ్మకును, (నీ) ఆత్మకును గల ఏకత్వమును మాటిమాటికి ప్రకటించుచున్నవి; కాని, ఆ ఏకత్వము (ఆ మాటలు సూచించు) లక్షణార్థములో గ్రహించవలెను గాని, (ఆ మాటల యొక్క) వాచకార్థములలోకాదు; (ఆ మాటలు సూచించు భావార్థము గ్రహించవలెను గాని, ఆ మాటల బాహ్యార్థమును కాదు), ఎందుకనగా, ఆ మాటలయొక్క వాచకార్థములు (బాహ్యార్థములు) విరుద్ధార్థములు కలవి. (ఒకదానికి మరొకదానికి పొత్తుకుదరనివి). (బాహ్య దృష్టితో చూచినచో, జీవాత్మ) మిణుగురు పురుగు; (పరమాత్మ) సాక్షాత్ సూర్యభగవానుడు, (జీవాత్మ) భటుడు; (పరమాత్మ) రాజు; (జీవాత్మ) దిగుడుబావి; (పరమాత్మ) మహాసముద్రము; (జీవాత్మ) పరమాణువు; (పరమాత్మ) మేరుపర్వతము.

243. తయోర్విరోధోఽయముపాధికల్పితో
న వాస్తవః కశ్చిదుపాధిరేషః
ఈశస్య మాయా మహదాదికారణం
జీవస్య కార్యం శృణు పంచకోశమ్

ఈ రెండింటికిని (జీవునకు, ఈశ్వరునకు) గల భేదము వాటి ఉపాధులవల్ల ఏర్పడినవి కాని, వాస్తవమయినవి కావు, 'మహత్'చే (మాయచే) కప్పబడి (బ్రహ్మము) ఈశ్వరుడగుచున్నాడు. (అవిద్య వలన కలిగిన) పంచకోశములచే కప్పబడి (బ్రహ్మము) జీవుడగుచున్నాడు. (ఒకే బ్రహ్మతత్త్వము వేరువేరు ఉపాధులవలన

జీవాత్మ పరమాత్మలుగా గోచరించుచున్నది. జీవుని యొక్క పరిమితత్వము, ఈశ్వరుని యొక్క సర్వాంతర్యామిత్వము వాటి వేరువేరు ఉపాధుల వలన కలిగినవి).

244. ఏతావుపాధీ పరజీవయో స్తయోః
సమ్యక్ నిరాసేన పరో న జీవః
రాజ్యం నరేంద్రస్య భటస్య ఖేటక
స్తయోరపోహే న భటో న రాజా.

ఈ జీవాత్మ పరమాత్మలయొక్క ఉపాధులను పూర్తిగా తొలచించినచో, జీవుడును లేడు; ఈశ్వరుడును లేడు; రాజుయొక్క రాజ్యమును, భటునియొక్క డాలును — (ఒకరిని రాజుగను, ఇంకొకరిని భటునిగను చూపించు భిన్నచిహ్నములను)తొలగించినచో రాజుయును లేడు; భటుడును లేడు. (ఇద్దరును భిన్నత్వములేని మానవాకారములే).

245. అథాత ఆదేశ ఇతి శ్రుతిః స్వయం
నిషేధతి బ్రహ్మణి కల్పితం ద్వయం
శ్రుతిప్రమాణానుగృహీత యుక్త్యా
స్తయోర్నిరాసః కరణీయ ఏవమ్.

'అథాత ఆదే....' (అథాత ఆదేశనేతి నేతి' అను బృహదారణ్యకోపనిషత్తులోని) శ్రుతి వాక్యము స్వయముగా బ్రహ్మమునందు కల్పింపబడిన (జీవాత్మ పరమాత్మలను) రెండు భావములను నిషేధించుచున్నది. (పైనచెప్పిన) శ్రుతి ప్రమాణమును ఆధారముగా తీసుకొని, బుద్ధిచేత (విచక్షణా జ్ఞానముచేత) ఆ రెండింటిని (కల్పుగజేసిన ఉపాధులను) తొలగించి (బ్రహ్మసాక్షాత్కారము చేసుకొనవలెను.)

246. నేదం నేదం కల్పితత్వాన్న సత్యం
రజ్జౌ దృష్టవ్యాలవత్స్వప్నవచ్చ
ఇత్థం దృశ్యం సాధుయుక్త్యా వ్యపోహ్య
జ్ఞేయః పశ్చాదేక భావ స్తయోర్యః

'ఇదికాదు', 'ఇదికాదు'—ఇది త్రాటియందు సర్పమువలె, (నిద్రలో కనుపించు) స్వప్నమువలె, కల్పితములయినవి. కావున, సత్యములయినవికావు—ఈ విధముగా చ

దృశ్యప్రపంచ మంతయు అసత్యమయినదిగా, బాగుగ ఆలోచించుట ద్వారా(తార్కిక దృష్టితో) తెలుసుకొని, వాటిని విడిచిపెట్టి, పిమ్మట ఆ రెండింటియందు గల ఏకత్వ భావమును అవగాహన చేసుకొనవలెను.

247. తతస్తు తౌ లక్షణయా సులక్ష్యౌ
తయోరఖండైకరసత్వసిద్ధయే
నాలం జహత్యా, న తథాఽజహత్యా
కిం తూభయార్థాత్మికయైవ భావ్యం.

అందుచేత ఈ రెండింటి యొక్క (జీవాత్మ పరమాత్మల యొక్క) లక్షణార్థముల వలన, వాటిలో ఉన్న సత్యము ముక్కలుకాని ఒకేరసమని (అఖండైకరసం)తెలుసుకొనుటకు, జహల్లక్షణము, అజహల్లక్షణములవల్లనేకాక, జహాజహల్లక్షణము వలన కూడా భావించి తెలుసుకొనవలెను.

ఒక వస్తువును సామీప్యమునగల ఇంకొక వస్తువుద్వారా చూపించుటను 'లక్షణ లక్షితము' అందురు. అందులో మనము 'లక్షణమును' విడిచి, 'లక్షితమును' గ్రహించవలెను. 'కాకివాల్చిన్న ఇల్లునాది' అని చెప్పునపుడు కాకి 'లక్షణము'; ఇంటిని చూపుటకు ఉపయోగింపబడినది; చూడవలసినది (లక్షితము) ఇల్లుగాని, కాకి కాదు; ఇందు 'లక్షణమును' విడిచిపెట్టి 'లక్షితమును' గ్రహించుచున్నాము. ఇది 'జహల్లక్షణము', రంగురంగుల వస్తువులను గూర్చి మాట్లాడుకొను చున్నప్పుడు, 'నాకు నీలిరంగు ఇష్టము' అన్నప్పుడు, ఆ నీలిరంగు ఏ వస్తువును ప్రత్యేకముగా నిర్దేశించు చున్నదో అది ఇష్టము అని అర్థము. ఇందులో చెప్పబడని దానిని ఇది తెలుపును గాబట్టి-అజహల్లక్షణమయినది-ఈ రెండింటి మిశ్రమము. జహదజహల్లక్షణము-ఇవన్నియును సాంకేతిక పదములు).

248, 249. స దేవదత్తోఽయమితీహ చైకతా
విరుద్ధధర్మాంశమపాస్య కథ్యతే
యథా తథా తత్త్వమసీతి వాక్యే
విరుద్ధధర్మానుభయత్ర హిత్వా
సంలక్ష్య చిన్మాత్రతయా సదాత్మనో-
రఖండభావః పరిచీయతే బుధైః
ఏవం మహావాక్యశతేన కథ్యతే
బ్రహ్మాత్మనోరైక్యమఖండభావః

'ఆ దేవదత్తుడే ఇతడు' అను వాక్యములో విరుద్ధ ధర్మములు గల (ఆ, ఈ) మాటలను విడిచిపెట్టి, అసలు వ్యక్తి యొక్క ఏకత్వమును ఏ విధముగా తెలుసుకొను చున్నామో, ('ఆ మనిషే-ఈమనిషి' అన్నప్పుడు 'ఆ', 'ఈ' అన్నవి వేరు వేరు దేశ కాలములందు కనుపించిన వ్యక్తి గూర్చి చెప్పబడినను, ఆ మాటలచే నిర్దేశింపబడిన వ్యక్తి ఒక్కడే అని మనము ఏ విధముగా గ్రహించగలుగుచున్నామో), అదే విధముగా 'అదే నీవు' (తత్త్వమసి) అను మహావాక్యములో విరుద్ధ లక్షణములు గల వాటిని, రెండింటి యందును విడిచిపెట్టి, రెండింటియందు (ఒకే విధముగా గల) చిన్మాత్రతత్త్వము వలన, జీవాత్మ పరమాత్మలయందు అభిన్నమయిన అఖండ తత్త్వమును పండితులు తెలుసుకొనుచున్నారు. ఈ విధముగా పలు మహావాక్యములచే జీవబ్రహ్మైక్య సత్యమును, వాటి అఖండత్వమును గూర్చి చెప్పబడినది.

## ధ్యాన మార్గము (250-253) :

250. అస్థూలమిత్యేతదసన్నిరస్య
సిద్ధం స్వతో వ్యోమవదప్రతర్క్యం
అతో మృషామాత్రమిదం ప్రతీతం
జహీహి యత్స్వాత్మతయా గృహీతం
బ్రహ్మాహమిత్యేవ విశుద్ధబుద్ధ్యా
విద్ధి స్వమాత్మానమఖండబోధమ్.

(పరమాత్మ) 'స్థూలముయినదికాదు' (అను శ్రుతివాక్యములవలన), ఈ అసత్ ప్రపంచమును (అనాత్మను) విడిచిపెట్టి, స్వతః సిద్ధుడు, ఆకాశమువలె (దేనికిని అంటనివాడు) ఆలోచనలకు అందనివాడు, (అప్రతర్క్యం), అని పరమాత్మను గ్రహించదగినవాడు. కావున (ఇంద్రియ మనోబుద్ధులకు గోచరమగు) ఈ దృశ్య ప్రపంచమంతటిని, 'నేను' అను భావము కలిగించు ఈ శరీరాదులను విడిచిపెట్టి, 'నేను బ్రహ్మమును' అని, పరిశుద్ధమయిన బుద్ధిచేత తలంచుచు, నిన్ను నీవే అఖండ జ్ఞానస్వరూపమయిన పరమాత్మగ తెలిసికొనుము.

251. మృత్కార్యం సకలం ఘటాది సతతం మృన్మాత్రమేవాహితం
తద్వత్సజ్జనితం సదాత్మకమిదం సన్మాత్రమేవాఖిలమ్,
యస్మాన్నాస్తి సతః పరం కిమపి తత్సత్యం స ఆత్మా స్వయం
తస్మాత్ త్త్వమసి ప్రశాంతమమలం బ్రహ్మాద్వయం యత్పరమ్.

మట్టితో చేయబడిన కుండలన్నియును ఎల్లప్పుడు మట్టి మాత్రమేనని(మనము తెలుసు కొనుచున్నట్లు), సత్స్వరూపమయిన (బ్రహ్మము) వలన కలిగిన ఈ జగత్తంతయు, బ్రహ్మముతో నిండియున్నది. అందులో బ్రహ్మము (సత్)తప్ప వేరేమియును లేదని తెలుసుకొనవలెను. బ్రహ్మమునకు భిన్నమయినది ఏమియు (ఈ జగత్తున) లేదు కావున, జీవాత్మ కూడ స్వయముగా బ్రహ్మ స్వరూపమయినదే; ఇది సత్యము. కావున, ప్రశాంతమయిన, నిర్మలమయిన, అద్వితీయమయిన, ఇంద్రియా గోచర మయిన బ్రహ్మము—అదే నీవు (తత్వమసి), (అని తెలిసికొనుము).

252. నిద్రాకల్పితదేశకాలవిషయజ్ఞాత్రాది సర్వం యథా
మిథ్యా తద్వదిహాపి జాగ్రతి జగత్స్వాజ్ఞానకార్యత్వతః
యస్మాదేవమిదం శరీరకరణప్రాణాహమాద్యప్యసత్
తస్మాత్తత్త్వమసి ప్రశాంతమమలం బ్రహ్మాద్వయం యత్పరం

నిద్రలో కల్పింపబడిన (కలలో కనబడు) ప్రదేశములు, వివిధ కాలములు, భిన్న విషయములు, (వీటన్నింటిని తెలుసుకొనుచున్నాను అను) జ్ఞాత—ఈ సర్వము ఏ విధముగా అసత్యమని (మిథ్య అని), మనము తెలుసుకొను చున్నామో, ఆ విధముగానే, ఈ జాగ్రదవస్థయందు కూడ, తన అజ్ఞానము వలన కల్పింపబడిన ఈ జగత్తు ఈ శరీరము, ఇంద్రియములు, ప్రాణము, అహంకారము మొదలగునవి అన్నియును అసత్యములని (గ్రహించవలెను). కావున ప్రశాంతమయిన, నిర్మలమయిన, అద్వి తీయమయిన, ఇంద్రియాగోచరమయిన, బ్రహ్మము—'అదే నీవు' (తత్వమసి) (అని గ్రహించుము).

253. యత్ర భ్రాంత్యాకల్పితం తద్వివేకే
తత్తన్మాత్రం నైవ తస్మాద్విభిన్నం
స్వప్నే నష్టం స్వప్నవిశ్వం విచిత్రం
స్వస్మాద్భిన్నం కిన్ను దృష్టం ప్రబోధే

ఎచ్చోట భ్రాంతివలన కలిగిన (నానాత్వము) కనుపించుచున్నదో, అచ్చోటనే విచక్షణా జ్ఞానమువలన (భ్రాంతి తొలగిపోగా), కేవల పరబ్రహ్మము మాత్రమే(గోచరించును): అంతకు భిన్నమయినదేదియును ఉండదు. కలలో కనబడు స్వప్నప్రపంచమంతయును, మెలుకువరాగానే, విచిత్రముగా కరిగిపోయి, తనకన్న భిన్నమయిన (స్వప్న ప్రపంచ కము) ఏదియు లేదని తెలుసుకొనుచున్నాము. (అట్లే అజ్ఞాన జనిత జగత్తుకూడ).

## ధ్యానాలంబన (254-266) :

254. జాతినీతికులగోత్ర దూరగం
నామరూప గుణదోషవర్జితమ్
దేశకాల విషయాతివర్తి యద్
బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని

జాతి, నీతి, కులము, గోత్రము లేనిది, నామము, రూపము, గుణములు మొదలగు దోషములు లేనిది, దేశము, కాలము, విషయములు-వీటికి అతీతమయినది అయిన బ్రహ్మ స్వరూపము – అది నీవే (తత్త్వమసి) అని నీలో నీవు సదా భావించుచుండుము (ధ్యానించుచుండుము).

255. యత్పరం సకలవాగగోచరం
గోచరం విమలబోధచక్షుషః
శుద్ధచిద్ఘనమనాదివస్తు యద్
బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని.

ఎల్లవాక్కులకు (సకల శాస్త్రముల వలన) అనిర్వచనీయమయినది, శుద్ధమయిన జ్ఞాన చక్షువుచేత మాత్రమే ఎరుగదగునది, నిర్మలమయిన జ్ఞానము యొక్క రాశివంటిది (శుద్ధ చిత్ఘనం), ఆదిలేనిది, అయిన ఆ బ్రహ్మస్వరూపము—అది నీవే (తత్త్వమసి) అని నీలో నీవే భావించుచుండుము.

256. షడ్భిరూర్మిభిరయోగి యోగిహృద్-
భావితం న కరణైర్విభావితమ్
బుద్ధ్యవేద్య మనవద్యమస్తి, యద్
బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని.

ఆరు విధములయిన దుఃఖకారణములచే తాకబడనిది,+ యోగీశ్వరులచే హృదయము నందు ధ్యానింపబడునది. ఇంద్రియములకు అగోచరమయినది, బుద్ధిచేత తెలుసుకొన వీలు లేనిది, నిందలకు అందనిది (అనవద్యం), అయిన బ్రహ్మస్వరూపము- అది నీవే (తత్త్వమసి) అని నీలోనీవు సదా భావించుకొనుచుండుము.

+ షడూర్మలు:- ఆరు దుఃఖకారణములు - అవిఏమన - 1) ఆకలి, 2) దప్పిక, 3) శోకము 4) మోహము 5) ముసలితనము, 6) మృత్యువు,

257. భ్రాంతి కల్పిత జగత్కలాశ్రయం
స్వాశ్రయం చ సదసద్విలక్షణం
నిష్కలం నిరుపమానవృద్ధి యద్
బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని

భ్రాంతి చేత కల్గిన ఈ జగత్తునకు, అందలి విభాగములకు మూలాధారముయినదియు, తనకు తానే ఆధారభూతముయినదియు, స్థూల, సూక్ష్మములకంటె భిన్నముయినదనియు (సదసద్విలక్షణం), వేరు వేరు భాగములు లేనిదియు (నిష్కలం), దేనితోను పోల్చ రానిదియు (నిరుపమం) అయిన బ్రహ్మము- అది నీవే (తత్త్వమసి) అని నీలో నీవు సదా భావించుచుండుము.

258. జన్మవృద్ధిపరిణత్యపక్షయ-
వ్యాధినాశనవిహీనమవ్యయం
విశ్వసృష్ట్యవవిఘాత కారణం
బ్రహ్మతత్త్వమసి భావయాత్మని

పుట్టుట, పెరుగుట, పరిమితిచెందుట, క్షీణించుట, జబ్బుపడుట, చనిపోవుట, - అను మార్పులు లేనిదియు, తరుగు లేనిదియు, ఈ ప్రపంచమునకు సృష్టి, స్థితి, లయ కారణ ముయినదియు, అయిన ఈ బ్రహ్మము-అదేనీవు (తత్త్వమసి) అని నీలోనీవు సదా భావింపుము.

259. అస్తభేదమనపాస్తలక్షణం
నిస్తరంగజలరాశినిశ్చలం
నిత్యముక్తమవిభక్త మూర్తి యద్
బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని.

అన్ని విభేదములను తనలో విలీనము చేసుకొన్నదియు (అస్తభేదం), లేకపోవుట అన్నది లేనిదియు (అనపాస్త లక్షణం - ఎల్లప్పుడు ఉండునట్టిదియు), తరంగములు లేని జలరాశివలె నిశ్చలముగానుండు నట్టిదియు, సదా ముక్తముయినదియు (అపరిణా విక్షేపశక్తులకు లోబడనిదియు), విభిన్నత్వము లేనిదియు, అయిన బ్రహ్మము — దీనివే (తత్త్వమసి) అని నీలో నీవు సదా భావించుకొనుచుండుము.

260. ఏకమేవ సదనేక కారణం
కారణాంతరనిరాసకారణం
కార్యకారణ విలక్షణం స్వయం
బ్రహ్మతత్త్వమసి భావయాత్మని.

సత్యస్వరూపము ఒక్కటే అయినను, అనేకత్వమునకు కారణమయినదియు, ఏ కారణములేని తనకు తానే కారణమయినదియు, కార్యకారణములకతీతమయినదియు, అయిన బ్రహ్మము- అదేనీవు (తత్త్వమసి) అని నీలోనీవు సర్వదా భావించుకొనుచుండుము.

261. నిర్వికల్పకమనల్పమక్షరం
యత్ క్షరాక్షర విలక్షణం పరం
నిత్యమవ్యయసుఖం నిరంజనం
బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని.

నిర్వికల్పికమయినదియు (మాయాతీతమయినదియు), అల్పత్వము లేనిదియు (మహోన్నత మయినదియు), నాశములేనిదియు, (అక్షరం), నాశవంతమయిన దృశ్యప్రపంచమునకు (క్షరం) దానికి కారణమై అనాది, అవినాశి అయిన మాయకు (అక్షరం) - ఈ రెండింటికి విలక్షణమయినదియు, పరమమయినదియు (ఇంద్రియ మనోబుద్ధులకతీతమయినదియు), ఎల్లప్పుడు తరుగులేని సుఖస్వరూపముగలదియు, (నిత్యావ్యయ సుఖం), మాలిన్యములేనిదియు (నిరంజనం- పూర్వవాసనలులేనిదియు), అయిన బ్రహ్మము — అదేనీవు (తత్త్వమసి) అని నీలోనీవు సర్వదా భావించుచుండుము.

262. యద్విభాతి సదనేకధా భ్రమా—
న్నామరూపగుణవిక్రియాత్మనా
హేమవత్స్వయమవిక్రియం సదా
బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని.

ఒకే బంగారము పలు ఆభరణములుగా ఎట్లు కనబడుచున్నదో, అట్లే ఒకే సత్పదార్థమయిన బ్రహ్మము భ్రాంతి వలన కలిగిన నామ, రూప, గుణ, క్రియావిభేదముల వలన అనేకములుగా కనబడుచున్నది. అట్టిబ్రహ్మము - అదేనీవు (తత్త్వమసి) అని నీలోనీవు సర్వదా భావించుకొనుచుండుము.

263. యచ్ఛశాస్త్రైన పరం పరాత్పరం
ప్రత్యగేకరస మాత్మలక్షణం
సత్యచిత్సుఖమనంత మవ్యయం
బ్రహ్మ తత్త్వమసి భావయాత్మని

తనకు అతీతమయినదేదియు లేనట్టిదియు (అనపరం), జగత్కారణమయిన మాయకే కారణమయినదియు (పరాత్పరం), ప్రతిజీవియందు ఏకరసముగా (ఒకే స్వభావము కలదిగా) కనబడు ప్రత్యగాత్మ లక్షణముకలదియు, సత్-చిత్-సుఖ స్వరూపమై, అనంతమయినదియు, అవ్యయమయినదియు,- అయిన బ్రహ్మము-అదేనీవు (తత్త్వమసి) అని నీలోనీవే సదా భావించుచుండుము.

264. ఉక్తమర్థమిమమాత్మని స్వయం
భావయేత్ప్రథితయుక్తిభిర్ధియా
సంశయాదిరహితం కరాంబువత్
తేన తత్త్వనిగమో భవిష్యతి.

(పై పది శ్లోకములలో) చెప్పిన దానియందలి పరమార్థమును, తనలోతాను ప్రసిద్ధి పొందిన యుక్తులను (తర్కపద్ధతులను) ఆధారముగ తీసుకొని, స్వబుద్ధితో (హృదయము నందు) భావించుచుండవలెను. అప్పుడు బ్రహ్మతత్త్వము, అరచేతిలోగల నీటివలె సంశయములులేకుండ అవగతమగును.

265. సంబోధమాత్రం పరిశుద్ధతత్త్వం
విజ్ఞాయ సంఘే నృపవచ్చ సైన్యే
తదాశ్రయః స్వాత్మని సర్వదా స్థితో
విలాపయ బ్రహ్మణి విశ్వజాతం.

శరీరేంద్రియ ప్రాణాహంకార సమూహమునందు (సంఘే), గల ఆత్మ తత్త్వము పరిశుద్ధతత్త్వము కలదై, (శరీర మనోబుద్ధుల వాసలతో కూడనిదై), స్వబోధమాత్రమై (సర్వాతీత స్థితిలో, తనను తానే ప్రకాశింపజేసుకొనునదై), సాధారణ సైనికుల మధ్యన విరాజమానమగు రాజువలె వెలుగొందుచు (రాజు ప్రభువు: సైనికులు అతని ఆజ్ఞలు పాలించు సాధారణ జీవులు; అట్లే బ్రహ్మము—శరీరాది సంఘము

మిథ్య సంబంధము): ఉన్న బ్రహ్మమును ఆశ్రయించి, తన ఆత్మయందే, (ఆత్మ జ్ఞానమునందే), సదా నిలచుచు, ఈ ప్రపంచమును బ్రహ్మమునందు లయ పరుపుము.

266. బుద్ధౌ గుహాయాం సదసద్విలక్షణం
బ్రహ్మాస్తి సత్యం పరమద్వితీయం
తదాత్మనా యోఽత్ర వసేద్గుహాయాం
పునర్న తస్యాంగ గుహాప్రవేశః

సత్యమయిన, పరమమయిన, అద్వితీయమయిన, స్థూల సూక్ష్మముల కతీతమయిన, పరబ్రహ్మ స్వరూపము బుద్ధి యొక్క గుహలో (హృదయకుహరము నందు) ఉండును (ప్రకటితమగును). ఆ హృదయకుహరమునందు ఆత్మ సాన్నిధ్యమున నివసించువానికి తిరిగి తల్లిగర్భమును (అంగగుహా) ప్రవేశించవలసిన అవసరము లేదు. (బ్రహ్మతత్త్వమును తెలుసుకొని, ఆ బ్రహ్మమునందే సదా నిలచువానికి పునర్జన్మ ఉండదు).

## వాసనలను విడిచిపెట్టుట : (267–276) :

267. జ్ఞాతే వస్తున్యపి బలవతీ వాసనాఽనాదిరేషా
కర్తా భోక్తాప్యహమితి దృఢా యాఽస్య సంసారహేతుః
ప్రత్యగ్దృష్ట్యాఽఽత్మని నివసతా సాఽపనేయా ప్రయత్నా–
న్ముక్తిం ప్రాహుస్తదిహ మునయో వాసనాతానవం యత్

ఆత్మతత్త్వమును ఎరిగిన పిదప కూడ, ఆదిలేనిది, అతిబలవంతమయినది అయిన — 'నేను కర్తను, నేను భోక్తను' (నేను చేయుచున్నాను, నేను అనుభవించుచున్నాను) అను భావము మనసులో దృఢముగా (పోవకొనిపోయి) ఉండును. అదే సంసార హేతువగుచున్నది (జనన మరణ కారణ మగుచున్నది.) అంతర్ దృష్టితో సదా ఆత్మయందే నిలచి, (ఆకర్తృత్వ, భోక్తృత్వ భావమును— 'అహం' భావమును), ప్రయత్న పూర్వకముగా, తొలగించవలెను. ఈ వాసనలను లేకుండ చేసుకొనుటయే, (వాసనాతానవం) ముక్తి అని మునీశ్వరులు చెప్పుచుందురు. అది (ఆవాసనలను తొలగించుట) ఇక్కడే చేయవలెను.

268. అహం మమేతి యో భావో దేహాక్షాదావనాత్మని
అధ్యాసోఽయం నిరస్తవ్యో విదుషా స్వాత్మనిష్ఠయా

అనాత్మ అయిన దేహేంద్రియాదుల యందు 'నేను, నాది' (అహం, మమ) అను భావము, ఆత్మయందు ఆరోపింపబడినది. దానిని పండితులు స్వాత్మనిష్ఠవలన (తన ఆత్మయందే సదా నిలిచి యుండుటవలన) తొలగించవలెను.

269. జ్ఞాత్వా స్వం ప్రత్యగాత్మానం బుద్ధి తద్వృత్తిసాక్షిణం
సోఽహమిత్యేవ సద్వృత్త్యానాత్మన్యాత్మమతిం జహి

బుద్ధికి, అందలివృత్తులకు సాక్షీభూతుడయిన తన ఆత్మను, (ప్రత్యగాత్మను), 'నేనే అతడు' (సోఽహం) అను సద్వృత్తి వలన (సద్ భావన వలన), 'ఈ అనాత్మయే నేను' అను అపోహను (అనాత్మని+ఆత్మమతిం) విడిచిపెట్టవలెను.

270. లోకానువర్తనం త్యక్త్వా త్యక్త్వా దేహానువర్తనం
శాస్త్రానువర్తనం త్యక్త్వా స్వాధ్యాసాపనయం కురు

లోకానువర్తనము (లోకపు పోకడలను గుడ్డిగా అనుసరించుట), దేహానువర్తనము (శరీర మనోబుద్ధులు కల్పించు వ్యామోహములను గుడ్డిగా అనుసరించుట), శాస్త్రానువర్తనము (శాస్త్రములను—వాటి అంతరార్థములను గ్రహించక—విచక్షణా శూన్యముగా గుడ్డిగానమ్మి వానిని అనుసరించుట), ఈ మూడింటిని విడిచిపెట్టి, నీ ఆత్మతత్త్వమును కప్పి ఉంచిన, (వాసనలను) తొలగింపుము. ('నేను ఆత్మను' అనుభావమును మరుగుపరచి, 'నేను ఈ శరీర మనో బుద్ధ్యహంకారములతో కూడిన జీవిని' అను భావము ఆరోపింపబడినది—దానిని 'అధ్యాసము' అందురు).

271. లోకవాసనయా జంతోః శాస్త్రవాసనయాపి చ
దేహవాసనయా జ్ఞానం యథావన్నైవ జాయతే

(పైన చెప్పబడిన) లోకవాసన వలన, శాస్త్రవాసన వలన, దేహవాసన వలన- (వాటి ఉధృతము వలన) మనిషి సరిఅయిన జ్ఞానమును (ఆత్మజ్ఞానమును), పొందలేక పోవుచున్నాడు.

275. అనాత్మవాసనాజాలై స్తిరోభూతాత్మవాసనా
నిత్యాత్మనిష్ఠయా తేషాం నాశే భాతిస్వయం స్ఫుటం

అనాత్మ వాసనల వలలలో చిక్కుకొని, ఎరుకపడని ఆత్మవాసన, నిత్యాత్మ—నిష్ఠలో ఉన్నవారికి (ఎల్లప్పుడు ఆత్మ భావనయందే,— 'నేనే ఆత్మను' అను భావనలో నిలచు వారికి), ఆ అనాత్మ వాసనలు తొలగిపోయి, ఆత్మజ్ఞానము స్వయముగా ప్రకాశించును.

276. యథా యథా ప్రత్యగవస్థితం మన—
స్తథా తథా ముంచతి బాహ్యవాసనాః
నిఃశేషమోక్షే సతి వాసనానా—
మాత్మానుభూతిః ప్రతిబంధశూన్యా

అంతరాత్మయందు (ఆత్మధ్యానము నందు) మనస్సు, ఎప్పుడెప్పుడు నిలకడను పొందునో (ఎంతమట్టుకు నిలకడను పొందునో), అప్పుడప్పుడు (అంతమట్టుకు) బాహ్యవాసనలు తొలగిపోవును. బాహ్య వాసనలన్నియు, నిశ్శేషముగా నశించి పోవునప్పుడు, ఎట్టి ప్రతిబంధకములు లేకుండనే, ఆత్మానుభవము కలుగును.

## అధ్యాసాపనయము (277–292) :

277. స్వాత్మన్యేవ సదా స్థిత్వా మనో నశ్యతి యోగినః
వాసనానాం క్షయశ్చాతః స్వాధ్యాసాపనయం కురు

(అధ్యాసము=ఆరోపితము; సత్స్వరూపమయిన ఆత్మయందు, అసత్ పదార్థమయిన దేహాది జీవభావమును ఆరోపించుట 'అధ్యాసము' అగును—మిథ్యాజ్ఞానము అని కూడ అర్థము).

తన ఆత్మలోనే ఎల్లప్పుడును నిలచు యోగీశ్వరునకు మనస్సు నశించిపోవును. మనోనాశము వలన వాసనలు పూర్తిగా తొలగిపోవును. అందుచేత, (ఈ దేహమే నేను అను) నీయొక్క మిథ్యాజ్ఞానమును తొలగించుము. (స్వ+అధ్యాస+అపన యం కురు).

278. తమో ద్వాభ్యాం, రజః సత్త్వాత్సత్త్వం శుద్ధేన నశ్యతి
తస్మాత్సత్త్వమవష్టభ్య స్వాధ్యాసాపనయం కురు,

తమో గుణము (సత్వరజోగుణముల) రెండింటి వలనను, రజోగుణము సత్వ గుణముపలనను, సత్వగుణము (దానిని మరింత) పరిశుద్ధపరచుట వలనను తొలగి పోవును. కావున సత్వమును ఊతగా గొని, నీలోగల జీవభావమును విడిచిపెట్టుము.

279. ప్రారబ్ధం పుష్యతి వపురితి నిశ్చిత్య నిశ్చలః
ధైర్యమాలంబ్య యత్నేన స్వాధ్యాసాపనయం కురు

(ఈ శరీరము కలుగుటకు కారణమయిన) ప్రారబ్ధకర్మయే ఈ దేహమును (అవసర మున్నంతవరకు) నిలుపునని నిశ్చయముగా తెలుసుకొని, (శరీర పోషణాదులగూర్చి తాపత్రయపడక), నిశ్చలుడవై, ధైర్యముతో, ప్రయత్నపూర్వకముగా (నేను ఈ శరీరమును అను) మిథ్యాజ్ఞానమును విడిచిపెట్టుము.

280. నాహం జీవః పరంబ్రహ్మేత్యతద్వ్యావృత్తిపూర్వకమ్
వాసనావేగతః ప్రాప్తస్వాధ్యాసాపనయం కురు

'నేను జీవుడను. నేను బ్రహ్మమును' అనుభావన ద్వారా (మనోవృత్తి ద్వారా), వాసనల ఉద్ధృతము వలన కలిగిన జీవభావమును (మిథ్యా జ్ఞానమును) పరిత్య జించుము.

281. శ్రుత్యా యుక్త్యా స్వానుభూత్యా జ్ఞాత్వాసార్వాత్మ్యమాత్మనః
క్వచిదాభాసతః ప్రాప్త స్వాధ్యాసాపనయం కురు

శ్రుతుల వల్లను (శ్రవణము వల్లను), యుక్తియుక్తముగా ఆలోచించుట వల్లను (మననము), స్వానుభవమువల్లను (నిదిధ్యాసము వలనను), సర్వాత్మతత్వమయిన పరమాత్మ (నీవే అని) తెలుసుకొని, జీవభావన రూపకమైన మిథ్యాజ్ఞానమును, ఏకొద్దిగ మిగిలినను దానిని తొలగించుము.

282. అన్నాదానవిసర్గాభ్యామీషన్నాస్తి క్రియా మునేః
తదేకనిష్ఠయా నిత్యం స్వాధ్యాసాపనయం కురు

ఆత్మభావన ఒక్కదానియందే సదా నిలచియున్న మునులకు, ఆహార విసర్జనాదుల యందు, (విషయస్పందన ప్రతిస్పందనలయందు), ఈషణ్మాత్రమయినను(ఏకొంచెము కూడ) చేయుదగునది ఉండదు. (వాటియందు వారు ఏమాత్రము ఇచ్ఛ చూపరు). అందుచేత, దేహమే ఆత్మయను మిథ్యాభావమును విడిచిపెట్టుము.

283. తత్త్వమస్యాదివాక్యోత్థబ్రహ్మాత్మైకత్వబోధతః
బ్రహ్మణ్యాత్మత్వదార్ఢ్యాయ స్వాధ్యాసాపనయం కురు

'తత్త్వమసి' మొదలగు మహావాక్యముల నాధారముగ తీసుకొని, బ్రహ్మాత్మైకత్వభావమును తెలుసుకొని, 'నేనే బ్రహ్మమును' అను భావము దృఢముగా నాటుకొనుటకు నేను జీవుడను అను మిధ్యాజ్ఞానమును విడిచిపెట్టుము.

284. అహంభావస్య దేహేఽస్మిన్నిః శేషవిలయావధి
సావధానేన యుక్తాత్మా స్వాధ్యాసాపనయం కురు

ఈ దేహమునందలి 'అహం' భావము(ఈ దేహమే నేను అను భావము)నిశ్శేషముగ నశించువరకు, సావధానముతో (జాగరూకతతో), అచంచల మనస్సుతో(యుక్తాత్మా) మిథ్యాజ్ఞానము పారద్రోలుము.

285. ప్రతీతిర్జీవజగతోః స్వప్నవద్భాతి యావతా
తావన్నిరంతరం విద్వాన్స్వాధ్యాసాపనయం కురు

ఈ జీవుడు, జగత్తు స్వప్నతుల్యముగా అనుభవమగువరకు, (లేక, స్వప్నతుల్యముగానైనను అనుభవమగుచున్నంతవరకు)అప్పటివరకు, ఓ విద్వాంసుడా, నిరంతరముగా, దేహాత్మభావమును (మిథ్యాజ్ఞానమును) తొలగించుము.

286. మాతాపిత్రోర్మలోద్భూతం మలమాంసమయం వపుః
త్యక్త్వా చండాలవద్దూరం బ్రహ్మీభూయ కృతీ భవ

తల్లిదండ్రుల మలిన(సంపర్కము) వలన కలిగినదియు, మల మాంసములతో నిండినదియు అయిన ఈ దేహమును అంటరానిదానివలె దూరముగానుంచి, బ్రహ్మీభూతుడవై, (బ్రహ్మమునందు నిలచినవాడవై) కృతార్థుడవుకమ్ము.

287. నిద్రాయా లోకవార్తాయాః శబ్దాదేరపి విస్మృతేః
క్వచిన్నావసరం దత్త్వా చింతయాత్మానమాత్మని

నిద్రవలనగాని, లోకవ్యవహారములవలనగాని, శబ్దాదులవలనగాని (కలిగిన అవరోధము), నీవు ఆత్మను మరచునట్లు చేయుటకు ఏమాత్రమును అవుసరము కల్పించవక

(అవకాశమును ఈయక), (బాహ్యస్పర్శలవలన ఏమాత్రము చలింపక), ఆత్మచే ఆత్మనే తలంచుచుండుము (ఆత్మధ్యానమునందే నిరంతరము నిలచియుండుము).

288. ఘటాకాశం మహాకాశ ఇవాత్మానం పరాత్మని
విలాప్యాఖండభావేన తూష్ణీంభవ సదా మునే

ఓ మునీశ్వరుడా ! మహాకాశమునందు ఘటాకాశము పూర్తిగా కలసిపోవునట్లు, పరమాత్మయందు నీ ఆత్మను విలీనముచేసి (భిన్నత్వములేని), అఖండభావముతో ఎల్లప్పుడు తూష్ణీభావముతో (అపరిమితమయిన ప్రశాంతభావముతో) ఉండుము.

289. స్వప్రకాశమధిష్ఠానం స్వయంభూయ సదాత్మని
బ్రహ్మాండమపి పిండాండం త్యజ్యతాం మలభాండవత్

(నిరంతరాత్మధ్యానమువలన) కలిగిన ఆత్మభావనవలన— అన్నింటికి ఆధారభూతము, స్వయంప్రకాశము అయిన ఆ పరమాత్మ స్వయముగా నీవే అని గ్రహించి (స్వయం భూయ), బ్రహ్మాండమును (జగత్తును), పిండాండమును (శరీరమును), మలముతో నిండిన కుండలవలె పరిత్యజింపుము.

290. చిదాత్మని సదానందే దేహారూఢమహంధియం
నివేశ్య లింగముత్సృజ్య కేవలో భవ సర్వదా

శరీరముపై ఉంచబడిన 'నేను' అను భావమును(ఈ శరీరమే నేను అను భావమును), ఆ శరీరమునుండి విడదీసి), సచ్చిదానంద స్వరూపుడయిన బ్రహ్మమునందు ప్రవేశ పెట్టి, (దేహాత్మభావమును విడచి, బ్రహ్మాత్మభావమును పొంది), సూక్ష్మశరీరమును (లింగ శరీరమును) త్యజించి, ఎల్లప్పుడును కేవలుడవై(అద్వితీయుడవై)యుండుము. (బ్రహ్మభూతుడవై యుండుము).

291. యత్రైష జగదాభాసో దర్పణాంతః పురం యథా
తద్బ్రహ్మాహమితి జ్ఞాత్వా కృతకృత్యో భవిష్యసి.

అద్దములో కనబడు పట్టణమువలెనే, ఈ జగత్తంతయును బ్రహ్మముయొక్క అభాస (ప్రతిబింబము — ఆరోపితము) మాత్రమే అని గ్రహించి, అట్టి బ్రహ్మము నేనే అని తెలిసికొనినంతనే, కృతకృత్యుడవు అగుదువు. (ఈ ప్రపంచము యొక్క మిథ్యా తత్వమును బాగుగా తెలిసికొనినంతనే బ్రహ్మజ్ఞానము తనంత తానే కలుగును).

292. యత్సత్యభూతం నిజరూపమాద్యం
చిదద్వయానందమరూపమక్రియమ్
తదేత్య మిథ్యావపురుత్సృజేత
శైలూషవద్వేషముపాత్తమాత్మనః

(అన్నింటికిని) ఆది అయినదియు, సత్యమయినదియు, చిదానందస్వరూపమైనదియు, అద్వితీయమయినదియు, రూపము లేనిదియు, క్రియారహితమయినదియు అయిన ఆ పరబ్రహ్మమే నీ నిజస్వరూపముగా గ్రహించి, ఈ మిథ్యాశరీరమును (నాటకము అయిపోయిన పిమ్మట), వేషధారి తన వేషమును త్యజించునట్లు(అంతటి అనాసక్తితో) విడిచిపెట్టవలెను.

## జీవ మిథ్యాతత్వము (293–297):

293. సర్వాత్మనా దృశ్యమిదం మృషైవ
నైవాహమర్థః క్షణికత్వదర్శనాత్
జానామ్యహం సర్వమితి ప్రతీతిః
కుతోఽహమాదేః క్షణికస్య సిద్ధ్యేత్

సర్వాత్మదృష్టితో చూచినప్పుడు, ఈ దృశ్యప్రపంచము ఉనికిలేనిది (మృషా): 'అహం'భావము కూడ (జీవుడు కూడ) క్షణికదర్శనత్వము వలన (క్షణక్షణమునకు అవస్థాభేదము చెందుచుండుటవలన), సత్పదార్థముకాదు (నిజమయినదికాదు): అట్టి ఎడ, 'నేను ఈ ప్రపంచమును తెలుసుకొనుచున్నాను' అనుభావన — క్షణికస్వభావము గల జీవాదులకు ఎట్లు ఉండగలదు ? (నిజముకాని 'అహం'భావము, ఉనికిలేని ప్రపంచమును తెలుసుకొనుట' అనునది ఎట్లు సంభవము ?)

294. అహంపదార్థస్త్వహమాది సాక్షీ
నిత్యం సుషుప్తావపి భావదర్శనాత్
బ్రూతే హ్యజో నిత్య ఇతి శ్రుతిః స్వయం
తత్ప్రత్యగాత్మా సదసద్విలక్షణః

'అహం' పదమునకు (సరిఅయిన) అర్థముగా (అహం పదార్థం) చెప్పబడిన ప్రత్యగాత్మ — ఈ జీవుడు, (ఈ దృశ్యప్రపంచము) మొదలయినవానికి సాక్షీభూతునిగా ఉన్నాడు. అది నిత్యమయినది. (ఏలనగా), గాఢనిద్రలో కూడ (నిజము వేదు

అను భావమును) తెలుసుకొనుచుండును. జన్మలేనిది, నిత్యమయినది అని శ్రుతులు స్వయముగా చెప్పుచున్నవి. ఈ ప్రత్యగాత్మ స్థూల సూక్ష్మములకంటె (సత్ + అసత్‌ల కంటె) విలక్షణమయినది — (వేరు లక్షణములు కలది — భిన్నమయినది).

295. వికారిణాం సర్వవికారవేత్తా
నిత్యోఽవికారో భవితుం సమర్హతి
మనోరథ స్వప్నసుషుప్తిషు స్ఫుటం
పునః పునర్దృష్టమసత్వమేతయోః

మార్పులు చెందుచున్నవాటిలో (వికారిణాం) కలుగుచున్న మార్పులనన్నింటిని తెలుసుకొనువాడు (సర్వవికారవేత్తా), తాను మాత్రము ఎప్పుడు కూడ మార్పులుచెందకుండ (నిత్య+అవికారః) ఉండుటకు అర్హుడయినవాడు. (మార్పులు తెలుసుకొనువాడు మార్పులు చెందనివాడై యుండవలెను). స్థూల సూక్ష్మశరీరముల యొక్క నాస్తికత (లేకుండుట — అస్థిరత్వము). ఊహలయందు, స్వప్నములయందు, గాఢనిద్రయందు స్పష్టముగా, మాటిమాటికి తెలియుచునేయున్నది. (మేలుకొని ఉన్నప్పుడు స్వప్న ప్రపంచము — స్వప్నజ్ఞాత ఉండరు; స్వప్నావస్థలో — జాగ్రత్ ప్రపంచము, అందలి జ్ఞాత ఉండరు; గాఢనిద్రలో రెండును — ఇద్దరును ఉండరు. కాబట్టి ఈ మూడవస్థలను తెలుసుకొనువాడు మార్పులేకుండ ఎల్లప్పుడును ఉండవలెననునది సిద్ధాంతము).

296. అతోఽభిమానం త్యజ మాంసపిండే
పిండాభిమానిన్యపి బుద్ధికల్పితే
కాలత్రయాబాధ్యమఖండబోధం
జ్ఞాత్వా స్వమాత్మానముపైహి శాంతిమ్.

అందుచేత, బుద్ధిచేత కల్పింపబడిన (మాయాకల్పితమయిన), ఈ మాంసపు ముద్ద యందు (మాంసపిండే). 'ఆ మాంసపిండమే నేను' అను భావమునందు అభిమానమును (ఆసక్తిని; సంగమును) విడిచిపెట్టుము. నీలోనున్న ఆత్మ (ప్రత్యగాత్మ). మూడు కాలములచే బాధింపబడనిదై. (నాటికి అతీతమయినదై), తిరుగులేని జ్ఞాన స్వరూపమయినదిగా తెలుసుకొని శాంతిని పొందుము.

297. త్యజాభిమానం కులగోత్రనామ-
రూపాశ్రమేష్వార్ద్రశవాశ్రితేషు
లింగస్యధర్మానపి కర్తృతాదీం
స్త్యక్త్వా భవాఖండసుఖస్వరూపః

కుళ్ళిపోవుచున్న శవము వంటి (ఆర్ద్ర శవం), ఈ శరీరమును ఆశ్రయించిన కులము, గోత్రము, నామము, రూపము, ఆశ్రమము - (ఇవన్నియును శరీరమును ఆశ్రయించి యున్నవే-శరీరము లేనిచో ఇవి ఉండవు)-వీటి యందలి అభిమానమును విడిచిపెట్టుము. సూక్ష్మ శరీరము యొక్క ధర్మములయిన కర్తృత్వ భోక్తృత్వాదులను కూడ విడిచిపెట్టుము. (స్థూల-సూక్ష్మ శరీరములందలి అభిమానమును విడిచిపెట్టి), అఖండానంద స్వరూపుడవై యుండుము.

(అఖండానందప్రాప్తికి-బ్రహ్మజ్ఞానమునకు-ఈ స్థూల సూక్ష్మ-శరీరములందలి అభిమానమే ముఖ్యమయిన అవరోధము).

**జీవభావమును విడచుట (298-309) :**

298. సంత్యన్యే ప్రతిబంధాః పుంసః సంసారహేతవో దృష్టాః
తేషామేషాం మూలం ప్రథమవికారో భవత్యహంకారః

పురుషునకు సంసార కారకములయిన ప్రతిబంధకములు ఇంకను ఎన్నో కలవు. అహంకారమే వాటన్నింటికి మూలమయినదియు, మొట్టమొదటి వికారమును అయి ఉన్నది.

299. యావత్స్యాత్స్వస్య సంబంధోఽహంకారేణ దురాత్మనా
తావన్న లేశమాత్రాపి ముక్తివార్తా విలక్షణా

దుఃఖకారకమయిన (దురాత్మ అయిన) ఈ అహంకారముతో నీకు సంబంధము ఉన్నంతవరకు (నేను ఈ శరీరాదులను అను భావము ఉన్నంతవరకు), మోక్షము గూడ ఉండదు. ('నేను ఆత్మను' అను భావన, 'నేను జీవుడను' అను భావన - ఈ రెండును ఒకేసమయములో ఒకే చోట ఉండలేవు. జీవ భావము పూర్తిగ తొలగిన గాని, 'ఆత్మభావన' కలుగదు).

300. అహంకారగ్రహాన్ముక్తః స్వరూపముపపద్యతే
చంద్రవద్విమలః పూర్ణః సదానందః స్వయంప్రభః

(రాహు గ్రహమునుండి విముక్తుడయిన) చంద్రుడు ఏ విధముగా, నిర్మలంగా, పూర్ణ రూపముతో ప్రకాశించునో, ఆ విధముగనే, ఈ అహంకార గ్రహమునుండి ముక్తి పొందిన ఆత్మ తన నిజస్వరూపముయిన, సదానందముయిన, స్వయంప్రకాశముయిన, పూర్ణరూపమును (పరబ్రహ్మ స్వరూపమును) పొందుచున్నాడు.

301. యో వా పురేసోఽహమితి ప్రతీతో
బుద్ధ్యా ప్రక్లుప్తస్తమసాఽతి మూఢయా
తస్యైవ నిఃశేషతయా వినాశే
బ్రహ్మాత్మభావః ప్రతిబంధశూన్యః

ఈ దేహమునందు, తమోగుణమునేత మోహితమై, బుద్ధిచేత కల్పింపబడి, మిక్కిలి తెలివితక్కువ వలన కలిగిన— 'ఈ దేహమును నేను' అను భావము ఎల్లప్పుడు ప్రతీతమగుచుండును. దానిని (ఆ భావమును) నిశ్శేషముగా నాశనము చేసినప్పుడే 'నేను బ్రహ్మను' అనుభావము ఎట్టి ప్రతిబంధకములు లేకనే స్థిరపడును.

302. బ్రహ్మానందనిధిర్మహాబలవతాఽహంకార ఘోరాహినా
సంవేష్ట్యాత్మని రక్ష్యతే గుణమయైశ్చండైస్త్రిభిర్మస్తకైః
విజ్ఞానాఖ్యమహాసినా శ్రుతిమతా విచ్ఛిద్య శీర్షత్రయం
నిర్మూల్యాహిమిమం నిధిం సుఖకరం ధీరోఽనుభోక్తుంక్షమః

(సత్వరజస్తమములను) భీకరములయిన మూడు పడగలు గల అహంకారమను ఒక ఘోర సర్పము బలవంతముయినదై తన ఆత్మలో (తనలో) గల బ్రహ్మానంద నిధిని చుట్టుకొని: (ఎవ్వరిని దగ్గరకు రానీకుండ) కాపాడుచున్నది (అడ్డుతగులుచున్నది), శాస్త్రజ్ఞానముతో కూడిన విజ్ఞానమను మహాఖడ్గముచే ఆ పాము యొక్క మూడు తలలను (త్రిగుణములను) ఖండించి, ఆపామును నిర్మూలించ గలిగిన ధీరుడే, ఆ ఆనందదాయకముయిన నిధిని అనుభవించుటకు అర్హుడగుచున్నాడు.

303. యావద్వా యత్కించిద్విషదోషస్ఫూర్తిరస్తి చేద్దేహే
కథమారోగ్యాయ భవేత్తద్వదహంతాపి యోగినో ముక్త్యై

శరీరమునందు ఏ కొద్దిగానయినను విషము వలన దోషము మిగిలియున్నచో, మనిషికి ఆరోగ్యమెట్లు కలుగును? ఆ విధముగనే, (ఏ కొద్దిగానయినను) 'అహం' భావము మిగిలియున్నచో, యోగులకు ముక్తిపొందుట దుర్లభము.

304. అహమోఽత్యంత నివృత్త్యా తత్కృతనానావికల్పసంహృత్యా
ప్రత్యక్తత్త్వవివేకాదయమహమస్మీతి విందతే తత్త్వమ్.

అహంకారమును నిశ్శేషముగా తొలగించి, దాని వలన కలిగిన వివిధ రకములయిన మనోవృత్తులను సంహరించి, (అవి లేకుండజేసి), తన ఆత్మయందే విచక్షణా జ్ఞానముతో తరచి చూచినప్పుడు 'ఇదే నేను అయియున్నాను' (ఇదం+అహం+అస్మి) అను తన నిజతత్త్వము అవగతమగును.

305. అహంకారేకర్తర్యహమితి మతిం ముంచ సహసా
వికారాత్మన్యాత్మప్రతిఫలజుషి స్వస్థితిముషి
యదధ్యాసాత్ప్రాప్తా జనిమృతిజరాదుఃఖబహులా
ప్రతీచశ్చిన్మూర్తేస్తవ సుఖతనోః సంసృతిరియం

ఆత్మ తేజస్సు మనోవృత్తులయందు (బుద్ధియందు) ప్రతిఫలించుట వలన కలిగిన వికార రూపమయిన, కర్తృత్వ, భోక్తృత్వ భావముకల ఈ అహంకారమును ('ఈ దేహమే నేను' అను మనోవృత్తిని) వెంటనే త్యజింపుము. అది (ఆ అహంకారము) నిన్ను నీ ఆత్మలో నిలవనీయకుండ అవరోధము కలిగించును. మిథ్యాజ్ఞానము వలన సంప్రాప్తమయిన ఈ అహంకారమువల్లనే, జనన, మరణ, జరా దుఃఖములను కలిగించి, నీ నిజస్థితి అయిన చిదానంద స్వరూపమును మరచి, సంసారములో చిక్కుకొని యుంటివి.

(కర్తృత్వభోక్తృత్వ భావనలకు పునాది అయిన ఈ అహంకారము కూడా ఒక మనోవికారమే ఒక భావమే—మనో బుద్ధులలో కలుగు వృత్తులలో చిత్ ప్రకాశము ప్రతిబింబించుట వలన, అవి స్వయంప్రకాశములయినట్లు, 'నేను చేయుచున్నాను', 'నేను తెలుసుకొనుచున్నాను,' 'నేను అనుభవించుచున్నాను' అను భావముతో వెలుగొందుచుండును. ఆ ప్రతిఫలాభాసితి మనోవికారపుంజమే ఈ అహంకారము. మనోవృత్తులు లేనిచో అహంకారము గూడ ఉండదు.)

306. సదైకరూపస్య చిదాత్మనో విభో-
రానందమూర్తేరనవద్యకీర్తేః
నైవాన్యథా క్వాప్యవికారిణస్తే
వినాహమధ్యాసమముష్య సంసృతిః

నీవు ఏకరూపుడవు; చిత్స్వరూపుడవు. ఆనందమూర్తివి; విభుడవు: అకళంక కీర్తి కలవాడవు; వికారములు (మార్పులు) లేనివాడవు; (నీవు సాక్షాత్ పరబ్రహ్మస్వరూపుడవు), 'నేను శరీరాదులను' అను మిథ్యాజ్ఞానముతో సంప్రాప్తమయిన ఈ అహంకారమే (నీ నిజతత్వమును మరుగుపరచి) నిన్ను సంసారములో త్రిప్పుచున్నది.

307. తస్మాదహంకారమిమం స్వశత్రుం
భోక్తుర్గలే కంటకవత్ప్రతీతమ్
విచ్ఛిద్య విజ్ఞానమహాసినా స్ఫుటం
భుంక్ష్వాత్మసామ్రాజ్యసుఖం యథేష్టం.

అందుచేత, అహంకారము అను ఈ నీశత్రువును—భోజనము చేయువాని గొంతుకలో ముల్లువలె గుచ్చుకున్న దానిని—ఆత్మజ్ఞానము మేటి కత్తితో పూర్తిగా ఛేదించి, ఆత్మ సామ్రాజ్య సుఖమును యథేచ్ఛగా (ఎట్టి అడ్డంకులు లేకుండ) అనుభవింపుము.

308. తతోఽహమాదేర్వినివర్త్య వృత్తిం
సంత్యక్తరాగః పరమార్థలాభాత్
తూష్ణీం సమాస్స్వాత్మసుఖానుభూత్యా
పూర్ణాత్మనా బ్రహ్మణి నిర్వికల్పః

అందువలన, అహంకారము (దాని అంగములయిన జాతికుల ఆశ్రమ ధర్మములు) అను మనోవృత్తులను తొలగించి (వాటిని ఆపి), రాగమును విడిచిపెట్టి (దేహాదుల యందు అనురాగమును, ఆసక్తిని విడిచిపెట్టి), (ఈ ప్రయత్నముల వలన కలిగిన) పరమార్థ లాభముతో (పరం+అర్థ+లాభం—తన నిజతత్వమును తెలుసుకొనుటచే), అవిభక్తమయిన (పూర్ణం), నిర్వికల్పమయిన పరబ్రహ్మమునందు నిలచి, నీలోగల ఆత్మ సుఖమును, (ఆత్మానందమును) అనుభవించుచు, ప్రశాంతతను పొందుము. (మనస్సులో వృత్తులు పూర్తిగా తొలగిపోయినప్పుడు కలుగు ప్రశాంతతే ఆత్మానందమని చెప్పవచ్చును).

309. సమూలకృత్తోఽపి మహానహం పున—
ర్వ్యుల్లేఖితః స్యాద్యది చేతసా క్షణం
సంజీవ్య విక్షేపశతం కరోతి
నభస్వతా ప్రావృషి వారిదో యథా

ఈ అహంకారము చాల లోతయినది (గహనా): దానిని సమూలముగా నాశనము చేసినను, మనస్సులో క్షణమాత్రము మరల ప్రవేశించినను, వర్షాకాలములో గాలి వలన సమీకరింపబడిన మేఘములవలె—అది పెరిగి అనేకములయిన అలజడులను (విక్షేప శతం) సృష్టించును. (అందుచేత, ఈ అహంకార విషయములో, ఎల్లవేళల జాగరూకతతో ఉండవలెను).

## చింతన, క్రియ, వాసనల విడచుట (310-319):

310. నిగృహ్య శత్రోరహమోఽవకాశః
క్వచిన్న దేయో విషయానుచింతయా
స ఏవ సంజీవనహేతురస్య
ప్రక్షీణజంబీరతరోరివాంబు

పరమ శత్రువయిన ఈ అహంకారమును నిగ్రహించిన పిమ్మట, దానికి (మనస్సునకు) విషయముల గూర్చి ఆలోచించుటకు అవకాశమును ఈయకూడదు. అట్టి ఆలోచనలే 'సంజీవిని' అగును—నీరు తగలగనే చిగురుట్టు ఎండిపోయిన నిమ్మచెట్టువలె—ఆ అహంకారమును పునరుజ్జీవింప జేయును. (అందుచేత విషయముల గూర్చిన ఆలోచనలు మనస్సులో మెదలనీయరాదు. మనస్సును సదా దైవచింతనలో, దైవకార్యములలో నిమగ్నము చేసినచో ఈ ఆలోచనలు దరికి చేరవు).

311. దేహాత్మనా సంస్థిత ఏవ కామీ
విలక్షణః కామయితా కథం స్యాత్
అతోఽర్థసంధానపరత్వమేవ
భేదప్రసక్త్యా భవబంధహేతుః

దేహాత్మభావములో (ఈ శరీరమే నేను అనుభావములో) ఉన్న వానికే విషయములయందాసక్తి కలుగును. అందుకు విలక్షణుడయిన బ్రహ్మాత్మభావము కలవానికి (నేను బ్రహ్మము అను భావము కలవానికి), అట్టి విషయవాంఛలు ఎట్లు కలుగును? అందు

చేత, అర్ధ, సంధాన, పరత్వము (విషయానుభవమునందలి ఆసక్తి), భేద ప్రసక్తి (విభిన్నత్వ భావన—నేను అనుభవించువాడను, ఈ ప్రపంచము అనుభవింపబడునది అను మిథ్యాభావన) - ఈ రెండే సంసారమునకు కారణములగుచున్నవి.

312. కార్యప్రవర్ధనాద్బీజప్రవృద్ధిః పరిదృశ్యతే
కార్యనాశాద్బీజనాశః తస్మాత్కార్యం నిరోధయేత్.

(ఒక విత్తు నుండి పుట్టిన) చెట్టును (కార్యమును) ఎదగనిచ్చినచో దానినుండి వేలకొద్ది విత్తనములు (బీజములు) ఉద్భవించుటను చూచుచున్నాము. (పూర్వవాసలను) బీజము వలన కలిగిన విషయ ప్రవృత్తి అనుకార్యము (చెట్టు) పెరిగి, మరికొన్ని బీజములకు (వాసనలకు) కారణమగును. కార్యమును (మొదటిలోనే) నాశనము చేయుటవలన (దానివలన కలగబోవు) బీజనాశనము కూడ కలుగును. అందుచేత కార్యములను (విషయ వాంఛలను) ఆదిలోనే నిరోధించవలెను.

313. వాసనావృద్ధితః కార్యం కార్యవృద్ధ్యా చ వాసనా
వర్ధతే సర్వథా పుంసః సంసారో న నివర్తతే

వాసనలు అభివృద్ధి చెందుటవలన కార్యములు (విషయ వాంఛలు, విషయ ప్రవృత్తి) వృద్ధి చెందును. కార్యములు వృద్ధి చెందుటవలన వాసనలు అభివృద్ధి పొందును. ఈ విధముగా నిరంతరము (సర్వథా) జరుగుచుండుటవలన పురుషునకు సంసారమునుండి ఎప్పటికిని ముక్తి లభించదు.

314. సంసారబంధవిచ్ఛిత్త్యై తద్ద్వయం ప్రదహేద్యతిః
వాసనావృద్ధిరేతాభ్యాం చింతయా క్రియయా బహిః

వాసనల అభివృద్ధికి కారణములగునవి రెండు — 1) విషయముల గూర్చి ఎల్లప్పుడును ఆలోచించుచుండుట (చింతన); 2) బయట ప్రపంచములో ఆ వాంఛలను తీర్చుకొనుటకు ప్రవర్తించుట (బహిఃక్రియ); (మొదటిది మనస్సులో జరుగునది; రెండవది బాహ్య ప్రపంచములో జరుగునది). సంసారబంధమును త్రెంచుటకు ఈ రెండిం టిని కాల్చివేయవలెను (ప్రదహేత్)

315-316. తాభ్యాం ప్రవర్ధమానా సా సూతే సంసృతిమాత్మనః
త్రయాణాం చ క్షయోపాయః సర్వావస్థాసు సర్వదా
సర్వత్ర సర్వతః సర్వం బ్రహ్మమాత్రావలోకనైః
సద్భావవాసనాదార్ఢ్యాత్తత్త్రయం లయమశ్నుతే

ఈ రెండింటి వలన (చింతనలు - బాహ్యక్రియలవలన) వృద్ధి పొందుచు, అవి (వాసనలు) మానవుని సంసార హేతువగుచున్నవి. ఈ మూడింటిని నాశనముచేయు ఉపాయము (ఒక్కటే-అది) సర్వావస్థల యందు, ఎల్లప్పుడు, అన్నిచోట్ల, అన్నింటి యందును (సర్వతః), అన్నియు తానే అయిన బ్రహ్మమును మాత్రమే చూచుట — దానివలన కలిగిన సద్భావ వాసనలవలన (బ్రహ్మము గూర్చిన భావనలవలన కలిగిన వాసనల వలన) ఈ మూడింటిని (ఆలోచనలను, క్రియలను, వాసనలను) నశింపజేయ వచ్చును.

317. క్రియానాశే భవేచ్చింతానాశోఽస్మాద్వాసనాక్షయః
వాసనాప్రక్షయో మోక్షః సా జీవన్ముక్తిరిష్యతే.

కామ్యకర్మలను ఆచరించకుండుటవలన (క్రియానాశము వలన), మనస్సులోని విషయ వాంఛలు (క్రియాజనితములయినవి) నశించును (చింతా నాశము కల్గును); అందువలన (వాటివలన కలగబోవు) వాసనలు నశించును. వాసనల నాశము వలన మోక్షము కలుగును. అట్టి వానిని జీవన్ముక్తుడు అందురు.

318. సద్వాసనా స్ఫూర్తివిజృంభణే సతి
హ్యసౌ విలీనాత్వహమాదివాసనా
అతిప్రకృష్టాప్యరుణప్రభాయాం
విలీయతే సాధు యథా తమిస్రా.

దట్టముగా అలముకొన్న చీకట్లయినను, అరుణోదయముకాగానే ఏ విధముగా పూర్తిగా తొలగిపోవునో, ఆవిధముగానే, సద్వాసనల స్ఫూర్తి - (సత్యమును తెలుసుకొనగోరు ప్రగాఢమయినవాంఛ - బ్రహ్మజ్ఞానమునకై నిరంతర తపన) మనస్సులో విజృంభించగా, అహంకారము మొదలగు (అసత్) వాసనలన్నియు, (ఆ సద్వాసనలలో) విలీనమయిపోవును (కరిగిపోవును).

319. తమస్తమఃకార్యమనర్థజాలం
న దృశ్యతే సత్యుదితే దినేశే
తథాద్వయానందరసానుభూతౌ
నైవాస్తి బంధో న చ దుఃఖగంధః.

పగటిరాజు అయిన సూర్యుడు ఉదయించగనే, చీకటి, ఆ చీకటి వలన కలుగు నానా విధ అనర్థములు - అన్నియును కనుపించకుండ పోవును. ఆ విధముగనే, జ్ఞానోదయము కాగానే, అద్వయానంద-రసానుభూతియందు, ఎట్టి బంధముగాని (అవరోధము గాని), ఎట్టి దుఃఖ లేశముగాని (దుఃఖగంధము గాని) ఉండదు. (బ్రహ్మజ్ఞాని నిరంతరానందమును అనుభవించును, బ్రహ్మమునందే నిలచియుండును).

## అప్రమత్తత : (320-329)

320. దృశ్యం ప్రతీతం ప్రవిలాపయన్స్వయం
సన్మాత్రమానందఘనం విభావయన్
సమాహితస్సన్ బహిరంతరం వా
కాలం నయేథాః సతి కర్మబంధే.

ఈ కనిపించుచున్న దృశ్య ప్రపంచమునంతయు విలీనము జేసి, బాహ్యాంతరములను నిశ్చలపరచి (సమాహితః), సన్మాత్రుడు, ఆనంద ఘనుడు అయిన పరబ్రహ్మను భావించుము, (ధ్యానించుము), ప్రారబ్ధకర్మము (కర్మబంధము) ఉన్నంతవరకు కాలము గడుపవలెను. (సహజ మరణము వచ్చువరకు జీవన్ముక్తునిగా జీవించవలెను).

321. ప్రమాదో బ్రహ్మనిష్ఠాయాం న కర్తవ్యః కదాచన
ప్రమాదో మృత్యురిత్యాహ భగవాన్ బ్రహ్మణః సుతః

బ్రహ్మనిష్ఠలో (ఎల్లప్పుడు బ్రహ్మము నూర్చిన భావనలో) ఉన్నవారు, ఎప్పటికిని మనస్సును ఏమరిపాటునేయరాదు (ఎప్పటికిని 'నేను బ్రహ్మమును' అను సత్యమును మరువరాదు); ఆవిధముగా మరచిపోవుటయే మృత్యువని బ్రహ్మకుమారుడైన భగవాన్ సనత్కుమారుడు చెప్పిరి. (భారతము - ఉద్యోగ పర్వములో).

322. న ప్రమాదనర్థోఽన్యో జ్ఞానినః స్వస్వరూపతః
తతో మోహస్తతోఽహంధీస్తతో బంధస్తతో వ్యథా

జ్ఞానులకు స్వస్వరూపమును ('నేను బ్రహ్మమును' అను సత్యమును) మరచిపోవుట కంటె అనర్థము మరొకటిలేదు. ఆ మరుపు వలన మోహము కల్గును (ఆవరణ విక్షేపశక్తులు విజృంభించును). అందువలన 'అహంకారము' ('నేను వేరు' అను భావము) కలుగును. అందువలన (సంసార) బంధము కలుగును; దాని వలన దుఃఖము కలుగును. (ఇవి అన్నియును తన నిజస్వరూపమయిన బ్రహ్మతత్వమును మరచి పోవుటవలన కలుగును).

323. విషయాభిముఖం దృష్ట్వావిద్వాంసమపి విస్మృతిః
విక్షేపయతి ధీర్దోషైర్యోషా జారమివ ప్రియం

విద్వాంసుడయినను, విషయాభిముఖముగా (బాహ్యవిషయములందలి ఆలోచనలతో) ఉండుటను చూసి, మరుపు (ప్రమాదము) — ప్రియురాలు (ప్రియురాలి ఆలోచనలు) జారుని బాధించు విధముగా - బుద్ధిజనితమయిన పలుదోషములచే (ధీర్దోషైః - పలు వాంఛలచే) బాధించును. (బాహ్యదృష్టి - విషయాభిముఖత్వము ఉన్నచో, అంతః దృష్టి - బ్రహ్మముగూర్చిన చింతన ఉండదు. స్వాత్మసుఖమును - తన ఆత్మలోనే సుఖించుటను — విడిచి, బాహ్యసుఖములను కోరుట—తన భార్యను విడచి, ప్రియురాలి కొరకు పరితపించుట వంటిది).

324. యథా పకృష్టం శైవాలం క్షణమాత్రం న తిష్ఠతి
ఆవృణోతి తథా మాయా ప్రాజ్ఞం వాఽపి పరాఙ్ముఖం.

(చెరువులో గల నీటిని పూర్తిగా కప్పి ఉంచిన) నాచును ప్రక్కకు తొలగించినప్పటి కిని, అది క్షణకాలము గూడ తొలగి ఉండదు. (చేయితీసిన వెంటనే తిరిగిపూర్తిగా కప్పివేయును). ఆ విధముగనే, పరాఙ్ముఖుడైన ప్రాజ్ఞుని కూడ (బాహ్య విషయము లందు ఆసక్తిగల విద్వాంసునికూడ), మాయ కప్పివేయును. (బ్రహ్మ నిష్ఠలో నున్న సాధకునకు ఏ మాత్రము విషయ స్పృహ కలిగినను, అతనిని మాయ — (ఆవరణ విక్షేపశక్తులు) పూర్తిగా కప్పివేసి, సంసార బంధములో చిక్కుకొనునట్లు చేయును.)

325. లక్ష్యచ్యుతం చేద్యది చిత్తమీషద్
బహిర్ముఖం సన్నిపతేత్తత స్తతః
ప్రమాదతః ప్రచ్యుతకేలికందుకః
సోపానపంక్తౌ పతితో యథా తథా

తన లక్ష్యమును మరచి, మనస్సును ఏ కొద్దిగనయినను, బహిర్ముఖము చేసినచో (బాహ్యవిషయములవైపు తిప్పినచో)— ప్రమాదవశమున సోపాన పంక్తిమీద (మెట్ల మీద) పడిన బంతి, (కేలికందుకము) క్రింది క్రిందికి (పెరుగుచున్న వేగముతో), ఏ విధముగా పడిపోవునో, ఆ విధముగనే (తన లక్ష్యము మరచిన) సాధకుడు గూడ పతనమగును.

326. 327. విషయేష్వావిశచ్చేతః సంకల్పయతి తద్గుణాన్
328. సమ్యక్సంకల్పనాత్కామః కామాత్పుంసః ప్రవర్తనమ్
తతః స్వరూపవిభ్రంశో విభ్రష్టస్తు పతత్యధః
పతితస్య వినా నాశం పునర్నారోహ ఈక్ష్యతే
సంకల్పం వర్జయేత్తస్మాత్ సర్వానర్థస్య కారణం
అపథ్యానిహివస్తూని వ్యాధిగ్రస్తో యథోత్సృజేత్

విషయములలో ప్రవేశించు మనస్సు, వాటి గుణముల గూర్చి సదా తలపోయు చుండును (సంకల్పయతి). ఆ ఆలోచనలవలన (ఆ విషయములలో) కోరిక(కామః) కలుగును. కోరికవలన ప్రవర్తన (విషయములలో ప్రవర్తించుట) కలుగును. అందు వలన (బాహ్యపరత్వము వలన), తన నిజస్థితిని మరచిపోయి, అందుకు విరుద్ధముగా ప్రవర్తించుట జరుగును (స్వరూప విభ్రంశము కలుగును). అట్టి భ్రష్టత్వము పతనమునకు దారితీయును. ఆ విధముగా (తన నిజస్థితినుండి భ్రష్టుడై) పడిపోయినవానికి నాశము తప్ప, తిరిగి పైకివచ్చుట ఉండదు. అందుచేత అన్ని అనర్థములకు కారణమయిన సంకల్పమును (విషయముల గూర్చి తలపోయుటను) — వ్యాధిగ్రస్తుడు అపథ్యములయిన వస్తువులను విడిచిపెట్టునట్లుగా — విడిచిపెట్టవలెను.

329. అతః ప్రమాదాన్న పరోఽస్తి మృత్యు —
ర్వివేకినో బ్రహ్మవిదః సమాధౌ
సమాహితః సిద్ధిముపైతి సమ్యక్
సమాహితాత్మా భవ సావధానః

కావున, సమాధిలో (ధ్యానములో) నున్న, విచక్షణాజ్ఞానముకల బ్రహ్మవిదునకు (సాధకునకు), మోహప్రకంటె (ప్రమాదముకంటె), వేరయిన మృత్యువు మరొకటి లేదు. మనస్సును చక్కగా బ్రహ్మమునందు ఉంచినవాడు (సమాహితః), సిద్ధిని పొందగలడు. కావున నీవు కూడ సావధానుడవై (జాగరూకతతో), మనస్సును నిశ్చలముచేసి (బాహ్యదృష్టి విడచి), బ్రహ్మమునందు నిలుపుము. (సమాహితాత్మా భవ). (సమాహితము = నిశ్చలమయినది; చక్కగా ఉంచబడినది; పరిశుద్ధమయినది; చేర్చబడినది; ఏకాగ్రమయినది).

## కేవలత్వము (330 – 338) :

330. జీవతో యస్య కైవల్యం విదేహే చ స కేవలః
యత్కించిత్పశ్యతో భేదం భయం బ్రూతే యజుఃశ్రుతిః

జీవించి ఉండగా, తాను కేవల బ్రహ్మస్వరూపుడనని ఎవడు తెలుసుకొనుచున్నాడో, అతడు దేహము విడిచిన పిమ్మట కూడ కేవలుడిగా ఉండును (అతనికి పునర్జన్మ ఉండదు). ఏకొద్దిగనయినను భేదమును (భిన్నత్వమును) చూచువాడు భయమును పొందునని యజుర్వేదము (-అందలి తైత్తిరేయోపనిషత్తు) చెప్పుచున్నది. (ఎట్టి ఘోరమయిన పాపములు చేసినవానికయినను తనయందు తనకు భయము ఉండదు. కానికాని, వేరు వస్తువునందో, వ్యక్తియందో భయము ఉండును. సర్వైకత్వమును అనుభవించు బ్రహ్మనిష్ఠునకు — తనకు వేరయినదేదియు లేనందున — భయము ఉండదు. విభిన్నత్వము చూచువానికే మానసిక ఆందోళనలు కలుగును).

331. యదా కదా వాపి విపశ్చిదేష
బ్రహ్మణ్యనంతేఽప్యణుమాత్రభేదం
పశ్యత్యథాముష్య భయం తదైవ
యద్వీక్షితం భిన్నతయా ప్రమాదాత్

(బ్రహ్మాత్మైక్య భావనలోనున్న) పండితుడు (తన నిజతత్త్వమును మరచిపోవుట వలన), అనంతమయిన పరబ్రహ్మమునందు, ఏకొద్దిగనయిన భేదమును (భిన్నత్వమును) చూచినచో, ప్రమాదమువలన కలిగిన (తన నిజతత్త్వమును మరచిపోవుట వలన కనుపించుచున్న) ఆ భిన్నవస్తువే భయమునకు కారణమగును.

332. శ్రుతిస్మృతిన్యాయశతైర్నిషిద్ధే
దృశ్యేఽత్ర యః స్వాత్మమతిం కరోతి
ఉపైతి దుఃఖోపరి దుఃఖజాతం
నిషిద్ధకర్తా స మలిమ్లుచో యథా

శ్రుతులు, స్మృతులు, న్యాయతర్క-శాస్త్రములు (అనాత్మలని) నిషేధించిన ఈ దృశ్య ప్రపంచమునందు, 'అదేనేను' అను భావమును (స్వాత్మమతిని) ఎవడు ఉంచునో, అట్టివాడు — నిషిద్ధకర్మలు చేసిన దొంగవలె - దుఃఖములను, ఒకదానికిమించి మరొక దానిని పొందును.

333. సత్యాభిసంధానరతో విముక్తో
మహత్త్వమాత్మీయముపైతి నిత్యం
మిథ్యాభిసంధానరతస్తు నశ్యేత్
దృష్టం తదేతద్యద చౌరచౌరయోః

సత్పదార్థమయిన బ్రహ్మమునందే మనస్సును సంధానపరచిన (బ్రహ్మమునందే మనస్సును సదా నిలిపిన) ముక్తునకు, మహత్తరమయిన ఆత్మసుఖము నిత్యము కల్గును. అసత్ పదార్థమయిన (దేహాదులయందును, విషయములయందును) మనస్సును సంధాన పరచినవానికి (విషయవాంఛల గూర్చి సదా ఆలోచించుచుండు వానికి) వినాశము తప్పదు — ఇందుకు దృష్టాంతము — దొంగతనము చేయనివాడు, దొంగతనము చేసినవాడు — (మొదటివాడు సదా సుఖి: రెండవవాడు సదా దుఃఖితుడు).

334. యతిరసదనుసంధిం బంధహేతుం విహాయ
స్వయమయమహమస్మీత్యాత్మదృష్ట్యైవ తిష్ఠేత్
సుఖయతి నను నిష్ఠా బ్రహ్మణి స్వానుభూత్యా
హరతి పరమవిద్యా కార్యదుఃఖం ప్రతీతం.

బంధకారణమయిన అసత్తునందు మనస్సును సంధానపరచుట విడచిపెట్టి, 'ఇదే నేను అయి ఉన్నాను' (అయమహమస్మి) అను ఆత్మదృష్టితో స్వయముగా బ్రహ్మ భావమునందు నిలచి, సాధకుడు (యతి) అనిర్వానందమును పొందును. స్వానుభవము వలన కలిగిన బ్రహ్మనిష్ఠ (పరబ్రహ్మమునందలి నిలకడ) అవిద్యవలన కలిగిన పరమ దుఃఖమును కూడ తొలగించును కదా!

335. బాహ్యానుసంధిః పరివర్ధయేత్ఫలం
దుర్వాసనామేవ తత స్తతోఽధికం
జ్ఞాత్వా వివేకైః పరిహృత్య బాహ్యం
స్వాత్మానుసంధిం విదధీత నిత్యం.

బాహ్యాను సంధానము (మనస్సును బాహ్యవిషయములందు ప్రవేశపెట్టుట) కర్మఫలములు (రోజురోజుకు) అభివృద్ధి చెందును, దానివలన దుష్టవాసనలే అధికాధికముగా అభివృద్ధి చెందుచుండును; విచక్షణాజ్ఞానముతో దీనిని తెలుసుకొని, బాహ్యవిషయములను విడిచిపెట్టి, తన ఆత్మయందే మనస్సును ఎల్లప్పుడు అనుసంధానము చేయవలెను.

336. బాహ్యే నిరుద్ధే మనసః ప్రసన్నతా
మనఃప్రసాదే పరమాత్మ దర్శనమ్
తస్మిన్ సుదృష్టే భవబంధనాశో
బహిర్నిరోధః పదవీ విముక్తేః

బాహ్య విషయములను నిరోధించుటవలన(అందలి ఆసక్తిని విడుచుటవలన),మనస్సు ప్రశాంతమగును. మనస్సు ప్రశాంతము కాగానే, పరమాత్మ దర్శనమగును (పరమాత్మ తత్త్వము అవగాహన అగును). ఆ పరమాత్మయందు భావన స్థిరముగా నిలచినప్పుడు (సుదృష్టే), భవబంధము నశించును. అందుచేత మోక్షమునకు బాహ్య నిరోధమే మొదటిమెట్టు.

337. కః పండితః సన్సదసద్వివేకీ
శ్రుతిప్రమాణః పరమార్థదర్శీ
జానన్హి కుర్యాదసతోఽవలంబం
స్వపాతహేతోః శిశువన్ముముక్షుః

మోక్షముకోరు పండితుడు, సదసద్వివేచక్షణాజ్ఞానము కలిగి, శృతులయందలి ప్రామాణ్యతను అంగీకరించి, పరమార్థమును (ఈశ్వరతత్త్వమును) తెలుసుకొనికూడ, చిన్నపిల్లవానివలె, ఆపదకు హేతువయిన, అసత్ పదార్థమునందు (దేహాదులయందు) అభిమానమును (అసతః+అవలంబం — అసత్తును ఆశ్రయించుటను) ఎందుకు ఉంచుకొనును?

338. దేహాదిసంసక్తిమతో న ముక్తి –
ర్ముక్తస్య దేహాద్యభిమత్యభావః
సుప్తస్య నో జాగరణం న జాగ్రతః
స్వప్నస్తయోర్భిన్న గుణాశ్రయత్వాత్

దేహాదులయందు (అసక్తియందు) అభిమానము కలవానికి, (ఆసక్తికలవానికి) మోక్షము ఉండదు. ముక్తిపొందినవానికి, ఈ దేహాదులయందు అభిమానము ఉండదు. (దేహాదులయందు అభిమానము – ముక్తి – ఈ రెండును పరస్పర విరుద్ధ స్వభావములు కలవి. ఒకటి ఉన్నచోట మరొకటి ఉండదు). నిద్రపోవుచున్నవానికి జాగ్రదావస్థలోని జగత్తు కనబడదు. మేలుకొనియున్నవానికి స్వప్నప్రపంచము ఉండదు. ఏలనన, ఈ రెండును విభిన్నగుణములను ఆశ్రయించియున్నవి.

## సర్వాత్మత్వము : (339-348):

339. అంతర్బహిః స్వం స్థిరజంగమేషు
జ్ఞాత్వాఽఽత్మనాధారతయా విలోక్య
త్యక్తాఖిలోపాధిరఖండరూపః
పూర్ణాత్మనా యః స్థిత ఏప ముక్తః

లోపల బయటగల చరాచర ప్రపంచమంతటికీ ఆధారభూతమయిన ఆత్మతత్త్వము తానే అని తెలుసుకొని, అన్నింటిని తనలోతానే జూచి, అన్ని ఉపాధులను త్యజించి, సర్వాత్మ భావములో (సర్వాత్మనా), అఖండరూపునిగా ఉండువాడే ముక్తుడు.

340. సర్వాత్మనా బంధవిముక్తిహేతుః
సర్వాత్మభావాన్న పరోఽస్తి కశ్చిత్
దృశ్యాగ్రహే సత్యుపపద్యతేఽసౌ
సర్వాత్మభావోఽస్య సదాత్మనిష్ఠయా

సర్వాత్మ భావము బంధవిముక్తికి హేతువగుచున్నది. ఈ సర్వాత్మ భావమునకు మించినది మరొకటిలేదు. ఈ దృశ్యప్రపంచమును పరిగణించకపోవుట వలన (విడిచిపెట్టుటవలన - దృశ్య+అగ్రహే సతి). సత్యమునందే (బ్రహ్మమునందే) స్థిరముగా నిలచి, అన్నింటియందును సర్వాత్మభావమును ఉంచగలడు. (అన్నింటి

యందు ఉన్న సత్‌పదార్థము నాలోనున్న 'ఆత్మ' అన్నియు ఒక్కడే అని తెలుసు కొనగలడు).

341. దృశ్యస్యాగ్రహణం కథం ను ఘటతే దేహాత్మనా తిష్ఠతో
బాహ్యార్థానుభవప్రసక్తమనసస్తత్తత్క్రియాః కుర్వతః
సన్న్యస్తాఖిల ధర్మకర్మవిషయైర్నిత్యాత్మనిష్ఠాపరై -
స్తత్త్వజ్ఞైః కరణీయమాత్మని సదానందేచ్ఛుభిర్యత్నతః

బాహ్య విషయములను అనుభవించుటయందే ఆసక్తికలవారికి, వాటి ప్రాప్తికై ఆయాకర్మలనుచేయువారికి, దేహాత్మ భావమునందే ('ఈ దేహమే నేను' అనుభావము నందు) ఉన్నవారికి, దృశ్యప్రపంచమును విడిచిపెట్టుట (దృశ్యస్య+అగ్రహణం), ఎట్లు సంభవమగును ? అన్ని ధర్మములను, అన్ని కర్మలను, అన్ని విషయములను పరిత్యజించి, (సన్న్యస్తః), ఎల్లప్పుడును ఆత్మనిష్ఠాపరాయణులై, సదానందమును (పరమాత్మలోని ఆనందమును) కోరుతత్వజ్ఞులకే ప్రయత్నము చేయుటవలన, ఇది (దృశ్యప్రపంచమును విడిచిపెట్టుట) ఆచరణ యోగ్యమయినది (సాధ్యమగును).

342. సర్వాత్మసిద్ధయే భిక్షోః కృతశ్రవణకర్మణః
సమాధిం విదధాత్యేషా శాంతో దాంత ఇతి శ్రుతిః

శ్రుత్యాదులను వినుట, వాటిగూర్చి చర్చించుట, ఆలోచించుట మొదలగు కర్మలవలన జ్ఞానులయిన భిక్షువులు (సర్వసంగపరిత్యాగులు), సర్వాత్మ-సిద్ధికొరకు, (సర్వాత్మత్వ భావమును పొందుటకొరకు) శాంతి, దాంతి, మొదలగు (షట్సంపత్తితో) కూడిన సమాధి విధానమును, శ్రుతులు (బృహదారణ్యకోపనిషత్తు) నిర్దేశించుచున్నది.

343. ఆరూఢశక్తేరహమో వినాశః
కర్తుం న శక్యః సహసాపి పండితైః
యే నిర్వికల్పాఖ్య సమాధినిశ్చలా-
స్తానంతరాఽనంతభవా హి వాసనాః

ఎంతటి పండితులకైనను, (ఆత్మయందు) ఆరోపించబడి, మహాశక్తివంతమయిన (ఆరూఢశక్తి అయిన) ఈ జీవభావమును సత్వరముగా నాశనము చేయుట (వదలు కొనుట) కఠినము, నిర్వికల్పమను సమాధియందు నిశ్చలముగా ఉన్నవారికి

మాత్రమే అది వీలుపడును. లోపలగల (జీవభావమునందుగల) వాసనలు అనేక జన్మల వలన కలిగినవికదా! (అందుచేత ఈ వాసనలను సులభముగా తొలగించుట కష్టము).

344. అహంబుద్ధ్యైవ మోహిన్యా యోజయిత్వాఽఽవృతేర్బలాత్
విక్షేపశక్తిః పురుషం విక్షేపయతి తద్గుణైః

ఆవరణశక్తి బలమువలన మోహితుడయిన పురుషుడు, 'ఈదేహము నేను' అను భావముతో సదా ఆలోచించుచుండుటవలన, విక్షేప శక్తి, తన గుణములవలన, అతనిని (వలువిధములుగా) బాధపెట్టును (మభ్యపెట్టును).

345. విక్షేపశక్తి విజయో విషమో విధాతుం
నిః శేషమావరణశక్తి నివృత్త్యభావే
దృగ్దృశ్యయోః స్ఫుటపయోజలవద్విభాగే
నశ్యేత్త దావరణమాత్మని చ స్వభావాత్
నిః సంశయేన భవతి ప్రతిబంధశూన్యో
విక్షేపణం న హి తదా యది చే న్మృషార్థే

ఆవరణశక్తిని నిశ్శేషముగా నిర్మూలించినగాని, విక్షేప శక్తిమీద విజయము సాధించుట కష్టము. (విచక్షణాజ్ఞానమువలన) దృక్‌దృశ్యములందలి- (చూచునది, చూడబడునది: అనుభవించునది, అనుభవింపబడునది, వీటియందలి) సత్యాసత్యములను— పాలు, నీరువలె - (పాలు, నీళ్లు కలిసిన మిశ్రమములో నీటిని విడచి పాలను మాత్రమే గ్రహించగలుగు హంసవలె, అసత్- పదార్థమునుండి, సత్ పదార్థమును విడదీసి చూడగలుగుట వలన, ఆత్మను కప్పియుంచిన) ఆవరణశక్తి పూర్తిగ తొలగిపోయి, ఆత్మ స్వభావసిద్ధముగా ప్రకాశించును. ఆ పిమ్మట మనస్సు తిరిగి అనిత్యము లయిన విషయములలో ప్రవేశించకుండనున్నచో (మృషార్థే నహిచేత్‌యది), అప్పుడు విక్షేపశక్తిమీద విజయము, ఎట్టి ప్రతిబంధకములు లేక, నిస్సంశయముగా సిద్ధించును.

346. సమ్యగ్వివేకః స్ఫుటబోధజన్యో
విభజ్య దృగ్దృశ్యపదార్థ తత్త్వం
ఛినత్తి మాయాకృత మోహబంధం
యస్మాద్విముక్తస్య పునర్న సంసృతిః

స్వానుభవజ్ఞానమువలన కలిగిన (స్ఫుటబోధజన్యః), మంచి విచక్షణాజ్ఞానము వలన దృక్ దృశ్యపదార్థములను విభజించి, (వాటివాటి నిజతత్త్వమును తెలుసుకొని, మాయ వలన కలిగిన ఈ మోహబంధమును ఛేదించవచ్చును. (ఆ విధముగా ఛేదించుట వలన), ముక్తునకు తిరిగి సంసార బంధము ఉండదు.

347. పరావరైకత్వవివేక వహ్నిః
దహత్యవిద్యాగహనం హ్యశేషం
కిం స్యాత్పునః సంసరణస్య బీజ
మద్వైతభావం సముపేయుషోఽస్య.

పరావరములలో (బ్రహ్మము, జీవములలో) ఏకత్వమును గ్రహించుట అను వివేక మను అగ్ని అవిద్య అను దట్టమయిన (అడవిని) నిశ్శేషముగా దహించివేయును. అప్పుడు, అద్వైతభావమును పొందిన, (బ్రహ్మముతో ఐక్యతను పొందిన)- అట్టి వానికి తిరిగి సంసారబీజము (సంసారమునందు ప్రవేశించుటకు కారణము) ఎట్లు ఉండగలదు? (ఉండదు అనుభావము).

348. ఆవరణస్య నివృత్తిర్భవతి చ సమ్యక్ పదార్థదర్శనతః
మిథ్యాజ్ఞాన వినాశస్తద్విక్షేపజనితదుఃఖనివృత్తిః

బ్రహ్మతత్త్వమును పూర్తిగా దర్శించినవానికి (సమ్యక్ పదార్థదర్శనః), ఆవరణశక్తి పూర్తిగా తొలగిపోవును. (అటుపిమ్మట) మిథ్యాజ్ఞానము-(దేహాత్మభావము) నశించును. (తరువాత) విక్షేపశక్తి వలన కలిగిన పలు దుఃఖములు తొలగిపోవును.

**కారణము-కార్యము (349-353) :**

49. ఏతత్త్రితయం దృష్టం సమ్యగ్రజ్జుస్వరూపవిజ్ఞానాత్
తస్మాద్వస్తు సత్తత్త్వం జ్ఞాతవ్యం బంధముక్తయే విదుషా.

త్రాటియొక్క నిజరూపమును బాగుగ తెలుసుకొనుట వలన (తెలుసుకొనిన పిమ్మట), ఈ మూడింటిని మనము చూడగలుగుచున్నాము ((1) ఆవరణ శక్తి వలన త్రాడు అను జ్ఞానము మరుగుపడుట; 2) విక్షేపశక్తి వలన సర్పము అను భ్రాంతి కలుగుట, (3) ఈ భ్రాంతి వలన కలిగిన భయాందోళనలు.) అందుచేత పండితులు, బంధముక్తి కొరకు వస్తువుల నిజతత్వమును తెలుసుకొనవలెను.

350. 351. అయోఽగ్ని యోగాదివ సత్సమన్వయా-
న్మాత్రాదిరూపేణ విజృంభతే ధీః
తత్కార్యమేతద్వితీయం యతో మృషా
దృష్టం భ్రమస్వప్నమనోరథేషు
తతో వికారాః ప్రకృతేరహంముఖా
దేహావసానా విషయాశ్చ సర్వే
క్షణేఽన్యథాభావితయాహ్యమీషా-
మసత్వమాత్మాతు కదాపి నాన్యథా

మంటలో కాలుటవలన ఇనుపగుండు (మండుచున్న నిప్పుకణికవలె) కనబడునట్లు, బుద్ధిగూడ ఆత్మ సంయోగమువలన (సత్ సమన్వితాత్) పరిమాణ రూపమున (మాత్రాది రూపేణ) (తెలుసుకొనువాడు, తెలుసుకొనుబడునది అను మార్పులతో) విజృంభించుచున్నది. ఆ మార్పు వలన ఈ రెండును (తెలుసుకొనువాడు, తెలుసుకొను బడునది-దృష్ట, దృశ్యము), కలుగుచున్నవి. భ్రాంతి, స్వప్నము, ఊహలోకమువలె-ఈ రెండును కూడ అసత్యములే (మృషా): ఆ విధముగనే జీవభావము ('అహం' భావము) మొదలుకొని దేహమువరకు ఉన్న ప్రకృతి వికారములు, అన్ని విషయములు, ఇవన్నియు అసత్యములే(అనిత్యములే),క్షణక్షణమునకును మార్పులు చెందుచుండుటవలన ఇవన్నియు అసత్యములయినవి. ఆత్మ అన్ననో ఎప్పటికిని మార్పులు చెందదు (న+అన్యథా).

352. నిత్యాద్వయాఖండచిదేకరూపో
బుద్ధ్యాదిసాక్షీ సదసద్విలక్షణః
అహంపదప్రత్యయలక్షితార్థః
ప్రత్యక్సదానంద ఘనః పరాత్మా

పరమాత్మ స్వరూపము-నిత్యమయినది; అద్వితీయమయినది; అఖండ మయినది; జ్ఞానమే రూపముగా గలది (చిదేకరూపః) బుద్ధి మొదలగు వానికి (శరీర మనోబుద్ధులలో జరుగు మార్పులకు, వృత్తులకు) సాక్షి-రూపమయినది; స్థూల సూక్ష్మములకు విలక్షణమయినది; 'నేను' అను పదప్రత్యయముచే సూచింపబడునది; ప్రతి హృదయమునందు (ప్రత్యగాత్మగా) సదానందముతో నిండియున్నది;

353. ఇత్థం విపశ్చిత్సదసద్విభజ్య
నిశ్చిత్య తత్త్వం నిజబోధదృష్ట్యా
జ్ఞాత్వా స్వమాత్మానమఖండబోధం
తేభ్యో విముక్తః స్వయ మేవ శామ్యతి.

ఈ విధముగా పండితుడు సత్, అసత్‌లను వేరుజేసి, వాటియొక్క నిజతత్త్వమును, తన వివక్షణా జ్ఞానమను దృష్టితో చూసి, తన నిజతత్త్వము, అఖండ జ్ఞానరూపమయిన పరమాత్మ తత్త్వముగా గ్రహించి, వాటినుండి (ఆవరణ విక్షేప శక్తులనుండి) విముక్తుడై, (అనిర్వచనీయమయిన) ప్రశాంతతను పొందును.

## సమాధి (354-372):

354. అజ్ఞాన హృదయగ్రంథేర్నిః శేషవిలయ స్తదా
సమాధినాఽవికల్పేన యదాఽద్వైతాత్మ దర్శనమ్.

నిర్వికల్ప సమాధియందు, అద్వైత ఆత్మ దర్శనము కలుగునప్పుడే, ఈ అజ్ఞానము వలన కలిగిన హృదయ గ్రంథులు నిశ్శేషముగా నాశనమగును. (గ్రంథి-ముడి; హృదయగ్రంధి-మనిషితత్త్వములోని పీటముళ్ళు; ఇవి ఏమనగా- (1) అవిద్య-తన నిజతత్త్వమును తెలుసుకొనలేకపోవుట; (2) కామము-వాంఛలు; (3) కర్మలు:- అవిద్య వలన వాంఛలు, వాటివలన కర్మలు కలుగుచున్నవి. ఇవి మనిషిని బాహ్యముఖునిగా నిలుపును.)

355. త్వమహమిదమితీయం కల్పనా బుద్ధిదోషాత్
ప్రభవతి పరమాత్మన్యద్వయే నిర్విశేషే
ప్రవిలసతి సమాధానస్య సర్వో వికల్పో
విలయనముపగచ్ఛేద్వస్తుతత్త్వావధృత్యా

నిర్విశేషమయిన, అద్వయమయిన, పరమాత్మయందు, బుద్ధి-దోషమువలన, (మిథ్యా జ్ఞానమువలన), 'నీవు', 'నేను', 'ఇది', 'అది', అను విభిన్నత్వము కల్పింపబడినది. నిర్వికల్ప సమాధియందు, (ప్రవిలసతి సమాధౌ), ఉన్నవానికి పరమాత్మయొక్క నిజతత్త్వము ఎరుకపడుటవలన, (బుద్ధిదోషము వలన కలిగిన) విభిన్నత్వమంతయు (సర్వోవికల్పో), తనలో విలీనమయిపోవును: (నిర్వికల్ప సమాధిలో 'జీవభావము' తొలగిపోవుటవలన, తత్కల్పితమయిన అన్ని వికల్పములు, అన్ని విభేదములు కరగిపోవును.

356. శాంతో దాంతః పరముపరతః క్షాంతియుక్తః సమాధిం
కుర్వన్నిత్యం కలయతి యతిః స్వస్య సర్వాత్మభావం:
తేనావిద్యాతిమిరజనితాన్సాధు దగ్ధ్వా వికల్పాన్
బ్రహ్మాకృత్యా నివసతి సుఖం నిష్క్రియో నిర్వికల్పః

మనస్సును శాంతపరచి, ఇంద్రియములను నిగ్రహించి, (దాంతః) మనోబుద్ధులనుండి బయటపడి (వాటి ఒత్తిడులకు లోనుగాక-పరా+ఉపరతః) తితీక్షతో కూడినవాడై (క్షాంతియుక్తః), ఎల్లప్పుడు సమాధి విధానమును ఆచరించుచున్న యోగి (యతిః) తనలో సర్వాత్మ భావమును చూడగలుగుచున్నాడు. అప్పుడు, అవిద్య అను చీకటి వలన కలిగిన వికల్పములన్నింటిని (వివిధత్వమునంతటిని) బాగుగ కాల్చివేసి, నిర్వికల్పుడై (భేదభావము లేనివాడై) నిష్క్రియుడై, బ్రహ్మరూపములో నిలచి ('నేనే బ్రహ్మమును' అను భావముతో ఉండి), ఆనందమును పొందుచుండును.

357. సమాహితా యే ప్రవిలాప్య బాహ్యం
శ్రోత్రాది చేతః స్వమహం చిదాత్మని
త ఏవ ముక్తా భవపాశబంధైః
నాఽన్యేతు పారోక్షకథాభిధాయినః

చిదాత్మలో (జ్ఞాన స్వరూపమయిన పరబ్రహ్మలో) బాహ్యప్రపంచమును, శ్రోత్రాది ఇంద్రియములను, మనస్సును, నేను అను భావమును, విలీనముచేసి (ప్రవిలాప్య), ఎవడు నిశ్చలుడై (సమాహితః) ఉండునో, అతడే సంసారపాశ బంధములనుండి, విముక్తి పొందుచున్నాడు. ఇంకొకరి వలన విని తెలుసుకొనినవాడు (పరోక్ష-కథాభిధాయినః) ముక్తుడు కాలేడు.

౩౫౮. ఉపాధిభేదాత్స్వ యమేవ భిద్యతే
చోపాధ్యపోహే స్వయమేవ కేవలః
తస్మాదుపాధేర్విలయాయ విద్వాన్
వసేత్సదా కల్పసమాధినిష్ఠయా.

(పరమాత్మ అద్వయుడయ్యును), ఉపాధి భేదములవలన స్వయముగా భిన్నుడగు చున్నాడు (భిన్నత్వము పొందినట్లు తోచుచున్నాడు). ఆ ఉపాధులు తొలగి పోగానే, తానే స్వయముగా కేవలునిగా, (ప్రకాశించుచున్నాడు). అందుచేత ఈ ఉపాధులను విలీనము చేయుటకొరకు పండితుడయినవాడు నిర్వికల్ప సమాధి నిష్ఠలో ఎల్లప్పుడు ఉండవలెను.

359. సతి సక్తో నరో యాతి సద్భావం హ్యేకనిష్ఠయా
కీటకో భ్రమరం ధ్యాయన్ భ్రమరత్వాయ కల్పతే

బ్రహ్మమునందు ఆసక్తికలవాడు (సతిసక్తః) తదేక నిష్ఠతో, (సదాబ్రహ్మమునే ధ్యానించు చుండుటవలన), బ్రహ్మభావమును (సద్భావం), పొందుచున్నాడు. కీటకము నిరంతరము భ్రమరమును ధ్యానించుచు, తానే భ్రమరముగా మారిపోవునుకదా!

360. క్రియాంతరాసక్తిమపాస్య కీటకో
ధ్యాయన్యథాలిం హ్యలిభావమృచ్ఛతి:
తథైవయోగీ పరమాత్మతత్త్వం
ధ్యాత్వా సమాయాతి తదేకనిష్ఠయా.

కీటకము తన సమస్త క్రియలయందు (తినుట, ప్రాకుట మొదలగు కీటకక్రియ అన్నింటియందు) ఆసక్తిని విడిచిపెట్టి, (తన మట్టి గూటిలో ఉండి), నిరంతరము తుమ్మెదను గూర్చి ధ్యానించుచుండుటవలన (నేను పురుగునుకాను, నేను తుమ్మెదను అనుభావముతో సదా ధ్యానించుచుండుటవలన) అది తుమ్మెదగా మారిపోయినట్లే, యోగి కూడ తదేకనిష్ఠతో, పరమాత్మ తత్త్వము గూర్చి ధ్యానించుచు, తానుగూడ పరమాత్మ తత్త్వమును పొందుచున్నాడు).

(దీనినే భ్రమరకీటక న్యాయమందురు. కీటకమునకు, తుమ్మెదకు రూపములోను, ఆహారములోను, చలనములోను, ఎంతో భేదమున్నను, వస్తుతః కీటకము,

తుమ్మెద ఒక్కటే-తుమ్మెద గుడ్డులోంచి వచ్చినదే కీటకము: అది తన పరిసరము లను ప్రవర్తనను విడిచిపెట్టి, తన స్వస్వరూపమయిన తుమ్మెదగా అగుటకు నిశ్చయించుకొని, మరొక చింతలేక, తన నిజతత్వమయిన తుమ్మెద గూర్చి ధ్యానించు చుండుట వలన అది తుమ్మెదగా మారిపోవుచున్నది. తన నిజస్థితిని మరచి, తను పురుగునే అనుకొని, ఆకుల మీద ప్రాకుచు, ఆకులనే తినుచున్నంతకాలము, అది భ్రమరముకాలేదు. భ్రమరమువలె అనంతాకాశములో ఎగురుచు, పూవులలోని తేనియ యొక్క మధురిమను ఆస్వాదించలేదు.

అట్లే జీవుడు గూడ వస్తుతత్వములో పరబ్రహ్మమే అయినను, తన నిజస్థితిని మరచి, అల్పత్వభావముతో, ఈ జనన మరణ చక్రములో పడి దుఃఖమనుభవించు చున్నాడు. ఎప్పుడు తన నిజతత్వమును తెలుసుకొని, నేను జీవుడనుకాను, బ్రహ్మమును అనిగ్రహించి, బ్రహ్మభావప్రాప్తికి నిరంతర కృషి చేయునో, అప్పుడే తాను గూడ తన నిజతత్వమయిన పరబ్రహ్మ-స్వరూపమును పొందుచున్నాడు).

361. అతీవ సూక్ష్మం పరమాత్మతత్వం
న స్థూలదృష్ట్యా ప్రతిపత్తుమర్హతి
సమాధినాత్యంతసుసూక్ష్మవృత్యా
జ్ఞాతవ్యమార్యైరతిశుద్ధబుద్ధిభిః

పరమాత్మ తత్వము అత్యంత సూక్ష్మ మయినది. స్థూల దృష్టిచేత దీనిని గ్రహించుటకు వీలులేనిది. (సాధారణముగా మనము ఉపయోగించు ఇంద్రియములు, భావనలు, ఆలోచనలద్వారా దీనిని తెలిసికొనుట కష్టము). అత్యంత పరిశుద్ధమయిన బుద్ధిగల పవిత్ర అంతఃకరణ గలవారు (ఆర్యులు) సమాధియందు, అత్యంత సూక్ష్మముగా చేయబడిన వృత్తిద్వారా (అతి సూక్ష్మమయిన భావన ద్వారా) దీనిని (పరబ్రహ్మను) తెలుసుకొనగలరు.

362. యథా సువర్ణం పుటపాకశోధితం
త్యక్త్వా మలం స్వాత్మగుణం సమృచ్ఛతి;
తథా మనః సత్వరజస్తమోమలం
ధ్యానేన సంత్యజ్య సమేతి తత్వం

పుటము పెట్టిన బంగారము (మంటలో కరగించి శుద్ధి చేసిన బంగారము), తన మాలిన్యమును (అన్య వస్తు సంపర్కమును) విడిచి, పరిశుద్ధమయిన స్వగుణమును పొందునట్లు, ధ్యానము వలన మనస్సు సత్వరజస్తమో గుణములను మాలిన్యమును కోల్పోయి, సమత్వ భావమును (నిశ్చలత్వమును) పొందును. (బ్రహ్మభావము పొందును)

363. నిరంతరాభ్యాసవశాత్తదిత్థం
పక్వం మనో బ్రహ్మణి లీయతే యదా
తథా సమాధిః స వికల్పవర్జితః
స్వతోఽద్వయానందరసానుభావకః

ఈ విధముగ నిరంతరాభ్యాసమువలన, మనస్సు పరిపక్వత చెంది, (నిశ్చలమై) యున్నప్పుడు, అది బ్రహ్మమునందు లయమయిపోవును. అప్పుడు సమాధి సవికల్ప స్థితిని విడచి, (నిర్వికల్ప స్థితిని పొంది), తనలోనే అద్వయితానంద రసానుభూతిని పొందుచుండును.

(మనస్సు సంపూర్ణముగా లయముకానంతవరకు, ద్వైత-వృత్తి- 'నేను జీవుడను; పరబ్రహ్మ గూర్చి ధ్యానము చేయుచున్నాను' అనుభావము - సదా వ్యక్తమగుచుండును. మనస్సు సంపూర్ణముగా నిశ్చలమయి, భావరహితమయినప్పుడు, ద్వైత భావముగూడ పోయి, 'తానే పరబ్రహ్మ' అను భావము వెంటనే నిలచును).

364. సమాధినాఽనేన సమస్తవాసనా
గ్రంథేర్వినాశోఽఖిలకర్మనాశః
అంతర్బహిః సర్వత ఏవ సర్వదా
స్వరూపవిస్ఫూర్తిరయత్నతః స్యాత్

ఈ సమాధి వలన (నిర్వికల్ప సమాధియందు నిలచియుండుట వలన), సమస్తవాసనలు నశించును; హృదయ గ్రంథులయిన వాంఛలు అన్నియు తొలగిపోవును. ఎల్ల కర్మలును నశించును. (వాసనలు, వాంఛలు లేనిచో కర్మలు గూడ ఉండవు). లోపలను, బయటను, అన్నిచోట్ల, అన్నివేళలయందు, తన స్వరూపమే, (బ్రహ్మాత్మ భావమువలన కలిగిన సర్వాత్మత్వభాసమే), ఎట్టి ప్రయత్నము లేకనే, అనుభవమగు చుండును.

365. శ్రుతేః శతగుణం విద్యాన్మననం మననాదపి
నిదిధ్యాసం లక్షగుణమనంతం నిర్వికల్పకం

'శ్రవణము' కన్న (ఒకరు చెప్పినది వినుట, లేక గ్రంధ పఠనము వలన కలిగిన జ్ఞానము కన్న), 'మననము' (తనలోతాను విచక్షణా పూర్వకముగా ఆలోచించుట) వందరెట్లు నయము (లాభదాయకమయినది). మననము కన్న 'నిధి ధ్యాసము' (ధ్యానము) లక్షరెట్లు విశిష్టమయినది, నిర్వికల్ప సమాధి అన్ననో—అది అనంత మయిన (అధికృత) కలది. (ముందువాటితో పోల్చ వీలులేనంత విశిష్టత గలది).

366. నిర్వికల్పసమాధినా స్ఫుటం
బ్రహ్మతత్వమవగమ్యతే ధృవం
నాన్యథా చలతయా మనోగతేః
ప్రత్యయాంతర విమిశ్రితం భవేత్

నిర్వికల్ప సమాధి వలన బ్రహ్మతత్వము స్ఫుటముగా (ఎట్టి భావ—దోషములు లేకుండ) అవగాహన అగుట నిశ్చయము. మరి ఏ ఇతర మార్గము వలనను ఇది కుదరదు. ఏలననగా, చంచలమయిన మనస్సుతో (బ్రహ్మతత్వమును అర్థముచేసు కొన ప్రయత్నించినచో), ఆట్టి బ్రహ్మావగాహన, కొన్ని అన్యభావములతో (గుణము లతో) మిశ్రితమై, యుండును. (చంచలమనస్సుతో చూచునప్పుడు 'నిర్గుణబ్రహ్మ' అవగాహన కాదు. కొన్ని వేరుగుణములతో అది మిశ్రితమై యుండును. అట్టిదానిని 'సగుణబ్రహ్మ' అని అందురు.

367. అతః సమాధత్స్వ యతేంద్రియః సదా
నిరంతరం శాంతమనాః ప్రతీచి
విధ్వంసయ ధ్వాంతమనాద్యవిద్యయా
కృతం సదేకత్వవిలోకనేన

అందుచేత ప్రశాంత మనస్కుడవై, ఇంద్రియములను నిగ్రహించి, నిరంతరము (నీ మనస్సును) సమాధియందు నిలుపుము. ఏమ్మట, అన్నిచోట్ల, అన్ని వేళల, నీక రూపుడయిన పరబ్రహ్మను అవలోకించుచు, అనాది ఆయిన అవిద్యవలన కలిగిన అంధకారమును (ధ్వాంతం) తొలగించుము (విధ్వంసయ).

368. యోగస్య ప్రథమద్వారం వాక్ నిరోధోఽపరిగ్రహః
నిరాశా చ నిరీహా చ నిత్యమేకాంత శీలతా

యోగమునకు మొట్టమొదటి ద్వారము :- 1) వాక్ నిరోధము. (ఎల్ల కర్మేంద్రియములను నిరోధించుట); 2) అపరిగ్రహము (తనకొరకు వస్తువులను సమకూర్చుకొనకుండుట); 3) (విషయవాంఛలయందు) ఆసక్తి చూపకపోవుట; 4) కామ్యకర్మలను విడిచిపెట్టుట (నిరీహ); 5) ఎల్లప్పుడును ఏకాంతమునందే ఉండుట - (ఏక+అంతం=ఏకాంతం=ఒకే లక్ష్యముతో ఉండుట).

369. ఏకాంతస్థితిరింద్రియోపరమణే హేతుర్దమశ్చేతసః
సంరోధే కరణం శమేన విలయం యాయాదహంవాసనా
తేనానందరసానుభూతిరచలా బ్రాహ్మీ సదా యోగినః
తస్మాచ్చిత్తనిరోధ ఏవ సతతం కార్యః ప్రయత్నాన్మునేః

ఏకాంతస్థితి వలన (విషయములనుండి) ఇంద్రియములను నిగ్రహించవచ్చును. ఇంద్రియ నిగ్రహము వలన మనస్సును శాంతపరుపవచ్చును; మనస్సును శాంత పరుచుటవలన, 'అహం'భావమును (అహంవాసనను) లయింపజేయవచ్చును. అప్పుడు అట్టి యోగులకు ఎల్లప్పుడు, అచంచలమయిన బ్రహ్మానందరసానుభూతి సిద్ధించును; అందుచేత, మునులు, ప్రయత్నపూర్వకముగా చిత్తనిరోధమునే చేయుచుండవలెను. (మనస్సును వృత్తిరహితము చేయవలెను).

370. వాచం నియచ్ఛాత్మని తం నియచ్ఛ
బుద్ధౌ ధియం యచ్ఛ చ బుద్ధిసాక్షిణి
తం చాపి పూర్ణాత్మని నిర్వికల్పే
విలాప్య శాంతిం పరమాం భజస్వ

వాక్కును (బాహ్యకర్మలను) మనస్సులో నిలుపుము (లయపరుపుము). మనస్సును బుద్ధిలో నిలుపుము. బుద్ధిని, బుద్ధిసాక్షి అయిన ప్రత్యగాత్మలో విలీనము చేయుము. దానిని కూడ (ఆ ప్రత్యగాత్మనుకూడ) నిర్వికల్పమందు (నిర్గుణ బ్రహ్మమునందు) లయింపజేయుము. అప్పుడు పరమమయిన శాంతిని పొందుము.

371. దేహప్రాణేంద్రియమనోబుద్ధ్యాదిభిరుపాధిభిః
యైర్యైర్వృత్తేః సమాయోగస్తత్తద్భావోఽస్య యోగినః

దేహము, ప్రాణము, ఇంద్రియములు, మనస్సు, బుద్ధి మొదలగు ఉపాధులలో, దేని దేని వృత్తులయందు (ఏ ఉపాధియందు), మనస్సు సంయోగము పొందునో, దాని భావమే యోగి పొందును. (ఏ ఉపాధియందు మనస్సు లగ్నముచేసి వ్యవహరించునో, మనిషి ఆ ఉపాధియందే ఉన్నట్లు భావించుచుండును).

372. తన్నివృత్త్యా మునేః సమ్యక్ సర్వోపరమణం సుఖం
సందృశ్యతే సదానందరసానుభవవిప్లవః

వాటిని (ఆ ఉపాధులను) విడిచిపెట్టిన ముని, అన్నింటినుండి తన మనస్సును సులభముగా మరల్చి (సర్వోపరమణముజేసి—), బ్రహ్మానందరసానుభవమునందు అతిశయించును.

## నిస్సంగత్వము (373-378) :

373. అంతస్త్యాగో బహిస్త్యాగో విరక్తస్యైవ యుజ్యతే
త్యజత్యంతర్బహిఃసంగం విరక్తస్తు ముముక్షయా.

అంతస్త్యాగము (మనస్సులోని వాంఛలను విడిచిపెట్టుట), బహిస్త్యాగము, (బయట ప్రపంచములో విషయములను విడిచిపెట్టుట),—ఈ రెండును విరక్తివలననే (విషయములయందు ఆసక్తి, సంగము లేకపోవుట వలననే) సాధ్యపడగలదు. ముక్తియందలి కోరికవలన, విరక్తునకు, లోనివాంఛలయందు, బయటి విషయములందు ఆసక్తిని (సంగమును) సులభముగా విడిచిపెట్ట సాధ్యపడును. (విషయ సుఖములు కోరువాడు, బాహ్య—అంతరములను విడిచిపెట్టలేడు. విరక్తునకు—విషయ సుఖములందు ఆసక్తి లేనివానికి, అంతర్బాహ్యములను విడిచిపెట్టుట సులభము).

374. బహిస్తు విషయైః సంగః తథాంతరహమాదిభిః
విరక్త ఏవ శక్నోతి త్యక్తుం బ్రహ్మణి నిష్ఠితః

(బ్రహ్మ భావమునందు నిలచిన) విరక్తునకు మాత్రమే, బాహ్యవిషయములందు, లోపలి (మనోబుద్ధులలోని) 'అహం'భావము మొదలగు వానియందు, అభిమానము తొలగిపోవును.

375. వైరాగ్యబోధౌ పురుషస్య పక్షివత్
పక్షౌ విజానీహి విచక్షణ త్వం
విముక్తిసౌధాగ్రలతాధిరోహణం
తాభ్యాం వినా నాన్యతరేణ సిద్ధ్యతి

ఓ వివేకవంతుడా! ముక్తిసౌధము యొక్క చిట్టచివరనున్న లతను అధిరోహించుటకు, పక్షికి గల రెండు రెక్కలవలె, వైరాగ్యము, వివేకము (బుద్ధి) అనునవి రెండును అవసరమని నీవు తెలుసుకొనుము. (ఆ రెండింటిలోను ఏ ఒక్కటి లేకపోయినను, ఒకరెక్కలేని పక్షి ఎగురలేనట్లు), ఒక్కదానితో మాత్రమే ముక్తి సాధ్యపడదు. (మోక్షమునకు వైరాగ్యము, వివేకము రెండునూ అవసరమే.)

376. అత్యంత వైరాగ్యవతః సమాధిః
సమాహితస్యైవ దృఢ ప్రబోధః
ప్రబుద్ధతత్వ స్యహి బంధముక్తి -
ర్ముక్తాత్మనో నిత్యసుఖానుభూతిః

అత్యంత వైరాగ్యము కలవానికే సమాధి సిద్ధించును: (మనస్సులో ఎట్టి అలజడులు, ఆలోచనలు, వాంఛలు లేనప్పుడే సమాధి స్థితి కలుగును, అందుకు అత్యంతమయిన వైరాగ్యము ముఖ్యము). సమాధిస్థితివలన దృఢమయిన ఆత్మజ్ఞానము కలుగును. ఆత్మతత్వము (సంపూర్ణముగా) తెలుసుకొనుటవలన బాధ ముక్తి కలుగును. ముక్తి పొందినవాడు ఎల్లప్పుడు ఆనందమును అనుభవించుచుండును.

377. వైరాగ్యాన్న పరం సుఖస్య జనకం పశ్యామి వశ్యాత్మన -
స్తచ్చేచ్ఛుద్ధతరాత్మబోధసహితం స్వారాజ్యసామ్రాజ్యధుక్:
ఏతద్వారమజస్రముక్తియువతేర్యస్మాత్త్వమస్మాత్పరం
సర్వత్రాస్పృహయా సదాత్మని సదా ప్రజ్ఞాం కురు శ్రేయసే

నిగ్రహచిత్తుడు (వశ్యాత్మ) ఆనందమును పొందుటకు వైరాగ్యముకన్న మార్గము (జనకం) కనుపించుటలేదు. ఆ వైరాగ్యము, పరిశుద్ధమయిన ఆత్మజ్ఞానముతో కూడినదయినచో, స్వారాజ్యము (లోపల) సామ్రాజ్యము (బయట) కలుగును. (లోపలి ప్రపంచముమీద, బయటి ప్రపంచముమీద ఆధిపత్యము లభించును). శాశ్వత ముక్తికాంతను చేరుటకు ఇదే మార్గము. కావున, నీవు నీ శ్రేయస్సుకొరకు, అన్నిటి

యందును సంగమును విడిచి, పరమాత్మయందు నీ మనస్సును (ప్రజ్ఞాం), సర్వదా లగ్నము చేయుము.

378. ఆశాం ఛిన్ధి విషోపమేషు విషయేష్వేషైవ మృత్యోః కృతి -
స్త్యక్త్వా జాతికులాశ్రమేష్వభిమతిం ముంచాతిదూరాత్క్రియాః
దేహాదావసతి త్యజాత్మధిషణాం ప్రజ్ఞాం కురుష్వాత్మని
త్వం ద్రష్టాస్యమలోఽపి నిర్ద్వయపరం బ్రహ్మాసి యద్వస్తుతః

విషతుల్యములయిన విషయభోగములందు ఆసక్తిని త్రెంచివేయుము. ఇవే మృత్యువునకు కారణములు; జాతి కుల ధర్మములందలి అభిమానమును విడిచిపెట్టుము. కామ్యకర్మలను ఎంతో దూరమునకు నెట్టివేయుము (దగ్గరకు రానీకుము); అసత్యములయిన దేహాదులయందు ఆత్మభావమును విడిచిపెట్టుము. పరమాత్మయందే నీ మనస్సును లగ్నము చేయుము. (నీవు ఈ సంసారసాగరములో కొట్టుకొనిపోవుచున్న జీవుడవు కావు); నీవు ద్రష్టవు (సాక్షిమాత్రుడవు); నిర్మలుడవు; వస్తుతత్వముచే నీవు సాక్షాత్ నిర్ద్వందమయిన పరబ్రహ్మవు.

## ధ్యాన పద్ధతి (379 -383) :

379. లక్ష్యేబ్రహ్మణిమానసందృఢతరంసంస్థాప్యబాహ్యేంద్రియం
స్వస్థానే వినివేశ్య నిశ్చలతనుశ్చోపేక్ష్య దేహస్థితిం
బ్రహ్మాత్మైక్యముపేత్య తన్మయతయా చాఖండవృత్త్యాఽనిశం
బ్రహ్మానందరసం పిబాత్మనిముదా శూన్యైః కిమన్యైర్భృశం

పరబ్రహ్మను లక్ష్యముగా చేసుకొని, మనస్సును అందులో దృఢముగా లగ్నము చేసి (సంస్థాప్య), బాహ్యేంద్రియములను వాటి స్వస్థానములందు నిలిపి (బాహ్యదృష్టిని మరల్చి, అంతర్దృష్టిని అలవరచుకొని), దేహమును స్థిరముగా నిలిపి, శరీరస్థితిని ఉపేక్షించి (శరీరము యొక్క మంచిచెడ్డల గూర్చి ఆరాటపడక), బ్రహ్మాత్మైకత్వమును పొంది, (బ్రహ్మములో నీవు లీనమై), అఖండమయిన బ్రహ్మభావమునందే నిలచుచు, బ్రహ్మభూతుడవై (తన్మయుడవై), ఎల్లప్పుడు నీలోగల బ్రహ్మానందరసమును సంతోషముతో గ్రోలుచుండుము. శూన్యములయిన, నిలకడలేని వేరు వాటితో పని ఏమి ?

380. అనాత్మచింతనం త్యక్త్వా కశ్మలం దుఃఖకారణం
చింతయాత్మానమానందరూపం యన్ముక్తికారణమ్.

దుఃఖకారణము, దోషభూయిష్టము అయిన అనాత్మ గూర్చిన (దేహాదుల గూర్చిన) ఆలోచనలను విడిచిపెట్టి, ముక్తి కారకుడు, ఆనందరూపుడు అయిన పరమాత్మనే తలంచుచుండుము (ధ్యానించుచుండుము).

381. ఏష స్వయంజ్యోతి రశేషసాక్షీ
విజ్ఞానకోశే విలసత్యజస్రమ్
లక్ష్యం విధాయైనమసద్విలక్షణ -
మఖండవృత్త్యాఽఽత్మ తయానుభావయ.

సర్వమునకును సాక్షి అయినవాడు, తనంతటనే ప్రకాశించువాడు, అసత్తునకు విలక్షణమయినవాడు, (జీవునకు వేరయినవాడు), బుద్ధిమయకోశమునందు ప్రకాశించువాడు అగు (ఆ పరమాత్మను) లక్ష్యముగా చేసుకొని, నిరంతర ధ్యానమువలన (అఖండవృత్త్యా), నీ ఆత్మగా (నీవుగా) అనుభవమును పొందుము.

382. ఏతమచ్ఛిన్నయా వృత్త్యా ప్రత్యయాంతరశూన్యయా
ఉల్లేఖయన్విజానీయాత్స్వస్వరూపతయా స్ఫుటం

ఈ విధముగా వేరు ఆలోచనలు లేకుండ, నిరంతర ధ్యానమువలన (లోతుగా) గుచ్చి చూసి (ఉల్లేఖయన్), ఆ ఆత్మతత్వము నీ నిజస్వరూపముగా నిశ్చయముగా తెలిసికొనుము (ఉల్లేఖయన్ = గుచ్చు: త్రవ్వు).

383. అత్రాత్మత్వం దృఢీకుర్వన్నహమాదిషు సంత్యజన్
ఉదాసీనతయా తేషు తిష్ఠేద్ఘటపటాదివత్

బ్రహ్మాత్మ భావమును దృఢపరచి, 'అహం' భావము మొదలగువానిని (దేహాదులను) త్యజించి, వానియందు పగిలిన కుండలయందువలె, ఉదాసీన భావముతో ఉండవలెను. (పగిలిన కుండను మనము లక్ష్యపెట్టము. ఆ విధముగనే శరీరాదులను లక్ష్యపెట్టరాదు).

## ఆత్మభావన (384–397):

384. విశుద్ధమంతఃకరణం స్వరూపే
నివేశ్య సాక్షిణ్యవబోధమాత్రే
శనైః శనైర్నిశ్చలతాముపానయన్
పూర్ణంస్వమేవాను విలోకయే త్తతః

అంతఃకరణమును శుద్ధము చేసి, (మనోబుద్ధులను రజస్తమోగుణముల నుండి వాంఛలనుండి విడదీసి) దానిని సాక్షీమాత్రుడు, జ్ఞానస్వరూపుడు అయిన ఆత్మయందు చేర్చి, నెమ్మదీ నెమ్మదిగా దానిని నిశ్చలమయినదిగాచేసి, (వేరు ఆలోచనలు లేనిదిగా చేసి), (సాధకుడు) పూర్ణరూపుడయిన తననే (హృదయ కుహరమునందుగల పరమాత్మ స్వరూపమును) అవలోకించవలెను. (మనస్సు నిశ్చలమయిన వెంటనే, తానే పరమాత్మనను సత్యము సుగోచరమగును.)

385. దేహేంద్రియ ప్రాణమనోఽహమాదిభిః
స్వాజ్ఞానక్లృప్తైరఖిలై రుపాధిభిః
విముక్తమాత్మాన మఖండరూపం
పూర్ణం మహాకాశమివావలోకయేత్.

దేహము, ఇంద్రియములు, ప్రాణము, మనస్సు, అహంకారము మొదలగు నీలోని అజ్ఞానమువలన కలిగిన అన్ని ఉపాధులనుండి మనస్సును విముక్తపరచి (విడదీసి), (ఆ విధముగా శుద్ధమయిన అంతఃకరణముతో) పూర్ణరూపుని, అఖండరూపుని మహాకాశమువలె అవలోకించవలెను.

386. ఘటకలశకుసూలసూచీ ముఖ్యై -
ర్గగనముపాధిశతై ర్విముక్తమేకమ్
భవతి న వివిధం తథైవ శుద్ధం
పరమహమాదివిముక్తమేకమేవ.

కుండ, ముంత, (ధాన్యము మొదలగు దినుసులు రాశులుగా పోయుటకు ఉపయోగపడు) కళ్ళము, సూదిబెజ్జము మొదలగు వందలకొలదిగల ఉపాధుల విభేదము వలన (విభజింపబడినట్లు కనబడు) ఆకాశమంతయును, అవి తొలగిపోగానే, ఒక్కటేగానే,

వేరువేరు (ఆకాశములు)కానట్లు, అహంకారము మొదలగు ఉపాధులు తొలగిపోగానే, శుద్ధమయిన పరమాత్మ ఏకరూపముతో ఉండును.

387. బ్రహ్మాది స్తంబపర్యంతా మృషామాత్రా ఉపాధయః
తతః పూర్ణం స్వమాత్మానం పశ్యేదేకాత్మనా స్థితమ్.

బ్రహ్మ (సృష్టికర్త) మొదలుకొని, అత్యల్పమయిన జీవి (స్తంబము) వరకు గల ఉపాధులన్నియును అసత్యమయినవి మాత్రమే. అందువలన తన ఆత్మను (అన్ని ఉపాధులయందు), ఏకరూపముతో ఉన్న పూర్ణ ఆత్మతత్వముగా తెలుసుకొనవలెను.

388. యత్ర భ్రాంత్యా కల్పితం తద్వివేకే
తత్తన్మాత్రం నైవ తస్మాద్విభిన్నమ్
భ్రాంతేర్నాశే భ్రాంతిదృష్టాహితత్వం
రజ్జుస్తద్వద్విశ్వమాత్మస్వరూపం.

(ఒక వస్తువునందు) భ్రాంతివలన కల్పింపబడిన (వేరొక వస్తువు అను భావము), వివేకజ్ఞానమువలన (నిజము తెలిసికొనిన తర్వాత), మొదటి వస్తువు రూపముతోనే పూర్తిగా కనబడునుగాని, అందుకు విభిన్నముగా కనుపడదు. భ్రాంతివలన(సర్పముగా కనబడిన) పాముతత్వము (పాము అను భావము) భ్రాంతి తొలగిపోగానే, (దాని నిజతత్వమయిన) త్రాటిని మించి వేరుకానట్లు, ఈ విశ్వముగూడ (భ్రాంతివలన విభిన్నముగా కనబడుచున్నను), అంతయు ఆ పరమాత్మ స్వరూపమే.

389. స్వయం బ్రహ్మా స్వయం విష్ణుః స్వయమింద్రః స్వయం శివః
స్వయం విశ్వమిదం సర్వం స్వస్మాదన్యన్న కించన

తానే బ్రహ్మ; తానే విష్ణువు; తానే ఇంద్రుడు; తానే శివుడు; తానే ఈ విశ్వమంతయును కూడ; (ఉపాధి భేదములవలన వేరువేరుగా తోచుచున్నను), ఇవన్నియును పరమాత్మ కంటె, ఏ మాత్రము వేరయినవి కావు.

390. అంతః స్వయం చాపి బహిః స్వయం చ
స్వయం పురస్తాత్ స్వయమేవ పశ్చాత్
స్వయం హ్యవాచ్యాం స్వయమప్యుదీచ్యాం
తథోపరిష్టాత్స్వయమప్యధస్తాత్

లోన నున్నది స్వయముగ అతనే; బయటనున్నది అతనే; ముందునున్నది అతనే; వెనుకనున్నది అతనే; దక్షిణ దిక్కున (కుడివైపు) ఉన్నది అతనే; ఉత్తర దిక్కున (ఎడమవైపు) ఉన్నది అతనే; మీదనున్నది అతనే; క్రిందనున్నది కూడ స్వయముగా అతనే— (అతనే, ఆ పరబ్రహ్మస్వరూపమే-స్వయముగా అన్నివైపుల, లోన బయట గూడ ఆవరించి ఉన్నాడు).

391. తరంగఫేనభ్రమబుద్బుదాది
సర్వం స్వరూపేణ జలం యథా తథా
చిదేవ దేహాద్యహమంతమేతత్
సర్వం చిదేవైకరసం విశుద్ధం

తరంగములు, నురుగు, సుడిగుండములు, బుడగలు—మొదలగునవి అన్నియును గూడ స్వరూపముచే (వస్తుతత్వముచే) నీరే అయినట్లు, (బాహ్య) దేహము మొదలు కొని, (లోనగల) 'అహం' భావము వరకు అన్నియును, 'చిత్' స్వరూపమే. ఈసర్వము (విశ్వమంతయు) ఒక్క 'చిత్' రసముతోనే నిండియున్నది. (చిద్రసమే అయి ఉన్నది).

392. సదేవేదం సర్వం జగదవగతం వాఙ్మనసయోః
సతోఽన్యన్నాస్త్యేవ ప్రకృతిపరసీమ్ని స్థితవతః
పృథక్ కిం మృత్స్నాయాః కలశఘటకుంభాద్యవగతం
వదత్యేష భ్రాంతస్త్వమహమితి మాయామదిరయా

ఇంద్రియములకు మనస్సునకు (వాఙ్మనసయోః) కనుపించుచున్న ఈ జగత్తు అంతయును, బ్రహ్మస్వరూపమే (సత్+ఏవ+ఇదం=సదేవేదం=అంతా సత్స్వరూపమే) ప్రకృతి పరిధినిదాటి ఉన్నది కూడ బ్రహ్మమే, కాని వేరయినదికాదు. (బ్రహ్మతత్త్వము మనకు కనబడు ప్రపంచమును దాటిగూడ ఉన్నది). మట్టితో చేయబడిన కుండలు, ముంతలు, బానలు, మొదలగునవి అన్నియును, మట్టికంటె వేరయినవి ఎట్లుకాగలవు? మాయ అను కల్లుచే (మాయామదిరచే) భ్రాంతుడై, 'నీవు', 'నేను' అని పలుకుచుండును.

393. క్రియాసమభిహారేణ యత్రనాన్యదితి శ్రుతిః
బ్రవీతి ద్వైతరాహిత్యం మిథ్యాధ్యాసనివృత్తయే

మిథ్యాజ్ఞానము వలన (బ్రహ్మమునందు ఆరోపింపబడిన దేహాదిభావములు) పోగొట్టబడు, శ్రుతులు ద్వంద్వరాహిత్యమును 'యత్రనాన్యదితి' అను పలుక్రియలతో (వ్యాకరణ విశేషములతో) చెప్పుచున్నవి. (ఛాందోగ్యోపనిషత్తులో — 'యత్ర నాన్యత్పశ్యతి, యత్ర నాన్యత్ శృణోతి, నాన్యద్విజానీతి, తద్భూమా' అని చెప్పబడినది (7/24/1).

394. ఆకాశవన్నిర్మల నిర్వికల్పం
నిఃసీమ నిఃస్పందన నిర్వికారం
అంతర్బహిః శూన్యమనన్యమద్వయం
స్వయం పరంబ్రహ్మ కిమస్తి బోధ్యమ్.

ఈ పరబ్రహ్మ స్వరూపము ఆకాశమువలె—నిర్మలమయినది; నిర్వికల్పమయినది (భిన్నత్వములేనిది); ఎల్లలులేనిది; కదలికలేనిది; మార్పులులేనిది; లోపల బయట అనునవిలేనిది; అనన్యమయినది (వేరు వస్తువులేనిది); అద్వయమయినది; అదే స్వయముగా నీ ఆత్మకూడ— ఇంతకన్న చెప్పవలసినదేమున్నది?

395. వక్తవ్యంకిము విద్యతేఽత్ర బహుధా బ్రహ్మైవజీవః స్వయం
బ్రహ్మైతజ్జగదాతతంను సకలం బ్రహ్మాద్వితీయం శ్రుతిః
బ్రహ్మైవాహమితి ప్రబుద్ధమతయః సంత్యక్తబాహ్యాః స్ఫుటం
బ్రహ్మీభూయ వసంతి సంతతచిదానందాత్మనై తద్ధ్రువం

పలు విధములుగా చెప్పవలసినది ఏమున్నది? — జీవుడు స్వయముగా బ్రహ్మస్వరూపుడు; ఈ సువిశాలమయిన జగత్తంతయు కూడ బ్రహ్మమే—బ్రహ్మము అద్వితీయుడని శ్రుతులు చెప్పుచున్నవి. వికశించిన మనస్సు గలవారు (ప్రబుద్ధమతులు విజ్ఞానవంతులు) 'నేనే బ్రహ్మమును' అని తెలిసికొని, బాహ్య ప్రపంచమును విడిచి పెట్టి, బ్రహ్మ భూతులై (బ్రహ్మ భావమునందే నిలచువారై), సంతత చిదానందముతో నిండిన వారై ఉందురు. ఇది నిశ్చయము.

396. జహి మలమయకోశేఽహంధియోత్థాపితాశాం
ప్రసభమనిలకల్పే లింగదేహేఽపి పశ్చాత్
నిగమగదితకీర్తిం నిత్యమానందమూర్తిం
స్వయమితి పరిచీయ బ్రహ్మరూపేణ తిష్ఠ.

ఈ మలముతో నిండిన దేహమునందు అహంకారము పెంచుకున్న ఆశలను విడిచి పెట్టుము: ఆ విధముగనే గాలి మూటవంటి (అనిలకల్పే) లింగదేహమందలి (సూక్ష్మ దేహమందలి) ఆశనుగూడ వెంటనే విడిచిపెట్టుము. వేదములచే కీర్తింపబడువాడు, సర్వదా ఆనంద స్వరూపుడు అయిన (ఆ పరబ్రహ్మ స్వరూపము) నీవే అని తెలుసుకొని, బ్రహ్మరూపముతో మనుము (నిలుపుము).

397. శవాకారం యావద్భజతి మనుజస్తావదశుచిః
పరేభ్యః స్యాత్క్లేశో జనన మరణ వ్యాధి నిలయః
యదాత్మానం శుద్ధం కలయతి శివాకారమచలం
తదా తేభ్యో ముక్తో భవతి హి తదాహ శ్రుతిరపి.

శవరూపములో ఉన్న ఈ దేహమును కొలుచుచున్నంతవరకు— (దాని సేవలోనే) నిమగ్నమైయున్నంత వరకు, మనిషి 'అశుచి' అగుచున్నాడు. (అట్టి వానికి), ఇతరుల వలన దుఃఖములు కలుగును. జననము, మరణము, వ్యాధి, మొదలగు వాని వలన బాధపడుచుండును. ఎప్పుడు—తనను పరిశుద్ధునిగా, నిశ్చలుడయిన శివరూపునిగా తెలుసుకొనునో, అప్పుడే ఆ బంధముల నుండి సదా ముక్తుడయి, (పరమాత్మ స్వరూపునిగా) ఉండును. ఈ విధముగా శ్రుతులు గూడ చెప్పుచున్నవి.

## అభేదత్వము (398–406):

398. స్వాత్మన్యారోపితాశేషాభాసవస్తునిరాసతః
స్వయమేవ పరం బ్రహ్మ పూర్ణమద్వయ మక్రియం.

ఆత్మయందు ఆరోపింపబడిన, ప్రతిబింబ మాత్రములయిన (అభాస—అసత్యములయిన) అనేకములగు భావములను (వస్తువులను) తొలగించునప్పుడు, పరబ్రహ్మ స్వరూపము, స్వయముగా, పూర్ణరూపముతో, అద్వితీయునిగా క్రియా రహితునిగా ప్రకాశించును. (కామ్య కర్మలను చేయుటకు ప్రోద్బలములగు వాసనలుగాని, వాంఛలుగాని, ఆ ఆత్మతత్త్వములో ఉండవుగాబట్టి— 'అక్రియుడు').

399. సమాహితాయాం సతి చిత్తవృత్తౌ
పరాత్మని బ్రహ్మణి నిర్వికల్పే,
నదృశ్యతే కశ్చిదయం వికల్పః
ప్రజల్పమాత్రః పరిశిష్యతే యతః

చిత్త వృత్తులన్నియును (మనో బుద్ధులలో కలుగు ఆందోళనలు, అలజడులు, ఆలో
నలు, వాంఛలు, భావనలు వగైరా), నిర్వికల్పమయిన పరబ్రహ్మయందు (పరమాత్మ
గూర్చిన భావనయందు — తదేక వృత్తియందు) లయపరచినప్పుడు, ఈ కల్పిం
బడిన విభిన్నత్వమంతయు (వికల్పః), ఏమాత్రమును గోచరించదు. (ఆ నిజమును
అనుభవపూర్వకముగా తెలిసికొనిన పిమ్మట ఈ శాస్త్ర చర్చ, వాగ్వివాదములు,
న్నియు, బట్టి ప్రజల్పములు మాత్రమే (నిరుపయోగమయిన ధ్వనులు మాత్రమే)
అగుచున్నవి.

400. అసంకల్పో వికల్పోఽయం విశ్వమిత్యేకవస్తుని
నిర్వికారే నిరాకారే నిర్విశేషే భిదా కుతః

ఏక వస్తువు (అద్వయము) అయిన పరమాత్మయందు ఈ విభిన్న కల్పన అయిన
విశ్వమంతయు అసత్యము (అసత్కల్పము). నిర్వికారుడు (మార్పులు లేనివాడు)
నిరాకారుడు (ఆకారము లేనివాడు), నిర్విశేషుడు (మరొక వస్తువుగాని, గుణముగాని
లేనివాడు), అయిన వాని యందు (పరమాత్మ యందు), విభిన్నత్వము ఎట్లుండును

401. ద్రష్టృదర్శనదృశ్యాదిభావశూన్యైకవస్తుని
నిర్వికారే నిరాకారే నిర్విశేషే భిదా కుతః

ద్రష్ట (చూచువాడు), దర్శనము (చూచుట), దృశ్యము (చూడబడునది) ఈ
విభేదములులేని, (జ్ఞాత, జ్ఞానము, జ్ఞేయము, అను విభేదములులేని), ఏకవస్తువు
యందు—నిర్వికారుడు, నిరాకారుడు, నిర్విశేషుడు అయినవాని యందు విభిన్న
మెట్లుండును?

402. కల్పార్ణవ ఇవాత్యంతపరిపూర్ణైకవస్తుని
నిర్వికారే నిరాకారే నిర్విశేషే భిదా కుతః

కల్పార్ణవమువలె (ప్రళయానంతరము ప్రశాంతముగా మిగిలిన మహాసముద్రమువలె)
అత్యంత పరిపూర్ణుడయిన ఏకవస్తువుయందు (అద్వైత పరబ్రహ్మ స్వరూపము
నందు), నిర్వికారుడు, నిరాకారుడు, నిర్విశేషుడు అయిన వానియందు విభిన్నత్వ
మెట్లుండును.

403. తేజసీవ తమో యత్ర విలీనం భ్రాంతికారణం
అద్వితీయే పరే తత్త్వే నిర్విశేషే భిదా కుతః

కాంతిలో చీకటి విలీనమయిపోయినట్లు, భ్రాంతి కారణమయిన ఈ జగత్తంతయు ఎవనియందు విలీనమగునో, అట్టి అద్వితీయుడు అతీంద్రియుడు (పరం), నిర్విశేషుడు అయిన ఆత్మ తత్త్వము నందు విభిన్నత్వ మెట్లుండును.

404. ఏకాత్మకే పరే తత్త్వే భేదవార్తా కథం వసేత్
సుషుప్తౌ సుఖమాత్రాయాం భేదః కేనావలోకితః

ఏకాత్మ రూపమయిన పరతత్త్వమునందు విభిన్నత్వ భావము ఎట్లు నిలువగలదు? గాఢ నిద్రలో (జీవుడు) సుఖమాత్రునిగా ఉన్నప్పుడు, ఎవడు (ఏ భిన్నత్వమును) చూడగలుగు చున్నాడు?

405. న హ్యస్తి విశ్వం పరతత్త్వబోధాత్
సదాత్మని బ్రహ్మణి నిర్వికల్పే
కాలత్రయే నాప్యహిరీక్షితో గుణే
న హ్యంబుబిన్దుః మృగతృష్ణికాయామ్

నిర్వికల్పమయిన (విభిన్నత్వము లేని), సత్స్వరూపమయిన, పరబ్రహ్మమునందు, (అభాసరూపమయిన) ఈ విశ్వము ఎప్పుడును (ఏకాలమందును) లేదు. త్రాటి యందు సర్పము, (భూత భవిష్యద్వర్తమానములయిన) మూడు కాలములలో ఎప్పుడును లేదు. (ఉండదు): అట్లే, ఎండమావులయందు (ఏ కాలమందుగూడ), ఒక్క నీటి బిందువయినను లేదు. (ఈ సర్పము, ఈ నీరు - ఇవి భ్రమవలన కనుపించు చున్నవి. వానికి ఉనికి లేదు). (అట్లే ఈ విశ్వము ఎప్పుడును లేదు; ఉన్నది, ఎల్లకాలములందు అన్నిచోట్ల-బ్రహ్మము మాత్రమే; భ్రమవలన, ఉన్నట్లు తోచుచున్న ఈ విశ్వము, భ్రమ తొలగిపోగానే, అంతరించును. అప్పుడు, నిజ తత్త్వము, ఈ భ్రమల కన్నింటికి ఆధారభూతము అయిన-అద్వయ పరబ్రహ్మము ఒక్కటే విదితమగును-అట్టి అవగాహన నిశ్చల సమాధియందు కలుగును).

406. మాయామాత్ర మిదం ద్వైతమద్వైతం పరమార్థతః
ఇతి బ్రూతే శ్రుతిః సాక్షాత్సుషుప్తావనుభూయతే.

అద్వయ మయిన పరమాత్మయందు, విభిన్నత్వము (ద్వైతము) మాయ వలనకలిగినది మాత్రమే. ఈ విధముగా సాక్షాత్తు శ్రుతులే (ఉపనిషత్తులే) చెప్పుచున్నవి. గాఢ నిద్ర యందు మన అనుభవము కూడ అదే. (గాఢనిద్రలో విభిన్నత్వము గోచరించదు).

## ఆత్మ విచారము (407–413) :

407. అనన్యత్వమధిష్ఠానాదారోప్యస్య నిరీక్షితమ్
పండితై రజ్జుసర్పాదౌ వికల్పో భ్రాంతిజీవనః

(ఒక వస్తువునందు భ్రమవలన మరొక వస్తువు అను భావము ఆరోపింప బడినప్పుడు-ఒక వస్తువునుజూచి, మరొక వస్తువు అని భ్రమించినప్పుడు), ఆ ఆరోపితమయిన దానికి ఆధారమయిన దానికీ, వస్తుతత్వములో విభేదములేదని పండితులు తెలిసికొనగలరు. త్రాటియందును, (దానిపై ఆరోపింపబడిన-దానియందును భ్రమవలన చూచుచున్న) సర్పము నందును, ఉన్నది ఒక్కటే వస్తుతత్వము (రజ్జు తత్వము). ఆవిధముగానే ఈ విశ్వమంతయు భ్రాంతిజనితమయినది. (కావున దాని వస్తుతత్వము, ఆధారభూతమయిన బ్రహ్మ వస్తుతత్వమునకు భిన్నమయినది కాదు.)

408. చిత్తమూలో వికల్పోఽయం చిత్తాభావే న కశ్చన
అతశ్చిత్తం సమాధేహి ప్రత్యగ్రూపే పరాత్మని.

ఈ విభిన్నత్వమున కంతకును చిత్తమే (మనస్సే) మూలము: మనస్సులేనప్పుడు ఇది ఎన్నటికిని ఉండదు. (ఉదా : గాఢ నిద్రలో ఇది కనబడదు). కావున నీ మనసును నీలోగల పరమాత్మ తత్వమునందు చేర్చి లయపరుపుము.

409. కిమపి సతతబోధం కేవలానందరూపం
నిరుపమమతివేలం నిత్యముక్తం నిరీహం
నిరవధి గగనాభం నిష్కలం నిర్వికల్పం
హృది కలయతి విద్వాన్ బ్రహ్మ పూర్ణం సమాధౌ

చెప్పనలవికాని (కిమపి) సంతతజ్ఞాన స్వరూపుడు, కేవలుడు, ఆనందరూపుడు, దేని తోను పోల్చదగనివాడు (నిరుపమం), ఎల్లలు లేనివాడు (అతివేలం), నిత్యముక్తుడు, క్రియారహితుడు, అంతులేని ఆకాశమువలె-భాగములులేనివాడు (నిష్కలం), నిర్వి కల్పుడు అయిన పరిపూర్ణమయిన పరబ్రహ్మమును పండితుడు సమాధిస్థితియందు తన హృదయ కుహరములో చూచుచున్నాడు.

410. ప్రకృతివికృతిశూన్యం భావనాతీతభావం
సమరస మసమానం మానసం బంధదూరం
నిగమవచనసిద్ధం నిత్యమస్మత్ప్రసిద్ధం
హృది కలయతి విద్వాన్ బ్రహ్మపూర్ణం సమాధౌ

ఈ కనబడుచున్న ప్రకృతిగాని, దాని మార్పులుగాని లేనివాడు - (ప్రకృతి వికృతి శూన్యః), ఎల్ల ఆలోచనలకు అతీతమయిన భావము కలవాడు, అన్నింటి యందు సమానముగా నిండియున్నవాడు (సమరసః), తనతో సమానమయినది (తుల్యమయినది) లేనివాడు, (అసమానః), ఎట్టి ప్రమాణమునకును అందనివాడు (మానసంబంధదూరః), శ్రుతి వాక్యములచే నిర్దేశింపబడినవాడు, మనలో 'నేను' అను భావముతో ప్రసిద్ధమయినవాడు (అస్మత్ప్రసిద్ధః)—అట్టి పరిపూర్ణమయిన బ్రహ్మమును పండితుడు సమాధిస్థితిలో తన హృదయకుహరములోనే తిలకించుచున్నాడు.

411. అజరమమరమస్తాభావవస్తు స్వరూపం
స్తిమితసలిలరాశిప్రఖ్యమాఖ్యావిహీనం
శమితగుణవికారం శాశ్వతం శాంతమేకం
హృది కలయతి విద్వాన్ బ్రహ్మపూర్ణం సమాధౌ.

ముసలితనము, మరణము లేనివాడు (ఎట్టి మార్పులును లేనివాడు), అభావ తొలగిన నిజరూపముతో ప్రకాశించువాడు, స్తిమితమయిన (అలలు, అలజడులు లేని) మహాజలరాశివలెనున్నవాడును, గుణముల వలన కలిగిన వికారములన్నియు శమింపజేసినవాడును, శాశ్వతుడును, పేరుచే నిర్దేశింపలేనివాడును (ఆఖ్యావిహీనః) శాంత స్వరూపుడును, కేవలుడును (ఏకః), అయిన ఆ పరబ్రహ్మమును పండితుడు సమాధి స్థితిలో తన హృదయకుహరములోనే అవలోకించుచున్నాడు.

412. సమాహితాంతఃకరణః స్వరూపే
విలోకయాత్మానమఖండవైభవం
విచ్ఛిద్ధి బంధం భవగంధగంధితం
యత్నేన పుంస్త్వం సఫలీకురుష్వ.

అంతఃకరణమును సమాధి స్థితియందు నిలిపి, నీలో (స్వరూపే) అఖండవైభవముతో నున్న ఆత్మతత్త్వమును అవలోకింపుము. పూర్వజన్మల వాసనలచే కలుషితమయిన

(భవగంధ గంధితం) నీ బంధములను త్రెంచుకొనుము. ప్రయత్నమువలన నీ మనుజజన్మమును సఫలీకృతము జేయుము. (బ్రహ్మకైవల్యము కొరకు ప్రయత్నింపుము.)

413. సర్వోపాధివినిర్ముక్తం సచ్చిదానందమద్వయం
భావయాత్మానమాత్మస్థం న భూయః కల్పసేఽధ్వనే

అన్ని ఉపాధులను అతిక్రమించిన సచ్చిదానందుని, అద్వయుని, ఆ పరమాత్మను-నీలో నున్నవానిని-భావించు చుండుము. (ధ్యానించుచుండుము). తిరిగి ఈ జనన మరణ చక్రమునందు చిక్కుకొనవు).

## శరీరభావమును విడచుట (414-418) :

414. ఛాయేవ పుంసః పరిదృశ్యమాన
మాభాసరూపేణ ఫలానుభూత్యా
శరీర భారాచ్ఛవవన్నిరస్తం
పునర్న సంధత్త ఇదం మహాత్మా.

(ఆత్మ దర్శనము పొందిన) మహాత్ముడు ఈ శరీరమును ఒక నీడవలె, (అసత్యమయినదిగా-ఛాయాఇవ), చూచును. ప్రారబ్ధ కర్మఫలమును అనుభవించుట మాత్రమే ఉన్నట్లు తలంచును. ఈ శరీరముపతనమై శవమయినప్పుడు, తిరిగి దానిని పొందుటకు ప్రయత్నించడు-లేక-ఈ శరీరమును (పనికిరాని) శవమువలె విడిచిపెట్టి (భావించి), తిరిగి దానియందు ఆసక్తి చూపడు.

415. సతతవిమలబోధానందరూపం సమేత్య
త్యజ జడమలరూపోపాధిమేతం సుదూరే;
అథ పునరపి నైష స్మర్యతాం వాంతవస్తు
స్మరణవిషయభూతం కల్పతే కుత్సనాయ.

శాశ్వతమయినదియు, నిర్మల మయినదియు, జ్ఞానానంద రూపకమయినదియు, అయిన (పరమాత్మను) పొంది (తెలుసుకొని), జడమయినదియు, (చైతన్యములేనిదియు), మలరూపమయినదియు, అయిన ఈ ఉపాధిని (శరీరమును) దూరముగా త్రోసి వేయుము. (సుదూరేత్యజ), అటుపిమ్మట దానిని తలంపకుము (స్మరింపకుము) వాంతి చేసుకున్న వస్తువును తలచుకున్నంత మాత్రమున అసహ్యము కలుగునుగా

416. సమూలమేతత్పరిదహ్య వహ్నౌ
సదాత్మని బ్రహ్మణి నిర్వికల్పే
తతః స్వయం నిత్యవిశుద్ధబోధా—
నందాత్మనా తిష్ఠతి విద్వరిష్ఠః

సత్స్వరూపము, నిర్వికల్పము, అయిన పరబ్రహ్మమను అగ్నియందు, (ఈదేహాది భావమును), సమూలముగా దహించి, పండిత శ్రేష్ఠుడు నిత్యము, పరిశుద్ధము, బోధ రూపకము, ఆనందమయము అయిన, ఆ పరమాత్మలో స్వయముగా నిలచును.

417. ప్రారబ్ధసూత్ర గ్రథితం శరీరం
ప్రయాతు వాతిష్ఠతు గోరివ స్రక్
నతత్పునః పశ్యతి తత్వవేత్తా—
ఽఽనందాత్మని బ్రహ్మణి లీనవృత్తిః

ఆనంద స్వరూపమయిన పరబ్రహ్మలో లీనమయిన భావముతోనున్న (లీనవృత్తిః), తత్వవేత్త, ప్రారబ్ధ కర్మమను దారముచే పెనవేయబడిన (ప్రారబ్ధసూత్రాగ్రథితం), ఈ శరీరము - ఆవు మెడలో వేసిన పూలదండవలె- ఉన్నను, పోయినను, దానిని తిరిగి లక్ష్యపెట్టడు. (గోకులాష్టమినాడు కొందరు గోపూజచేసి, ఆవుమెడలో పూలదండలు వేసెదరు. కాని ఆ ఆవునకు ఆ పూలదండ ఉన్నను, ఊడినను, ఇతరులు మెచ్చుకున్నను, లేకున్నను, ఎట్టి అనుభూతియు పొందదు. అవిధముగనే తత్వవేత్తలు ఈ శరీరమునుగూడ పరిగణింతురు).

418. అఖండానందమాత్మానం విజ్ఞాయ స్వస్వరూపతః
కిమిచ్ఛన్ కస్యవా హేతోర్దేహం పుష్ణాతి తత్వవిత్

తన నిజతత్వమును (స్వస్వరూపమును) అఖండానంద స్వరూపుడయిన ఆ పరమాత్మగా తెలుసుకొనిన తత్వవేత్తః - దేనిని ఆశించి, లేక ఎవరికొరకు, ఈ శరీరమును పోషించు చుండవలెను?.

## ఆత్మజ్ఞాన ఫలము (419-425) :

419. సంసిద్ధస్య ఫలం త్వేతజ్జీవన్ముక్తస్య యోగినః
బహిరంతః సదానందరసాస్వాదనమాత్మని

సిద్ధిపొందిన, జీవన్ముక్తుడయిన యోగికి - లోపల, బయట, ఆత్మతత్త్వమయిన స్వా నంద రసానుభవమే, ఫలము (సిద్ధిపొందుట వలన కలుగు లాభమేమి - అన్న ప్రశ్నకు ఇది జవాబు).

420. వైరాగ్యస్య ఫలం బోధో బోధస్యోపరతిః ఫలం,
స్వానందానుభవాచ్ఛాంతిరేషైవోపరతేః ఫలం.

వైరాగ్యమువలన కలుగు ఫలము ఆత్మజ్ఞానము (బోధః): జ్ఞానము వలన కలుగు ఫలము - ఉపరతి (అనిత్యవస్తువులనుండి వైదొలగి, నిత్యవస్తువయిన ఆత్మయందు నిలచుట), ఉపరతి వలన కలుగు ఫలము - తనలోతాను ఆనందానుభవము పొందుట. దానివలన శాంతిని పొందుట (వైరాగ్యమువలన జ్ఞానము, జ్ఞానము వలన ఉపరతి, దాని వలన ఆత్మానందము, దానివలన శాంతి కలుగును).

421. ఉత్తరోత్తరాభావః పూర్వ పూర్వం తు నిష్ఫలం
నివృత్తిః పరమాతృప్తిరానందోఽనుపమః స్వతః

(పైశ్లోకములో చెప్పిన అనుక్రమణములో), తదుపరిచెప్పిన (ఫలములు), కలుగనిచో, ముందుచెప్పినవి నిష్ఫలములు (నిష్ప్రయోజనములు) అగును. (జ్ఞానము కలుగనిచో వైరాగ్యము వ్యర్థము; ఉపరతి కలుగనిచో జ్ఞానము వ్యర్థము; ఆత్మానుభవము కలుగనిచో ఉపరతి వ్యర్థము). (ధృఢవ్రతుడయిన సాధకునిలో) - నివృత్తి (బాహ్యాంతరములందలి వైరాగ్యము), అత్యంత తృప్తి, (పరమతృప్తిః) నిరుపమానమయిన ఆనందము, (ఒకదాని వెనుక నొకటి) స్వతస్సిద్ధముగా కలుగును.

422. దృష్టదుఃఖేష్వనుద్వేగో విద్యాయాః ప్రస్తుతం ఫలం
యత్కృతం భ్రాంతివేలాయం నానాకర్మ జుగుప్సితం
పశ్చాన్నరో వివేకేన తత్కథం కర్తుమర్హతి.

దృశ్యప్రపంచమందలి దుఃఖములవలన చలించకుండుట - జ్ఞానమువలన కలుగు ఫలము. భ్రాంతికాలములో (అజ్ఞానవశమున) చేసిన పలువిధములయిన నీచకర్మలను (కుత్సితకర్మలను), వివేకము (ఆత్మజ్ఞానము) కలిగిన పిమ్మట మనుజుడు ఎట్లు చేయగలడు? (మనుజుడు నీచములయిన కామ్యకర్మలను అజ్ఞానమువలన చేయును: జ్ఞానము కలిగిన పిమ్మట అట్టి పనులను చేయడు. అదియే జ్ఞానము వలన కలుగు ఫలము).

423. విద్యాఫలం స్యాదసతో నివృత్తిః
ప్రవృత్తిరజ్ఞానఫలం తదీక్షితం,
తజ్జ్ఞాజ్ఞయోర్యన్మృగ తృష్ణికాదౌ
నో చేద్విదాం దృష్టఫలం కిమస్మాత్

జ్ఞానము వలన ఫలము అసద్వస్తువులనుండి (ఈ దేహాదులు, దృశ్య ప్రపంచము నుండి) నివృత్తి; అజ్ఞానము వలన ఫలము (ఈ ప్రపంచమే నిజమను భావముతో అందులో) ప్రవర్తించుట; (జ్ఞాని ఈ జగత్తు అసత్యమని తెలుసుకొని, నిర్లిప్తునిగా ఉండును; అజ్ఞాని-ఈ జగత్తు సత్యమని భావించి, అందులో కర్మలుచేయుటకు ఉప క్రమించును). ఎండమావులు మొదలగు (మిథ్యావస్తువులయందు) జ్ఞాని, అజ్ఞానుల (ప్రవర్తనవలన) ఇది తేటతెల్లమగుచున్నది. (ఎండమావులలో నీరు ఉండదని తెలిసిన జ్ఞాని దానిని చూసియు చలింపడు. అజ్ఞాని,అందులో నీరు ఉన్నదని భ్రమించి తన దాహము తీర్చుకొనుటకు, ఎండమావుల వైపు పరుగులుపెట్టుచునే యుండును), (జ్ఞాని, అజ్ఞానులమధ్య ఈ విభేదము లేనిచో) విద్వత్తు (జ్ఞానము) పొందుటలో గల ఫలము ఏమిటి?

424. అజ్ఞానహృదయగ్రంథేర్వినాశో యద్యశేషతః
అనిచ్ఛోర్విషయః కిం ను ప్రవృత్తేః కారణం స్వతః

అజ్ఞానము వలన కలిగిన హృదయగ్రంథులను (వాసనలు, వాంఛలు,కర్మలు), నిశ్శేష ముగా నాశనముచేసి, విషయ సుఖములందు కోరిక లేని వానిని, ఏకారణములు మరల ప్రవృత్తియందు దింపగలవు? (అజ్ఞానము తొలగిపోయిన పిదప, కర్మప్రేరిత ములయిన వాంఛలు అన్నియు నశిపోవును.)

425. వాసనానుదయో భోగ్యే వైరాగ్యస్య తదావధిః
అహంభావోదయాభావో బోధస్య పరమావధిః
లీనవృత్తేరనుత్పత్తిర్మర్యాదోపరతేస్తు సా

భోగ్య వస్తువులయందు (విషయములయందు) వాసనలు (వాంఛలు), కలుగకుండు టయే వైరాగ్యము యొక్క అవధి (ఆఖరిమెట్టు); 'అహం' భావము (తిరిగి) (కలుగ కుండుటయే జ్ఞానము యొక్క పరమావధి. లీనమయిపోయిన మనోవృత్తులు తిరిగి కలుగ కుండుటయే ఉపరతి యొక్క తుదిసీమ. (వైరాగ్యము, జ్ఞానము, ఉపరతి-వీటిని

ఎంతవరకు తెలుసుకొనగలమో ఈ శ్లోకము చెప్పుచున్నది. వాంఛలు పూర్తిగా పోయినచో వైరాగ్యము కలిగినట్లే; 'అహం' భావము పూర్తిగా తొలగిపోయినచో జ్ఞానము కలిగినట్లే; మనోవృత్తులు తిరిగి తలఎత్తకుండా పూర్తిగా లీనమయిపోయినచో ఉపరతి కలిగినట్లే).

## జీవన్ముక్తుని లక్షణములు (426-445) :

426. బ్రహ్మాకారతయా సదా స్థితతయా నిర్ముక్తబాహ్యార్థధీ
రన్యావేదిత భోగ్యభోగకలనో నిద్రాలువద్బాలవత్
స్వప్నాలోకితలోకవజ్జగదిదం పశ్యన్క్వచిల్లబ్ధధీ-
రాస్తేకశ్చిదనంతపుణ్యఫలభుగ్ధన్యః స మాన్యో భువి

బ్రహ్మభావమునందు (బ్రహ్మాకారమునందు) సర్వదా నిలిచియున్న మహాత్ముడు బాహ్య ప్రపంచము యొక్క స్పృహ లేనివాడై, నిద్రలోవలె, లేక పసిపాపవలె, వేరొకరయిన పెట్టినచో ఆరగించుచు, ఈ జగత్తును స్వప్న లోకమువలె పరిగణించుచు, అప్పుడప్పుడు (ఎప్పుడో ఒకప్పుడు) మాత్రమే ఈ బాహ్యప్రపంచ స్పృహను పొందుచు ఉండును. అట్టివారు ఎన్నో జన్మల పుణ్యఫలమువలనగాని జన్మించరు. అట్టి మహాపురుషులు ధన్యులుకదా!

427. స్థితప్రజ్ఞో యతిరయం యః సదానందమశ్నుతే
బ్రహ్మణ్యేవ విలీనాత్మా నిర్వికారో వినిష్క్రియః

పరబ్రహ్మమునందే తన ఆత్మను విలీనముచేసి, నిర్వికారుడై, నిష్క్రియుడై, సదానందము పొందుచున్న యోగియే-స్థితప్రజ్ఞుడగుచున్నాడు.

428. బ్రహ్మాత్మనోః శోధితయోరేకభావావగాహినీ
నిర్వికల్పా చ చిన్మాత్రా వృత్తిః ప్రజ్ఞేతి కథ్యతే
సుస్థితా సా భవేద్యస్య స్థితప్రజ్ఞః స ఉచ్యతే

జీవాత్మ పరమాత్మల తత్వమును పరిశోధించి, అవి రెండునూ ఒక్కటే అను అవగాహన కలుగజేయునదియు, నిర్వికల్పము (భిన్నత్వము లేనిదియు), చిన్మాత్రము (కేవల జ్ఞాన స్వరూపమయినదియు), అయిన మనోవృత్తిని 'ప్రజ్ఞ' అందురు. (జీవబ్రహ్మైక్య తత్వమును సంపూర్ణముగా తెలుసుకొను నిర్వికల్పమయిన భావన-ప్రజ్ఞ); అట్టి ప్రజ్ఞలో (భావనలో) సుస్థిరముగా నిలుచువానిని 'స్థితప్రజ్ఞుడు' అందురు.

429. యస్య స్థితా భవేత్ప్రజ్ఞా యస్యానందో నిరంతరః
ప్రపంచో విస్మృతప్రాయః స జీవన్ముక్త ఇష్యతే

ఎవని ప్రజ్ఞ సుస్థిరమై యున్నదో, (ఆత్మ జ్ఞానమువలన కలిగిన) ఆనందము ఎవనిలో నిరంతరముగా ఉండునో, ఈ ప్రపంచమును మరచిపోయినట్లు (ఎవడు ప్రవర్తించునో), అతనినే జీవన్ముక్తుడందురు.

430. లీనధీరపి జాగర్తి జాగ్రద్ధర్మవివర్జితః
బోధో నిర్వాసనో యస్య స జీవన్ముక్త ఇష్యతే

మనస్సును (పరమాత్మలో)విలీనము చేసినను, ఎవడు జాగ్రదవస్థ ధర్మములు లేనివాడై మేలుకొని ఉండునో, ఎవని జ్ఞానము వాసనా-రహితమయినదో, (వాంఛలు లేనిదో), అట్టివానినే జీవన్ముక్తుడందురు. (గాఢనిద్రలో కూడ మనస్సు లయమగును. కాని జీవన్ముక్తునిలో, మేలుకొని ఉండగనే మనస్సు విలీనమగును. కాని జాగ్రవస్థలోవలె-ఈ దృశ్యప్రపంచము యొక్క అనుభవము ఉండదు).

431. శాంతసంసారకలనః కలావానపి నిష్కలః
యస్య చిత్తం వినిశ్చింతం స జీవన్ముక్త ఇష్యతే

ఎవనియందు సంసారమందలి ఆసక్తి నశించిపోయినదో (శాంత సంసార కలనః), భాగములతో (అంగములతో) కూడుకున్న (దేహమును) కలవాడయ్యును, ఎవడు (తన ఆత్మ భావనయందు), ఎట్టి భాగములు, విభిన్నత్వము లేనివాడో (నిష్కలః), ఎవని చిత్తము చింతారహితము (ఆలోచనలు లేనిది) అయినదో, అట్టి వానిని జీవన్ముక్తుడందురు.

432. వర్తమానేఽపి దేహేఽస్మిఞ్ఛాయావదనువర్తిని
అహంతామమతాఽభావో జీవన్ముక్తస్య లక్షణం.

తనను నీడవలె అనుసరించుచున్న దేహములో ఉన్నను, దానియందు (ఆదేహమునందు), అహంకార మమకారములు (నేను, నాది అను భావము)లేకుండ ఉండుటయే జీవన్ముక్తుని లక్షణము.

433. అతీతాననుసంధానం భవిష్యదవిచారణం
ఔదాసీన్యమపి ప్రాప్తే జీవన్ముక్తస్య లక్షణం.

జరిగిపోయినవాటియందు అనుసంధానము (వాటి గూర్చి పదే పదే ఆలోచించుట), రాబోవువాటియందు (అవే అపోహాలతో కూడిన) ఆలోచనలు—ఇవి రెండును లేకుండ, (వర్తమానములో) ప్రాప్తించు (మంచి చెడ్డలయందు), ఉదాసీనతతో నుండుట-ఇవి జీవన్ముక్తుని లక్షణములు.

434. గుణదోషవిశిష్టేఽస్మిన్స్వభావేన విలక్షణే
సర్వత్ర సమదర్శిత్వం జీవన్ముక్తస్య లక్షణం.

స్వభావముచే (పరస్పర) విరుద్ధములగు మంచి, చెడ్డ గుణములుకల అన్నింటి యందును, సమదృష్టి (ఒకేరకమయిన భావన, అనుభూతి), కలిగిఉండుట జీవన్ముక్తుని లక్షణము.

435. ఇష్టానిష్టార్థసంప్రాప్తౌ సమదర్శితయాఽఽత్మని
ఉభయత్రావికారిత్వం జీవన్ముక్తస్య లక్షణం.

ఆత్మజ్ఞానము వలన కలిగిన సమదృష్టివలన—ఇష్టమయినవిగాని, అయిష్టమయినవిగాని ఏమి ప్రాప్తించినను వాటివల్ల మనో వికారము పొందక, (ఇష్టమయినవి కలిగినప్పుడు సంతోషము, అయిష్టమయినవి కలిగినప్పుడు దుఃఖము పొందక) సమభావముతో నుండుట-జీవన్ముక్తుని లక్షణము.

436. బ్రహ్మానందరసాస్వాదాసక్తచిత్తతయా యతేః
అంతర్బహిరవిజ్ఞానం జీవన్ముక్తస్య లక్షణం.

బ్రహ్మానంద రసమును ఆస్వాదించుటయందే లగ్నమయిన చిత్తముగల యోగులు (యతులు), బయటి ప్రపంచమును, లోని (భావనారూపకమయిన) ప్రపంచమును, తెలిసికొనకుండ ఉండుట (మరచి ఉండుట) జీవన్ముక్తుని లక్షణము.

437. దేహేంద్రియాదౌ కర్తవ్యే మమాహంభావవర్జితః
ఔదాసీన్యేన యస్తిష్ఠేత్స జీవన్ముక్త లక్షణః

తనదేహము, ఇంద్రియములు మొదలగు వానియందును, కర్తవ్యమునందును, 'నేను' 'నాది' అనుభావమును విడిచిపెట్టి, ఉదాసీనతతో ఉండెడివాడు (చరించెడివాడు) జీవన్ముక్తుని లక్షణములు గలవాడగును.

438. విజ్ఞాత ఆత్మనో యస్య బ్రహ్మభావః శ్రుతేర్బలాత్
భవబంధవినిర్ముక్తః స జీవన్ముక్త లక్షణః

శ్రుతుల బలమువలన, (వేదాంత గ్రంథములను చదువుట, వినుట, మననముచేసి, వాటి సారమును బాగుగ అర్థము చేసికొనుట వలన), తాను పరబ్రహ్మనను సత్యము తెలిసికొని, జననమరణ బంధములనుండి విముక్తిని పొందెడివాడు, జీవన్ముక్తుని లక్షణములు కలవాడగును.

439. దేహేంద్రియేష్వహంభావ ఇదంభావ స్తదన్యకే
యస్య నో భవతః క్వాపి స జీవన్ముక్త ఇష్యతే.

(తన) దేహేంద్రియములందు 'నేను' అనుభావము, తదితరములందు 'అది' అను భావము ఎవనిలో ఎప్పటికిని కలుగకుండ ఉండునో, (ఎవడు 'తన' 'పర' భేదము లేక అన్నింటిలో సమానముగా ఆత్మ-తత్వము తెలుసుకొనునో), వానిని జీవన్ముక్తుడందురు.

440. న ప్రత్యగ్బ్రహ్మణోర్భేదం కదాపి బ్రహ్మసర్గయోః
ప్రజ్ఞయా యో విజానాతి స జీవన్ముక్త లక్షణః

తనప్రజ్ఞవలన (వికశించిన బుద్ధివలన), జీవాత్మ, పరబ్రహ్మల యందును, బ్రహ్మము విశ్వములయందును భేదము ఏకాలమందును లేదను సత్యము తెలిసికొన్నవాడు జీవన్ముక్త లక్షణముగలవాడగును.

441. సాధుభిః పూజ్యమానేఽస్మిన్పీడ్యమానేఽపి దుర్జనైః
సమభావో భవేద్యస్య స జీవన్ముక్త లక్షణః

ఇది (ఈ దేహము) సాధుజనులచే పూజింపబడినప్పుడుగాని, దుష్టజనులచే పీడింపబడి నప్పుడుగాని, (ఆనంద దుఃఖములను పొందక) సమభావముతో చూడగలుగవాడు జీవన్ముక్త లక్షణములు గలవాడగును.

442. యత్ర ప్రవిష్టా విషయాః పరేరితా
నదీప్రవాహా ఇవ వారిరాశౌ
లినంతి సన్మాత్రతయా న విక్రియా –
ముత్పాదయంత్యేవ యతిర్విముక్తః

సన్మాత్రుడగు యతి (బ్రహ్మభావమునందే సదా నిలచియున్న యోగి) యందు, పరులచే ప్రేరేపింపబడిన విషయములు ప్రవేశించియు—సముద్రములో కలిసిన నదీ ప్రవాహములవలె-ఎట్టి స్పందనలను కలుగజేయక విలీనములైపోవును. అట్టియోగియే ముక్తుడు.

443. విజ్ఞాతబ్రహ్మతత్త్వస్య యథాపూర్వం న సంసృతిః
అస్తి చేన్న స విజ్ఞాతబ్రహ్మభావో బహిర్ముఖః

బ్రహ్మతత్త్వమును ఎఱిగిన వానికి పూర్వమట్లుల ఈ సంసారము ఉండదు. (బాహ్య విషయములలో ప్రవర్తించుట ఉండదు). ఒకవేళ, ఆవిధముగా (బాహ్యవిషయాసక్తి) ఉన్నచో అట్టివాడు ఇంకనూ బహిర్ముఖుడు కావున బ్రహ్మతత్త్వము తెలిసినవాడుకాడు.

444. ప్రాచీనవాసనావేగాదసౌ సంసరతీతి చేత్
న సదేకత్వవిజ్ఞానాన్మందీ భవతి వాసనా.

పూర్వ వాసనలచే (పూర్వజన్మ కర్మల ఫలములవలన), (జ్ఞానిఅయినను), ఈ సంసారములో తిరుగుచునే ఉండవలెనన్నచో, అదినిజముకాదు. (ఏలనన), బ్రహ్మైకత్వ జ్ఞానము వలన పూర్వ వాసనలన్నియు క్షీణించి పోవును.

445. అత్యంత కాముకస్యాపి వృత్తిః కుంఠతి మాతరి
తథైవ బ్రహ్మణి జ్ఞాతే పూర్ణానందే మనీషిణః

అత్యంతకాముక ప్రవృత్తి కలవానికి గూడ, తల్లివద్ద అతని (కాముక) వృత్తులన్నియు నశించును; ఆవిధముగానే, పూర్ణానంద స్వరూపుడయిన బ్రహ్మమును తెలిసికొనిన మహాత్మునకు (అతని పూర్వ వాసనలన్నియు నశించును).

## ప్రారబ్ధకర్మ (446-464) :

446. నిదిధ్యాసనశీలస్య బాహ్యప్రత్యయ ఈక్ష్యతే
బ్రవీతి శ్రుతిరేతస్య ప్రారబ్ధం ఫలదర్శనాత్

నిదిధ్యాసమునందు (ధ్యాన సమాధియందు) సదా నిలచువానికి గూడ, బాహ్య ప్రపంచమునందు వ్యవహరించుట (తినుట, తిరుగుట, మొ॥) కనబడుచుండును.

ష ప్రవృత్తి ఉండుటవలన, దీనికి ప్రారబ్ధమే కారణమని శ్రుతులు చెప్పుచున్నవి. (జీవన్ముక్తునకు ఈ ప్రపంచముతో సంబంధము ఉండదు. అట్టిచో అతడు కూడ అజ్ఞానివలె పనులు చేయుచుండుట ఎట్లు సంభవము? దానికి కారణము ప్రారబ్ధ కర్మ వలన ఈ దేహము, అందలి వాసనలు కారణమనియును, ఆ కర్మ లయమగువరకును జ్ఞాని కూడ ఈ ప్రపంచములో తన దైవందిన కర్మలు చేయుచునే ఉండవలయు ననియును భావము).

447. సుఖాద్యనుభవో యావత్తావత్ప్రారబ్ధమిష్యతే
ఫలోదయః క్రియాపూర్వో నిష్క్రియో న హి కుత్రచిత్

(జీవన్ముక్తునిలో) సుఖము మొదలగు అనుభవములు, ఎంతవరకు కలుగుచుండునో, అంతవరకు ప్రారబ్ధము పనిచేయు చున్నదని తెలుసుకొనవచ్చును. (ఏలననగా), ఇప్పుడు కనబడు ఫలములు, పూర్వము చేసిన క్రియల ఫలితములు; క్రియారహిత మయినఫలము ఉండదు. (జీవన్ముక్తుడు ఈ ప్రపంచములో ఇంకను జీవించి ఉండుట, సుఖదుఃఖములననుభవించుట చూచుచున్నాము. అది అతని ఇచ్ఛాపూర్వక వ్యవహారము కాదు గావున, అది ప్రారబ్ధకర్మఫలమని భావింపవలెను).

448. అహం బ్రహ్మేతి విజ్ఞానాత్ కల్పకోటిశతార్జితమ్
సంచితం విలయం యాతి ప్రబోధాత్స్వప్నకర్మవత్

'నేను బ్రహ్మను' అని తెలుసుకొనుటవలన పందకోట్ల కల్పములలో ఆర్జించిన 'సంచిత' కర్మ—నిదురమేల్కొనగానే స్వప్నకర్మ అంతయు నశించునట్లు — నశించి పోవును.

449. యత్కృతం స్వప్నవేలాయాం పుణ్యం వా పాపముల్బణం
సుప్తోత్థితస్య కిం తత్స్యాత్స్వర్గాయ నరకాయ వా.

స్వప్నకాలమునందు (స్వప్నలోకములో)ఆచరించిన పుణ్య, పాపకర్మల ప్రాబల్యము వలన, మేలుకొనిన పిదప వానికి స్వర్గప్రాప్తిగాని, నరక ప్రాప్తిగాని జరగదు.

(స్వప్నములో ఒకనిని ఖూనీ చేసినచో, మేలుకొనిన పిదప వానికి ఉరిశిక్ష వేయవలసిన అవసరము లేదు. ఎందుకనగా, స్వప్నలోకముతోనహా, స్వప్నకర్త

కూడ మెలుకువలో విలీనమయిపోవును. అట్లే బ్రహ్మజ్ఞానము కలిగిన పిమ్మట, ఈ దృశ్యప్రపంచముతోపాటు, అందులో కర్తగా వ్యవహరించుచున్న జీవుడు గూడ - జీవభావము కూడ - పరమాత్మలో విలీనమయిపోవును. అందువలన ఫలమును అనుభవించుటకు జీవుడు ఉండడు. బయటివారికి కనపడు శరీరము స్వప్న తుల్యమయిన ఉపాధి మాత్రమే).

450. స్వమసంగముదాసీనం పరిజ్ఞాయ నభో యథా
న శ్లిష్యతే యతిః కించిత్కదాచిద్భావి కర్మభిః

(జీవన్ముక్తుడు) ఆకాశమువలె నిస్సంగుడు (దేనిని అంటనివాడు), ఉదాసీనుడు (వేటియందును ఆసక్తి చూపనివాడు), అని తనను తాను తెలిసికొనుటవలన భావి కర్మలు (ఆగామికర్మలు) కూడా వానిని ఏ మాత్రమును, ఎన్నటికిని అంటవు.

451. న నభో ఘటయోగేన సురాగంధేన లిప్యతే
తథాత్మోపాధియోగేన తద్ధర్మైర్నైవ లిప్యతే

(కల్లు) కుండలో ఉన్న ఆకాశమును ఆకల్లువాసన ఏ విధముగా అంటదో, ఆ విధముగానే, (ఆకాశమువలె) నిర్లిప్తమయిన ఆత్మతత్వము, దేహాది ఉపాధులలో ఉన్నను, వాటి ధర్మములచే అది అంటబడదు-(కర్మలు, కర్మఫలములు దేహమనో బుద్ధుల వరకే పరిమితము. అవి ఆత్మను ఏ విధముగను బంధింపవు).

(ఈ ప్రపంచములో ప్రతి జీవియొక్క జీవనసరళిని నిర్ణయించునవి-కర్మలు కర్మఫలములు; ఇవి వాసనారూపములో ఉండును. ఈ వాసనలు జీవిని మాటి మాటికి ఈ ప్రపంచములో పుట్టునట్లుచేసి, ప్రవర్తించునట్లు, తిరిగికర్మలను చేయునట్లు, ప్రోత్సహించును. ఈ కర్మలు మూడు విధములు: 1) సంచితము 2) ప్రారబ్ధము; 3) ఆగామి; పూర్వజన్మలలో చేసినకర్మలు (ఇంకనూ అనుభవమునకు రానివి) - సంచితమనబడును; ఫలోన్ముఖమయి, ప్రస్తుతజన్మకు కారణభూతమయిన కర్మ (వాసనలు) ప్రారబ్ధమనబడును. మనము చేయుచున్న కర్మలవలన ముందు ముందు కలగబోవు ఫలములు 'ఆగామి' అందురు. జ్ఞానోదయమువలన పూర్వజన్మలవలన కలిగిన 'సంచితము', ఇప్పటివరకు చేసిన కర్మల ఫలము-'ఆగామి' - ఈ రెండురకములయిన కర్మలు నశించును. కాని, ఇప్పటికి ఫలోన్ముఖమునకు వచ్చి, ఈదేహధారణకు కారణమయిన ప్రారబ్ధము మాత్రము ఈ దేహము అంతమగు వరకు నడచును).

452. జ్ఞానోదయాత్ పురారబ్ధం కర్మ జ్ఞానాన్న నశ్యతి
అదత్వా స్వఫలం లక్ష్యముద్దిశ్యోత్సృష్టబాణవత్

జ్ఞానోదయమునకు పూర్వము ఆరంభమయిన కర్మ (ఫలోన్ముఖమునకు వచ్చినకర్మ) ఒక లక్ష్యమును ఉద్దేశించి వదలిన బాణమువలె — తన ఫలమును ఈయకుండ, జ్ఞానము కలుగుటవలన మాత్రమే నశింపదు. ('కీ' ఇచ్చి వదిలిన గడియారము, తనను ఎవ్వరును పట్టించుకొనుట లేదని, పనిచేయుట మానివేయదు. స్ప్రింగులో బలమున్నంత వరకు పనిచేయుచునే యుండును. ఈ దేహము గూడ 'ప్రారబ్ధము' అను కీ ఇచ్చి వదలిన గడియారము వంటిది. మధ్యలో ఆత్మ జ్ఞానమువలన జీవుడు ఈ దేహమును లక్ష్యపెట్టకున్నను, అది తన ప్రారబ్ధ కర్మఫలము ఉన్నంతవరకు పనిచేయుచునే యుండును).

453. వ్యాఘ్రబుద్ధ్యా వినిర్ముక్తో బాణం పశ్చాత్తు గోమతౌ
న తిష్ఠతి ఛినత్త్యేవ లక్ష్యం వేగేన నిర్భరం

పెద్దపులి అనుభావముతో (దానిని చంపుటకు) వదలిన బాణము, తదుపరి (అది పెద్ద పులి కాదు) ఆవు అని తెలిసినను, (బాణము వదలిన వేటగాడు ఏమియును చేయలేడు) ఆ బాణము ఆగకుండ అమితవేగముతో పోయి (తన లక్ష్యమయిన ఆ ఆవును) తప్పక కొట్టును.

454. ప్రారబ్ధం బలవత్తరం ఖలు విదాం భోగేన తస్య క్షయః
సమ్యగ్జ్ఞానహుతాశనేన విలయః ప్రాక్సంచితాగామినామ్
బ్రహ్మాత్మైక్యమవేక్ష్య తన్మయతయా యే సర్వదాసంస్థితా -
స్తేషాం తత్త్రితయం న హి క్వచిదపి బ్రహ్మైవ తే నిర్గుణం

బాగుగా అవగాహన చేసుకొనిన బ్రహ్మజ్ఞానమను మంటవలన సంచిత, ఆగామి కర్మలు నశించును. కాని, ప్రారబ్ధము చాలా బలమయినది. (అది జ్ఞానము వలన పోదు). జ్ఞానులకు కూడ అది అనుభవించుటవలన మాత్రమే పోవును. కాని, బ్రహ్మాత్మైకత్వమును తెలుసుకొని, సదా బ్రహ్మమునందే నిలచువారిని, ఈ (సంచిత, ప్రారబ్ధ, ఆగామి కర్మలు) మూడునుకూడ బాధింపవు (అంటవు). వారు సదా నిర్గుణ బ్రహ్మమునందే ఉందురు. (కావున వారికి దేహాది ఉపాధులయొక్కయు, వాటి కర్మల యొక్కయు స్పృహ ఉండదు).

455. ఉపాధితాదాత్మ్యవిహీనకేవల -
బ్రహ్మాత్మనైవాత్మని తిష్ఠతో మునేః
ప్రారబ్ధసద్భావకథా న యుక్తా
స్వప్నార్థసంబంధకథేవ జాగ్రతః

(గత రాత్రి) స్వప్నములో జరిగిన సంఘటనలు మేలుకొనిన తర్వాత (మేలుకొనిన వానికి) అర్థరహితములయినట్లు (ఆస్వప్న సంఘటనలవలన ఎట్టి ఉపకారముగాని, అపకారముగాని కలుగనట్లు), దేహాది ఉపాధులయందు మనస్సును లగ్నము చేయక, కేవల బ్రహ్మభావమునందే మనస్సును నిలిపిన మునికి ప్రారబ్ధము ఉండును అను మాట కూడ అర్థములేనిది.

456. న హి ప్రబుద్ధః ప్రతిభాసదేహే
దేహోపయోగిన్యపి చ ప్రపంచే
కరోత్యహంతాం మమతామిదంతాం
కిం తు స్వయం తిష్ఠతి జాగరేణ

కలలో కనపడిన తన దేహమునందును, (తను సృష్టించుకున్న) స్వప్నప్రపంచము నందును, 'నేను', 'నాది', 'అది', 'ఇది' అను భావమును (అభిమానమును), (నిద్ర నుండి మేల్కొనిన తర్వాత), ఆ జాగృతుడు (మేలుకొనినవాడు) ఏమాత్రమును అనుభవింపక, స్వస్థుడై నిలచును.

457. న తస్య మిథ్యార్థసమర్థనేచ్ఛా
న సంగ్రహస్తజ్జగతోఽపి దృష్టః
తత్రానువృత్తిర్యది చేన్మృషార్థే
న నిద్రయా ముక్త ఇతీష్యతే ధ్రువమ్.

(అట్టి జాగృతుడు) కలలో కనబడునవి నిజమయినవే అని సమర్థింపుటకు ప్రయత్నించడు. స్వప్నజగత్తులో సంప్రాప్తమయిన సంపదలను నిలుపుకొనవలెనని చూడడు (తాపత్రయపడడు). ఆ స్వప్నలోకము నిజమేనను భావము ఇంకను మిగిలి ఉన్నచో; అతను ఇంకనూ నిద్రనుండి మేల్కొనలేదని రూఢిగా చెప్పగలము. (నిద్రలో మాట్లాడువాడు, మేలుకొని ఉన్నట్లు భ్రమకలిగించినను, వాని మాటలనుబట్టి వాడు ఇంకనూ స్వప్నజగత్తులోనే ఉన్నాడని మనము గ్రహించగలము).

458. తద్వత్పరే బ్రహ్మణి వర్తమానః
సదాత్మనా తిష్ఠతి నాన్యదీక్షతే
స్మృతిర్యథా స్వప్నవిలోకితార్థే
తథా విదః ప్రాశనమోచనాదౌ

ఆ విధముగనే పరబ్రహ్మయందు నిలచువానికి, పరబ్రహ్మస్వరూపమే కనుపించు చుండునుగాని, తదితరము లేవియు కనబడవు. కలలో కనబడునవి (మేలుకొనిన తర్వాత) జ్ఞాపకము ఉండునట్లు, జ్ఞానికి తను ఆచరించు తినుట మొదలగు క్రియలు, స్వప్నతుల్యములుగా గోచరించును.

459. కర్మణానిర్మితో దేహః ప్రారబ్ధం తస్యకల్ప్యతామ్
నానాదేరాత్మనో యుక్తం నైవాత్మాకర్మనిర్మితః

దేహము కర్మవలన కలుగునది గావున, ప్రారబ్ధకర్మవలన కలిగినది ఈ దేహము అని చెప్పుట సమంజసముకాని, అనాది అయిన ఆత్మ (ప్రారబ్ధమువలన) కలిగినదని చెప్పుట తగదు. ఆత్మ కర్మవలన కలిగినది కాదు.

450. అజోనిత్యః శాశ్వత ఇతిబ్రూతే శ్రుతిరమోఘవాక్
తదాత్మనాతిష్ఠతోఽస్య కుతః ప్రారబ్ధకల్పనా.

అమోఘమయిన (తిరుగులేని) శ్రుతివాక్యములు పరమాత్మను జన్మలేనివాడనియు, నిత్యుడనియు, శాశ్వతుడనియు చెప్పుచున్నవి. అట్టిచో, ఆత్మభావమునందు నిలచిన (దేహాత్మభావములేని) జ్ఞానికి ప్రారబ్ధము ఎట్లుండును.

461. ప్రారబ్ధం సిద్ధ్యతి తదా యదా దేహాత్మనాస్థితిః
దేహాత్మభావో నైవేష్టః ప్రారబ్ధం త్యజ్యతామతః

దేహాత్మభావముతో (ఈ దేహమే నేను అను భావముతో) ఉన్నప్పుడు ప్రారబ్ధము కలుగవచ్చును. కాని, దేహాత్మభావములేని జ్ఞాని విషయములో ప్రారబ్ధమును విడిచి పెట్టవచ్చును. (అట్టి వానికి ప్రారబ్ధము ఇంకను పనిచేయును అను భావమును విడిచి పెట్టవచ్చును).

462. శరీరస్యాపి ప్రారబ్ధకల్పనా భ్రాంతిరేవ హి
అధ్యస్తస్య కుతః సత్త్వ మసత్యస్య కుతోజనిః
అజాతస్య కుతోనాశః ప్రారబ్ధమసతః కుతః

శరీరమునందుకూడ ప్రారబ్ధకల్పన (ఈ దేహము ప్రారబ్ధకర్మ వలన పుట్టి, దాని ప్రాబల్యమువలన నడచుచున్నది అనుభావన) భ్రాంతివలన కలిగినదే కదా! ఆరోపితమయిన దానికి (ఒకదానిని చూచి మరొకటి అనుకున్నదానికి — అధ్యాసస్య), ఉనికి (సత్వత) ఎట్లుండును? ఉనికిలేని దానికి పుట్టుక ఎట్లు? పుట్టుకలేనిదానికి చనిపోవుట ఎట్లు సంభవము? (ఉనికి, పుట్టుక, చావు లేని) అసత్యవస్తువునకు ప్రారబ్ధము అనునది ఎట్లు వర్తించును? (మిథ్యావస్తువులను కలుగచేయుచున్నదన్నచో అది గూడ భ్రాంతియే).

463. జ్ఞానేనాజ్ఞానకార్యస్య సమూలస్య లయో యది
తిష్ఠత్యయం కథం దేహ ఇతి శంకావతో జడాన్
సమాధాతుం బాహ్య దృష్ట్యా ప్రారబ్ధం వదతి శ్రుతిః

జ్ఞానప్రాప్తివలన అజ్ఞాన జనితములయిన కర్మలన్నియును సమూలముగా నశించి పోయినచో, (జీవన్ముక్తుల యొక్క) దేహము ఇంకనూ ఎట్లు నిలచియున్నది (ఎట్లు పనిచేయుచున్నది) అను అల్పబుద్ధుల (జడుల) శంకలను (అనుమానములను) తీర్చుటకొరకే ఉపనిషత్తులు కూడ బాహ్యదృష్టిననుసరించి (లోకవ్యవహారముననుసరించి) ప్రారబ్ధ సిద్ధాంతమును చెప్పుచున్నవి. (కాని దేహస్పృహలేని జీవన్ముక్తునకు ప్రారబ్ధము అంటదు).

464. న తు దేహాది సత్యత్వబోధనాయ విపశ్చితామ్
యతః శ్రుతేరభిప్రాయః పరమార్థైవ గోచరః

(జ్ఞానులు కూడ ప్రారబ్ధ కర్మను అనుభవించవలసి ఉండునను సిద్ధాంతము వలన ఉపనిషత్తులు — ద్వైతసిద్ధాంతముననుసరించి —) దేహము కూడ సత్యమయినదే అని బోధించుటకొరకు కాదు (ఏలననగా) పరమాత్మతత్వము ఒక్కటే అని, (అద్వయమయినదని) ఉపనిషత్తుల అభిప్రాయము తెలిసినదే.

## అద్వయబ్రహ్మము (465 - 471) :

465. పరిపూర్ణమనాద్యంత మప్రమేయమవిక్రియమ్
ఏకమేవాద్వయం బ్రహ్మ నేహ నానాస్తి కించన.

పరిపూర్ణమయినది(ఎక్కడను వెలితి లేనిది), ఆదిలేనిది, అంతములేనిది, అప్రమేయమయినది (దేనితోను పోల్చ శక్యముకానిది), మార్పులు చెందనిది (అవిక్రియం),

అయిన బ్రహ్మస్వరూపము ఒక్కటే. (ఏకం - తనలో ఎట్టి విభేదములు లేనిది) అద్వయమై (స్వజాతీయ, విజాతీయ భేదములు లేనిదై), (అంతటను నిండి) యున్నది. అక్కడ (అందులో) ఏవిధమయిన నానాత్వము (బహుళత్వము) లేదు.

466. సద్ఘనం చిద్ఘనం నిత్యమానందఘనమక్రియమ్
ఏకమేవాద్వయంబ్రహ్మ నేహ నానాస్తి కించన.

సద్ఘనమయినది (స్థూల శరీరమునకు, విశ్వమునకు ఆధారమయిన మూలవస్తువు— సత్పదార్థమయినది), చిత్ఘనమయినది (సూక్ష్మశరీరములో - అంతరంగములో - జ్ఞానరూపకమయినది), నిత్యము ఆనందఘనమయినది (కారణశరీరములో ఎల్లప్పుడు ఆనందరూపముతో ఉండునది), క్రియారహితమయినది - (తన సాక్షిత్వములో అన్ని పనులు జరుగునుగాని, తాను ఎట్టి పనులను చేయదు - ఎట్టి కర్మఫలములు దానికి అంటవు). అట్టి బ్రహ్మతత్వము ఒక్కటే, అద్వయమై (అంతటను నిండియున్నది) అందులో ఏవిధమయిన నానాత్వము లేదు.

467. ప్రత్యగేకరసం పూర్ణమనంతం సర్వతోముఖం
ఏకమేవాద్వయం బ్రహ్మ నేహ నానాస్తికించన.

(ప్రతి జీవిలోను) ప్రత్యగాత్మ రూపములో ఒకే విధముగా ఉండునదియు (ఎట్టి మార్పులు లేకుండ ఉండునదియు), (పలు ఉపాధులలో ఉన్నను భిన్నత్వములేని)పరిపూర్ణమయినదియు, అనంతమయినదియు (ఊహాకందని సుదూరముల వరకు వ్యాపించియున్నదియు), సర్వతోముఖమయినదియు (అన్ని దిక్కులందును ముఖములుగలది కావున అది లేనిచోటు, చూడనిచోటు ఉండదు)-అట్టి బ్రహ్మతత్వము ఒక్కటే అద్వయమై (సర్వత్ర నిండియున్నది). అందులో ఏవిధమయిన నానాత్వములేదు.

468. అహేయమనుపాదేయమనాధేయమనాశ్రయం
ఏకమేవాద్వయం బ్రహ్మ నేహ నానాస్తికించన.

అహేయమయినది-(పనికిరానిదని అసహ్యించుకొని పారవేయుటకు వీలులేనిది-ఏలననగా అది స్వయముగా తన తత్వమే గాబట్టి); (ఆవిధముగనే) ఇంకొక చోటనుండి తెచ్చుకొందుకు వీలులేనిది (అనుపాదేయం); ఆరోపితము కానిది (అనాధేయం— వేరొక వస్తువుయొక్క ఆభాసరూపము కానిదె-నిత్యసత్యమయినది); అట్టి బ్రహ్మ తత్వము ఒక్కటే అద్వయమై (సర్వత్ర నిండియున్నది) అందులో ఏవిధమయిన నానాత్వము లేదు.

469. నిర్గుణం నిష్కలం సూక్ష్మం నిర్వికల్పం నిరంజనం
ఏకమేవాద్వయం బ్రహ్మ నేహ నానాస్తికించన.

నిర్గుణమయినది (గుణములు లేనిది), భాగములులేనిది, (నిష్కలం), సూక్ష్మమయినది, ఎట్టి అలజడులు, ఆందోళనలు లేనిది (నిర్వికల్పం), ఎటువంటి మచ్చయు లేనిది (నిరంజనం) వేరొక ఆశ్రయము లేక ఉండునది (అనాశ్రయం-బ్రహ్మమే అన్నిటికిని ఆధారము; దానికి వేరు ఆధారములేదు); అట్టి బ్రహ్మతత్వము ఒక్కటే అద్వయమై (సర్వత్రా నిండియున్నది). అందులో ఏవిధమయిన నానాత్వము లేదు.

470. అనిరూప్యస్వరూపం యన్మనోవాచామగోచరమ్
ఏకమేవాద్వయం బ్రహ్మ నేహ నానాస్తికించన.

నిరూపించగల స్వరూపములేనిది (ఇంద్రియములకు తెలియరానిది), మనస్సునకు, వాక్కునకు అగోచరమయినది, (మనోబుద్ధులచేత ఊహింపరానిది, వాక్కుచే వివరింప వీలులేనిది), అయిన బ్రహ్మతత్వము ఒక్కటే అద్వయమై (సర్వత్ర నిండియున్నది.) అందులో ఏ విధమయిన నానాత్వములేదు.

471. సత్సమృద్ధం స్వయంసిద్ధం శుద్ధం బుద్ధమనీదృశం
ఏకమేవాద్వయం బ్రహ్మ నేహ నానాస్తికించన.

సత్ పదార్థముతో నిండియున్నదియు (అందులో అసత్ పదార్థమునకు తావులేదు) స్వతస్సిద్ధమయినదియు (తనంత తానే ప్రతీతమగునదియు), పరిశుద్ధమయినదియు (తానుతప్ప వేరొక వస్తువు లేనిదియు), జ్ఞానస్వరూపమయినదియు (బుద్ధం).(ఇప్పటి వరకు తెలుసుకున్న) వీటన్నింటికంటె వేరయినదియు (అనీదృశం), అయిన బ్రహ్మ తత్వము ఒక్కటే అద్వయమై, (సర్వత్ర నిండియున్నది). అందులో ఏవిధమైన నానాత్వములేదు.

**ఆత్మానుభవము (472-479) :**

472. నిరస్తరాగా వినిరస్తభోగాః
శాంతాః సుదాంతాః యతయో మహాంతః
విజ్ఞాయ తత్త్వం పరమే తదంతే
ప్రాప్తాః పరాం నిర్వృతిరాత్మ యోగాత్

రాగమును వర్జించినవారును, భోగములను అస్తమింపజేసిన వారును, శాంత స్వభావులును, పరిశుద్ధమయిన అంతఃకరణ కలవారును, మహాత్ములును అయిన సాధకులు (యతులు) ఈ పరబ్రహ్మ తత్త్వమును తెలుసుకొని, అంతమందు (ప్రారబ్ధము నశించిన పిదప), ఆత్మయోగము వలన (ఆత్మయందే నిలచియుండుటవలన), (పూర్వ వాసనలన్నియు తొలగిపోగా), ఉత్కృష్టమయిన శాంతిని (నివృతిని) పొందు చున్నారు.

473. భవానపీదం పరతత్త్వమాత్మనః
స్వరూపమానందఘనం విచార్య
విధూయ మోహం స్వమనఃప్రకల్పితం
ముక్తః కృతార్థో భవతు ప్రబుద్ధః

నీవుకూడ ఆనంద ఘనస్వరూపమయిన ఈ పరమాత్మ తత్త్వమును విచక్షణ ద్వారా గ్రహించి, నీ మనస్సు కల్పించిన మోహమును వినర్జించి, (ఈ మాయా జనిత సంసారమునుండి—నిద్రనుండి మేల్కొనినట్లు) మేల్కొని (ప్రబుద్ధః), (ఈ భవ బంధములనుండి) ముక్తుడై కృతార్థుడవుకమ్ము.

474. సమాధినా సాధు వినిశ్చలాత్మనా
పశ్యాత్మతత్త్వం స్ఫుటబోధచక్షుషా
నిస్సంశయం సమ్యగవేక్షితశ్చే-
చ్ఛ్రుతః పదార్థో న పునర్వికల్ప్యతే.

బాగుగా నిశ్చలము చేయబడిన మనస్సును సమాధియందు నిలిపి, వికసించిన నీ జ్ఞాన నేత్రముచే ఆత్మతత్త్వమును చూడుము (అనుభవ పూర్వకముగా తెలిసికొనుము). శ్రుతివాక్యముల అంతరార్థమును నీవు బాగుగ అవగాహన చేసుకొనియుంటివేని, తిరిగి నీమనస్సు వికల్పమును చెందదు. (నిశ్చలత్వమును కోల్పోదు).

475. స్వస్యావిద్యాబంధసంబంధమోక్షా-
త్సత్యజ్ఞానానందరూపాత్మలబ్ధౌ
శాస్త్రం యుక్తిర్దేశికోక్తిః ప్రమాణం
చాంతఃసిద్ధా స్వానుభూతిః ప్రమాణం.

నీయొక్క అవిద్యవలన (అజ్ఞానమువలన) కలిగిన బంధముతో గల సంబంధమును త్రెంచుకొనుటకు (అవిద్యాబంధముక్తి కొరకు), సత్య, జ్ఞాన, ఆనంద స్వరూపుడయిన పరమాత్మను పొందుటకు, శాస్త్రములు (ఉపనిషత్తులు), తార్కిక ఆలోచన (యుక్తి) గురూపదేశము ఇవి ప్రమాణములు; (అయినను ఇవి మార్గదర్శకములు మాత్రమే); నీ అంతఃకరణలో సిద్ధించు — (స్వాంతఃసిద్ధా) నీస్వానుభవమే (నిజమయిన) ప్రమాణము.

476. బంధో మోక్షశ్చ తృప్తిశ్చ చింతాఽఽరోగ్యక్షుదాదయః
స్వేనైవ వేద్యాయజ్జ్ఞానంపరేషామనుమానికం.

బంధము, మోక్షము (నేను బంధితుడను అనుభావము, నేను ముక్తుడను అనుభావము), తృప్తి, అసంతృప్తి (చింతా), ఆరోగ్యము, ఆకలి మొదలగునవి, స్వయముగా అనుభవించువానికే తెలియును. పరులకు అది అనుమానం మాత్రమే. (స్వానుభవము వలన తెలుసుకున్నదానికి, పరులవలన విని ఊహించుకున్నదానికి చాలా వ్యత్యాసము ఉండునని భావము).

477. తటస్థితా బోధయంతి గురవః శ్రుతయోయథా
ప్రజ్ఞయైవ తరేద్విద్వానీశ్వరానుగృహీతయా.

గురువులు, శ్రుతులు, (సాధకునియందు) తటస్థులవలె, వారి బోధనలను బోధించుచున్నారు. సాధకుడు (వారి బోధనల సాధారముగా తీసుకొని), ఈశ్వరానుగ్రహము వలన, తన ప్రజ్ఞచేతనే, (ఈ సంసార సాగరమును) ఈదవలెను. (తటస్థుడు— అనగా ఒడ్డున నిలబడినవాడు అనికూడ అర్థము చెప్పుకొనవచ్చును. సాధారణముగా ఈతనేర్పువాడు, ఈతనేర్చుకొను వానికి, అనుసరించవలసిన పద్ధతులన్నియు నేర్పి, అంతమున, తాను ఒడ్డునే నిలబడి, ఈతనేర్చుకొను వానిని నీటిలోకి నెట్టివేయును. ఎట్టి ఆపద రాకుండ తాను ఒడ్డున నిలబడి చూచుచుండును. గురువు తనను రక్షించుటకు ఒడ్డున ఉన్నాడను ధైర్యముతో, ఈతనేర్చుకొనువాడు తన నేర్పుతోనే ఈతకొట్టుట నేర్చుకొనును. సాధకుడు తన అంతిమ సాధనలో తనకు ఈశ్వరానుగ్రహము ఉన్నదను ధైర్యముతో ముందుకు సాగిపోవలెను. బ్రహ్మసాక్షాత్కారము తనంతతానే పొందవలెను.)

478. స్వానుభూత్యా స్వయం జ్ఞాత్వా స్వమాత్మానమఖండితం
సంసిద్ధః సమ్ముఖం తిష్ఠేన్నిర్వికల్పాత్మనాఽఽత్మని.

స్వానుభవమువలన తన అఖండ ఆత్మతత్త్వమును తానే స్వయముగా తెలుసుకొని (బ్రహ్మాత్మైకత్వానుభూతిని స్వయముగా పొంది), సిద్ధిపొందినవాడై, నిర్వికల్పమయిన మనస్సుతో (ఎట్టి అనుమానములు లేనిమనస్సుతో), పరమాత్మ సమ్ముఖమున నిలచును. (పరమాత్మతో ఐక్యత పొందును).

479. వేదాంత సిద్ధాంత నిరుక్తిరేషా
బ్రహ్మైవ జీవః సకలం జగచ్చ
అఖండరూపస్థితిరేవ మోక్షో
బ్రహ్మాద్వితీయే శ్రుతయః ప్రమాణమ్.

వేదాంతములన్నియు సిద్ధాంతము చేసి చెప్పిన సత్యమేమనగా — బ్రహ్మయే జీవుడు; బ్రహ్మయే ఈ జగత్తంతయును,— అట్టి అఖండమయిన (ముక్కలుగాలేని, ముక్కలు చేయ వీలులేని), పరబ్రహ్మ స్వరూపమునందు నిలచియుండుట మోక్షము, బ్రహ్మము అద్వితీయమనుటకు శ్రుతులే ప్రమాణము.

## శిష్యుని ఆత్మానుభవము : (480–520)

480. ఇతి గురువచనాచ్ఛ్రుతి ప్రమాణా
త్పరమవగమ్య సతత్త్వమాత్మయుక్త్యా
ప్రశమితకరణః సమాహితాత్మా
క్వచిదచలాకృతిరాత్మనిష్ఠోఽభూత్

ఈ విధముగా గురువు చెప్పిన వచనముల వలనను, శ్రుతులలో వివరించిన ప్రమాణముల వలనను, స్వబుద్ధితో తార్కికముగా ఆలోచించుట వలనను, నిగ్రహముతో కూడుకున్న మనస్సుగలవాడై (సమాహితాత్మా), ప్రశాంతచిత్తుడై, పరమాత్మ తత్త్వమును అనుభూతిపొంది (పరమవగమ్య), కొద్దికాలము, (ఎంతయోకాలము), ఆత్మ నిష్ఠయందు (ఆత్మానుభవ పారవశ్యము నందు), నిశ్చలుడై యుండెను.

481. కించిత్కాలం సమాధాయ పరే బ్రహ్మణి మానసం
ఉత్థాయ పరమానందాదిదం వచనమబ్రవీత్

కొంతకాలము (ఎంతోకాలము) పరబ్రహ్మలో మనస్సును లగ్నముచేసి, సమాధిస్థితిలో ఉండి, (పిమ్మట) లేచి, ఉత్కృష్టమయిన ఆనందముతో ఈ విధముగా పలికెను.

482. బుద్ధిర్వినష్టా గలితా ప్రవృత్తి—
ర్బ్రహ్మాత్మనోరేకతయాఽధిగత్యా
ఇదం న జానేఽప్యనిదం న జానే
కిం వా కియద్వా సుఖమస్త్యపారం

నా ఆత్మయు, బ్రహ్మము ఒక్కటే అను జ్ఞానము (అనుభవము) కలుగుటవలన నా బుద్ధి (మనోబుద్ధులు) పూర్తిగా నశించినవి. (అజ్ఞానము, అనుమానములు, వాంఛలతో కూడి, మనస్సు, బుద్ధి అను భ్రమను కలిగించు మనోవృత్తులు అన్నియును— సూర్యకాంతిలో చీకటులవలె విలీనమయిపోయినవి). కార్యాచరణయందలి ప్రవృత్తి (పనులు చేయుట యందలి ఆసక్తి—స్వప్నప్రపంచమునందలి ఆసక్తివలె) కరిగిపోయినది. 'ఇది ఉన్నది' తెలియుటలేదు; 'ఇదిలేదు' అని తెలియుటలేదు. (బహుళత్వమునకు కారణమయిన మనోబుద్ధులు విలీనముకాగానే, అంతా బ్రహ్మతత్త్వమే గోచరించునుగాని, వివిధత్వము గోచరించదు). ఈ అవధులులేని ఆనందము ఏమిటి? ఎక్కడ నుండి వచ్చినది?—నేను చెప్పలేకున్నాను. (ఇంద్రియాతీతమయినది, అనిర్వచనీయమయినది గావున)

483. వాచా వక్తుమశక్యమేవ మనసా మన్తుం న వా శక్యతే
స్వానందామృతపూరపూరితపరబ్రహ్మాంబుధేర్వైభవమ్
అంభోరాశివిశీర్ణవార్షికశిలాభావం భజన్మే మనో
యస్యాంశాంశలవే విలీనమధునాఽఽనందాత్మనా నిర్వృతం

నా (నిజస్వరూపమయిన) ఆనందామృతముతో నిండిన పరబ్రహ్మమను మహాసముద్రము యొక్క (పరమానంద సాగరము యొక్క) వైభవమును గూర్చి నోటితో చెప్పలేక పోవుచున్నాను; మనస్సుతో ఆలోచించలేక పోవుచున్నాను. (ఏలననగా, ఆ ఆనందానుభవ సముద్రమునందు, ఈ ఇంద్రియములు, ఈ మనస్సులేవు. ఆ అనుభవము వీటికి అతీతమయినది) సముద్రములోపడి, అందులోనే కరిగిపోయిన వడగలివలె (వర్షించిన మంచుముక్కవలె), నా మనస్సు ఇప్పుడు, (ఆ పరమానందాంబుధిలో) ఒకనొక లవలేశమయిన చోట విలీనమయి (ప్రత్యేకతను కోల్పోయి) ఆ ఆనందానుభవముతో నిండిపోయినది.

484. క్వ గతం కేన వా నీతం కుత్ర లీనమిదం జగత్
అధునైవ మయా దృష్టం నాస్తి కిం మహాద్భుతం

ఈ జగత్తు ఎక్కడకు పోయినది? ఎవరు తీసుకొని పోయిరి? ఎక్కడకు తీసుకొని పోయిరి? (ఇప్పటి వరకు) ఇక్కడే నాకు కనుపించిన జగత్తు ఇప్పుడు లేదు. అత్యంతాశ్చర్యముకదా! (బ్రహ్మమునందు మేలుకొనిన వానికి ఈజగత్తు—స్వప్న జగత్తు మేలుకొనిన వానిలో కరిగిపోవునట్లు—బ్రహ్మముతో కరిగిపోవును).

485. కిం హేయం కిముపాదేయం కిమన్యత్ కిం విలక్షణం
అఖండానందపీయూషపూర్ణే బ్రహ్మమహార్ణవే

అఖండానందమను అమృతముతో నిండిన బ్రహ్మమను మహాసముద్రములో విడిచి పెట్టవలసినది ఏది? స్వీకరించవలసినది ఏది ? అన్యమయినది ఏది ? విలక్షణమయినది (బ్రహ్మమునకు వేరయినది) ఏది?

486. న కించిదత్ర పశ్యామి న శృణోమి న వేద్మ్యహం
స్వాత్మనైవ సదానందరూపేణాస్మి విలక్షణః

అక్కడ (ఆ బ్రహ్మానందస్థితిలో) నాకు ఏమియును కనుపించుట లేదు. వినుపించుట లేదు; (బ్రహ్మముకన్న వేరయినది) తెలియుట లేదు; నాలో నేనే (స్వాత్మని+ఏవ) బ్రహ్మానంద రూపముతో ఉన్నాను. (ఈ అనుభవము అంతకు ముందు పొందిన అనుభవములకన్న) విలక్షణమయినది (వేరయినది).

487. నమో నమస్తే గురవే మహాత్మనే
విముక్తసంగాయ సదుత్తమాయ
నిత్యాద్వయానందరసస్వరూపిణే
భూమ్నే సదాఽపారదయాంబుధామ్నే.

ఓ గురువర్యా! నీవు సంగరహితుడవు; మహాత్ముడవు; నిత్యుడవు; అద్వయితానంద రస స్వరూపుడవు; ఉత్తమోత్తముడవు; సదా అపార దయాసముద్రుడవు; అట్టి నీకు నమస్కారములు.

488. యత్కటాక్షశశిసాంద్రచంద్రికాపాతధూతభవతాపజశ్రమః
ప్రాప్తవానహమఖండవైభవానందమాత్మపదమక్షయం క్షణాత్.

జనన మరణ తాపమువలన కలిగిన శ్రమ అంతయును, నీ కటాక్షమనెడి చంద్రుని వలన విరిసిన ఘనమైన వెన్నెలతో పూర్తిగా కడిగివేయబడినది (వల్లాని

పోయినది). అఖండానందమైన పదమును, అక్షయమయిన (తిరుగులేని) ఆత్మ స్థానమును, ఒక్క క్షణములో (నీ కటాక్షము వలననే) పొందగలిగితిని.

489. ధన్యోఽహం కృతకృత్యోఽహం విముక్తోఽహం భవగ్రహాత్
నిత్యానందస్వరూపోఽహం పూర్ణోఽహం త్వదనుగ్రహాత్

(ఓ గురువర్యా!) నీ అనుగ్రహము వలన నేను ధన్యుడనయితిని; కృతకృత్యుడనయితిని; (సర్వకర్మలను చేసిన వాడనయితిని); భవగ్రహమునుండి (జనన మరణ రూపకమయిన రాహు గ్రహమునుండి) విముక్తుడనయితిని; నిత్యానంద స్వరూపుడనయితిని; పరిపూర్ణుడనయితిని.

490. అసంగోఽహ మనంగోఽహ మలింగోఽహ మభంగురః
ప్రశాంతోఽహ మనంతోఽహ మమలోఽహం చిరంతనః

నేను సంగరహితుడను; (దేనియందును ఆసక్తి, కోరిక లేనివాడను); అంగరహితుడను (దేహాది ఉపాధులు లేనివాడను); సూక్ష్మ శరీరముకూడ లేనివాడను (ఇంద్రియ మనోబుద్ధులు లేనివాడను); నాశరహితుడను; ప్రశాంతుడను; అనంతుడను; నిర్మలుడను; శాశ్వతుండను; (చిరంతనః).

491. అకర్తాహమభోక్తాహమవికారోఽహమక్రియః
శుద్ధబోధస్వరూపోఽహం కేవలోఽహం సదాశివః

(దేహేంద్రియ మనోబుద్ధుల కతీతుడనగుటచే), నేను కర్తనుకాను; భోక్తనుకాను; మార్పులు చెందువాడను కాను; నేను నిష్క్రియుడను (చేయవలసిన పనులేమియు లేనివాడను). నేను (ఆత్మ స్వరూపుడను కావున) పరిశుద్ధమయిన జ్ఞానస్వరూపుడను; కేవలుడను (నాకు వేరయినదేదియు లేనివాడను); సదాశివుడను (పవిత్రుడను).

492. ద్రష్టుః శ్రోతుర్వక్తుః కర్తుర్భోక్తుర్విభిన్న ఏవాహం
నిత్యనిరంతరనిష్క్రియనిఃసీమాసంగపూర్ణబోధాత్మా

నేను చూచువానికంటెను, వినెడి వానికంటెను, మాట్లాడువాని కంటెను, పనులు చేసెడి వానికంటెను, (ఫలమును) అనుభవించు వానికంటెను, భిన్నమయినవాడను. (పై ప్రక్రియలన్నియును 'జీవుని'కి సంబంధించినవి). నేను నిత్యమయిన, నిరంతర

మయిన (శాశ్వతమయిన), క్రియారహితమయిన, ఎల్లలులేని, సంగరహితమయిన పరిపూర్ణబోధతత్త్వమును (జ్ఞాన స్వరూపమును).

493. నాహమిదం నాహమదోఽప్యుభయోరవభాసకం పరం శుద్ధం
బాహ్యాభ్యంతర శూన్యం పూర్ణం బ్రహ్మాద్వితీయమేవాహం.

నేను 'ఇది' (అవిద్య వలన కలిగిన దేహాదులను) కాను; 'అది' (శాస్త్రజ్ఞానము కలిగి అనుభవ శూన్యమయిన జ్ఞానిని) కాను; నేను ఈ రెండింటిని ప్రకాశింపజేయు పరిశుద్ధమయిన పరమాత్మతత్త్వమును; (పోలిక కొరకు— 'నేను చీకటిని కాను; చీకటిని పారద్రోలెడి సూర్యునికాను; ఆ రెండింటి యొక్క జ్ఞానమును కలుగజేసెడి బోధ తత్త్వమును), నేను (దేహముకాను కావున) బాహ్యాంతరములు (బయట లోపల అన్నవి) లేనివాడను; పరిపూర్ణమయిన అద్వయ బ్రహ్మ స్వరూపమును నేను.

494. నిరుపమమనాదితత్త్వంత్వమహమిదమదఇతి కల్పనాదూరం
నిత్యానందైకరసం సత్యం బ్రహ్మాద్వితీయమేవాహం.

నిరుపమానమయినది (దేనితోను పోల్చ శక్యముకానిది), ఆదిలేనిది, 'నేను', 'నీవు', 'అది', 'ఇది' అను భిన్నత్వ కల్పనలేనిది, నిత్యమయినది, సత్యమయినదీ, ఆనందమే రసముగాగలది, (మూలపదార్థముగాగలది), అద్వితీయమయినది అయిన ఆ పరబ్రహ్మ స్వరూపమే నేను.

495. నారాయణోఽహం నరకాంతకోఽహం
పురంతకోఽహం పురుషోఽహమీశః
అఖండబోధోఽహమశేషసాక్షీ
నిరీశ్వరోఽహం నిరహం చ నిర్మమః

నేను నారాయణుడను (నారా+అయన = బ్రహ్మము యొక్క వైభవము): నేను నరకాంతకుడను (పాపముల పుట్ట అయిన ఈ దేహమే నరకము; దానిని అంతము చేసినవాడను); నేను పురంతకుడను (జాగ్రత్, స్వప్న, సుషుప్త్యావస్థలు మూడు స్థానములు—త్రిపురములు; అందులో తిరుగు జీవుడు త్రిపురాసురుడు; జీవభావమును, దేహభావమును అంతము చేసినవాడను కావున త్రిపురాంతకుడను); నేను (ప్రతి ప్రాణియందు ఉండు) పురుషుడను; నేను (ఇంద్రియ మనోబుద్ధులకు) నియామకుడను

(ఈశ్వరుడను); నేను అఖండ స్వరూపుడను; నేను సర్వసాక్షిని; (నేనే ఈశ్వరుడను కావున) నాకు వేరే నియామకుడు లేడు; నాకు అహంకారము (నేను వేరు అను భావము), మమకారము (ఇది నాది అను భావము) లేవు.

496. సర్వేషు భూతేష్వహమేవ సంస్థితో
జ్ఞానాత్మనాఽన్తర్బహిరాశ్రయః సన్
భోక్తా చ భోగ్యం స్వయమేవ సర్వం
యద్యత్పృథగ్దృష్టమిదంతయా పురా.

నేనే అన్ని ప్రాణులలోను జ్ఞానరూపకముగా లోపల బయట నిండియున్నాను. (ప్రతి ప్రాణిలోను 'నేను తెలుసుకొనుచున్నాను'అను భావము ఆత్మతత్త్వము వలననే కలుగుచున్నది). అనుభవించు వాడను, అనుభవింపబడునదియు నేనే; పూర్వము వేరు వేరుగా 'ఇది' 'అది' అని కనిపించిన జగత్తంతయు, (జ్ఞానోదయమయిన పిమ్మట), అంతయు నేనే (అని తెలుసుకొనుచున్నాను). (కలలో కనబడు వేరువేరు వస్తువులన్నియు కర్తతోసహా-తానే అని మేలుకొనిన తర్వాత ఎరుకపడును. ఆ విధముగానే జ్ఞానోదయమయిన పిదప అంతయు స్వప్నతుల్యము).

497. మయ్యఖండసుఖాంభోధౌ బహుధా విశ్వవీచయః
ఉత్పద్యంతే విలీయంతే మాయామారుతవిభ్రమాత్

నా అఖండానంద సముద్రమునందు 'మాయ' అను పెనుగాలిచే ఇటునటు తిరుగు ఎన్నియో విశ్వవీచికలు (జగములు అను అలలు) పుట్టుచున్నవి; నశించుచున్నవి; (మాయా కల్పితలోకములు అనంతానందసముద్రమయిన పరబ్రహ్మయందు అక్కడ అక్కడ కనిపించుచుండును; అంతరించుచుండును).

498. స్థూలాదిభావా మయి కల్పితా భ్రమా -
దారోపితానుస్ఫురణేన లోకైః
కాలే యథా కల్పకవత్సరాయ -
నర్త్వాదయో నిష్కలనిర్వికల్పే

భాగములు లేని అనంతకాలములో ఏ విధముగా కల్పములు, సంవత్సరములు, అయనములు, ఋతువులు (ఊహా మాత్రముగా) కల్పింపబడినవో, ఆ విధముగానే నాలో.

(అనంత, అద్వయ, అఖండ, నిర్వికల్ప పరబ్రహ్మలో) మాయవలన (భ్రమవలన) స్థూలాది భావము (స్థూల, సూక్ష్మ, కారణ శరీరములను భావము) లోకులచే (భ్రమకు లోబడిన వారిచే), ఆరోపింపబడినవి.

499. ఆరోపితం నాశ్రయదూషకం భవేత్
కదాపి మూఢైర్మతిదోషదూషితైః
నార్ద్రీకరోత్యూషరభూమిభాగం
మరీచికావారిమహాప్రవాహః

(ఒక వస్తువును చూచి మరొక వస్తువు అనుకొను భ్రమను ఆరోపితము అందురు) మూఢులచేత ఆరోపింపబడిన వస్తువు-అది ఎంత దోష భూయిష్ఠమయినదయినను ఆధార వస్తువును దూషితము చేయలేవు. (త్రాటిలో ఆరోపితమయిన పాము- అది ఎంతటి విషసర్పమయినను త్రాటిని ఏ మాత్రము విషపూరితము చేయలేదు). (ఎడారి భూములలో కనబడు) ఎండ మావులలో గల నీటి ప్రవాహము ఆ ఊసర భూములను ఏ మాత్రమును తడపలేవు కదా!

500. ఆకాశవత్కల్ప విదూరగోఽహం
ఆదిత్యవద్భాస్య విలక్షణోఽహం
అహార్యవన్నిత్య వినిశ్చలోఽహ
మంభోధివత్పార వివర్జితోఽహం.

నేను ఆకాశమువలె దేనిచేతను అంటబడను; నేను సూర్యునివలె, ప్రకాశింపబడు వానికంటె వేరయినవాడను; నేను పర్వతమువలె నిత్యుడను; నిశ్చలుడను. నేను మహాసముద్రమువలె అవసలు లేనివాడను.

501. న మే దేహేన సంబంధో మేఘేనేవ విహాయసః
అతః కుతో మే తద్ధర్మా జాగ్రత్స్వప్నసుషుప్తయః

మేఘములతో సంబంధములేని ఆకాశమువలె, నాకు దేహముతో సంబంధములేదు. అట్లైతే నాకు ఆ శరీర ధర్మములయిన జాగ్రదవస్థ, స్వప్నావస్థ, సుషుప్త్యవస్థ ఎట్లుండును?

502. ఉపాధిరాయాతి స ఏవ గచ్ఛతి
స ఏవ కర్మాణి కరోతి భుంక్తే
స ఏవ జీర్యన్ మ్రియతే సదాహం
కులాద్రివన్నిశ్చల ఏవ సంస్థితః

ఈ ఉపాధి వచ్చుచుండును; పోవుచుండును; ఆ ఉపాధి (దేహము) కర్మలను చేయుచుండును; ఫలమును అనుభవించుచుండును. ఆ ఉపాధియే జీర్ణించి (శిథిలమయి) మరణమందును. నేను మాత్రము ఎల్లప్పుడు మేరు పర్వతమువలె (కులాద్రి వలె), నిశ్చలముగా నుందును. (మేరు పర్వతమునకు దక్షిణమున నిలబడి మేరు పర్వతము వైపు చూచువారికి దాని శిఖరము ధృవనక్షత్రముతో కలసి, ధృవనక్షత్రమువలె స్థిరముగా నున్నట్లు తోచును). (కులాద్రి అనగా ఉత్తరధృవమని కొందరి భావన).

503. న మే ప్రవృత్తిర్న చ మే నివృత్తిః
సదేకరూపస్య నిరంశకస్య
ఏకాత్మకో యో నిబిడో నిరంతరో
వ్యోమేవ పూర్ణః స కథం ను చేష్టతే.

నాకు ప్రవృత్తి అన్నది (పనులలో ఉద్యమించుట అనునది) లేదు. నివృత్తి అనునది (పనులనుండి విరమించుట అనునది) లేదు. (పనులు చేయుట, చేయకుండుట అనునది ఉపాధులకే పరిమితము. నేను ఉపాధిని కాను కావున నాకురెండును లేవు). నేను ఎల్లప్పుడును సదేక రూపముతో (సత్+ఏక+రూపః—ఉనికియే నాతత్వముగా) ఉందును. నాలో (పనులు చేయుటకు కావలసిన) భాగములు లేవు; ఆకాశమువలె అంతటను నిండిఉన్న ఆత్మతత్వము ఒక్కటే నిబిడమయినది (పూర్తిగా నిండినది), నిరంతరమయినది (మధ్యమధ్యన ఖాళీలు లేనిది), పరిపూర్ణమయినది (వేరొక వస్తువునకు తావులేనిది). అట్టి ఆత్మతత్వము ఎట్లు వ్యవహరించగలదు. (పనులు జరుగుటకు, చేయువాడు, చేయబడునది, చేయుట—కర్త, కర్మ, క్రియ—అను విభిన్నత్వము అవసరము. అట్టి విభిన్నత్వములేని ఏకత్వములో చేష్టలు ఎట్లు వీలుపడును).

504. పుణ్యాని పాపాని నిరింద్రియస్య
నిశ్చేతసో నిర్వికృతేర్నిరాకృతేః
కుతో మమాఖండసుఖానుభూతే -
ర్బ్రూతే హ్యనన్వాగతమిత్యపి శ్రుతిః

నేను నిరింద్రియుడను (ఇంద్రియములు లేని వాడను). మనస్సు లేనివాడను; మనో వికారములు (మార్పులు) లేనివాడను; ఆకారము లేనివాడను; నేను అఖండానంద రసానుభవమునందు ఉన్నవాడను. అట్టి నాకు పుణ్యములు, పాపములు ఎట్లు అంట గలవు? 'అనందాగతం' అని (ఈ విషయమునే) శ్రుతులు చెప్పుచున్నవి కదా! (బృహదారకోపనిషత్తులో సుషుప్తావస్థలో నున్న జీవుని గూర్చి చెప్పునప్పుడు — 'అతనికి పుణ్యమంటదు; అతనికి పాపమంటదు; హృదయములోగల అన్ని దుఃఖము లకును అతీతుడై యుండును' - అని చెప్పబడినది).

505. ఛాయయా స్పృష్టముష్ణం వా శీతం వా శుష్ఠు దుఃష్ఠు వా
న స్పృశత్యేవ యత్కించిత్పురుషం తద్విలక్షణం.

తన నీడ వేడివస్తువును గాని, చల్లని వస్తువును గాని, శుభప్రదమయిన దానిని గాని, క్షుద్రమయిన దానిని గాని దేనిని తాకినను, (ఆ నీడను కలుగజేసిన) పురుషునకు ఆ నీడకు వేరయిన వాడగుట వలన-ఏ విధమయిన స్పర్శ జ్ఞానమును (మనోవికార మును) కలుగదు.

506. న సాక్షిణం సాక్ష్యధర్మాః సంస్పృశంతి విలక్షణం
అవికారముదాశీనం గృహధర్మాః ప్రదీపవత్.

సాక్షిని (చూచువానిని), సాక్ష్యధర్మములు (చూడబడుదాని ధర్మములు - దాని మంచి చెడ్డలు) అంటవు. (ఏలనన) సాక్షి సాక్ష్యమునకు విలక్షణుడు (వేరయినవాడు). ఇంటిలో జరుగు గృహ ధర్మములన్నింటికి (ఇంటిలోగల) దీపమువలె, సాక్షి ఎల్లప్పుడును నిర్వికారుడు, ఉదాసీనుడుగా నిలచును.

507. రవేర్యథా కర్మణి సాక్షిభావో
వహ్నేర్యథా దాహ నియామకత్వం
రజ్జోర్యథాఽఽరోపితవస్తుసంగ—
స్తథైవ కూటస్థ చిదాత్మనో మే.

(ఈ ప్రపంచములో జరుగు) కర్మల కన్నింటికిని సూర్యుడు సాక్షిమాత్రుడు (ఆ కర్మల యొక్క పాప పుణ్యములతో, మంచి చెడ్డలతో అతనికి సంబంధము లేదు.) మంటకు దాహక నియమములేదు (ఇది కాల్చవచ్చును, ఇది కాల్చకూడదు అను నియమములేక తనలోపడిన వస్తువుల నన్నింటిని ఒకే విధముగా కాల్చును.)

రజ్జువునకు (త్రాటికి) తనయందు ఆరోపింపబడిన వస్తువునందు (సర్పమునందు) ఎట్టి అభిమానముగాని, ఆసక్తిగాని (సంగము) లేదు. ఆ విధముగానే కూటస్థుడయిన (ఎల్ల ప్రాణులలోను ఉన్న) చిత్ స్వరూపుడనయిన నాకుగూడ (ఈ దేహాదులయందు సూర్యునివలె సాక్షీభావము, వహ్నివలె నిర్మమత్వము, రజ్జువువలె సంగరాహిత్యము ఉన్నది).

508. కర్తాపి వా కారయితాపి నాహం
భోక్తాపి వా భోజయితాపి నాహం
ద్రష్టాపి వా దర్శయితాపి నాహం
సోఽహం స్వయంజ్యోతిరనీదృగాత్మా

నేను చేయువాడనుకాను; చేయించువాడను కాను; అనుభవించువాడను కాను (భోక్తా); అనుభవింపచేయువాడను (భోజయితా) కాను; నేను చూచువాడను కాను; చూచునట్లు చేయువాడను కాను: నేను స్వయంజ్యోతి అయిన ఆ పరబ్రహ్మ స్వరూపుడను (సోఽహం): (ఇప్పటి వరకు ఎరిగిన) వీటన్నిటివంటి వాడనుకాను.

509. చలత్యుపాధౌ ప్రతిబింబలౌల్య-
మౌపాధికం మూఢధియో నయంతి
స్వబింబ భూతం రవివద్వినిష్క్రియం
కర్తాస్మి భోక్తాస్మి హతోఽస్మి హేతి.

సూర్యుడు నిష్క్రియుడు (కదలికలేనివాడు). ఆ విధముగనే ఆత్మకూడ క్రియారహితము యినదే. (కాని, సూర్యుని నిజతత్వమును తెలియని మూఢులు అతని ప్రతిబింబము నీటిలో బడి కదులు చుండుట చూచి సూర్యుడు కదులుచున్నాడని భ్రమింతురు). ఆవిధముగానే, కదలుచున్న ఉపాధులయందు (దేహాదులయందు) ఆత్మయొక్క ప్రతిబింబము కదులుటను చూచి, ఆత్మయే కదులుచున్నదను భ్రమతో, 'నేను కర్తను', 'నేను భోక్తను', 'అయ్యో నేను చచ్చిపోవుచున్నాను' అని పలుకుచుందురు. (మనస్సులోని ఆందోళనలను, బుద్ధిలోని ఆలోచనలను ప్రకాశింపజేయునది ఆత్మ తత్వము. ఆ కాంతిలో మనోబుద్ధులలోని వృత్తులు ప్రకాశవంతమై 'నేను' అను భావమును (ప్రతిబింబమును) సృష్టించి, 'నేను చేయుచున్నాను' అను భావమును కలుగచేయును).

510. జలే వాపి స్థలే వాపి లుఠత్వేష జడాత్మకః
నాహం విలిప్యే తద్ధర్మైర్ఘటధర్మైర్నభో యథా

ఈ జడ శరీరము నీటిలోగాని, నేలమీదగాని ఒరిగిపోనిమ్ము; కుండలోగల ఆకాశము (ఘట ధర్మములచే ఏ విధముగా అంటుబడదో) ఆవిధముగనే నేనుకూడ ఈ శరీర ధర్మములచేత అంటబడను (కట్టుబడి ఉండను). (శరీర ధర్మములు - పుట్టుట, పెరుగుట, జీర్ణించుట, నశించుట; మనోధర్మములు - ద్వంద్వములచే బాధపడుట; భయాందోళనలకు లోనగుట; చంచలత్వము; చపలత్వము మొదలగునవి; బుద్ధి ధర్మములు-వాంఛామోహములకు గురియగుట, త్రిగుణములకు లోనగుట మొదలగునవి-ఇవి ఏమియు నాకులేవు-ఆత్మకు ఉండవు).

511. కర్తృత్వ భోక్తృత్వ ఖలత్వమత్తతా-
జడత్వబద్ధత్వ విముక్తతాదయః
బుద్ధేర్వికల్పా న తు సంతి వస్తుతః
స్వస్మిన్ పరే బ్రహ్మణి కేవలేఽద్వయే.

కర్తను, భోక్తను, దుష్టుడను, త్రాగుబోతును, జడుడను, బద్ధుడను (బంధింపబడినవాడను), ముక్తుడను, అనునవి అన్నియును బుద్ధిలో కలుగు భావనలేకాని, వస్తుతః (నిర్దిష్టమయిన రూపములో), అవి అద్వయ పరబ్రహ్మ స్వరూపుడనయిన నాయందు లేవు. నేను కేవలుడను (దేనితోను సంబంధములేనివాడను).

512. సంతువికారాః ప్రకృతేర్దశధా, శతధా సహస్రధా వాపి
కిం మేఽసంగచిత్తస్యతైర్న ఘనః క్వచిదంబరం స్పృశతి.

ప్రకృతిలో వికారములు (మార్పులు), పదులు, వందలు, వేలసంఖ్యలో కలగనిండు. వాటిలో సంగము (ఆసక్తి) లేని నాకు వాటితో పని ఏమి? (వాటివల్ల నాకు ఎట్టి లాభ నష్టములు ఉండవు). మేఘములు (ఎన్ని ఉన్నను) అవి ఆకాశమును ఏ మాత్రము అంటవు.

513. అవ్యక్తాదిస్థూలపర్యంతమేతత్
విశ్వం యత్రాభాసమాత్రం ప్రతీతం
వ్యోమప్రఖ్యం సూక్ష్మమాద్యంతహీనం
బ్రహ్మాద్వైతం యత్తదేవాహమస్మి

అవ్యక్తము మొదలుకొని (కారణ శరీరము-అవిద్య మొదలుకొని), స్థూలము (దృశ్య ప్రపంచము) వరకు గల ఈ విశ్వమంతయు, అక్కడ (ఆ బ్రహ్మమునందు) ఒక ఆభాసగా, (ఛాయా మాత్రముగా) ప్రతీతమగును. అది (ఆ బ్రహ్మము) ఆకాశమువలె సూక్ష్మమయినది; ఆద్యంతములులేనిది; అద్వయమయినది; అట్టి పరబ్రహ్మమును నేనే—

514. సర్వాధారం సర్వవస్తుప్రకాశం
సర్వాకారం సర్వగం సర్వశూన్యం
నిత్యం శుద్ధం నిశ్చలం నిర్వికల్పం
బ్రహ్మాద్వైతం యత్తదేవాహమస్మి.

అన్నింటికి ఆధారభూతమయినదియు, సమస్తవస్తువులను ప్రకాశింపజేయునదియు, పలు ఆకారములు కలదియు, అన్నింటియందును వ్యాపించియున్నదియు (సర్వగం), (అయినను) బహుళత్వము (వివిధత్వము) లేనిదియు (సర్వశూన్యం), నిత్యమయినదియు, శుద్ధమయినదియు, నిశ్చలమయినదియు, నిర్వికల్పమయినదియు(ఆందోళనలు, ఆలోచనలు లేనిదియు), అయిన అద్వయ పరబ్రహ్మను నేనే.

515. యత్ప్రత్యస్తాశేషమాయావిశేషం
ప్రత్యగ్రూపం ప్రత్యయాగమ్యమానం
సత్యజ్ఞానానంతమానందరూపం
బ్రహ్మాద్వైతం యత్తదేవాహమస్మి

మాయచే కల్పించబడిన అశేషవిశ్వమునకతీతమయినదియు, ప్రతిప్రాణియందు ఆత్మతత్త్వమై యున్నది. (ప్రత్యగ్రూపం), గుణరహితమయినదగుటచే ఇంద్రియ మనోబుద్ధులచే తెలియరానిదియు (ప్రత్యయాగమ్యరూపం), సత్యము, జ్ఞానము, అనంతానందము స్వరూపముగా గలదియు, అయిన అద్వయ పరబ్రహ్మమునే నేను.

516. నిష్క్రియోఽస్మ్యవికారోఽస్మి
నిష్కలోఽస్మి నిరాకృతిః
నిర్వికల్పోఽస్మి నిత్యోఽస్మి
నిరాలంబోఽస్మి నిర్ద్వయః

నేను క్రియారహితుడను (కర్మలయందు ప్రవర్తించు వాడనుకాను): నిర్వికారుడను (ఎట్టిమార్పులు చెందని వాడను): నిష్కలుడను (వేరు వేరు భాగములు లేనివాడను) ఆకారములేనివాడను: నిర్వికల్పుడను (ఆలోచనలు, ఆందోళనలు లేనివాడను): నిత్యమయినవాడను; ఆలంబన (వేరు ఆధారము) లేనివాడను: నిర్ద్వయుడను (ద్వితీయ వస్తువులేని అద్వయపరబ్రహ్మను).

517. సర్వాత్మకోఽహం సర్వోఽహం సర్వాతీతోఽహమద్వయః
కేవలాఖండబోధోఽహమానందోఽహం నిరంతరః

నేను సర్వాత్మ తత్వమును: సర్వమును నేనే (ఈ భాసరూపకమయిన విశ్వమంతయు వస్తుతః నేనే (అయినను) నేను ఈ (దృశ్యప్రపంచమునకు) అంతటికిని అతీతమయినవాడను; నేను అద్వయుడను: కేవలుడను: అఖండబోధరూపుడను; అంతరాయములేని ఆనందరూపుడను.

518. స్వారాజ్యసామ్రాజ్యవిభూతిరేషా
భవత్కృపాశ్రీమహిమప్రసాదాత్
ప్రాప్తా మయా శ్రీగురవే మహాత్మనే
నమో నమస్తేఽస్తు పునర్నమోఽస్తు

మహాప్రసాదమయిన నీ కృపవలన నాకు స్వారాజ్య వైభవము (అంతరంగిక విజయము), సామ్రాజ్య వైభవము (బాహ్యప్రపంచముపై విజయము), సంప్రాప్తమయినది. మహాత్మా, శ్రీగురుదేవా! నీ కివే నా నమస్కారములు. మరల మరల నమస్కారము.

519. మహాస్వప్నే మాయాకృత జనిజరామృత్యుగహనే
భ్రమంతం క్లిశ్యంతం బహుళతరతాపైరనుదినమ్
అహంకార వ్యాఘ్రవ్యథితమిమమత్యంతకృపయా
ప్రబోధ్య ప్రస్వాపాత్పరమవితవాన్మామసి గురో

గురుదేవా! మాయా కార్యమువలన జనించిన ఈ జరామరణ సంకులమయిన మహారణ్యములో దినదినము, అనేకములయిన తాపత్రయములు నన్ను బాధపెట్టుచుండగా, అహంకారమను పెద్దపులి నన్ను నిరంతరము వెంటాడుచుండగా, (సంసారమను) ఈ మహాస్వప్నములో తిరుగుచు వ్యథచెందుచున్న నన్ను అత్యంతకృపవలన (మాయ అనెడి నిద్రనుండి) మేలుకొలిపి నన్ను రక్షించితివికదా!

520. సమస్తస్మై సదైకస్మై కస్మైచిన్మహసే నమః
యదేతద్విశ్వరూపేణ రాజతే గురురాజతే

విశ్వరూపునిగా విరాజిల్లుచున్న ఓ గురురాజా! నీవు సర్వదా ఒకే రూపములో ఉండువాడవు (ఆత్మ స్వరూపుడవు); అందరికంటెను (ఎంతటివానికంటెను) మహాత్ముడవు; అట్టి నీకు నమస్కారములు.

## అంతిమ ఉపదేశము (521-575)

521. ఇతి నతమవలోక్య శిష్యవర్యం
సమధిగతాత్మసుఖం ప్రబుద్ధతత్వం
ప్రముదితహృదయః స దేశికేంద్రః
పునరిదమాహ వచః పరం మహాత్మా

ఈ విధముగా జ్ఞానసిద్ధి కలిగి, ఆత్మానందమును (అనుభవపూర్వకముగా) తెలిసికొనిన శిష్యశ్రేష్ఠుడు అవనత శిరస్కుడై (తన ఎదుట) నిలచియుండుట చూచి, సంతోషముతో నిండిన హృదయము కలవాడై, ఆ పరమాత్ముడు, మహాత్ముడు అయిన గురూత్తముడు ఈ విధముగా పలికెను.

522. బ్రహ్మప్రత్యయసంతతిర్జగదతో బ్రహ్మైవ తత్సర్వతః
పశ్యాధ్యాత్మదృశా ప్రశాంతమనసా సర్వాస్వవస్థాస్వపి
రూపాదన్యదవేక్షితుం కిమభితశ్చక్షుష్మతాం విద్యతే
తద్వద్బ్రహ్మవిదః సతః కిమపరం బుద్ధేర్విహారాస్పదం

ఈ జగత్తంతయు అఖండ బ్రహ్మము యొక్క ప్రతీతమే. (ఇంద్రియ మనోబుద్ధులతో చూచుచుండుటవలన, అద్వితీయమయిన బ్రహ్మము, విభిన్నమై, వివిధత్వము గల జగత్తుగా తోచుచుండును). ప్రశాంతమయిన మనస్సుతో, అధ్యాత్మ దృష్టితో చూచినచో (ఈ జగత్తు) సర్వమును బ్రహ్మమని అవగతమగును. కళ్ళతో (చర్మచక్షువులతో) చూచువారికి, ఈ జగత్తులో పలు రూపములు తప్ప ఇంకేమి గోచరించగలదు ? ఆ విధముగానే ఆత్మజ్ఞానము పొందినవాని బుద్ధి బ్రహ్మమునందు మాత్రమే విహరించుచుండును. (ఒకే బ్రహ్మతత్వము ఇంద్రియములతోచూచు సాధారణ మానవునకు వివిధ తత్వముతో కూడుకున్న జగత్తుగాను, జ్ఞానదృష్టితోచూచు ఆత్మజ్ఞానికి, అఖండ, అద్వయ, పరబ్రహ్మముగను కనిపించును. స్వప్నజగత్తులోనున్న

జ్ఞానికి ఈ జగత్తు కనిపించదు; ఈ జగత్తులో ఉన్నవానికి - మేలుకొని ఉన్నవానికి - స్వప్నజగత్తు కనిపించదు - ఆ విధముగనే)

523. కస్తాం పరానందరసానుభూతి—
ముత్సృజ్య శూన్యేషు రమేత విద్వాన్
చంద్రే మహాహ్లాదిని దీప్యమానే
చిత్రేందుమాలోకయితుం క ఇచ్ఛేత్

(పరబ్రహ్మము నందలి) పరమానందరసానుభూతిని విడచిపెట్టి, పండితుడయినవాడు (వివేకి), శూన్యమయిన వాటియందు (సారములేని బాహ్య విషయములందు) ఎందుకు సంచరించజూచును ? మిక్కిలి ఆహ్లాదమును కలుగజేయు చంద్రుడు (ఆకాశములో) ప్రకాశించుచుండగా, చిత్రపటములోని చంద్రుని చూచుటకు ఎవరిష్టపడుదురు ?

524. అసత్పదార్థానుభవే న కించి
న్నహ్యస్తి తృప్తిర్న చ దుఃఖహానిః
సదద్వయానందరసానుభూత్యా
తృప్తః సుఖం తిష్ఠ సదాత్మనిష్ఠయా

అసత్పదార్థముల అనుభవము వలన (నిలకడలేని బాహ్యసుఖములను కోరుచుండుట వలన), తృప్తి ఉండదు. (వాటియందలి తీరని కోరికల వలన కలిగిన) దుఃఖము, నశింపదు. కావున, పరమాత్మయందే సదా నిలచి, అద్వయ బ్రహ్మానంద రసాను భూతిని పొందుచు, సంతృప్తుడవై సుఖముగా యుండుము.

525. స్వమేవ సర్వథా పశ్యన్మన్యమానః స్వమద్వయం
స్వానందమనుభుంజానః కాలం నయ మహామతే

ఓ మహాజ్ఞానీ, ఎల్ల వేళల, అన్నిచోట్ల, అన్నిటియందు (సర్వథా) నీ ఆత్మతత్వమునే చూచుచు, (అవి అన్నియును), నీ యొక్క అద్వితీయాత్మ తత్వముని తలంచుచు, నీలోగల ఆత్మానందమును అనుభవించుచు కాలమును వెళ్ళబుచ్చుము.

(ఆత్మజ్ఞాని తన శేషజీవితములో - ఈ లోకములో సంచరించుచున్నప్పుడు-బహిర్ముఖుడై యున్నప్పుడు - ఈ జగత్తంతయు తన ఆత్మతత్వమే యను భావనతో

ఉండవలెను. అంతర్ముఖుడై యున్నప్పుడు - తన ఆత్మతత్వమునందే సదా ఆనంద మనుభవించుచు ఆత్మారాముడై యుండవలెను).

526. అఖండబోధాత్మని నిర్వికల్పే
వికల్పనం వ్యోమ్నిపురః ప్రకల్పనం
తదద్వయానందమయాత్మనా సదా
శాంతిం పరామేత్య భజస్వ మౌనం

నిర్వికల్పమయిన (విభిన్నత్వములేని) అఖండబోధ స్వరూపమయిన పరమాత్మ యందు (ఈ జగత్తు అను) వివిధత్వమును (వికల్పము) కల్పించుట, ఆకాశములో పట్టణములు నిర్మించుటవంటివి — (గాలిమేడలవంటివి; పగటికలలవంటివి; ఊహ మాత్రమయినవి). అందుచేత, (ఈ అనిత్యమయిన జగత్తును విడచి) అద్వయా నందమునందు నిలిపిన మనస్సుతో) ఎల్లప్పుడు పరమశాంతితో మౌనమును వహించి యుండుము. (మౌనము రెండు విధములు; 1] బాహ్యము — మాటలాడకుండ నుండుట; 2] ఆంతర్యము: ఎట్టి ఆలోచనలు లేకుండ ఉండుట).

527. తూష్ణీమవస్థా పరమోపశాంతి—
ర్బుద్ధేరసంకల్పవికల్పహేతోః
బ్రహ్మాత్మనా బ్రహ్మవిదో మహాత్మనో
యత్రాద్వయానందసుఖం నిరంతరం

బ్రహ్మమునందే నిలచి, అద్వయితానందమును నిరంతరము అనుభవించుచుండు బ్రహ్మవేత్త అయిన మహాత్మునకు — మిథ్యాజ్ఞానమునకు, అలజడులకు, ఆందోళన లకు, కారణమయిన (అసత్కల్ప వికల్పహేతువయిన) బుద్ధి (మనస్సు) పరమ శాంతిని పొంది తూష్ణీభావముతో ఉండును (ఉన్నదో లేదో అన్న భావముతో నిశ్చలముగా నుండును).

528. నాస్తి నిర్వాసనాన్మౌనాత్పరం సుఖకృదుత్తమమ్
విజ్ఞాతాత్మస్వరూపస్య స్వానందరసపాయినః

వాసనలు (వాంఛలు) లేకపోవుటవలన కలుగు (మానసిక) మౌనముకన్న ఉత్తమ మయిన ఆనందమును ఇచ్చునది వేరొకటి లేదు. ఆత్మస్వరూపమును తెలిసినవారు తనలోగల ఆనంద రసమును త్రావుచు (అనుభవించుచు) ఉందురు.

(మనస్సులోగల ఆందోళనలకు, అలజడులకు మూలము పూర్వ వాసనలు; వాటివల్ల కలిగిన వాంఛా—మోహములు. ఆ వాసనలు తొలగిపోగానే మనస్సు నిర్మలమై, శుద్ధమై, నిశ్చలమై, ఆనందాతిరేకముతో అతిశయిల్లును).

529. గచ్ఛం స్తిష్ఠన్నుపవిశచ్ఛయానో వాఽన్యథాపి వా
యథేచ్ఛయా వసేద్విద్వానాత్మారామః సదా మునిః

అట్టి విద్వాంసుడయిన ముని (మౌనశీలి), నడచునప్పుడు, నిలబడి ఉన్నప్పుడు, కూరుచున్నప్పుడు, పండుకొనునప్పుడు, — మరి ఏ పని చేయుచున్నను — సదా ఆత్మలోనే వసించుచు, ఆత్మారాముడై, యథేచ్ఛగా (తన ఇచ్ఛవచ్చినరీతిని: నిర్వ్యాపీగా), ఉండును.

530. న దేశకాలాసనదిగ్యమాది—
లక్ష్యాద్యపేక్షాఽప్రతిబద్ధవృత్తేః
సంసిద్ధతత్త్వస్య మహాత్మనోఽస్తి
స్వవేదనే కా నియమాద్యవస్థా

పరమాత్మ జ్ఞానము సిద్ధించిన మహాత్ముని బుద్ధి ఎట్టి ప్రతిబంధకములు లేనిదై (అప్రతిబద్ధవృత్తి గలదై), ఉండుటవలన, అట్టివానికి (ప్రాథమిక సాధకునికివలె), దేశము, కాలము, ఆసనము, దిశ, యమనియమాదులు, లక్ష్యము, మొదలగు నియమములు పాటించుట ఉండదు (అవి పాటించవలసిన అవసరము, అందలి శ్రద్ధ ఉండదు). తనను తాను తెలిసికొనిన ఆత్మజ్ఞానికి, (అట్టి జ్ఞానసిద్ధికై సాధకుల కొరకు నిర్దేశించిన) నియమావళి ఎందుకు ? ప్రాథమిక విద్యలో ప్రతిదినము ఎక్కములు చదువవలసిన నియమము అవసరమయినను, పట్టభద్రుడయిన పిదపగూడ ప్రతిదినము ఎక్కములను చదువవలెనను నియమము హాస్యాస్పదము కదా).

531. ఘటోఽయమితి విజ్ఞాతుం నియమః కోఽన్వపేక్ష్యతే
వినా ప్రమాణసుష్ఠుత్వం యస్మిన్ సతిపదార్థధీః

'ఇది కుండ' అని తెలిసికొనుటకు, బాగుగా పనిచేయు చక్షురింద్రియము తప్ప (వినా ప్రమాణ సుష్ఠుత్వం) వేరు నియమములు ఏమియు అవసరములేదు. ఆ జ్ఞాన పరికరము సమముగా పనిచేయుచున్నచో పదార్థజ్ఞానము ('అక్కడ వస్తువు ఉన్నది' అన్న జ్ఞానము) కలుగును.

(ఇంద్రియములకతీతమయిన ఆత్మతత్త్వము స్వానుభవమునకు వచ్చువరకు, దేశకాలాసనయమాది నియమములు పాటించవలసిన అవసరముండును. ఆ బ్రహ్మ జ్ఞానము అవగతము కాగానే, — ఎదురుగా కనుపించు కుండవలె — ఎట్టి ప్రయత్నము లేకనే ఆ బ్రహ్మతత్త్వము అతనికి అవగతమగుచుండును).

532. అయమాత్మా నిత్యసిద్ధః ప్రమాణే సతి భాసతే
న దేశం నాపి వా కాలం న శుద్ధిం వాప్యపేక్షతే

జ్ఞానదృష్టి కలిగియున్నచో (ప్రమాణేసతి), ఆత్మతత్త్వము నిత్యసిద్ధమై ప్రకాశించుచుండును. (ఎల్లప్పుడును అవగతమగుచుండును). దేశమునుగాని, కాలమునుగాని, శుచిత్వమునుగాని (అజ్ఞానసిద్ధి) అపేక్షింపదు.

(బాహ్యవిషయములనుండి ఇంద్రియములను మరల్చి, మనోబుద్ధుల నుండి వాంఛామోహములను, భయాందోళనములను పారద్రోలి, ప్రశాంతమైన మనస్సుతో, సునిశితమయిన బుద్ధితో, ఏకాగ్రతతో ఆత్మతత్త్వమునుగూర్చి ధ్యానించుచుండుట వలన జ్ఞానదృష్టి వికసించును. ఆ జ్ఞానదృష్టి కలుగువరకు, మనోబుద్ధులను ప్రశాంతపరచు కొరకు ఈ దేశకాలాది నియమములు అవసరము. జ్ఞానదృష్టికలిగి, ఆత్మతత్త్వము విదితముకాగానే మనస్సు ఎల్లప్పుడూ ప్రశాంతముగా ఉండి, ఆత్మతత్త్వమునందే నిలచియుండును. అందుకు వేరు ప్రయత్నము అవసరము లేదు).

533. దేవదత్తోఽహమిత్యేతద్విజ్ఞానం నిరపేక్షకమ్
తద్వద్బ్రహ్మవిదోఽప్యస్య బ్రహ్మాహమితి వేదనమ్

'నేను దేవదత్తుడను' అని తెలుసుకొనుటకు ఎట్టి సాధనయు (ఎట్టి ప్రయత్నమును) అవసరములేదు. అవిధముగనే బ్రహ్మజ్ఞాని (ఎట్టి ప్రయత్నములేకనే) 'నేను బ్రహ్మమును' అని తెలుసుకొనుచుండును. (దేవదత్తుడు నిద్రలో తనను తాను మరచిపోయి స్వప్నజగత్తులో వేరొక వ్యక్తిగా వ్యవహరించవచ్చును. కాని మెలకువ కలుగగానే, 'తాను దేవదత్తుడనను జ్ఞానము వేరొకరు చెప్పనక్కరలేకనే, ఎట్టి ప్రయత్నము లేకనే కలుగును. అవిధముగనే, జ్ఞానోదయము కలిగిన ఆత్మజ్ఞానికి 'నేను బ్రహ్మమును' అను జ్ఞానము సుస్పష్టముగా తెలియుచుండును).

534. భానునేవ జగత్సర్వం భాసతే యస్య తేజసా
అనాత్మకమసత్తుచ్ఛం కిం ను తస్యావభాసకమ్.

అనాత్మ అయిన, అసత్యమయిన, తుచ్ఛమయిన ఈ జగత్తును అంతటిని, తన తేజస్సుచే (తన బోధతత్త్వముచే—చిత్ప్రకాశముచే), సూర్యునివలె – (సూర్యుడు తన కాంతిచే ఎల్ల వస్తువులను ప్రకాశింపజేయునట్లు) - ప్రకాశింపజేయు (చైతన్యవంతము జేయు) దానిని, (అట్టి ఆత్మతత్త్వమును), వేరొకరు ఎట్లు ప్రకాశింపజేయ గలరు ?

535. వేదశాస్త్రపురాణాని భూతాని సకలాన్యపి
యేనార్థవంతి తం కిన్ను విజ్ఞాతారం ప్రకాశయేత్

వేదశాస్త్రపురాణములను, సమస్తప్రాణులను అర్థవంతము చేయునట్టి జ్ఞానరూపుని వేరొకరు ఎట్లు ప్రకాశింపజేయగలరు?

536. ఏష స్వయంజ్యోతిరనంతశక్తి -
రాత్మాఽప్రమేయః సకలానుభూతిః
యమేవ విజ్ఞాయ విముక్తబంధో
జయత్యయం బ్రహ్మవిదుత్తమోత్తమః

ఈ ఆత్మతత్త్వము స్వయంప్రకాశమయినది; అంతులేని శక్తికలది; అప్రమేయమయి నది (ఎట్టి ప్రమాణముచేతను ఎరుగరానిది): అన్ని ప్రాణులయందును అనుభూత మగునది. ('నేను ఉన్నాను' అను భావమును కలుగజేయునది); ఉత్తమోత్తమమైన బ్రహ్మవేత్తలు ఆ ఆత్మతత్త్వమును తెలిసికొని, బంధముక్తులై విజయము పొందు చున్నారు.

537. న ఖిద్యతే నో విషయైః ప్రమోదతే
న సజ్జతే నాపి విరజ్యతే చ
స్వస్మిన్సదా క్రీడతి నందతి స్వయం
నిరంతరానందరసేన తృప్తః

నిరంతరము బ్రహ్మానందరసమును గ్రోలుటవలన తృప్తుడయిన జ్ఞాని, విషయ సుఖములు కలుగనిచో దుఃఖించడు. అవి కలిగినచో ఆనందపరవశుడుకాడు. వాటిని (తనంతతాను) కోరడు. అవి కలిగినప్పుడు వద్దనడు. (ఆత్మజ్ఞాని, విషయసుఖములు కలిగినను, కలుగకపోయినను, మనోవికారములులేక నిర్లిప్తుడై, నిస్సంగుడై యుండును).

538. క్షుధాం దేహవ్యథాం త్యక్త్వా బాలః క్రీడతి వస్తుని
తథైవ విద్వాన్ రమతే నిర్మమో నిరహం సుఖీ

ఆకలిని, శరీరశ్రమను మరచిపోయి బాలుడు తన ఆటవస్తువులతో (అత్యంతాన ముగా) ఆడుకొనుచుండును. ఆ విధముగనే విద్వాంసుడు (బ్రహ్మవేత్త), మమ మును, (విషయ సుఖములయందలి ఆకలిని), అహంకారమును (అవి లేనప బాధను) మరచి ఆత్మానందములో సుఖముగా నుండును.

539. చింతాశూన్యమదైన్యభైక్షమశనం పానం సరిద్వారిషు
స్వాతంత్ర్యేణ నిరంకుశా స్థితిరభీర్నిద్రా శ్మశానే వనే
వస్త్రం క్షాళనశోషణాదిరహితం దిగ్వాస్తు శయ్యా మహీ
సంచారో నిగమాంతవీథిషు విదాం క్రీడా పరే బ్రహ్మణి

బ్రహ్మవేత్తలకు ఎట్టి చింతలు ఉండవు; దీనత్వముండదు; భిక్షమువలన దొరికెడి భోజనము; త్రాగుట నదీజలములనే; జీవితము స్వతంత్రమయినది (ఎవరికిని లో ఉండునదికాదు); నిరంకుశమయినది (ఎవరి శాసనమునకును లోబడి ఉండు కాదు). భయము ఉండదు; నిద్ర శ్మశాన భూములయందునో, అడవ యందునో. ఉతుకుట ఆరవేయుట అవుసరములేని చెట్టు బెరడులో, దిక్కు వస్త్రములు. పండుకొనుట నేలమీదనే; సంచారము వేదాంత వీధులయందు (వ బుద్ధి ఎల్లప్పుడు వేదాంత విషయములందే తిరుగుచుండును); క్రీడ పరబ్రహ్మ నందే (వారి మనస్సు ఎల్లప్పుడు పరబ్రహ్మమునందే రమించుచుండును).

540. విమానమాలంబ్య శరీరమేత
ద్భునక్త్యశేషాన్విషయానుపస్థితాన్
పరేచ్ఛయా బాలవదాత్మవేత్తా
యోఽవ్యక్తలింగోఽననుషక్తబాహ్యః

ఆత్మజ్ఞాని తన నిజతత్వమును బాహ్యచిహ్నముల ద్వారా తెలియనీయక (అవ్య లింగః), బాహ్యవిషయములందు ఆసక్తిలేనివాడై, తన శరీరములో ఎట్టి అభిమా మును లేక (నిస్సంగుడై) నిలుచుచు, బాలునివలె (స్వబుద్ధితో కాక), పరులు కోరు వలన (పరేచ్ఛయా), అశేష విషయములను (మంచిచెడ్డలను) అనుభవించుచుండును

(తన ఇచ్ఛ లేకయే ఎప్పుడు ఏది కలిగిన, మంచి అయినను, చెడ్డ అయినను అనుభవించుచుండును).

541. దిగంబరో వాపి చ సాంబరో వా
త్వగంబరో వాపి చిదంబరస్థః
ఉన్మత్తవద్వాపి చ బాలవద్వా
పిశాచవద్వాపి చరత్యవన్యామ్.

చిదాకాశమునందు (బ్రహ్మజ్ఞానమునందు) సదా నిలచు జ్ఞాని, ఒకప్పుడు దిగంబరునిగను (బట్టలు కట్టుకొనకుండను), వేరొకప్పుడు బట్టలు ధరించి, మరొకప్పుడు చర్మధారియై, పిచ్చివానివలెగాని, బాలునివలెగాని, పిశాచమువలెగాని, ఈ భూమిపై తిరుగుచుండును. (ప్రాపంచిక నియమములేవియు అతనికి వర్తించవు. అతడు స్వతంత్రుడు; నిరంకుశుడు).

542. కామాన్నిష్కామరూపీ సంశ్చరత్యేకచరో మునిః
స్వాత్మనైవ సదాతుష్టః స్వయం సర్వాత్మనా స్థితః

సర్వాత్మతత్త్వమయిన పరబ్రహ్మమునందు సదా నిలచుచు, తన ఆత్మయందే ఎల్లప్పుడు సంతోషమును పొందు ముని - (మౌనమే ప్రధాన లక్షణముగా గల జ్ఞాని), ఒక్కడే (పరుల ప్రసక్తి లేక) తిరుగుచు, నిష్కాముడయినను (కోరికలు లేని వాడయ్యును), కోరికలు ఉన్నవానివలె సంచరించుచుండును. (కోరికలు కలవాడు స్వార్థ పూరితుడై ఎంతటి ఆసక్తితో పనులలో నిమగ్నుడై యుండునో, కోరికలు లేని జ్ఞాని లోకశ్రేయస్సుకొరకు తను నిర్ణయించుకున్న కార్యములను అంతటి దీక్షతో నెరవేర్చును.)

(బ్రహ్మజ్ఞాని—జ్ఞానోదయమయిన పిదప—అనుసరించు రెండు మార్గముల గూర్చి పైరెండు శ్లోకములలోచెప్పబడినది. మొదటిది (541వ శ్లోకములో చెప్పబడినది) 'అకర్మ' మార్గము, సన్యాసమార్గము, రెండవది (542వ శ్లోకములో చెప్పబడినది) 'కర్మమార్గము'—లోక శ్రేయస్సుకొరకు పనులుచేయుట. జ్ఞాని ఏ మార్గమయినను అనుసరించవచ్చును: ఒకప్పుడు ఒకమార్గము, మరొకప్పుడు మరొక మార్గము తొక్కవచ్చును; అతను స్వతంత్రుడు, నిరంకుశుడు; నిర్భయుడు).

543. క్వచిన్ మూఢో విద్వాన్ క్వచిదపి మహారాజ విభవః
క్వచిద్భ్రాంతః సౌమ్యః క్వచిదజగరాహారకలితః
క్వచిత్పాత్రీభూతః క్వచిదవమతః క్వాప్యవిదితః
శ్చరత్యేవం ప్రాజ్ఞః సతతపరమానందసుఖితః

బ్రహ్మజ్ఞాని (ప్రాజ్ఞుడు), ఎల్లప్పుడు పరమానందములో సుఖించుచు, (బయటివారికి) ఒకప్పుడు మూర్ఖునివలెను, మరొకప్పుడు పండితునివలెను, మరొకప్పుడు మహారాజ భోగములనుభవించుచును, ఇంకొకప్పుడు భ్రాంతునివలె తిరుగుచును, ఒకప్పుడు సౌమ్యముగను, మరొకప్పుడు కొండచిలువవలె (అజగరమువలె) కదలకుండ పడి యుండియు, వేరొకప్పుడు బహుమానింపబడి (పాత్రీకృతః), మరొకప్పుడు అవమానింపబడి, ఒక్కొకప్పుడు ఎవ్వరికిని తెలియకుండగను (అవిదితః) సంచరించు చుండును. (తన శేషజీవితమును వెళ్ళబుచ్చుచుండును).

(బ్రహ్మజ్ఞాని సర్వకాల సర్వావస్థలయందును, అద్వయ బ్రహ్మానందమునందే యుండును. పైవారికి మాత్రము, వేరువేరు కాలములలో, వేరువేరు పరిస్థితులలో, వేరువేరుగా కనుపించుచుండును).

544. నిర్ధనోఽపి సదా తుష్టోఽప్యసహాయో మహాబలః
నిత్యతృప్తోఽప్యభుంజానోఽప్యసమః సమదర్శనః

(బ్రహ్మజ్ఞాని) డబ్బులేనివాడయినను, (కోరికలు లేకపోవుటవలన) సదా సంతుష్టుడు. ఎవరి సహాయము లేకపోయినను (భయములేదు కావున) మహాబలవంతుడు (ఎట్టి పరిస్థితులనయినను నిర్భయముగా ఎదుర్కొనగలడు). విషయములలో తిరుగాడ కున్నను (వాటిలో సంగము లేకపోవుటచే) నిత్యతృప్తుడు. తనతోసమానమయినవాడు లేకపోయినను (అసమః), అందరను (తరతమ్యములు, రాగద్వేషములు లేక) సమానముగా చూచుచుండును.

545. అపి కుర్వన్నకుర్వాణశ్చాభోక్తా ఫలభోగ్యపి
శరీరప్య శరీర్యేష పరిచ్ఛిన్నోఽపి సర్వగః

పనులు చేయుచున్నట్లు కనబడుచున్నను (వాటిలో స్వార్థచింతన లేకపోవుటచే) ఏమియు చేయనివాడు. (ప్రారబ్ధ కర్మయొక్క) ఫలమును అనుభవించుచున్నను భోక్త కాడు (ఫలానుభవము శరీర మనోబుద్ధులకే పరిమితమగుగాని, వాటికి అతీతమయిన

తనకు—ఆత్మకు—కాదు అనుభావముతో ఉండువాడు). శరీరముతో కూడి ఉన్నను, వానితో (ఆ శరీరముతో) సంబంధము లేనివాడు.

546. అశరీరం సదా సంతమిమం బ్రహ్మవిదం క్వచిత్
ప్రియాప్రియే న స్పృశత స్తథైవ చ శుభాశుభే.

సదా సత్స్వభావుడయిన బ్రహ్మజ్ఞానికి శరీరభావము (నేను ఈ స్థూల, సూక్ష్మ, కారణ శరీరములను అను భావము) ఉండదు. కావున, ప్రియాప్రియములుగాని, శుభాశుభములుగాని స్పృశించవు (ప్రియా ప్రియములు, శుభా శుభములు కలిగినను అతనిలో ఎటువంటి ప్రతిస్పందనయు ఉండదు).

547. స్థూలాదిసంబంధవతోఽభిమానినః
సుఖం చ దుఃఖం చ శుభాశుభే చ
విధ్వస్తబంధస్య సదాత్మనో మునేః
కుతః శుభం వాఽప్యశుభం ఫలం వా

స్థూలాది శరీరములతో (స్థూల, సూక్ష్మ, కారణ శరీరములతో) సంబంధముకలిగి, వాటిలో అభిమానముగలవానికి, సుఖము, దుఃఖము, శుభము (మంచిని చేకూర్చునది), అశుభము (చెరుపును కలిగించునది) అను అనుభూతి కలుగవచ్చును. కాని, (ఈ దేహముతో) బంధము త్రెంచుకున్న (దేహాభిమానము లేని), బ్రహ్మ నిష్ఠుడయిన (సదాత్ముడయిన) మునీశ్వరునకు (మానసిక ఆందోళనలు లేనివానికి) సుఖము, దుఃఖము, శుభఫలము, అశుభఫలము అను భావము (స్పృహ) ఎట్లు ఉండగలదు?

548. తమసా గ్రస్తవద్భానాదగ్రస్తోఽపి రవిర్జనైః
గ్రస్త ఇత్యుచ్యతే భ్రాంత్యాహ్యజ్ఞాత్వావస్తులక్షణం.

(సూర్యగ్రహణ సమయమున) తమస్సు (రాహువు) సూర్యుని కబళించకపోయినను వస్తు లక్షణమును (నిజముగా జరిగినదానిని) ఎరుగని సామాన్యమానవులు, తమస్సు సూర్యుని కప్పివేయుచున్నట్లు కనుపించు చుండుటవలన, భ్రాంతులై సూర్యుని రాహువు మ్రింగెనని తలంచుచున్నారు. (మూఢజనులు కంటికి కనుపించుదానిని నమ్ముదురు. విచక్షణా జ్ఞానము కలవారు వస్తులక్షణములను తార్కికముగా ఆలోచించి,

కంటికి కనుపించు దానికి విలక్షణమయినను నిజమును గ్రహింతురు. అందుకు సూర్య గ్రహణమే దృష్టాంతము. ఈ కాలములోగూడ సూర్యునికి చంద్రుడు అడ్డువచ్చునచే, మనకు సూర్యుడు కనుపించుటలేదని భ్రమింతుము. మహదాకారముగల సూర్యునకు, అతి స్వల్పఆకారము గల చంద్రుడు అడ్డువచ్చుట ఎట్లు? నిజమునకు చంద్రుడు మన కంటికి అడ్డువచ్చుటవలన సూర్యుడు కనుపించుటలేదు. సూర్యుడు కనుపించకుండుటకు చంద్రుడే అక్కరలేదు. అరచేయి అడ్డుపెట్టుకున్నను కనుపడడు).

549. తద్వద్దేహాదిబంధేభ్యో విముక్తం బ్రహ్మవిత్తమమ్
పశ్యంతి దేహవన్మూఢాః శరీరాభాసదర్శనాత్.

ఆ విధముగనే, (చూచినదానినే నిజమని నమ్మెడి స్వభావముగల), మూఢులు, దేహాది బంధములనుండి విముక్తుడయిన బ్రహ్మజ్ఞానియొక్క—ఆభాసమాత్రమయిన (ఛాయా మాత్రమయిన) శరీరమును చూచుచుండుటవలన, అతను గూడ (ఆ జ్ఞానికూడ) (సాధారణ మానవులవలె) దేహముగలవాడని (దేహాభిమానము కలవాడని) తలంతురు.

(శరీరాభిమానముగల మానవులు తమప్రవర్తనకు తామే బాధ్యులమని ఎంచి, శుభాశుభములను మంచిచెడ్డలను నిర్ణయింతురు. ఆ దృష్టితోనే బ్రహ్మజ్ఞానియొక్క విచిత్ర ప్రవర్తనను అంచనావేసి, అతను మూఢుడని, పిచ్చివాడని. సోమరిపోతు అని, మత్తులో నున్నవాడని-ఈవిధముగా తలంచెదరు. కాని ఆ మహాజ్ఞానికి, తమకు కనుపించు శరీరముతో ఎట్టి సంబంధములేదని గ్రహించలేరు).

550. అహినిర్ల్వయనీ వాయం ముక్తదేహస్తు తిష్ఠతి
ఇతస్తతశ్చాల్యమానో యత్కించిత్ప్రాణవాయునా

జీవన్ముక్తుని శరీరము పాము విడిచిపెట్టిన కుబుసమువలె ఉండును (ప్రవర్తించును). (పాముకుబుసము గాలికి ఇటునటు కదులుచు, పామువలె భ్రమ కలిగించునట్లు), జీవన్ముక్తుని దేహము, ఏ కొద్దిగనో మిగిలిన ప్రాణవాయువుచే (ప్రారబ్ధ కర్మచే) ఇటునటు సంచరించుచు, (మంచిచెడ్డలను అనుభవించుచున్నట్లు) కనబడును. (పాము కుబుసమునుజూచి, కొందరు పాము అనుకొని, భయపడి పారిపోవచ్చును; కొందరు భక్తితో నమస్కరించవచ్చును; కొందరు కర్రలతో కొట్టవచ్చును; ఆ పాము కుబుసము ఎవ్వరు ఏమి చేసినను, అందునుండి వెడలిపోయిన పామునకు ఏమియును తెలియదు. ఆవిధముగనే

బ్రహ్మజ్ఞానియొక్క శరీరము ఎట్టి మానావమానములకు గురిఅయినను అతనికి తెలియదు. అతను తన బ్రహ్మానందరసానుభూతిలో సర్వము మరచియుండును).

551. స్రోతసా నీయతే దారు యథా నిమ్నోన్నతస్థలమ్
దైవేన నీయతే దేహో యథా కాలోపభుక్తిషు

నదిలో కొట్టుకొనిపోవు కర్రదుక్క, ప్రవాహవశమున, ఎత్తునకో, పల్లమునకో (తన ఇచ్ఛలేకయే) తీసుకొనిపోబడును; ఆ విధముగనే (బ్రహ్మజ్ఞానియొక్క) దేహము దైవవశమున తత్కాల ఫలానుభమును పొందుచుండును. (ప్రారబ్ధ కర్మ ఫలానుభవమునకవసరమయిన పరిస్థితులు దైవవశమున కలుగుచుండును. అవి అనుభవమునకు వచ్చును; వానిని బ్రహ్మజ్ఞాని నిర్లిప్తుడై అనుభవించుచుండును).

552. ప్రారబ్ధకర్మపరికల్పితవాసనాభిః
సంసారివచ్చరతి భుక్తిషు ముక్తదేహః
సిద్ధః స్వయం వసతి సాక్షివదత్ర తూష్ణీం
చక్రస్య మూలమివ కల్పవికల్పశూన్యః

దేహ భావమును విడిచిపెట్టిన (ముక్తదేహః) స్వయం సిద్ధుడు కూడ సాధారణ సంసారివలె, తన ప్రారబ్ధకర్మ సృష్టించిన వాసనల వలన (కోరికలవలన), విషయానుభవములో చరించుచుండును. కాని, (సాధారణ సంసారివలె కాక) సిద్ధపురుషుడు (తిరుగుచున్న) కుమ్మరి చక్రము యొక్క, (కదలని) ఇరుసువలె—సంకల్ప—వికల్ప శూన్యుడై (ఇది కావలెను. ఇది వద్దు అను ఇచ్ఛాద్వేషములు లేనివాడై), సాక్షివలె నిలచి (తనలోను, తనచుట్టును జరుగుచున్న సకల కర్మలకు కేవల ద్రష్ట మాత్రముగా ఉండి), తూష్ణీభావముతో (శుభాశుభములు ఏమి జరిగినను చలింపక) ఉండును.

553. నైవేంద్రియాణి విషయేషు నియుక్తం ఏష
నైవాపయుక్తం ఉపదర్శనలక్షణస్థః
నైవ క్రియాఫలమీషదపక్షతే చ
స్వానంద సాంద్రరసపానసుమత్తచిత్తః

(బ్రహ్మజ్ఞాని) తన ఇంద్రియములను (ఇచ్ఛాపూర్వకముగా) విషయములలో చేర్చడు; విషయముల నుండి వాటిని (ఇచ్ఛా పూర్వకముగా) నివర్తించడు. (ఇంద్రియములు విషయములలో చరించుచున్నను, చరించకున్నను), అతను కేవల ద్రష్టభావము కలిగి ఉండును (ఉపదర్శన లక్షణస్థ). అతనికి కర్మఫలముల యందు ఏ మాత్రము కోరిక ఉండదు. (ఏలననగా) అతను తనలోని చిక్కని ఆత్మానందరసమును త్రాగుటవలన (ఆనందముతో) సదామత్తులో ఉండును. (త్రాగిన మైకములో ఉన్న వానికి బయట ఏమి జరుగుచున్నను తెలియదు. అట్లులే బ్రహ్మానంద రసపాన మత్తునకు కూడ).

554. లక్ష్యాలక్ష్యగతిం త్యక్త్వా యస్తిష్ఠేత్కేవలాత్మనా
శివ ఏవ స్వయం సాక్షాదయం బ్రహ్మవిదుత్తమః

లక్ష్య లక్ష్య గమనమును (పొందదగు దానిని చేరుట కొరకు, విడువవలసిన దానిని విడుచుట కొరకు పడు ఆరాటమును) విడిచి, ఆత్మభావమునందే కేవలుడై నిలచు ఉత్తమ బ్రహ్మజ్ఞాని, స్వయముగా సాక్షాత్ శివుడే అగుచున్నాడు (శివుడు అనగా పవిత్రమయినవాడు. ఎట్టి అలజడులులేని, అతి ప్రశాంతమయిన మనస్సు కలవాడు శివుడు).

555. జీవన్నేవ సదా ముక్తః కృతార్థో బ్రహ్మవిత్తమః
ఉపాధినాశాత్ బ్రహ్మైవ సన్బ్రహ్మాప్యేతి నిర్ద్వయం

బ్రహ్మజ్ఞాని జీవించుచున్నను (అన్ని బంధముల నుండి) విముక్తి పొందినవాడు. అట్టి వాడు కృతార్థుడు (పొందవలసినది పొందినవాడు). (అట్టి బ్రహ్మజ్ఞాని) శరీరపతనము తర్వాత (ఉపాధినాశము తర్వాత), బ్రహ్మభావము పొంది, అద్వయబ్రహ్మమునందు కలిసిపోవును.

556. శైలూషో వేషసద్భావాభావయోశ్చ యథా పుమాన్
తథైవ బ్రహ్మవిచ్ఛ్రేష్ఠః సదా బ్రహ్మైవ నాపరః

నాటక పాత్రధారి (శైలూషః), వేషము వేసికొన్నను, వేషము తీసివేసినను, తాను (మారకుండ) తానుగానే ఎట్లుండునో, ఆ విధముగానే, ఉత్తమమయిన బ్రహ్మజ్ఞాని (దేహమునందు ఉన్నను, లేకున్నను) బ్రహ్మము తప్ప వేరొకడుకాడు, (రామయ్య అనువాడు నాటకములో మహారాక్షసుని వేషము వేసికొని, ఆ పాత్రను

అత్యంత భయంకరముగా నటించుచున్నను, అతనిని తెలిసిన వారికి అతను రామయ్య మాత్రమే అని తెలిసి, వేషమును చూసి భయముచెందరు. రామయ్యకూడ రంగస్థలము నుండి లోపలికి వచ్చి రామయ్యవలెనే ప్రవర్తించును గాని రాక్షసునిగా ప్రవర్తించడు. బ్రహ్మజ్ఞాని కూడ సదా బ్రహ్మమునందే ఉండుటవలన వేషము వంటి దేహము ఉన్నను, లేకున్నను, అతని బ్రహ్మభావనలో ఎట్టి మార్పు ఉండదు.

557. యత్ర క్వాపి విశీర్ణం సత్పర్ణమివ తరోర్వపుః పతనాత్
బ్రహ్మీభూతస్య యతేః ప్రాగేవతచ్చిదగ్నినా దగ్ధమ్

బ్రహ్మభావము నందు నిలచిన యతికి (సన్యాసికి), తన శరీరము—చెట్టున పండిరాలిపోయెడి ఆకువలె—ఎచ్చటనైన రాలిపోనిమ్ము. (అతనికి ఎట్టి సంబంధములేదు; ఏలననగా) అతని శరీరము (శరీర స్పృహ), అంతకు పూర్వమే జ్ఞానాగ్నిలో దగ్ధమయిపోయినది.

558. సదాత్మని బ్రహ్మణి తిష్ఠతో మునేః
పూర్ణాద్వయానందమయాత్మనా సదా
న కాలదేశాద్యుచిత ప్రతీక్షా
త్వంగ్ మాంస విట్ పిండ విసర్జనాయ

సదా బ్రహ్మమునందు నిలచి సంపూర్ణమయిన అద్వయిత ఆనందముతో నిండిన మనస్సుగల బ్రహ్మజ్ఞాని (మునిః), చర్మము, మాంసము, పురీషముతో నిండిన ఈ (అపవిత్ర) శరీరమును విడిచిపెట్టుటకు పుణ్యక్షేత్రము (దేశము), పుణ్యకాలము (కాలము)—వీటి కొరకు నిరీక్షించడు. (శరీరము ఎప్పుడు, ఎక్కడ రాలిపోయినను అతనికి ఎట్టి ఖేదమోదములు ఉండవు).

(సాధారణ మానవులు తమ మృత్యువు, పుణ్యక్షేత్రమునందు శుభఘడియల యందు సంభవించిన మంచిదని భావింతురు. జ్ఞానికి అట్టి భావన ఏ మాత్రము ఉండదు).

559. దేహస్య మోక్షో నో మోక్షో న దండస్య న కమండలోః
అవిద్యాహృదయగ్రంథిమోక్షో మోక్షో యతస్తతః

దేహమును త్యజించుట మోక్షము కాదు; దండకమండలములను విడిచిపెట్టుట ముక్తి కాదు. (సన్యాసి తన దండకమండలములను కూడ విడిచిపెట్టినచో 'పరివ్రాజకుడు'ని

పిలువబడును. సన్యాసులలో అట్టివాడు గౌరవింపబడును). అవిద్య వలన, (అజ్ఞానము వలన) కలిగిన హృదయగ్రంథులను విడిచిపెట్టుటయే (నిజమయిన) మోక్షమగును. (వాసనలు, వాంఛలు, కర్మలు ఇవి హృదయ గ్రంథులు. వీటినుండి బయట పడగలుగుటయే నిజమయిన మోక్షము. బాహ్యదేహమును, బాహ్య చిహ్నములను విడిచిపెట్టినంత మాత్రమున—అవిద్య ఉన్నంతవరకు—ముక్తి కలుగదు).

560. కుల్యాయామథ నద్యాం వా శివక్షేత్రేఽపి చత్వరే
వర్ణం పతతి చేత్తేన తరోః కిన్ను శుభాశుభమ్

రాలిపోయెడి పండుటాకు కుళ్ళు కాలవలో పడవచ్చును; (స్వచ్ఛమయిన) నదీ జలములో పడవచ్చును; శివక్షేత్రములో పడవచ్చును. లేక (నలుగురు నడిచెడి) నాలుగు బాటల కూడలిలోపడి, (బాటసారుల కాళ్ళక్రింద పడి నలిగిపోవచ్చును). అందువలన చెట్టునకు కలుగు శుభాశుభములేమియు ఉండవు. (అట్టులే, బ్రహ్మజ్ఞాని యొక్క జ్ఞానదగ్ధశరీరము ఎక్కడ పడినను ఆ జ్ఞానికి శుభాశుభములు కలుగవు).

561. పత్రస్య, పుష్పస్య ఫలస్య నాశవత్
దేహేంద్రియప్రాణధియాం వినాశః
నైవాత్మనః స్వస్య సదాత్మకస్యా—
నందాకృతేర్వృక్షవదస్తి చైషః

ఆకులుగాని, పువ్వులుగాని, పళ్ళుగాని రాలిపోయినట్లు (ఆ చెట్టునకు ఏ విధమయిన శుభాశుభములు సంభవించనట్లు), ఈ దేహము, ఇంద్రియములు, ప్రాణము, మనస్సు (బుద్ధి), నశించినను తన ఆత్మకు (ఏ విధమయిన హానియు జరుగదని బ్రహ్మజ్ఞాని ఎరుగును, కావున) అట్టి బ్రహ్మజ్ఞాని, ఎల్లప్పుడు పరమాత్మయందు నిలచును, స్వాత్మానంద రూపమునందు, వృక్షమువలె, (నిశ్చలముగా, సుస్థిరముగా) ఉండును.

562. ప్రజ్ఞానఘన ఇత్యాత్మలక్షణం సత్యసూచకం
అనూద్యౌపాధికస్యైవ కథయంతి వినాశనమ్.

'ప్రజ్ఞానఘనము' అని ఆత్మ లక్షణమయిన సత్యత్వమును, (బృహదారకోపనిషత్తులోని శ్రుతివాక్యము) సూచించుచున్నది. ఈ కనబడుచున్న ఉపాధులకు మాత్రమే వినాశము ఉన్నదని చెప్పుచుందురు. (చచ్చిపోవుట అనునది అసత్యమయిన, అనిత్య

మయిన ఈ ఉపాధులకు మాత్రమే. పూర్ణజ్ఞాన రూపమయిన, సత్పదార్థమయిన, నిత్య మయిన ఆత్మతత్వమునకు నాశము ఉండదు).

563. అవినాశీ వా అరేఽయమాత్మేతి శ్రుతిరాత్మనః
ప్రబ్రవీ త్యవినాశిత్వం వినశ్యత్సు వికారిషు

'ఓ ప్రియా, ఈ ఆత్మకు నాశనము లేదు' అని (బృహదారణ్యకోపనిషత్తులోని) శ్రుతి వాక్యము-నశించుచున్న (మార్పులు చెందుచున్న) వాటి మధ్య ఆత్మ మాత్రము అవి నాశమయినదని చెప్పుచున్నది.

(బృహదారణ్యకోపనిషత్తులో యాజ్ఞవల్క్యుడు తన భార్య అయిన మైత్రేయితో ఆత్మతత్వము గూర్చి చెప్పుచు పైవిధముగా చెప్పెను. ప్రజ్ఞానఘన మనగా - మరొక వస్తువు లేని పరిపూర్ణజ్ఞానము. అన్నియు నాశనమయిన పిదప మిగిలెడిది అదే-అదే అన్నింటికి ఆధారము).

564. పాషాణవృక్షతృణధాన్యకడంకరాద్యా
దగ్ధా భవంతి హి మృదేవ యథా తథైవ
దేహేంద్రియాసుమనఆది సమస్తదృశ్యం
జ్ఞానాగ్నిదగ్ధముపయాతి పరాత్మభావం

రాళ్ళు, వృక్షములు, గడ్డి, ధాన్యము, పొట్టు - అన్నియును కాలిపోయిన పిదప బూడిద (మట్టి) అగునట్లు, ఈ దేహము, ఇంద్రియములు, ప్రాణములు, మనస్సు మొదలగు ఈ సమస్త దృశ్య ప్రపంచము - జ్ఞానమను అగ్నిలో దగ్ధమయినప్పుడు పరమాత్మ భావమును పొందును.

(స్వప్నములో కనబడు జగత్తంతయును, స్వప్నకర్తతోసహా - మెలుకువ అను అగ్నిలో దగ్ధమయినప్పుడు, మిగిలెడిది జాగ్రదవస్థపొందిన స్వాప్నికుడు తాను మాత్రమే - ఆ విధముగనే - తురీయావస్థలో మెలుకువకలిగిన జ్ఞానికి, ఈ జాగ్రద వస్థలో కనుపించిన జగత్తంతయు, పరబ్రహ్మ స్వరూపమయిన తానే అని తెలిసి కొనును).

565. విలక్షణం యథా ధ్వాంతం లీయతే భానుతేజసి
తథైవ సకలం దృశ్యం బ్రహ్మణి ప్రవిలీయతే.

విలక్షణమయిన (సూర్యకాంతికి వేరయిన) చీకటి (సూర్యోదయసమయముకాగానే) సూర్యుని కాంతిలో విలీనమయిపోవును (కరగిపోవును). ఆ విధముగానే ఈ దృశ్య ప్రపంచమంతయు (జ్ఞానోదయము అయిన పిమ్మట), జ్ఞాన స్వరూపమయిన పరబ్రహ్మలో విలీనమగును. (సూర్యునిజూచి చీకటి ఎక్కడికిని పారిపోదు. సూర్యోదయమయిన వెంటనే, చీకటి అను భ్రమ-అక్కడి కక్కడే తేజస్సుతో నిండి - తొలగిపోవును. ఆవిధముగనే బహుళత్వముతో కాన్పించు ఈ దృశ్య ప్రపంచమంతయు, జ్ఞానోదయమయిన వెంటనే, తన బహుళత్వమును కోల్పోయి, అంతయు బ్రహ్మభావముతో నిండినదిగా, అభిన్నమయినదిగా కనుపించును).

566. ఘటే నష్టే యథా వ్యోమ వ్యోమైవ భవతి స్ఫుటమ్
తథైవోపాధివిలయే బ్రహ్మైవ బ్రహ్మవిత్స్వయం.

కుండ పగిలిపోయినప్పుడు, కుండలోని ఆకాశము (చుట్టునున్న) ఆకాశములో కలిసిపోవును. ఆ విధముగనే ఉపాధి (శరీర, మనోబుద్ధులు) నశించిన పిదప బ్రహ్మవేత్త బ్రహ్మములో స్వయముగా నిలచును. (లోపల గుల్లగా ఉన్న మట్టిబొమ్మ అన్ని వైపుల మూసి ఉన్నప్పుడు, లోపల ఖాళీ స్థలములో ఆకాశము ఉన్నదనీ, చీకటి పేరుకుపోయి ఉండునని మనము ఊహించగలము. కాని, ఆ బొమ్మలో ఆకాశము, చీకటి ఉన్నవో, లేవో చూచుటకు ఆ బొమ్మను పగలగొట్టినచో, అందులోని చీకటి బయట కాంతిలో విలీనమయిపోయి కనుపించదు. అందులోని ఆకాశము గూడ చుట్టునున్న ఆకాశములో కలసిపోయి, ప్రత్యేకతను (బొమ్మ ఆకాశము అన్న విభిన్నత్వమును) కోల్పోవును).

567. క్షీరం క్షీరే యథా క్షిప్తం తైలం తైలే జలం జలే
సంయుక్తమేకతాం యాతి తథాఽఽత్మన్యాత్మవిన్మునిః

పాలలో పోసిన పాలు, నూనెలో పోసిన నూనె, నీటిలో పోసిన నీరు, కలిసిపోయి ఒకే రూపములో (ఒకేనీరు, ఒకేనూనె, ఒకేపాలుగా) కనుపించును. ఆ విధముగానే, ఆత్మ జ్ఞానము కలిగిన ముని-ఆత్మతత్త్వములో విలీనమయిపోయి-(తన ప్రత్యేకతను కోల్పోవును).

568. ఏవం విదేహకైవల్యం సన్మాత్రత్వమఖండితమ్
బ్రహ్మభావం ప్రపద్యైష యతిర్నావర్తతే పునః

అఖండసన్మాత్ర భావమునందు (బ్రహ్మ భావమునందు) ఎల్లప్పుడు నిలచియుండుటయే విదేహకైవల్యము (శరీరము లేనిముక్తి); అట్టిజ్ఞాని సదా బ్రహ్మభావమునందు నిలచుచు తిరిగి జననమును పొందడు. (శంకరుని సిద్ధాంతము ప్రకారము విదేహకైవల్యము నకు దేహత్యాగము ముఖ్యముకాదు. సాధారణముగా దేహత్యాగము పిమ్మటనే విదేహ కైవల్యము కలుగునని నమ్మెదరు).

569. సదాత్మైకత్వవిజ్ఞానదగ్ధావిద్యాదివర్ష్మణః
అముష్య బ్రహ్మభూతత్వాద్బ్రహ్మణః కుత ఉద్భవః

బ్రహ్మాత్మైకత్వ విజ్ఞానముచే (తాను బ్రహ్మము ఒక్కటే అను జ్ఞానముచే), అవిద్య మొదలుకొని స్థూల శరీరము వరకు (ఎల్ల ఉపాధులు) దగ్ధము అగుటచే, బ్రహ్మజ్ఞాని బ్రహ్మమునందే నిలచును. (బ్రహ్మభావమును పొందును). బ్రహ్మమునకు పుట్టుక ఎట్లుండును? (కావున, బ్రహ్మభావము పొందిన జ్ఞానికి కూడ పుట్టుక ఉండదు).

570. మాయాక్లృప్తౌ బంధమోక్షౌ న స్తః స్వాత్మని వస్తుతః
యథా రజ్జౌ నిష్క్రియాయాం సర్పాభాసవినిర్గమౌ

ఆత్మతత్వమునందు మాయాకల్పితమయిన బంధము, మోక్షము ఉండవు. (బంధము, మోక్షము అనునవి కల్పింపబడిన - ఆరోపిత వస్తువులకు మాత్రమే ఉండును గాని, ఆధారమునకు అవి అర్థరహితమయిన మాటలు). ఎట్టి మార్పులు చెందని (నిష్క్రియాయాం) త్రాటియందు సర్పము వచ్చుట, పోవుట (కనుపించుట, కనుపించకుండ నుండుట-త్రాటితో సంబంధము లేకుండనే, త్రాటికి తెలియకుండనే) జరుగును.

571. ఆవృతేః సదసత్వాభ్యాం వక్తవ్యే బంధమోక్షణే
నావృతిర్బ్రహ్మణః కాదన్యాభావాదనావృతమ్
యద్యస్త్యద్వైతహానిః స్యాద్ద్వైతంనోసహతే శ్రుతిః

ఆవరణశక్తి ఉన్నప్పుడు బంధము అని, అది లేనప్పుడు మోక్షము అని చెప్పవచ్చును. (మాయా శక్తి రెండు విధములుగా పనిచేయును. 1. ఆవరణశక్తి - నిజమును కప్పి పుచ్చుట; 2. విక్షేప శక్తి - లేనిదానిని ఉన్నట్లుచూపుట). బ్రహ్మములో అన్యవస్తు వేదియును లేకపోవుటవలన, బ్రహ్మమునకు ఆవరణము ఉండదు. ఒకవేళ (ఆ

విధముగా బ్రహ్మమునందు వేరొకటి) ఉన్నచో, బ్రహ్మము యొక్క అద్వైత తత్త్వమునకు హాని కలుగును. (అనగా బ్రహ్మము అద్వయమయినది అని చెప్పుటకు వీలుండదు). శ్రుతులు బ్రహ్మమునందు ద్వైతభావమును అంగీకరించవు. (కావున బ్రహ్మము అద్వయమయినది. కావున అందులో వేరొకటి ఉండుటకు వీలులేదు; కావున బ్రహ్మమునకు ఆవరణము ఉండదు).

572. బంధం చ మోక్షం చ మృషైవ మూఢా
బుద్ధేర్గుణం వస్తుని కల్పయంతి
దృగావృతిం మేఘకృతాం యథా రవౌ
యతోఽద్వయాఽసంగచిదేతదక్షరమ్.

మూఢులు బుద్ధియొక్క గుణములయిన (బుద్ధియొక్క భావనలయిన), బంధము, మోక్షము అను మిథ్యాభావనను, బ్రహ్మతత్త్వమునకు అంటగట్టుచున్నారు. మేఘములు మనకంటి దృష్టిని మరుగు పరచుచుండగా, అవి (ఎంతోదూరములో నున్న) సూర్యుని కప్పుచున్న భ్రమకలుగుచున్నది. ఈ బ్రహ్మతత్త్వము అద్వయమయినది: సంగరహితమయినది; చిద్రూపమయినది: అక్షరమయినది: సంగరహితమయినది: (కావున అందులో బంధమోక్షములుండవు).

573. అస్తీతి ప్రత్యయో యశ్చ యశ్చ నాస్తీతి వస్తుని
బుద్ధేరేవ గుణావేతౌ న తు నిత్యస్య వస్తునః

(బంధము) ఉన్నదను భావనగాని, లేదు అను భావనగాని, బుద్ధికి సంబంధించిన గుణములు (బుద్ధిలో కలుగు భావములు): అవి నిత్యమయిన పరబ్రహ్మమందు ఉండవు

574. అతస్తౌ మాయయా క్లృప్తౌ బంధమోక్షౌ న చాత్మని
నిష్కలే నిష్క్రియే శాంతే నిరవద్యే నిరంజనే
అద్వితీయే పరే తత్త్వే వ్యోమవత్కల్పనా కుతః

అందుచేత ఈ బంధము, మోక్షము అనునవి మాయచేత (ఆవరణ శక్తిచేత) కల్పింపబడినవి; కాని ఇవి ఆత్మలోలేవు: ఆకాశమువలె నిష్కలమయినదియు (భాగములు లేనిదియు), క్రియారహితమయినదియు (ఎట్టిపనులను చేయనిదియు), శాంతమయినదియు, దోషరహితమయినదియు (నిరవద్యే), మచ్చలేనట్టిదియు (నిరంజనః) అయిన బ్రహ్మములో (బంధమోక్షములు) ఎట్లు కల్పింపబడును?

575. న నిరోధో న చోత్పత్తిర్న బద్ధో న చ సాధకః
న ముముక్షుర్న వై ముక్త ఇత్యేషా పరమార్థతా.

మృత్యువు (నిరోధము) లేదు; పుట్టుట లేదు, బద్ధుడు లేడు; సాధకుడు లేడు; మోక్షము కోరువాడు లేడు; ముక్తుడు లేడు; ఇదియే పరమార్థము. (ఇవి అన్నియును బుద్ధికల్పించిన భావనలు; పరమాత్మతత్త్వమునందు—పరమాత్మలో నిలచి చూచువానికి-ఇవన్నియును లేని వాటిగనే తోచును).

## ఉపసంహారము (576-578) :

576. సకలనిగమచూడాస్వాంతసిద్ధాంతరూపం
పరమిదమితి గుహ్యం దర్శితం తే మయాద్య
అపగతకలిదోషం కామనిర్ముక్తబుద్ధిం
స్వసుతవదసకృత్త్వాం భావయిత్వా ముముక్షుమ్.

కలిదోషమును అతిక్రమించినవాడవనియు, కోరికలు లేని బుద్ధిగలవాడవనియు మోక్షమునందు ఇచ్ఛగలవాడవనియు, గ్రహించి, నిన్ను నా స్వంతకొడుకువలె భావించి నీకు సకల వేదముల సారమును, సమస్తవేదాంత శాస్త్రములయందలి అతిరహస్యమయిన అంతరార్థములను నేడు నేను విశదపరచితిని.

577. ఇతి శ్రుత్వా గురోర్వాక్యం ప్రశ్రయేణ కృతానతిః
స తేన సమనుజ్ఞాతో యయౌ నిర్ముక్తబంధనః

ఈ విధముగా గురువు చెప్పినదంతయు విని, బంధముక్తుడయిన శిష్యుడు గురువునకు భక్తితో ప్రణమిల్లి, అతనిచే అనుజ్ఞాతుడై వెడలిపోయెను.

578. గురురేవ సదానందసింధౌ నిర్మగ్నమానసః
పావయన్వసుధాం సర్వాం విచచార నిరంతరః

గురువు కూడ బ్రహ్మానందసాగరమందు మునిగిన మనస్సు గలవాడై సమస్త భూమండలమును పావనము చేయుచు నిరంతరము సంచారము చేయుచుండెను.

(ఇంతటితో గురుశిష్యసంవాదరూపకమయిన వేదాంత చర్చ ముగిసినది. తను చెప్పదలచుకున్నది గురువు ఎన్నో ఉపమానములతో, ఎన్నియో తార్కిక యుక్తులతో గ్రంథ విస్తరణ భీతిలేక విపులముగా సవిస్తరముగా వివరించెను. దాని ముగింపు మూడు శ్లోకములలో క్లుప్తముగా ముగిసిపోయెను. బ్రహ్మతత్త్వము బుద్ధిచేత గ్రహించుటకు ఎంతయో వివరింపవలసి ఉండును. అయినను అనుమానములు కలుగుచునే

యుండును. వాటిని తీర్చుటకు మరికొన్ని ఉపమానములు, యుక్తులు వాడవలసి యుండును. కాని, బ్రహ్మతత్త్వము స్వానుభవ పూర్వకముగా తెలిసికొనిన వానికి గురువు చెప్పవలసినది ఏమియు ఉండదు. శిష్యుడు వినవలసినదియు ఏమియు ఉండదు. ఇద్దరూ బ్రహ్మజ్ఞానులే-ఇద్దరూ బ్రహ్మభూతులే-ఇక వ్యర్థ ప్రసంగములు వాదోప వాదములు అనవసరము. అందుకే ముగింపు అంత క్లుప్తముగా ముగిసినది).

## గ్రంథ ప్రశంస (579-581) :

579. ఇత్యాచార్యస్య శిష్యస్య సంవాదేనాత్మలక్షణమ్
నిరూపితం ముముక్షూణాం సుఖబోధోపపత్తయే.

మోక్షకాములకు సులభగ్రాహ్యమగునట్లు పరమాత్మతత్త్వము ఈ విధముగా గురుశిష్య సంవాదరూపములో నిరూపింపబడినది.

580. హితమిదముపదేశమాద్రియంతాం
విహిత నిరస్త సమస్త చిత్తదోషాః
భవసుఖవిరతాః ప్రశాంతచిత్తాః
శ్రుతిరసికా యతయో ముముక్షవోయే.

ఈ హితోపదేశమును—సమస్త చిత్తదోషములను అంతరింపచేసికొనినవారు, ప్రపంచ సుఖములయందు విరక్తి కలవారు, ప్రశాంత చిత్తులు, శ్రుతులయందు ఆసక్తికలవారు మోక్షకాములు అయిన యతులు (సాధకులు) ఆదరించెదరు గాక!

581. సంసారాధ్వని తాపభానుకిరణప్రోద్భూతదాహవ్యథా -
ఖిన్నానం జలకాంక్షయా మరుభువిభ్రాంత్యా పరిభ్రామ్యతాం
అత్యాసన్న సుధాంబుధిం సుఖకరం బ్రహ్మాద్వయం దర్శయ -
త్యేషా శంకరభారతీవిజయతే నిర్వాణ సంధాయినీ.

ఈ సంసారమను ఎడారి భూములయందు, తాపత్రయమను సూర్యుని ప్రచండ కిరణములచే భరింపరాని వేడిమివలన (దాహమువలన) బాధపడుచు, నీటికొరకు మరుభూములందు (ఎండమావులయందు నీరు ఉన్నదను) భ్రాంతిచే పరిభ్రమించుచున్న ఖిన్నులకు (దుఃఖితులకు), ఈ శంకరభారతి (శంకర భగవత్పాదులు), అతిదగ్గరలో ముక్తిప్రదమయినదియు, సుఖకరమయినదియు అయిన అద్వయ బ్రహ్మమను సుధా సముద్రమును చూపించి విజయము సాధించెను.

— సమాప్తము —